A-PDF Merger DEMO : Purchase from www.A-PDF.com to

మాదిరెడ్డి సులోచన

# దేవుడిచ్చిన వరాలు



ప్రేమ, ద్వేషం, స్వార్ధం లాంటి అంశాలు సాహిత్యానికి ఎప్పుడూ ముడి సరుకే. అందుకే మాదిరెడ్డి సులోచన కాల్పనిక సాహిత్యంలో ఈ మౌలిక అంశాలు నేటికీ నూతనంగానే వుంటాయి. మా సంస్థ 50వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన తరుణంలో జీవిత విలువలను ప్రోది చేసిన మాదిరెడ్డి నవలలను పునర్ముద్రించడం మాకెంతో ఆనందంగా వుంది. వీటినిఃఃః-- తెలుగు పాఠకులు సొంతం చేసుకుని, చదివి ఆనందిస్తారని మా ఆకాంక్ష.

విజయవాడ
1.10.2006

నవోదయ పబ్లిషర్స్

# దేవుడిచ్చిన వరాలు

వైశాఖ మాసపుటెండలు నిప్పులు చెరుగుతున్నాయి. దొడ్డవారని పేరుగాంచిన కోటయ్యగారి లోగిలిముందు పదేళ్ళ కుర్రవాడు బాటసారులకు, కావల్సిన వారికి కంచుచెంబుతో నీళ్ళు పోస్తున్నాడు. ఎండనపడి వెళ్ళేవారు మంచితీర్థాన్నే అమృతములా సేవిస్తున్నారు

"ఒరేయ్ అప్పిగా! పిల్లలు యింకా రాలేదేంట్రా?" కోటయ్య ఇల్లాలు చిట్టెమ్మ గుమ్మములో నుండి తొంగిచూసింది.

"వస్తూనే ఉంటారమ్మా. అడుగో వేణుబాబు" సందు మలుపు తిరిగిన పన్నెండేళ్ళ అబ్బాయిని చూపాడు.

"వేణు ఒక్కడే వస్తున్నాడేంరా? సూరి, మధు యేరి?"

"నాకేం తెలుసమ్మా?" అప్పిగాడు తిరిగి తన పనిలో లీనమయ్యాడు.

వగరుస్తూ వేణు రానే వచ్చాడు. అతని శరీరము చెమటలు క్రక్కుతోంది.

"అమ్మా..... అమ్మా! నేను పాసయ్యాను. క్లాసులో ఫస్టు....." ఇనుమడించిన ఉత్సాహంతో చెప్పాడు. చేతిలోని ప్రోగ్రెస్‌కార్డు తల్లి ముందుంచాడు.

"గొప్ప పని చేశావులే. ఈ కాగితము నేనేం చేసుకోనురా? నాకంత పాటి చదువు వస్తే బాగానే వుండును. అన్నా, తమ్ముడు యేరి?" చిట్టెమ్మ మాటలకు చిన్నబుచ్చుకున్నాడు వేణు.

"వాళ్ళు స్నేహితులతో మాట్లాడుతూ మెల్లగా వస్తున్నారమ్మా."

"వెర్రి పిల్లలు, ఎండలో ఏం మాటలు! నువ్వు వచ్చేవాడవు పిల్చుకు రావద్దూ?"

"పిలిచానమ్మా! 'కావాలంటే నువ్వు పో' అన్నారు.

"అమ్మో! నీ సంగతి తెలియదూ?" సాగదీసింది. ఇంతలో సూరి, మధు రానేవచ్చారు.

"పాసయ్యావా సూరుడూ!" అత్యంత ఆప్యాయంగా పెద్దకొడుకును అక్కున చేర్చుకుంది చిట్టెమ్మ. సూరి గర్వముగా తలాడించాడు. అంతలో బయట నుండి హుస్సురంటూ కోటయ్య వచ్చాడు.

"నాన్నా! నేను పాసయ్యాను" మధువెళ్ళి తండ్రిని కౌగిలించుకున్నాడు.

"నువ్వు కాక మరెవరు పాసవుతారురా!" ప్రేమతో కొడుకు వీపు నిమిరాడు కోటయ్య.

"అబ్బో ఏమిటో ఆ ధీమా! సూరుడే ఊరుమీద తిరుగుతాడని అనేవారు."

ప్రయివేటు పెట్టకుంటే నీ కొడుకు ప్రతాపం తెలిసేది! చూడు నా కొడుకు వంక! బంగారుకొండ." మధు నుదుట ముద్దుపెట్టుకున్నాడు కోటయ్య. వారి సంభాషణ సహజంగా సాగుతున్నా, మరో చిన్నారి హృదయముపై సమ్మెటపోట్లు పడ్డాయి. సూరి అమ్మకొడుకు, మధు నాన్నకొడుకు. తనెవరి కొడుకు? వేణు చిన్నారి మనసులో ఈ ప్రశ్న తలెత్తింది. కాని జవాబు యెవరివద్ద లభిస్తుందో తెలియదు.

"అన్నాయి! నేను పాసయ్యాను" ప్రేమలత పరుగెత్తుకు వచ్చింది.

వేణు చెల్లెలి చేతిని ఆప్యాయంగా నొక్కి, ప్రోగ్రెసు రిపోర్టు అందుకున్నాడు.

"చాలా బాగావచ్చాయే మార్కులు" అభినందించాడు.

"మరే అన్నయ్యా! వాళ్ళ చంద్ర ఫేలయింది." నిజంగా చిన్న పిల్లల మనసు పువ్వువంటిదే కాని స్వార్థపూరితమైనది కూడాను. చిన్నపిల్లకేం తెలుసు. ఇతరుల అపజయాన్ని అపహాస్యము చెయ్యరాదని. అందరిలో చిన్నదయిన ప్రేమలతను తల్లి, తరువాత తండ్రి యెత్తుకుని ముద్దు పెట్టుకున్నారు. ఆ దృశ్యము చూస్తుంటే వేణు హృదయము గిలగిలలాడింది. అందరిలో తనేదో ఒంటరి అయినట్టు అనుభూతి చెందాడు.



"రండి. భోజనాలకు ఆలస్యమయిపోయింది" చిట్టెమ్మ పిలిచింది. అందరూ వెళ్ళి కూర్చున్నారు. మిగిలిన ముగ్గురు పిల్లలూ ఉత్సాహంగా కబుర్లు చెబుతున్నారు. వేణు మాత్రము మౌనంగా అన్నము కలుపుతున్నాడు. అతని హృదయములో సమ్మెటపోట్లు పడుతున్నట్లు బాధ రేగింది. "నువ్వు పాసయ్యావా?" అని తండ్రి ఒక్కమాట అడగడేం?

"పిల్లలకు సెలవు లిచ్చారు, లలితను కూడా అత్తవారింటి నుండి పిలిపించండి. సరదాగా ఒక నెల రోజులు కలిసి వుంటారు" ప్రస్తావించింది చిట్టెమ్మ.

"మంచిది. రేపు పాలేరును, సూరిని పంపుతాను" అన్నాడు కోటయ్య.

"మరిచిపోయాను. సూరికిష్టమని బూడిద గుమ్మడికాయ వడియాలు వేయించాను" ఉట్టిమీద పళ్ళెం దింపి వడియాలు తెచ్చింది.

"నాన్నగారూ! నాకు బియ్యపుపిండి అప్పడాలు చాలా ఇష్టం. అమ్మ యెప్పుడూ అన్న కిష్టమైనవే చేస్తుంది" మధు ఫిర్యాదు.

"ఏమే! రాత్రికి బియ్యపుపిండి అప్పడాలు చేయాలి తెల్సిందా? ప్రేమలూ! నీకేం గావాలిరా తల్లీ?" కూతుర్ని అడిగాడు.

"మరి నాకేమో పాయసము కావాలి." ముద్దుగా చెప్పింది ప్రేమ. వేణు ఉడుక్కున్నాడు. పాసయిన రోజు అందరికీ అన్నీ కావాలి. తనకెందుకు వద్దు? తల్లి దండ్రులముందు తన కోర్కె వెల్లడించడానికి సంకోచపడలేదు.

"అమ్మా! నాకు వడలు కావాలి" తల్లి వంక చూశాడు.

"నీ కోర్కె ఏమిటని ఎవరడిగాడోయ్! త్వరగా తిని అప్పిగాడిని పొలము దగ్గరకు పంపు" కసురుకున్నాడు కోటయ్య. వేణు ముఖము చిన్నబోయింది. ఇక ముద్ద కలపబుద్ధి కాలేదు. మజ్జిగ వంచుకుని, గబగబా ముద్దలు నోట కుక్కుకుని లేచాడు. అంతవరకు కళ్ళలో ఆగిన నీరు జారిపడింది. చెయ్యి కడిగి కళ్ళు తుడుచుకుని బయటకు వచ్చాడు. అప్పిగాడు నిర్విచారంగా ఏదో పాట గొణుగుతున్నాడు. వాడిని పంపి తను కూర్చున్నాడు నీళ్ళ బిందెల ముందు.

నల్లగొండ జిల్లాలో చెప్పుకోతగిన భూస్వాములలో ఒకడు కోటయ్య. కాపిరాల గుట్ట, లతీఫ్ సాయెబు గుట్టల మధ్య ఉన్న జిల్లాలోని భూమి అంత సారవంతమైనది కాదు. పేరుకు కోటయ్యకు వంద ఎకరాల పొలముంది. కొంత గడ్డికి వదిలాడు. మరికొంత పొలము సజ్జలూ, జొన్నలూ, వేరుశనగ కాయలూ వేస్తాడు. కొన్నిసార్లు విత్తనాలు వెళ్ళటము గగనమవుతుంది. మరికొన్ని సార్లు పది బస్తాలు పండుతాయి. అతని ఆదాయమంతా పది ఎకరాల వరి పొలము మీదనే రెండు బావులున్నాయి. వరి పొలము మాత్రము అతని శ్రమను ఎప్పుడూ వృధాకానియ్యదు. ధనరాసులు కూడటం లేదు, అటు పైసాకు కటకటలాడి పోవటమూ లేదు.

కోటయ్యకు అయిదుగురు సంతానం. మొదటమ్మాయి లలిత. తల్లి దండ్రుల పసిమిని పంచుకుని పుట్టింది. రెండవ వాడు సూర్యనారాయణ. అతనూ అంతే. వారిరువురి అందాలను చూసి బంధువులూ, స్నేహితులూ చిట్టెమ్మ, కోటయ్యల అదృష్టాన్ని పొగిడేవారు. అలాంటి సమయాలలో భార్యా భర్తలు గర్వంగా నవ్వుకునేవారు. అటువంటి సమయంలోనే వేణు పుట్టాడు. వేణుకు ఎవరిపోలిక వచ్చిందోగాని, రంగు మాత్రము నలుపు. ఇద్దరు పిల్లల్లా కాక సన్నగా, పీలగా పుట్టాడు. తమకేదో అవమానమైనట్టూ, తమ స్వర్గములో ఎవరో రాక్షసులు ప్రవేశించినట్టూ బాధపడ్డారా దంపతులు. అయితే అది సహజమని అనుకోరాదు. ప్రపంచంలో ఎంత మంది నల్లని బిడ్డల్ని కనలేదు? కాకిపిల్ల కాకికి ముద్దన్నట్లు తమ బిడ్డలను ప్రేమించారు. కాని కోటయ్య దంపతుల సంకుచిత స్వభావమే అనుకోండి. వారిలోవున్న సౌందర్య లాలసే అనుకోండి, తమ రక్తం పంచుకుపుట్టిన నల్లబిడ్డ వేణును ప్రేమగా, అభిమానంగా చూడలేకపోయారు. పాలు త్రాగటము మరిచిన దగ్గర నుండి చిట్టెమ్మ పెళ్ళికి వెళ్ళినా, పేరంటమునకు వెళ్ళినా కుర్రవాడిని అత్తగారి వద్దనే వదలి వెళ్ళేది. "కోడలు నలుపైతే గోత్రమల్లా నలు"పను సామెతను గుర్తుంచుకొని, కోటయ్య తల్లి పసిమి ఛాయలోగల కోడలిని తెచ్చింది. అయినా వేణు నలుపు ఎలా పుణికి పుచ్చుకున్నాడో అర్థం కాదు. ఆ తరువాత పుట్టిన మధు, ప్రేమలు మాత్రం మంచి రంగును కల్గివున్నారు. అయిదుగురు బిడ్డల్లో



వేణు అంటే విముఖత తల్లిదండ్రులకు. సూరి, ప్రేమంటే తల్లికి ప్రాణము. మధు, లలితంటే తండ్రికి ప్రాణము. వారు తమ అభిప్రాయాలకు, అనుభూతులకే ప్రాముఖ్యము యిచ్చారుగాని, అతి సున్నితమైన కుమారుని మనసు ఎంత గాయపడుతుందో ఆలోచించలేకపోయారు. ఇంట్లో అన్నానికి కరువులేదు కాబట్టి తింటున్నాడు. అందరితోపాటు పెరుగుతున్నాడు. వేణుకు జీవితములో ఏదో వెల్తి కనిపించేది. అదేమిటో అతనికి అర్థం కాదు. అర్థం చేసుకునే వయస్సు కూడా కాదు.

ఇంట్లోకి వచ్చి, తనకు టీచరిచ్చిన కథల పుస్తకం తీసుకున్నాడు వేణు. స్వాతంత్ర్యము వచ్చి కొద్దిరోజులే కావడం మూలాన, స్వాతంత్ర్య సమరములో సమస్తమూ కోల్పోయిన వీరుల కథలూ గాథలూ వర్ణింపబడి వున్నాయి. అది తీసుకొని బయటికి వస్తూ ఓరగా గదివైపు చూశాడు. తల్లి మంచంలో తల్లిని అంటిపెట్టుకుని పడుకున్నాడు పధ్నాలుగేళ్ళ సూరి. తండ్రికి చెరో ప్రక్కా పడుకుని కబుర్లు చెబుతున్నారు ప్రేమ, మధు. తనూ అలాగే పడుకోవాలని బలమైన కోరిక కలిగింది వేణుకు. తలుపులు చేరవేసి నెమ్మదిగా తల్లి మంచం చేరాడు. తల్లీ, సూరీ ఆక్రమించగా మిగిలిన చోటులో తను పడుకున్నాడు.

"అప్పుడే వచ్చావు, నీళ్ళపని తెమిలిందా?" తల్లి అడిగింది.

"ఎవరూ రావడం లేదమ్మా?"

"పోతులా ఏమిటా దొర్లడం! ముగ్గురం పడుకుంటే మంచం వుంటుందా?"

"వాడు తనను తాను బుజ్జిపాపాయి అని అనుకుంటాడే. పన్నెండేళ్ళు దాటుతున్నాయి" కోటయ్య ఈసడించాడు. వేణు రోషంగా లేచాడు.

"అన్నయ్య నాకంటే పెద్దవాడు కాడా?" అరచినట్టే అడిగాడు.

"మూరెడు లేడు. ఎదురు జవాబు యిస్తున్నాడు చూడు" హుంకరించాడు కోటయ్య.

"ఏం పిల్లడోనండి! అన్నిటికీ పోటీ, మరి భగవంతుడు అందచందాలిస్తే ఇంకెంత మిడిసిపడేవాడో?" తల్లి దీర్ఘం తీసింది.

"ఆ తిరస్కారాన్ని భరించలేకపోయాడు వేణు. అభిమానంగా బయటికి వచ్చి కూర్చున్నాడు. అతనికి తల్లి, తండ్రిమీద కాదు, తోడబుట్టిన వారిపై విపరీతమైన అసూయా ద్వేషాలు బయలుదేరాయి. కాసేపటికి ప్రేమ వచ్చి, ఏదో అడిగితే కసరికొట్టాడు. తరువాత తండ్రిచే మొట్టికాయలు తిన్నాడు.

సాయంత్రం తండ్రి యెవరితోనో ముచ్చటిస్తుండగా; ఇంగ్లీషు మాష్టారు రాధాకృష్ణ వచ్చారు.

"నమస్కారం. రండి...... రండి" కోటయ్యగారు సాదరంగా ఆహ్వానించారు.

"ఏరీ! చిరంజీవులు......" నవ్వుతూ వచ్చి కూర్చున్నాడతను.

"సూరీ! మాష్టారు వచ్చారు" తండ్రి కేక విని సూరి బయటకు వచ్చి వినయంగా నమస్కరించాడు.

"నమస్కారం. వేణు ఏడీ" సూరి వేణును కేకవేశాడు. వేణు బయటికి వచ్చాడు.

"ఉదయమంత ఉత్సాహంగా వున్నవాడివి అప్పుడే అంత నీరుగారి పోయావేం? ఒంట్లో బావుందా?"

"వాడికేమండీ! దుక్కలా వున్నాడు. వాడికి వున్న రోగమల్లా ఒక్కటే. మిగిలిన పిల్లలతో గిల్లి కజ్జాలు తీస్తాడు" కోటయ్య చెప్పాడు. వేణు ముఖము మరీ పాలిపోయింది. తను కజ్జాలు తీస్తాడా?

"ఏదో పొరపాటు జరిగి వుంటుందండి. వేణు చాలా చురుకు గల వాడు, ఆలోచనాపరుడు. వాడిమాట చెప్పాలనే వచ్చాను. క్లాసులో అన్నింటిలో టాప్ చేశాడు. మీకు వీలుగా వుంటే సిటీకి పంపి ఏదైనా మంచి బడిలో చేర్పించండి."

"అలాగా! ఏదో ఇంట్లో పనులన్నీ వాళ్ళమ్మ నెత్తిన రుద్ది, పుస్తకాలు పట్టుకు కూర్చుంటాడు. సూరికెలా వచ్చాయి?"

"వాడు పాసుమార్కులు తెచ్చుకున్నాడు. మీరు కాస్త శ్రద్ధ వహించితే బాగానే చదువుతాడు."



"నాకు వాళ్ళ చదువును పర్యవేక్షించే తీరిక, ఓపిక లేవు మాష్టారూ! మీరే ఓ ప్రయివేటు మాస్టార్ని కుదర్చండి. సూరి డాక్టరు కావాలి, మధు ఇంజనీరు కావాలి" తండ్రి మాటలు వేణుకు తలతీసినంత పని అయింది. తనేం కాడా?"

"మనము అనుకున్నవి అనుకున్నట్టు అవుతాయండి? మీరు శ్రద్ధ వహిస్తే వేణు బాగా చదువుతాడు."

"చూద్దాం లెండి" తేల్చేశాడు. చిట్టెమ్మ నిమ్మరసము తెచ్చింది. అది త్రాగి రాధాకృష్ణ వెళ్ళిపోయాడు.

మర్నాడు ఉదయమే సూరి, తండ్రి, పాలేరు తయారయి యెటో వెళ్ళారు. తనకు అక్క దగ్గర కెళ్ళాలని యెంతో ఉత్సాహంగా వుంది వేణూకు. ఆ మాట అడిగితే కసురుకుంటారని కూడా తెలుసు. అందుకే ఊరుకున్నాడు.

"ఒరేయ్ వేణూ! ఇలా రా" అరుదుగా వినిపించే తల్లి ఆప్యాయమైన పిలుపు వినిపించింది. అందుకే మురిసిపోయి; పరుగున పెరట్లోకి వచ్చాడు.

"ఏంటమ్మా! పిలిచావా?"

"ఆఁ! వెధవపని యెంతచేసినా తెమలటం లేదురా! ఎండాకాలము రాగానే వడియాలు పెట్టాలనుకున్నాను. రోజూ ఏదోపని. అక్కయ్యొస్తే అసలు తీరదని పిండి ఉడకబెట్టాను. వరలక్ష్మి ఉందేమో పిలువు" అన్నది.

వేణూ పతంగిలా వెళ్ళాడు. ఒగురుస్తూ తిరిగి వచ్చాడు. "అమ్మా! వరలక్ష్మి మాస్టారుగారింట్లో మిషన్ కుట్టుకోవటానికి వెళ్ళిందటమ్మా."

"అయ్యో! మరెలా? ఒక్కదాన్ని పెడితే యెప్పుడవుతాయి? వేణూ, నువ్వూ ఓ చెయ్యి వేయమ్మా" తల్లి ఆప్యాయతకు కరిగిపోయాడు. వెంటనే పరిచిన తెల్లబట్టపై తల్లి పెట్టే విధంగా పిండిముద్దలు పెట్టసాగాడు అమ్మకు శ్రమ కాకూడదని. చిట్టెమ్మ కూడా సంతోషించింది. రెండు గంటలలో పని పూర్తి చేశారు. ఆఖరిముద్ద తీసుకుంటూండగా, మధు, ప్రేమ వచ్చారు బయటినుండి. నలుపుగా వున్న ముఖం చెమటలు క్రక్కుతూ జిడ్డు కారు తున్నది వేణు శరీరము. అతను సర్వము మరిచి రెండు చేతులతో వడియాలు పెడుతున్నాడు.

"ఛీ! అదేమిట్రా వేణూ?" పదేళ్ళ మధు ఛీత్కారం చేశాడు.

"ఏమిటి?" వేణు కనుబొమ్మలు ముడివడినాయి. తమ్ముడలా పేరుపెట్టి పిలవడము నచ్చలేదు.

"ఏమిటా? ఎడమచేత్తో యెక్కడయినా తిండి పదార్థాలు ముట్టుకుంటారా? అసహ్యంగాను. ఛీ! అంతా పెంటలో పొయ్యాలి." మధుకు చాలా అతిశయం. తండ్రి తననే ఇష్టపడతాడని, వేణు తల్లి వంక చూశాడు. తను ఇప్పుడు చేసిన సాయం గుర్తుంచుకుని అయినా, తనకు వత్తాసు పలకదా అనే ధీమా!

"చూడమ్మా! వాడిప్పటివరకూ ఊరుమీద తిరిగి నా పనికి వంక బెడుతున్నాడు."

"ఛీ! తిరగకపోతే! నీలా ఆడంగి ముత్తయ్యలా వడియాలు పెడతానేమిటి?" మధు మాటలకు తల్లి ఫక్కున నవ్వింది.

"మధూ! మరేం పెద్ద పనులు చేస్తావురా?" కొడుకును సంబరంగా అడిగింది.

"మధూ యిాజ్ యింజనీర్ ది గ్రేట్" గర్వముగా భుజాలు యెగరేశాడు.

"అలాగే అవుదువులే"

వేణుకు మండిపోయింది. తనని అలా అవమానము చేస్తుంటే తల్లికి సంతోషమా?

"అమ్మా! వాడు నన్ను ఆడంగి ముత్తయ్య అంటే ఊరుకుంటావా?"

"ఊరుకోక ఏం చెయ్యనురా? వాడిని చంపుదునా? చిన్నవాడు అంటే ఏం పోయింది."

"అవును వాడు చిన్నవాడు, అన్నయ్య పెద్దవాడు. ఇద్దరంటే నన్నే ...డమంటావు" ఉక్రోషంగా అడిగాడు.

"అబ్బబ్బ, కాసేపు మనిషిని ప్రశాంతంగా ఉండనివ్వవు కదా! ...ప్పుడూ నీ యేడుపు వాళ్ళమీదనే. అటు తిరుపతి కొండకేసి తిరిగి ఓ ...ండము పెట్టరా, 'అంతా చావనీ, నల్లకోతిని ఇంటికి మిగులనీ' అని" ఆవిడ ...రిచింది.



"అవునులే, వాళ్ళిద్దరు చేసిన పనులంటే నీకు చాలా యిష్టము."

"అయ్యో రామా! ఏం పాపము చేశానని ఈ రాక్షసి పిల్లాడిని నా కంటకట్టావు దేవా? మనుష్యుల్ని పీక్కు తింటావురా" ఆవిడ చేతులు కడుక్కోకుండానే తల బాదుకుంది. అది యెప్పుడూ సకారణంగా వాదించే పసివేణు నోరు మూయించే అస్త్రము.

వేణు రోషంగా బయటకు వెళ్ళాడు. చిట్టెమ్మ అవిధేయుడైన వేణు లాంటి కుమారుడినిచ్చినందుకు గొణుక్కుంటూనే ఉంది.

"ఏమీ! ఏమిటి గోల?" కోటయ్య వచ్చాడు.

"యెప్పుడుండే గోలే సూరిని బస్సు యెక్కించారా?"

"ఓ పళ్ళబుట్ట కొనిచ్చాను. అవధానులు కనిపించి ఆపేశాడు" ఏ కళనుందో గాని వేణు ఆశించిన విధంగా తండ్రికి ఆమె చెప్పలేదు. తండ్రి నరసింహావతారము యెత్తలేదు. అతను అభిమానించే రాధాకృష్ణ మాష్టారింటికి వెళ్ళాడు.

"రా వేణూ! సరూ, మా ప్రియశిష్యుడు వచ్చాడోయ్. పాసయి వచ్చాడు. నోరు తీపి చేద్దువుగాని రా" అతను కేకేశాడు. మరో మూడు నిమిషాలకు ఆవిడ వచ్చింది. బీరువాలోనుంచి చాక్లెట్లు తీసి యిచ్చింది.

"రేపురా వేణూ! ఏదైనా తీసి చేస్తాను. ఈపూట ఏం లేవు" అన్నదావిడ. వారి అభిమానము చూస్తే ఆ పసిహృదయము ఆర్ద్రమయింది.

"వేణూ! కేరమ్స్ ఆడుదామా?" బోర్డు తెచ్చాడు రాధాకృష్ణ. ఇరువురూ కేరమ్స్ ఆడుతుంటే సరోజిని లేసు అల్లుతూ కూర్చుంది. అయిదింటికి సరోజిని కాఫీ తెచ్చినప్పుడుగాని అతనికి ఇంటిపై ధ్యాస మరలలేదు.

"వస్తాను మాష్టారూ!" అంతే పరుగుదీశాడు. ఇల్లు చేరేసరికి చిట్టెమ్మ అప్పిగాడిని కేకలేస్తోంది.

"నువ్వా వచ్చావూ? ఇందాక యెక్కడ తగలబడ్డావు? నువ్వు ఆ నీళ్ళ దగ్గరుంటే అప్పిగాడు గేదలకు గడ్డి తెచ్చేవాడు."

"నేనే యెందుకుండాలి? మధును ఉండమను."

"మాటకు యెదురు చెప్పటము నేర్చుకున్నావు? నాన్నగారు రానీ...." బెదిరించింది. అంతలోనే కోటయ్య రానే వచ్చాడు.

"ఏమిటీ! యెప్పుడూ ఇంట్లో యేదో గోల?" విసుక్కున్నాడు.

"వేణు కేం పని చెప్పినా, ఆ చిన్న వెధవకు పోటీబెట్టుకుంటాడు. ప్రొద్దున తిండితిని వెళ్ళినవాడు ఇప్పుడు వచ్చాడు" తల్లి ఫిర్యాదు చేసింది.

"ఏమిట్రా పొగరు?" వేణు రెండు చెవులూ పట్టి ఆడించాడు తండ్రి. తండ్రి పంజానుండి బయటపడి బయట అరుగుమీద కూర్చున్నాడు. చీకటి పడ్డాక దీపము వెలిగించుకువచ్చి అరుగుమీదే చదువుతూ కూర్చున్నాడు. లోపల గిన్నెల చప్పుడు వినిపించింది. 'అమ్మ వడ్డిస్తుందిలా వుంది. అన్నయ్య అలిగితే పిలిచినట్టు నన్నూ పిలుస్తుంది. అప్పుడే లొంగిపోగూడదు. "నాన్నకు నీపై నేరాలు చెప్పనురా మా తండ్రి' అని నోటి దగ్గరికి ముద్ద తేవాలి. అప్పుడే కదలాలి. ధృడంగా నిశ్చయించుకున్నాడు. గట్టిగా తండ్రికేక వినిపించి అతని ఊహలను చెల్లాచెదురు చేశాయి.

"వేణు! ఒరేయ్ గాడిదా! రా! ప్రొద్దంతా ఊరుమీదపడి తిరిగి రాత్రి అలకసాగిస్తే యెవ్రా బ్రతిమాలేది?

"నాకు ఆకలిగా లేదు" అభిమానంగా జవాబు ఇచ్చాడు.

"వాడికి ఆకలి లేదట. మనము బ్రతిమాలుతామని తాపత్రయము కాబోలు! అలాంటిదేం లేదు. మాడితే వచ్చి తిను. నీ బ్రతుక్కి కోపమొక్కటే తక్కువ" అన్నాడు. పిలుస్తారని ఆశగా చూశాడు.

"ఈ పూట అమ్మ పూరీ, మామిడిపండ్ల రసము చేసింది అన్నయ్యా!" ప్రేమ వచ్చి చెప్పింది. వేణుకు నోరూరింది. తన పట్టుదల సడలిపోయింది. తను పంతానికిపోయి, కమ్మటి భోజనము వదులుకున్నాడు. మరోసారి అమ్మ పిలువకూడదూ?"

"వస్తావా, రావా? అన్నీ మూసిపెడతాను" వేణును ఉద్దేశించి అడిగింది తల్లి. మరోమాట లేక తల్లి ఉన్నచోటికి వెళ్ళి కూర్చున్నాడు. వడ్డించింది తిన్నాడు. అంత వ్రతము చెడగొట్టుకుని మామిడిపండ్ల ఆశకు భోజనానికి కూర్చుంటే రసము అడుగు తేలింది. చెయ్యి కడుక్కుని పడక చేరాడు.



"ఒరేయ్ వేణూ! ఇలా రా!" తండ్రి కేకవేశాడు. వేణు వెళ్ళి నిల్చున్నాడు.

"పద్దుల పుస్తకము పట్టుకురా. నేను చెప్పినవి రాద్దువుగాని." మాటాడక పద్దుల పుస్తకము పట్టుకొచ్చాడు. తండ్రి చెప్పిన వివరాలన్నీ పుస్తకములోకి యెక్కించాడు. పూర్తిచేసి తండ్రి ముందు పెట్టాడు. అతను తృప్తిగా తలపంకించాడు. అప్పుడే చిట్టెమ్మ మరచెంబుతో నీళ్ళు తెచ్చింది.

"వీడు రాయటము భలేగా రాస్తాడే. వేణూ! గుమస్తా ఉండగా వ్రాసినవన్నీ చీదరగా వున్నాయిరా. రేపు బౌండు బుక్కు తెస్తాను. అన్నీ చక్కగా కాపీ చేయి."

"అలాగే నాన్నా!" వేణు హృదయములో ఓ సంతోష తరంగము లేచింది. అప్పుడే అణగిపోతుందని అతనికేం తెలుసు?

"కాస్త బద్ధకస్తుడుగాని సూరుడి దస్తూరి బావుంటుందండి" చిట్టెమ్మ అన్నది. నిజంగా తాము కన్నపిల్లల పట్ల ఇంత భేదము చూపటము ఇప్పుడే ఉందా, పురాణాల నాటినుండి ఉన్నదా అన్నదే అర్ధంగాని విషయము.

ఒక్కసారి తల్లివంక చూసి బయటకు వచ్చాడు వేణు.

రెండవరోజు సాయంత్రము ప్రేమకు చొప్పకట్టెలతో బండిచేసి పెడుతుండగా లలితా, సూరి దిగారు. వేణు సంబరంగా అక్కకు ఎదురు వెళ్ళాడు.

"అక్కా! బావ రాలేదూ?"

"బావకు నా వెంట రావడమే పని. మధు యేడిరా?"

"నాన్నా, మధు పొలము దిక్కువెళ్ళారక్కా" అన్నాడు. చిట్టెమ్మ రావడము, కూతుర్ని కౌగిలించుకోవటమూ క్షణాలమీద జరిగిపోయాయి.

"చిక్కిపోయావు లలితా." అన్నది ఆనందమంతా కళ్ళతో వ్యక్తపరుస్తూ.

"అమ్మాయిగారికి చాలా పని ఉంటుందమ్మా. పట్నానికి దగ్గరన్న మాటేగాని ఓ నల్లా లేదు, పాడూ లేదు" సామానులు దింపి చెప్పాడు పాలేరు.

"మీ ఊళ్ళోకి పంపు రాలేదా అమ్మాయ్! నీళ్ళు నువ్వే తోడాలా?"

"అందరూ తోడుతారులే. లతా పాసయ్యావుట కదే?" చెల్లిని దగ్గరగా తీసుకుంది. సూరి వెళ్ళి వేణు ఫస్టు వచ్చాడని చెప్పి వుంటాడు.

అక్కయ్య అభినందిస్తుందనుకున్న వేణుకు నిరాశే యెదురయ్యింది. లలిత వేణు ఉనికిని మరచిపోయినట్టు ప్రవర్తించింది. ఎవరూ అడగరని తెలిసి తనే చెప్పుకున్నాడు.

"అక్కా! క్లాసులో నేను ఫస్టు వచ్చాను."

"అదో పెద్ద సంగతట్రా! మా మరుదులిద్దరూ క్లాసులో ఫస్టు వచ్చారు. ఇంకా మా ఊరిలో కాస్త కష్టమంటారు చదువు కూడాను."

"వాళ్ళిద్దరికీ ట్యూషన్లున్నాయి కదూ?"

"యేదో పేరుకేలే" అన్నది.

వేణు నిరుత్సాహంగా నిట్టూర్చాడు. అతనాశించిన అభినందన లభించనేలేదు. రోజూ పిండివంటలతో, కబుర్లతో కాలక్షేపము జరుగుతోంది. ఆరోజు అందరూ చాప మీద పడుకుని, సినిమా కబుర్లు చెప్పుకుంటున్నారు.

"అక్కా! నేను పాసయ్యాను కదా, తొమ్మిది రూపాయలట, పైలెటు పెన్ను కొంటానంటే వద్దంటున్నారే నాన్న." ఉన్నట్టుండి చెప్పాడు సూరి.

"అంత ఖరీదుపెట్టి తెస్తే ఎక్కడో పారేసుకుంటాడు లలితా! మెట్రిక్ పాసయ్యాక ఒకేసారి ఇప్పిస్తాను" కోటయ్య చెప్పాడు.

"అన్నింటికీ మెట్రిక్ పాస్ కావాలేం? సైకిల్ అడిగితే అదే మాట! పెన్ అడిగితే అదేమాట! ఉలెన్ ప్యాంట్ అడిగితే అదేమాట. గునిశాడు సూరి.

"పోనీలేరా, తొమ్మిది రూపాయలేగా, నేనిస్తాను కొని తెచ్చుకో" పెన్ను విలువా, ఉపయోగము తెలియని మధు, ప్రేమ తమకు పట్టనట్టు ఊరుకున్నారు. వేణు మాత్రం ఆశగా అక్కవంక చూశాడు. అతని చూపులెవరూ గమనించలేదు. ఆ సాయంత్రమే సూరి వెళ్ళి పెన్ను తెచ్చుకున్నాడు. చాక్లెట్ రంగుతో బంగారపు క్యాప్‌తో ముద్దుగా, ముచ్చటగా వుంది. అన్న చేతిలోనుండి అందుకుని ఆత్రంగా చూశాడు.

"చాలా బావుంది అన్నయ్యా."

"నీకు కావాలా?" వెటకారంగా అడిగింది తల్లి. "వీడితో చచ్చి పోతున్నానే. అన్నింటికి అన్నతో, తమ్ముడితో పోటీ!" అన్నది.



"అదేమిటమ్మగారూ! వేణుబాబు పరాయివాడా?" అప్పుడే లాంతర్లు తుడిచి పట్టుకువచ్చిన జీతగాడు అడిగాడు.

వేణు వాడిదెస కృతజ్ఞతాపూర్వకంగా చూశాడు. అన్నగారి పెన్ను చూస్తూనే, అలాంటిది తనకు కొనివ్వమని అడగాలనుకున్న వేణు ఆశ ఆదిలోనే అంతరించిపోయింది. చూచిందల్లా తనకు కావాలనటము తల్లి సహించలేదు. తండ్రికి, తల్లికి ఇష్టముకాని పిల్లలు బంధువులకు ఇష్టము కాదు. బంధువులు ఇంటి పెద్దల అభిప్రాయము ప్రకారము నడిచి, వారి ఆదరణ పొందాలనుకుంటారు. కాని యెవరికీ పసిమనసులలో కలిగే సంచలనము అవసరముండదు. సూరికి పెన్ను కొనిచ్చి, తనకేం పెట్టని అక్కంటే వేణుకు ఓ విధమైన విముఖత కల్గింది. అది బయటపెట్టే మార్గము వెతుకుతున్నాడు.

ఆ సాయంత్రము వేణు పద్దుల పుస్తకంలో నుండి తండ్రి చూపిన లెక్కలు మరో పుస్తకములోకి ఎక్కిస్తుండగా, చక్కగా ముస్తాబై వచ్చింది లలిత.

"ఒరేయ్! వరలక్ష్మి వదిన దగ్గరకు వెళ్దాము రారా."

"నేనేం రాను. నీ ప్రియమైన తమ్ముడున్నాడుగా! తీసుకువెళ్ళు." అన్నాడు. త్వరలోనే అక్కపై కక్ష తీర్చుకునే అవకాశం లభించినందుకు సంతోషపడుతూ.

"అదేమిట్రా, నువ్వు తమ్ముడివి కావా?"

"అందుకే నాకు పెన్ను కొనిచ్చావు కదూ?" వేణు మాటలకు లలిత తెల్లబోయింది. జరుగరాని ప్రమాదమేదో జరిగిపోయినట్టు బాధపడింది.

"అమ్మా! వీడి మాటలు చూడే! నువ్వంటే ఏమో అనుకున్నాను" అరిచింది. వేణుపై విపరీతమైన కోపము వచ్చింది. లోపలికి వెళ్ళి తల్లీ, కూతుర్లు వాడిని దారినపెట్టే మార్గము గానక చర్చలు మొదలుపెట్టారు. వాడి ప్రవర్తనకు బెత్తమే సరియైన మందు అని తేల్చారు.

నాల్గురోజులు గడిచాయి. అందరూ నట్టింట కూర్చున్నారు. "చూస్తుండగానే లలితమ్మ వచ్చి పదిరోజులు గడిచిపోయాయి. ఏ క్షణములోనైనా

దాని అత్తగారు రావచ్చు పిల్చుకుపోవడానికి. వెళ్ళి దానికి బట్టలు పట్రండి" చిట్టెమ్మ ప్రస్తావించింది.

"అలాగే సాయంత్రం కాస్త ఎండ తగ్గాక వెడతాను. బడులు తెరవగానే కొనడమూ, కుట్టడమూ అంటే వీలుపడదు. పిల్లలందరికీ కొంటాను. నువ్వూ రారాదూ?"

"ఆ! నేనెందుకు? నాకు కావల్సినవి యేవో లలిత ఏరుతుంది" అన్నది. పిల్లలంతా ఉత్సాహంగా, హుషారుగా ఈలలు వేశారు.

మొదట ఆడవారి దుస్తులు కొన్నారు. తర్వాత మొగపిల్లల దుస్తులు ఎన్నిక ప్రారంభమైంది. ముగ్గురికి ఒకేరకమైనవి కొన్నారు. మరో కొట్టులోకి వెళ్ళారు.

"నాన్నగారండీ! నాకీ గళ్ళచొక్కా కావాలండి" రెడీమేడ్ చొక్కా చూపించాడు సూరి.

"అవున్నానా! అవి ఫ్యాషన్ చొక్కాలు. మా మరుదులుకూడా కొన్నారు" లలిత చెప్పింది.

"తెలుపు కాబట్టి మధుకు, సూరికి బావుంటాయి. వేణుకు బావుండవు" పెదవి విరిచాడు కోటయ్య.

"వేణుకు మరోచోట చూడవచ్చు" అన్నది లలిత.

"ఇక్కడకూడా వారితో పందెము పెట్టుకోకు. నీకు కావల్సినవేమిటో నాకు తెల్సు. పెద్దవారు చెప్పినట్టు వినాలి. ఏం?" భర్త తమ్ములకు బోధించే కొన్ని మాటలు జ్ఞాపకముంచుకుంది లలిత. మంచిదన్నట్లు తలాడించాడు. మరో కొట్టులో ప్రేమకు ఫ్రాకు కొంటున్నారు.

"నాన్నా! ఈ తెల్లచొక్కా బావుంది" వేణు సంబరంగా, ఓ వ్రేళ్ళాడదీసిన చొక్కాను పట్టుకున్నాడు.

"నువ్వట్రా! వీసమెత్తు వారవస్తే ఊర్కుండేవాడివి!" నవ్వుతూ అన్నాడు. నీలో మిగిలిన పిల్లల్లో లేని లోపముంది. కాబట్టి దాన్ని ఎత్తి చూపాలని పెద్దవారి ప్రయత్నం. నా రంగులో భేదమైనా, హృదయము అందరి లాంటిదే. తనూ హక్కుదారుడే. అతని హక్కులకు ఏ మాత్రము భంగము గూడదని వేణు తాపత్రయం. కోటయ్య తెల్లచొక్కా ధర అడిగాడు. దాని ఖరీదు చాలా ఎక్కువ. అతను ముఖము చిట్లించి దూరము నెట్టాడు.

"తీసుకో నాన్నా."

"నీకు మతివుందట్రా! అంత ఖరీదులో నాలుగు చొక్కాలు కుట్టించ వచ్చు. నాకో అధికారివయ్యావు. ఇంట్లోనూ నీ గుణుపే, బయటా నీ ఏడుపే. చూడు డబ్బుందేమో? "జేబులోని పర్స్ తీసి వేణుపైకి విసిరాడు. అది సూటిగావచ్చి అతని గుండెలను గ్రుద్దినట్లు బాధపడ్డాడు. అదేమాట ప్రేమగా చెబితే విననంత మూర్ఖుడేం కాదు వేణు. కోటయ్య కోసమల్లా ఒక్కటే. 'మిగిలిన పిల్లలలో లేని సమస్య వేణుతో వుందే? అవిధేయుడెందుకయ్యాడు'. అతను కాస్త లోతుగా ఆలోచిస్తే, అతని ప్రశ్నకు జవాబు లభించేది. మిగిలిన పిల్లలు కోర్కెలు గుట్టుచప్పుడు కాకుండా తీరుతున్నాయి. వేణు కన్నీరు తుడుచుకుని తండ్రి పర్స్ అతని చేతిలోపెట్టి, బయటికి వచ్చాడు. తను స్వయంగా సంపాదించిననాడుతప్ప, తను కోరుకున్న దుస్తులు ఎవరినీ అడగరాదని మనసులోనే ప్రమాణము చేసుకున్నాడు. అతని ప్రమాణానికి సాక్షిగా సంధ్యాదేవి నిలబడింది.

రెండవరోజు బూట్ల కొట్టులో మరేం చెప్పక తండ్రి చూపించినవే తీసుకున్నాడు. క్రొత్తగా వచ్చిన హవాయి చెప్పులు కొన్నారు మిగిలినవారు.

"పెద్ద జమీందార్లలా ఇంట్లో చెప్పులు వేస్తారా?" తండ్రి అన్నను కసురుకోవటము విన్నాడు. నాకు అలాంటివి కావాలని అడగలేదు. అలా చిగురించే ఆశలకు నీరు, గాలి లభించలేదు. వేణు హృదయము చిన్నదైనా, ఆశలను ఓ మూల అణగద్రొక్కాడు. మౌనముగా తండ్రి యెటు వెళితే అటు తిరిగి వచ్చాడు. కాని అతని మనసులో ఎన్నో ప్రశ్నలు. మసగ్గా తేలిపోతున్నాయి. తను నల్లగా పుట్టడానికి కారణము యెవరు? నెమ్మదిగా ఉత్సాహము హరించుకుపోతూ, దాని స్థానాన గంభీరత అలముకోసాగింది.

## 2

బడులు తెరిచారు. వేణు వెళ్తున్నాడు, వస్తున్నాడు. ఆరోజు బడిలో గారడీ చూపుతారట. ఇరవై అయిదు పైసలు పట్రమ్మన్నారు. బడినుండి తిరిగి వస్తుండగా, దారిలో తండ్రి కనిపించాడు. మధు పరుగెత్తాడు.

"నాన్నోయ్ ఆగు" అరుస్తూ పరుగెత్తి తనకు కావల్సిన డబ్బులు తెచ్చుకున్నాడు. ఇంటికి వచ్చి అన్నం తింటుండగా సూరి అడిగాడు.

"అమ్మా గారడీ చూపుతారట! గారడికి ఒక్క రూపాయి కావాలి."

"నీ వేషాలు తెలియవట్రా! గారడికి ఒక్క రూపాయి దేనికి?"

"గారడీ చూశాక తలనొప్పి వస్తే టీనీళ్ళు త్రాగొద్దా?" మురిపెంగా అడిగాడు.

"అప్పుడే అయ్యగారికి జమీందార్ల రాజసము" నవ్వింది. వొక రూపాయి తీసి, సూరి చేతిలో పెట్టింది. అది విననట్లు ఒకసారి తలెత్తి చూసి తల దించుకున్నాడు వేణు. సూరి అమ్మకొడుకు, మధు నాన్న కొడుకు అన్న భావన అతని మదిలో బాగా పేరుకుపోయింది. దానికి తల్లి దండ్రుల ప్రవర్తన సహకారాన్నిచ్చింది. పాపము వారిది తప్పనలేము. ఎంత చదివినా, అనుభవం సంపాదించినా కొందరికి భావములు పరిపక్వమై, వాటిని క్షుణ్ణంగా పరిశీలించడం తెలియదు. వేణు నెమ్మదిగా బడి చేరినాడు. ఒక్క పిరియడ్‌కాగానే, గారడీ చూడ్డానికి నిర్ణయించిన స్థలములోకి చేరినారు.

"వేణూ! నువ్వు అమ్మనడిగి డబ్బులు తెచ్చుకోలేదుగా! పోనీ నేనిస్తాను రా!" సూరి పిలిచాడు.

"నాకేం అక్కర్లేదు" అభిమానంగా త్రోసిపుచ్చాడు. తన సామ్రాజ్యాన్ని లాక్కున్న శత్రువులా కనిపించాడు సూరి ఆ క్షణంలో. గేటు దగ్గరకు వచ్చాడు. తెలిసిన ప్రతి కుర్రవాడు ఒకటే ప్రశ్న. "అదేం వేణూ! గారడీ చూడవా?" తను చూడకపోతే వీళ్ళదేం మునిగిపోయిందో?

"వేణూ! ఓ వేణుగోపాల్......ఇటు, ఇటు రావయ్యా" చప్పట్లు కొడుతూ రాధాకృష్ణ పిలిచాడు.



"ఏమిటి మాష్టారూ?" త్వరగా వెళ్ళాడు.

"హాలులో బెంచీలు సరిపడటము లేదు. మన ప్యూన్లు తెలుసుగా, ఏడుగంటలలో ఆరడుగులు నడుస్తారు. కాస్త చంద్రానికి సాయం చెయ్యి. అన్యదా భావంచవు కదూ?"

"పని చెయ్యటానికి వెనుకాడుతామా?"

"అదేనోయ్! ఇంకా మనవారికి డిగ్నిటీ ఆఫ్ లేబర్ తెలియదు. అప్రత్‌ను పిలిస్తే ఆముదం త్రాగినట్టు ముఖము పెట్టాడు"

అతని వెనకాలే వెళ్ళి బెంచీలు మోశారు. తరువాత వారికి ప్రత్యేకంగా ఉపాధ్యాయుల దగ్గర స్థలము దొరికింది. గారడీ తరువాత అందరూ యిండ్లవైపు వెళ్తున్నారు.

"రావోయ్! ఈరోజు మా పాప పుట్టిన రోజు. ఎవరినీ పిలవలేదు. నువ్వయినా వచ్చి గ్రీటింగ్స్ చెప్పి పో" తన కింట్లోలేని గౌరవం ఎవరో కల్గిస్తుంటే కాదనలేకపోయాడు. అతనివెంట వెళ్ళాడు. చక్కగా ముస్తాబై నాలుగేళ్ల అబ్బాయి, రెండు సంవత్సరాల అమ్మాయి తండ్రి కెదురుగా వచ్చారు.

"పుట్టినరోజు పాపదా! బుజ్జిదండీ?"

"పాపదని చెప్పానుగా! కూతుర్ని, కొడుకుని ముద్దాడాడు.

"ఇద్దరూ కొత్తబట్టలేసుకున్నారు కదండీ."

"ఓ, అదా! బాబుకేం తెలుసు తన పుట్టినరోజు కాదని. చెల్లి ఒక్కర్తే వేసుకుంటే వాడి మనసు బాధపడదూ? అందుకే యిరువురికి కొన్నాము" అన్నారు. వేణు చిత్రంగా చూశాడు. ఫలహారము చేసి తిరిగి వచ్చేటప్పుడు అప్రయత్నంగా వంగి అతని పాదాలకు నమస్కరించాడు.

"ఇదేమిటోయ్?" రాధాకృష్ణ ఆశ్చర్యంగా చూశాడు. అతనికి జవాబు చెప్పకుండా త్వరగా యింటికి వచ్చాడు.

"ఊర్లో పెత్తనాలు తెమిలాయా వేణుగోపాల్ మహాశయా?" కోటయ్య అడిగాడు.

"నాకేం పెత్తనాలున్నాయి? మాష్టారింటికి వెళ్ళాను."

"ఏం వాళ్ళ అంట్ల మనిషి రాలేదా?"

"అంట్ల మనిషి రాకుంటే, నాకేం పని?"

"తిరిగి ఎదురు చెబుతాడు చూడు సిగ్గులేక. బడిలో బెంచీలెవడు మొయ్యమన్నాడోయ్? సిగ్గులేదూ?"

"మాష్టారు సాయం అడిగితే కాదని చెప్పాలా?"

"ఏడ్వలేకపోయాడు. నీకు అభిమానము లేదా! అది కడజాతివారు చేసేపని."

"వాడి రాతలో ఆ పనులే వ్రాసిపెట్టి ఉన్నాయేమో, బుద్ధి భూము లేలాలంటే రాత రాళ్ళు మోయమన్నట్లూ, భగవంతుడు రూపమే కాదు! గుణము దోచాడు కదరా" సన్నగా లోపలినుండి పలికింది చిట్టెమ్మ.

"అదంతా పనిచేసి గారడీ చూడాలని యెత్తమ్మా. నేను డబ్బిస్తానంటే వద్దన్నాడు" సూరి ఫిర్యాదు.

"చూశారండి. నిజంగా యెవరి గుణమొచ్చిందో గాని, నా తండ్రిది వెన్నపూసవంటి హృదయము. విషమైనా, అమృతమైనా అందరము తిందామంటాడు. ఏం పాపముచేసి, ఈ మతిలేనివాడిని కన్నానో, రాత" గొణుక్కుంటూ వెళ్ళింది. భార్య అంతలా బాధపడటము సహించలేకపోయాడు కోటయ్య. వెంటనే కొడుకు జుట్టుపట్టి కసితీరా ఆ చెంపా, ఈ చెంపా వాయించి, అతని ఆక్రందన చెవులబడ్డాక వదిలాడు. ముఖము తుడుచుకుని ఏడ్చినట్టు ఎవరికి తెలియరాదని అభిమానంగా వెళ్ళి కూర్చున్నాడు. ఇంట్లో పెద్దల నిరాదరణ పొందినవారంటే పిల్లలకు చులకనే. ప్రేమ తొంగి చూసింది.

"అమ్మా! కళ్ళు షర్టుతోనే ఒత్తుకుంటున్నాడే" గుసగుసగా చెప్తుంది, మధుకూడా చూశాడు.

"అసలు దెబ్బలు గట్టిగా తగులలేదులా వుంది. అసలేడవందే." వాడి కామెంటుతో వేణుకు మండిపోయింది. లేచి వాడి రెండు చెవులు మెలిపెట్టాడు. వాడు అరవబోయాడు. నోరుమూసి బెదిరించాడు.

"అరిచావంటే తంతాను" మధు భయపడిపోయాడు. ఇంటివారి నిదారణ క్రింద వేణులో వున్న గుణగణాలు బయటికి రావడము లేదు,



అతనంత బలాఢ్యుడు బడిలో ఎవరూ లేరన్న సంగతి తెలుసు. తను ప్రత్యక్షముగా చూశాడు. ఒకరోజు ఇద్దరు రౌడీ పిల్లలు కలిసి బజార్లో వెళ్ళే ఆడపిల్ల తలలోని పూలు తీశారు. వెంటనే వారిమీదికి లంఘించాడు వేణు. వారిద్దరూ అతనికంటె పెద్దవారే. ఆ దృశ్యము మధు కళ్ళలో మెదిలింది.

"వదులు అన్నయా! చెప్పను. ఎవరితో చెప్పను" అన్నాడు దీనంగా.

వెంటనే వదిలేశాడు. తను చెప్పవచ్చుననే అభిప్రాయముతో పరుగులు పెట్టిన ప్రేమ కాస్త వెనక్కిచూసి, వేణు చూపుల నెదుర్కుంటూ అక్కడే నిల్చుండిపోయింది.

"వెళ్ళు. ఆగిపోయావేం? తంపులమారి పిల్లా!"

"ఏమిట్రా, ఎవరదీ అరిచేది?"

"ఏం లేదమ్మా, ఊరికినే" జవాబిచ్చాడు మధు. తన విచారము మరచిపోయి నవ్వేడు వేణు తమ్ముడు పిరికితనానికి. తను అలకసాగిస్తే పిలిచేవారు లేరని తెలుసు. అందరూ భోజనాలకు కూర్చోగానే వెళ్ళి తనూ కూర్చున్నాడు.

* * *

సూరికి జ్వరము వచ్చింది. నాల్గురోజులు బడికి వెళ్ళలేక పోయాడు. అతన్ని అంటిపెట్టుకునే కూర్చుంది చిట్టెమ్మ. ఇది సూరికి పరీక్షల సమయము. ఇటు మెట్రిక్యులేషన్‌కు చదవాలి. మూడు సంవత్సరాల నుండి జోకొట్టిన పోర్షన్‌లను ఈసారి లేపి, పిల్లల దుంప తెంచుతారు. డాక్టరు వచ్చాడు. మందులిచ్చి జాగ్రత్తని చెప్పి వెళ్ళిపోయాడు.

"ఆఖరు సంవత్సరము గట్టెక్కితే కాలేజీలో చేరతాడనుకున్నాను కదండీ! ఇప్పుడే రావాలా పాపిష్టి జ్వరము?"

"నువ్వు దిగులుపడి, వాడిని అధైర్యపరచకు, ట్యూషన్ పెడతాను. కండువా ఇలా తే. బస్సుస్టాండు దగ్గర యాపిల్ పళ్ళు, ద్రాక్ష ఉన్నాయేమో చూస్తాను". అతనువెళ్ళి పళ్ళూ, హార్లిక్స్, గ్లూకోజు పట్టుకువచ్చాడు. వేణుకు విపరీతమైన దిగులు వేసింది. తల్లిదండ్రుల ప్రేమ తనకు దూరం చేసిన సూరి, మధు అంటే కొన్నిసార్లు విపరీతమైన అసూయ కలిగినమాట నిజమే.

ఆ క్షణములో వారు లేకుండాపోతే తనకే అడ్డూ వుండదని ఆలోచించేవాడు. కాని పాలిపోయిన ముఖముతో మంచానికి పడిన అన్నను చూడగానే ఏడుపు వచ్చింది. సూరి మూల్గుతున్నాడు.

"తలనొప్పిగా వుందా అన్నయ్యా?" ప్రేమగా వెళ్ళి దగ్గర కూర్చున్నాడు.

"తలే కాదు, ఒళ్ళంతా నొప్పిగా వుంది. మా సైన్స్ మాష్టారు వచ్చారుట్రా?"

"రాలేదన్నయ్యా! నువ్వేం దిగులుపడకు. శాయివాళ్ళ దగ్గర నోట్సు తెచ్చి, నీకు రాసి పెడతాను."

"మంచిదిరా" ఆ క్షణములో రెండు లేత హృదయాలు ఒకదానితో ఒకటి పెనవేసుకోబోయాయి.

"వాడిని ఒంటరిగా వదలాలని అన్నాడుగా డాక్టరు. ఇటు రా." చిట్టెమ్మ కేకవేసింది. వేణు దూరంగావచ్చి కూర్చున్నాడు. ఆమె కొడుకు దగ్గరగా వెళ్ళి యాపిల్ పళ్ళు కోసి బలవంతంగా తినిపించింది. చిన్న పిల్లలకు చెరి కాసింత పెట్టింది. అలా నాల్గురోజులు గడిచాయి. సూరికి పథ్యము పెట్టారు. వాడికోసం ప్రత్యేకంగా చేసే వస్తువులు చూశాక, తనకూ జ్వరం వస్తే భావుండును అనిపించేది వేణుకు. తను చిన్నవాడు కాదు ఇంత పెట్టడానికి. వారము రోజులనుండి ఇంట్లోకి పళ్ళు వస్తున్నాయి. వాటి వాసనే తప్ప రుచి తెలియదు. నిజంగా తనకు జ్వరము రావాలని కోరుకున్నాడు.

మరురోజు అన్నతో కబుర్లు చెబుతూ బడికి వెళ్తుంటే చిట్టెమ్మ కడగొట్టు తమ్ముడు వరదరాజు బ్యాగ్ పట్టుకుని కనిపించాడు.

"ఏరా సూరీ! బావున్నావా?"

"ఈ రోజే అన్నయ్యకు నయమైంది మామయ్యా! బడికి వెళ్తున్నాము" వేణు జవాబు చెప్పాడు.

"సరే వెళ్ళండి. నేను యింటిదగ్గరుంటాను" వరదరాజు వెళ్ళిపోయాడు. అంతకు ముందు సంవత్సరమే బి.కాం. పాసయి ఉద్యోగము చేస్తున్న వరదరాజంటే వేణుకెంతో గర్వము. చదువుకున్న మామయ్య, తన మార్కులను చూసి సంతోషిస్తాడని ఆ పసివాడి అభిప్రాయం. మధ్యాహ్నాము



రోజుకంటే ముందుగా వచ్చారు పిల్లలంతా. అందరికి బహుమతులు తెచ్చాడు. వేణు సంతోషించాడు. అక్కలా కాదు, మామయ్య మంచివాడు అనుకున్నాడు. నిజానికి వరదరాజు వేణుకోసము ప్రత్యేకంగా కొనాలని ఏం కొనలేదు. అక్కయ్య యింట్లో నల్గురు పిల్లలున్నారు కాబట్టి, నాల్గు కొనాలి అనే అభిప్రాయంతో తెచ్చాడు. అందరికి వడ్డించింది చిట్టెమ్మ.

"చదువయింది. ఇప్పుడయినా మరదలిని పిలుచుకొస్తావా లేదా?"

"మరో రెండు నెలలుండనీ, యింటికి కావల్సిన సామానులు అమరినాక పిల్చుకొస్తాను తొందరేం? ఆడవాళ్ళు వస్తూనే చేతిలో కత్తెరలు పెట్టుకొని వస్తారు!"

"బావుందిరా! పాపం దానికి మాత్రం విసుగురాదూ? తోడు ఓ పిల్ల కూడాను."

"పరాయివారి దగ్గరుందా? పుట్టింటిలోనేగా" నవ్వేశాడు రాజు.

"మా కోడలు బడికి వెడుతుందా?" నవ్వుతూ అడిగాడు కోటయ్య.

"పల్లెటూరులో అయిదేళ్ళు వస్తేగాని తీసుకోరు. ఏరా మధూ! చదువుకోకుంటే మా అమ్మాయి పనికిరాదుట్రా?" మధు సిగ్గుపడ్డాడు.

"మధు బంగారు కొండరా! వాడికెవడయినా పాతిక వేలు కట్నముతో ఇస్తారు. మేనరికము వేణుకు." చిట్టెమ్మ నవ్వింది.

"అమ్మ తల్లీ! నీ నీగ్రో కొడుక్కి యిస్తానా? మా అమ్మాయికి నలుపు అంటదూ? అక్కా! ఒక పని చేయరాదూ? సబ్బుల కంపెనీవాళ్ళు అడ్వర్టైజు చేస్తారే, అలా రోజూ నీ కొడుక్కి లక్స్‌సోప్ పెట్టి రుద్ది స్నానము చేయించు. కాస్త రంగు వస్తుంది." తన మాటలకు తనే నవ్వుకున్నాడు.

"యెవడికోసము యిస్తావురా! ఏదో వంక ఉంటేనే మేనరికానికి ఆశిస్తాము కదా?" అన్నది.

అది జరిగేదా, లేదా అన్న విషయము కాలమే నిర్ణయిస్తుంది. చాలామంది పెద్దవారికి ఉన్న దురలవాటు ఏమిటంటే తను సరదాలు పిల్లల ముందే వెళ్ళబోస్తారు. అది క్రూరమైన పరిహాసమని వారికి తెలియదు. వేణు వెంటనే అక్కడుండటము ఇష్టము లేనట్టు వెళ్ళిపోయాడు.

"మజ్జిగ పోసుకోవేంరా!" తల్లి అరుపు వినిపించుకోనేలేదు. దారి పొడవునా అతనికి తల్లి, మామల సంభాషణే చెవులలో మెదలుతుంది. కొందరు పిల్లలు యీ చెవిని విని, మరో చెవిన వదిలివేస్తారు. వేణుకు జ్ఞాపకశక్తి యెక్కువ. ఏదీ మరిచిపోలేడు. అందరూ నల్లటి పిల్లలంటే ఇలాగే చులకనచేసి మాట్లాడుతారా? కాదని వెంటనే అతని అంతరంగము జవాబు చెప్పింది! లక్ష్మయ్య మాష్టారి కూతురు నలుపు. ఒకరోజు యెవరో ఆ మాట అని ఆ మాష్టారిని వెక్కిరించారులా ఉంది.

"మీ అమ్మాయి పెళ్ళికి చాలా డబ్బు కావాలి. ఇప్పటినుండే సంపాదించండి మాష్టారూ! చక్కని వారికే పెళ్ళి కావటము కష్టము."

"మా అమ్మాయి పెళ్ళిగూర్చి మీకెందుకయ్యా చింత? మరోసారి అలా అన్నావంటే మర్యాదగా ఉండదు, మీ పిల్లల్లా పాలిపోయిన ముఖాలకంటే బావుంటుందిలే" చిర్రుబుర్రు మన్నాడు. అందరూ నోరు మూసుకున్నారు. నిజంగా మామయ్య అన్నట్టు తను నీగ్రోలా వున్నాడా? అల్లకల్లోలమైన మనసుతో బడి చేరాడు. అతని మనసులో ఏదో అర్థంగాని ఆవేదన బయలు దేరింది. అందరిపై విముఖత, కోపము పెరిగిపోసాగాయి. పిల్లల మనస్తత్వము పరిశీలించే పెద్దలు ఎందరు? బడిలో యెవరు కాస్త ప్రేమగా పిలిచినా, వారి దగ్గరకు వెళ్ళి వారు చెప్పిన పనులు చేసి పెట్టేవాడు, పాఠాలే ప్రాణాలుగా ప్రవర్తించాడు. "వినయము కూడా రంగును చూసేవస్తే తన పని ఇరకాటములో పడేది." అనుకున్నాడు.

ఆరోజు పరధ్యానంగా నడుస్తూ వర్షం వచ్చేది చూసుకోలేదు. ఎక్కడా అతనికి రక్షణ లభించలేదు. వర్షము వెలిసేవరకు ఓ చెట్టుక్రింద నిలబడ్డాడు. అరగంట తరువాత తడిసి ముద్దయి వచ్చాడు.

"అయ్యో! వర్షములో తడిశావట్రా! మీకేదైనా వస్తే నాకు చావు. మొన్నటివరకూ వాడి వంతయిందేమో, ఇప్పుడు నువ్వు పండుకో". తల్లి కసురుకుంది.

"అన్నింటికి వాడితో పోటీ పడతాడుగా, జ్వరము తెచ్చుకోవడానికి కూడా పోటీ పడనీ" వెటకారము చేశాడు కోటయ్య.



"అలా గుడ్లు వెళ్ళబెట్టి చూడకపోతే, బట్టలు మార్చుకోరాదూ?" కసురుకుంది తల్లి. వెంటనే పొడి తుండు తెచ్చి యిచ్చింది. బట్టలు మార్చుకుని, తల తుడుచుకుని, నెమ్మదిగా మేనమామ వున్న గదిలోకి వెళ్ళాడు. అతను మంచంలో వాలి ఏదో చెబుతున్నాడు. మధు, ప్రేమ చెరోప్రక్కన కూర్చుని కబుర్లు చెబుతున్నారు. తనూ వెళ్ళి ఓ ప్రక్కన కూర్చున్నాడు.

"ఒరేయ్! మంచముండాలా, విరగాలిరా? చిన్న పాపాయినను కుంటున్నావా! లే, కాస్త దూరంగా కూర్చోరాదూ. నాపైన పడటము దేనికి?" వరదరాజు ఈసడించాడు. వెంటనే ప్రేమవైపు తిరిగి తన చెంప అందించాడు.

"ఏయ్ దొంగపిల్లా! తప్పించుకునేవు, నా ప్రశ్నకు జవాబు చెప్పలేదు."'

"ఏమిటి? మరోసారి చెప్పు" ప్రేమ అడిగింది.

"గుడిచుట్టూ గరుకు, గుడిలో తెలుపు."

"టెంకాయ...... టెంకాయ మామయ్యా!" మధు అరిచాడు.

"నిన్నెవడు చెప్పమన్నారురా?" మధు వైపు తిరిగి నవ్వి, వాడిని దగ్గరకు లాక్కున్నాడు. వెంటనే వేణు గది వదలి బయటకు వచ్చాడు. 'డేవిడ్ కాఫర్ ఫీల్డ్' అనువాదము లైబ్రరీనుండి తెచ్చాడు. దాన్ని చదువుతూ కూర్చున్నాడు.

"ఒక్కరొక్కరిని పేరుపేరునా ఆహ్వానించాలా? వేణూ, అన్నము తిందువుగాని రా!"

"నాకు ఆకలిలేదు, వద్దమ్మా!" అన్నాడు. వాళ్ళంతా నవ్వుతూ చేసే క్రూరమైన పరిహాసము తను భరించలేడు.

"మధ్యాహ్నము కూడా సరిగ్గా తినలేదు కదరా!"

"ఆకలి వుంటే వాడే వస్తాడు, నువ్వు తిరగటము దేనికి?" కోటయ్య వారించాడు. తల్లి దండ్రులున్న తనకు, అనాథయై సోడా బాటిల్ కంపెనీలో పనిచేసే డేవిడ్‌కు భేదమేమీ లేదనిపించింది. డేవిడ్ బాధలు, మారుటి తండ్రి నిరసన చూస్తే విపరీతమైన దుఃఖము కల్గింది. అందరూ భోజనాలు చేసి, కబుర్లు చెప్పుకుంటూ పడుకున్నా, తను అలాగే లాంతరుముందు కూర్చున్నాడు. పుస్తకము పూర్తి అయిపోయేసరికి దూరంగా ఠాణాలో రెండుకొట్టిన శబ్దం

వినిపించింది. టంగు టంగుమంటూ రెండుసార్లు మ్రోగింది గడియారము. లాంతరు తగ్గించి వెళ్ళి పడుకోబోయాడు అతనికి నిద్ర రాలేదు. డేవిడ్ తల్లి మరొకరిని చేసుకున్నా, మారుటితండ్రి వీడు కుక్క అని హెడ్ మాస్టారుకు రిపోర్టు వ్రాసినా, తల్లి మరణించినా, అతన్ని కరుణామయుడైన ఆ భగవంతుడు కనికరించాడు. అత్తరూపములో ఓ వరము, అతన్ని రచయితగా రూపొందించడానికి ఓ వరము యిచ్చాడు. దాంతో అతను తన జీవితనావను సరైన దారి పట్టించాడు. తనకేమున్నాయి? తను పాడలేడు, వ్రాయలేడు... తెగని ఆలోచనలు. తెల్లవారేసరికి జర్వము పొంగుకు వచ్చింది. తల్లి పిలుపు గాని, తండ్రి అరుపులుగాని అతన్ని లేపలేకపోయాయి. రెండవ రోజు డాక్టరు వచ్చి డబుల్ నిమోనియా అని తేల్చాడు.

"నిజమా.... నిజమా డాక్టరుగారూ?" వణికిపోతూ అడిగింది చిట్టెమ్మ.

"అబద్ధం ఎందుకు చెబుతానమ్మా! అంత భయపడవల్సిన పని లేదమ్మా. పోలీస్ యాక్షన్‌కు ముందు, ఒక స్ట్రెప్టోమైసిన్ యాభైరూపాయలు అమ్మింది. ఇప్పుడు ఒక్క రూపాయే. బలహీనంగా వుండి తడిసినట్టున్నాడు. మరేం భయంలేదు" ఇంజక్షన్ యిచ్చి, మందులు ఇచ్చి వెళ్ళాడు డాక్టరు.

రెండవరోజు దమ్ము విపరీతంగా ప్రారంభమైంది. చిట్టెమ్మ కన్నీటితో కొడుకు గుండెలు రాస్తూ కూర్చుంది.

"ఏమండీ! త్వరగావెళ్ళి, పెద్ద డాక్టరును పిలుచుకురండీ. వేణూ! గోపాలా! నా తండ్రీ! ఇటు చూడరా" కొడుకు తలను హృదయానికి హత్తుకొంది. అంత జ్వరములోనూ వేణుకో చిత్రమైన ఆలోచన వచ్చింది. "తను అలాగే చచ్చిపోతే బావుండును. తన కోసం అమ్మ ఒక్కరోజూ సంతోషించలేదు. దుఃఖించలేదు. తను చచ్చిపోవాలి. అమ్మ కుమిలి కుమలి ఏడ్వాలి" అనుకున్నాడు.

"అరే! ఆ పిల్లాడిని అలా పలకరిస్తారేం? పడుకోబెట్టండి" డాక్టరు వచ్చి వేణును సరిగ్గా పడుకోబెట్టాడు. కడుపుమీద పట్టీవేసి, మరో ఇంజక్షన్ చేసి వెళ్లిపోయాడు.

రోజూ పాలు త్రాగీ త్రాగీ విసుగుపుట్టింది వేణుకు. చిట్టెమ్మ పాలు తెచ్చింది. వాటిని చూడగానే అసహ్యము వేసింది.



"అమ్మా! నాకు పాలొద్దు" ముఖం మాడ్చాడు.

"మరేం త్రాగుతావు? అన్నం వద్దన్నాడు"

"పళ్ళు కావాలి" అన్నాడు.

"డాక్టరు వద్దన్నాడు, ఓవల్టిన్ తేనా?"

"వద్దు" మరోవైపు తిరిగి పడుకున్నాడు. తనడిగినది యెందుకు పెట్టరో?"

"చెబితే వినవేంరా? నిజంగా నీతో చావుగా వుంది. చల్లని పదార్థాలు ఏం పెట్టొద్దని డాక్టరుగారు చెప్పలేదూ?" విసుక్కుంటూ పాలు త్రాగించింది, కోటయ్య కూడా అప్పుడప్పుడు దగ్గర కూర్చుని ప్రేమగా మాట్లాడేవాడు, తమ్ముడు, చెల్లెలు బడి కబుర్లు చెప్పేవారు. నాకీ జ్వరమిలాగే వుంటే బావుండును. అందరూ ప్రేమిస్తారు అనుకున్నాడు. మూడు రోజులు చూసి వెళ్లిపోయాడు వరదరాజు. జ్వరము తగ్గుముఖము పట్టేసరికి ఇరవై రోజులకు పైనే పట్టింది. ఈలోగా ఫస్ట్ టర్మ్ సెలవలిచ్చారు. తిరిగి బడులు తీసినా తను బడికి పోయే స్థితిలో లేడు. రెండవరోజే రాధాకృష్ణ వచ్చాడు.

"సెలవులలో రావాలనుకుంటే, సప్లిమెంటరీ పరీక్ష కేంద్రము యిక్కడే వుంది. బాగా చిక్కిపోయావు" ప్రేమగా వీపు తట్టాడు.

"రెండు రోజులయితే బ్రతుకనే బ్రతుకడనుకున్నామండీ! నయమయింది. పాలు త్రాగరా అంటే పేచీ, నిజంగా తల నొప్పి వస్తుందంటే నమ్మండి" బాధనంతా కళ్ళతోనే వ్యక్త పరిచింది తల్లి.

"అంత తీవ్రంగా వుందా? నాకు తెలియదు సుమండీ!"

"ఈ వారం తగ్గకపోతే పెద్దాసుపత్రిలో చేర్పించాలనుకున్నాము. కూర్చోండి, కాఫీ తెస్తాను" వెళ్ళిపోయింది చిట్టెమ్మ. కుర్చీ మంచానికి దగ్గరగా లాక్కుని కూర్చున్నాడు రాధాకృష్ణ.

"నిజమా వేణూ! నీపైన యెన్నో ఆశలు పెంచుకున్నాము. మాగజైన్ తీయాలని ప్రతిపాదించారు ఫైనలియర్స్. అంతా యిప్పుడే రావాలని పట్టుబట్టారు. అందరూ పద్యాలూ, వ్యాసాలూ ఇచ్చారు. నీవూ ఇస్తావనుకున్నాను

పోనీ వచ్చే యేడు ఇద్దువుగాని, పడుకో, ఎక్కువ ఆలోచించకు" అన్నాడు. చిట్టెమ్మ కాఫీ తెచ్చింది. కోటయ్యవచ్చి నమస్కరించాడు.

"నేనే మీ దగ్గరకు రావాలనుకున్నాను. మీరే వచ్చారే" నవ్వుతూ, అతని దగ్గరిగా ఉన్న ముక్కాలు పీటపై కూర్చున్నాడు.

"విశేషమా?"

"మాష్టారూ! మా సూరిమీద ఎన్నో ఆశలు పెట్టుకున్నాను. ఎలాగైనా ఈసారి వాడు ఫస్టుక్లాసులో పాసవ్వాలి. మీరు ఎంత అడిగినా కాదనేది లేదు. దయచేసి ప్రయివేటు చెప్పండి."

"డబ్బిస్తూ అంతగా బ్రతిమాలాలా? ఆలోచిస్తాను."

"అబ్బే అలా అంటే కుదరదు. మీరు పంపమంటే మీ యింటికే పంపుతాను."

"వద్దులెండి. మా యింట్లో మా చిరంజీవులు పని సాగనివ్వరు. నేనే వస్తాను."

"మంచిది. మీరు అంగీకరించటం మా అదృష్టం. ఎంతోమంది చెప్తామన్నారు గాని, పిల్లలు మీరు కావాలంటున్నారు" అన్నాడు. మర్నాటినుండి వస్తానని చెప్పి వెళ్లిపోయాడు రాధాకృష్ణ.

మర్నాడు పాఠము చెప్పి లేచాడు మాష్టారు. సూరి కూడా గౌరవంగా లేచాడు మాష్టారిని సాగనంపాలని, ఇంతలో బలహీనమైన వేణు పిలుపు వినిపించింది.

"ఏం వేణూ?" లోపలికి తొంగిచూశాడు.

"నేను ఇంకా బాగా నడవలేను. కాస్త వస్తారా మాష్టారూ?"

అతను లోపలికి వెళ్ళాడు.

"నీ పాఠాలను గూర్చి బెంగపెట్టుకోకు. నయమయ్యాక నేను చెప్తాను."

"అదికాదు మాష్టారూ!" దిండు క్రింద పెట్టిన కాగితాలు తీశాడు. అవి మేష్టారుచేతిలో పెట్టాడు.



"మన మేగజీన్‌కని చిన్న కథ వ్రాశాను. బలహీనంగా వుండి చేతులు వణికాయి. వ్రాత అందంగా లేదు. నచ్చితే తెలుగు మాస్టారుకి చూపించండి."

"విశ్రాంతి తీసుకోక ఎందుకు ఇలాంటివి చేస్తావు" విసుక్కుని యింటికి వచ్చాడు. కాగితాలు జేబులో పెట్టుకుని మరిచేపోయాడు. భోజనము చేసి ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పట్టుకుని మంచంలో వాలాడు. అలవాటు ప్రకారంగా ఉదయం భర్తకు కావల్సిన దుస్తులు తీసి, పాత ప్యాంటులోని వస్తువులు ఉతికిన దాంట్లోకి మారుస్తుంది సరోజని.

"ఏమండీ! కోటయ్యగారు సంవత్సరపు అడ్వాన్సు యిచ్చాడా? ఏం జేబు యింత బరువుగా వుంది."

"ఆఁ! సంవత్సరపు ఫీజు అంత కట్ట యెలా అవుతుందోయ్? మరిచేపోయాను. ఆ కథ యిలా తే."

"యే కథ?"

"చాలించు, అది మా వేణు వ్రాసినకథ" సరోజని పేపర్లు అతనికి అందించింది, అవి విప్పాడు. "అమ్మ కావాలి" టైటిల్ చూశాడు. కథ చదువుతుంటే వేణు హృదయము చదివినట్టే వుంది. అప్రయత్నంగా రాధాకృష్ణ కళ్ళల్లో నీళ్ళు నిలిచాయి.

"ఏమిటండీ! అంత రసావేశము?"

"ఆవేశము కాదు సరూ! వేణు ముఖంలో కదలాడే నీలినీడల కర్థము తెలిసింది."

"ఏమిటో చెప్పండి."

"తల్లిచే నిరాదరింపబడిన కుర్రాడు అనేక విధాలుగా బాధపడతాడు. తన ప్రేమను దోచుకున్న దొంగలని, తోబుట్టినవారిని చంపాలనుకుంటాడు. చంపలేకపోతాడు. అతనలా బాధపడుతుండగానే తల్లికి జ్వరమొచ్చి మంచాన పడుతుంది. అమాయకుడైన బాలుడు, తల్లి చచ్చిపోతే బావుంటుందని కోరుకుంటాడు. వెంటనే అతనికి తల్లి అవసరం, నిరాదరణలోనే ఆదరణ చూపే ఘట్టాలు గుర్తుకొచ్చాయి. రెండోవైపు నుండి హృదయవిదారకమైన తల్లి అరుపులు వినిపిస్తాయి, వణికిపోతాడు. ఊరిలో వున్న ఆంజనేయస్వామి

ఆలయానికి వెళ్ళి ప్రార్థిస్తాడు. అతను అలసి అక్కడే నిద్రబోతాడు. ఆంజనేయస్వామి ప్రత్యక్షమై "ఏం కావాలి?" అన్నాడు.

"మా అమ్మ, మా అమ్మ కావాలి."

"అమ్మంటే ఇష్టంలేదుగా?" స్వామి చిరునవ్వుతో ప్రశ్నిస్తాడు.

"అబద్ధం...... తమాషాకి ఇష్టం లేదని అన్నాను. అమ్మ తమ్ముళ్లను, చెల్లెండ్లనే ప్రేమగా చూడనీ, అమ్మ వుంటే చాలు. అమ్మ కావాలి". ఏడ్పు మొదలు పెట్టాడు. "మీ అమ్మ నీకోసం అడుగుతుంది రమ్మని" ప్రక్కింటి అతను పిల్చుకుపోతాడు, "మాయలా వుంది. ఈ నొప్పి తగ్గిపోతుందనుకోలేదు. చచ్చిపోతానని అనుకున్నాను" అంటుంది తల్లి.

"అమ్మా! నువ్వు చచ్చిపోవు. నాకు కావాలి" అంటూ తల్లి వొడిలో వాలిపోతాడు.

"బలే పిల్లవాడు" ఆమె అందుకుని చదివింది. అక్కడక్కడున్న చిన్న పొరపాట్లు సరిచేసింది. రాధాకృష్ణ ఆలోచిస్తూ ఉండిపోయాడు.

* * *

"వేణుకు నయమైంది. బడికి వెళ్ళి వస్తున్నాడు. అతని ముఖములో వయసుకు మించిన గంభీరత అలముకొన్నది. జ్వరంపడి మిస్సయిన పాఠాలన్నీ చదవాలి. ఆత్రముగా పుస్తకాలు తీశాడు. తెలుగు, లెక్కలు అన్నీ తనంత తాను చెయ్యగలిగేడు. ఇంగ్లీష్ చదవలేకపోతున్నాడు. ఇటు మాస్టారిని అడగలేకపోతున్నాడు. సంకోచపడుతూనే ఒక వారము గడిపాడు. తెల్లవారితే నెల పరీక్ష, ఈసారి జబ్బుపడి ఫస్ట్ టర్మ్ పరీక్షలు కూడా రాయలేదు. అందుకే నెమ్మదిగా సూరికి మాస్టారు చదువుచెప్పే చోటికి వచ్చాడు.

"ఏం వేణూ! పోయమ్ అర్థం గావటము లేదు కదూ?"

"అవును సార్! మీకెలా తెలుసు?"

"ఆ మాత్రం వూహించలేనా? మిగిలిన పాఠాలన్నీ సులువుగానే అర్ధము అవుతాయి."

"నిజమేనండి. వారము రోజులనుండి అడగాలనుకుంటూ మీకు ఇబ్బందని..."



"చదువు దగ్గర మొహమాటము దేనికోయ్! సూరీ! నువ్వీ లెక్క చేస్తుండు. నేను వేణుకి పోయమ్ చెప్తాను" సూరి తలాడించి లెక్కలు చేస్తూ కూర్చున్నాడు. వేణు పాఠము వింటున్నాడు.

"వేణూ!" తండ్రి పిలిచాడు. వస్తానన్నట్టు మాస్టారికి కళ్ళతోనే చెప్పి లోపలికి వెళ్ళాడు. కోటయ్యగొంతు కంచులా వినిపిస్తున్నది.

"నీది మొదటినుండి కుళ్ళు బుద్దేరా. అన్నింటికి వాడితో పందెము దేనికి? నువ్వా మెట్రిక్యులేషన్ కొచ్చాక ట్యూషన్ పెడతాను."

"ఇప్పుడు నేనేం చేశాను?"

"పైగా యెదురు ప్రశ్న. వాడి చదువు చెడగొట్టాలని కదూ నువ్వు మాస్టారిదగ్గర కెళ్ళింది?"

"ఈ రోజేనా! రోజూ గండుపిల్లిలా ముఖము పెట్టుకుని గది ముందు తచ్చాడుతాడు, యెందుకో అనుకున్నాను" తల్లి అన్నది.

"అన్నయ్య పాఠము చెడగొట్టాలని ఎందుకు వెళ్తాను? నాకు పాఠము అర్థం కాలేదు, రేపు టెస్టుంది."

"నువ్వు చదివి ఉద్ధరించేది చాలు గాని ఇంట్లో తగలబడు." తండ్రి మాటలు విని ఇంట్లోకి పోబోయిన వాడల్లా మాస్టారు యెదురు చూస్తాడనుకుని బయటి గదిలోకి వెళ్ళాడు.

"రేపు మీకు ఖాళీగా వున్నప్పుడు వస్తాను మాస్టారూ?" అనేసి, అతని ముందున్న పుస్తకము తీసుకుని వచ్చేశాడు. రాధాకృష్ణ అంతా విన్నాడు.

"పిల్లలను పెద్దవారు బేధభావముతో చూస్తే వారిమధ్య ద్వేషము పెరుగుతుందని చెప్పాలనుకున్నాడు. అనువుకాదని ఊరుకున్నాడు. అతని హృదయములో ముల్లు గ్రుచ్చినట్లయింది. మర్నాడు ఇంగ్లీష్ క్లాసులో బోర్డుమీద ప్రశ్నలు చూసి పిల్లలంతా తెల్లబోయారు. యెన్నడూ ఛాయిస్ అడిగితే మండిపడే రాధాకృష్ణ తనంతట తనే ఛాయిస్ యిచ్చాడు. దాని భావము గ్రహించిన వేణు రాధాకృష్ణ వంక అత్యంత గౌరవభావముతో చూశాడు. ఆ చూపులు భావనకు, భాషకు అందనివి. పరీక్షవ్రాసి బయటికి వస్తుంటే మాస్టారు ఆపాడు.

"ఈరోజు మూడో పిరియడ్‌లో ఏముంది?"

"క్రాఫ్ట్ అండి."

"అయితే స్టాఫ్ రూమ్‌కు రా, నిన్న వదిలిన పాఠము పూర్తి చేస్తాను" తలాడించాడు. మూడో పిరియడ్‌లో పాఠము చెప్పించుకు వచ్చాడు.

మర్నాడు రాధాకృష్ణ వెళ్ళేసరికి ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది. కోటయ్య ఒక్కడే చార్మినార్ సిగరెట్టు వెలిగించుకుని కూర్చున్నాడు.

"రండి మాష్టారూ! మీ కోసమే చూస్తున్నాను. మా వాడి మేనమామ ఇక్కడికేదో పనిమీద వచ్చాడట. తెలిసినవారింట దిగాడు. కబురు చేస్తే మా ఆవిడ పిల్లలను తీసుకుని వెళ్ళింది. ఈపూట మీరు విశ్రాంతి తీసుకోండి?"

"దానికేంలెండి. మీ రెక్కడికో తయారయినట్టున్నారు?"

"అలా పొలాలవైపు వెళ్దామని బయలుదేరాను. మీరు వచ్చినపుడు ఇంట్లో యెవరూ లేకుంటే ఇబ్బందిపడతారని కూర్చున్నాను" తాళముపెట్టి లేచాడు. ఇరువురూ నడక ప్రారంభించారు. కాసేపు లోకాభిరామాయణం మాట్లాడారు.

"కాలము మారిపోతుంది మాష్టారూ! స్వరాజ్యము వచ్చిన దగ్గర నుండి వస్తువుల ధరలు మండిపోతున్నాయేగాని తగ్గటము లేదు."

"పంట పండించుకునే మీరే ఇలా అంటే, అన్నీ కొనుక్కొనే మేమేం అనాలి?"

"మేము కొననివి యేమిటో చెప్పండి? బియ్యము ఇంటివి, పాడి ఇంటిది. మిగిలినవన్నీ కొనాల్సినవారమేగా! జీతగాళ్ళ జీతాలు పెరిగాయి. మంటికైనా ఇంటివాడన్నట్టు వ్యవసాయము చూడటానికి పూర్తిగా ఒక మనిషి ఉండాలి."

"అదీ నిజమేలెండి. పాలేర్లకు అప్పగించి నిశ్చింతగా ఉండేకాలము పోయింది."

"ఒక్కరోజు ఉదయము వెళ్ళకుంటే, ఇంజను నడుస్తూనే ఉంటుంది. నీళ్ళదారి నీళ్ళది! జీతగాళ్ళ దారి జీతగాళ్ళది. పుల్లలేరటము, ఊర్లోకితెచ్చి అమ్మటమూ, చదివింది చాలు పై యేడు వేణును వ్యవసాయములో పెట్టాలను కుంటున్నాను."



"వేణూనా?" ఆశ్చర్యంగా చూశాడు.

"అవును మాష్టారూ! సూరి డాక్టర్ కావాలి. మధు ఇంజనీరు కావాలని మొదటి నుండి అనుకుంటున్నాము."

"మనము అనుకోగానే సరా? వారికి ఆసక్తి ఉండాలి. మార్కులు రావాలి, వ్యవసాయము శ్రద్ధగా చేసుకున్నా నష్టమేం లేదు కాని, వేణూ చదువుకుంటాడు. చాలా చురుకైనవాడండి."

"నిజమేననుకోండి అందరూ చదువులూ, ఉద్యోగాలూ అంటే మరి కడుపులోకి యెలా వస్తుందండీ?" కోటయ్య మాటలకు ఫక్కున నవ్వేశాడు రాధాకృష్ణ.

"అది నిజమేకాని అభిరుచులు కూడా గమనించాలిగదా? మీరు అన్యదా భావించనంటే ఓ మాట చెప్తాను."

"చెప్పండి. మీరయినా కోపమొచ్చే మాటెందుకు చెప్తారు."

"ఏం లేదు. నేను వినదలచుకోక పోయినా, దృష్టి అటు మళ్ళించ దలచుకోకపోయినా, మీ మాటలు కొన్ని చెవిలో పడ్డాయి. అందుకే మీకు చెప్పాలనుకున్నాను. మీకు తెలియనిదికాదు. కాని కొన్ని సార్లు మరిచిపో తుంటాము."

"ఇంత ఉపోద్ఘాతము దేనికి చెప్పండి."

"పిల్లల మనసులు అతి సున్నితమైనవి. మీరు సూరిని, మధును అభిమానించినంతగా వేణుని అభిమానించటము లేదేమోనని అనుమానం. అలా అని వాడు మీకు పరాయివాడు కాదు. వాడు అవి మనసులో పెట్టుకుని ముభావముగా వుంటాడు."

"అలా అని చెప్పాడా?" ఈసారి కోటయ్య కంఠము తీవ్రంగా వుంది.

"ఛ, వాడలాంటివాడు కాదండి. నేనే గమనించాను. మనకు తెలియ కుండానే పక్షపాతముగా ప్రవర్తిస్తాము. పిల్లలు కదూ! వారికి మంచి, చెడు, తెలుపు, నలుపు ఏం తెలియవు. వాడు మీ సంతానమే కాబట్టి, మీనుండి ప్రేమానురాగాలను కోరుకుంటాడు, మీరు ఇవ్వరని కాదు." ఇంకెలా చెప్పాలో

తెలియలేదు. కోటయ్య ముఖము గంభీరంగా మారిపోవటము చూసి, టాపిక్ మరోవైపు మరల్చాడు. పొలాలవరకూ, ఆయన వెంబడి వెళ్ళి కాసేపు తిరిగి వచ్చాడు.

కొడుకును అడగాలా వద్దా, అనుకొన్న కోటయ్య, ఆ రాత్రి అడగలేక పోయాడు. రెండవరోజు ఆ విషయమే మరచిపోయాడు, ఓ పదిహేను రోజులు గడిచాక, వేణు 'రత్న' స్కూల్ మాగజైన్ పట్టుకొని సతోషంగా పరుగెత్తుకు వచ్చాడు.

"నాన్నా, అమ్మా! యిదిగో నా కథ పడింది" అన్నాడు.

"ఎప్పుడు వ్రాశావురా పిడుగా!" తండ్రి నవ్వుతూ అందుకున్నాడు.

"ఏమిటండీ?" చిట్టెమ్మ వచ్చింది.

"వీడేదో కథ వ్రాశాడట, కూర్చో చదువుతాను. అలా తండ్రి అనటం అతనికెంతో సంతోషాన్ని కలుగజేసింది. తండ్రి చదువుతుంటే తల్లి వింటుంది. కథ సాగినకొలదీ వారి ముఖాలు క్రోధముతో యెరుపు యెక్కాయి. పూర్తిచేసి ఆ సంచికనలా నేలకేసి కొట్టాడు.

"ఇలా వ్రాయటానికి నీకు సిగ్గెలా లేకపోయిందిరా?" తండ్రి గర్జించాడు.

"అవ్వ! సంసారాన్ని రచ్చ కీడ్చడము కథట్రా! నేను చావబోతుంటే ఇంత విషము కలిపి నాకు పోస్తావుగాని, నాకు బాగవ్వాలని ప్రార్థనలు చేస్తావా? ఎప్పుడో తోబుట్టువులను చంపుతావు." తల్లి ఆవేశంగా లేచి వేణు చెవులు పట్టుకుని నాల్గు అంటించింది.

"అదొక్కటేనా వీడు చేసిన ఘనకార్యము. మన పిల్లవాడిని చూసి మనము దాచుకోవాలని ఊరుకున్నాను. ఇంట్లో తనను బాగా చూడమని, సూరిని, మధునే బాగా చూస్తామని మాష్టారితో చెప్పుకున్నా డులా వుంది. ఆయన వుపదేశము మొదలుపెట్టాడు" కోటయ్య చెప్పాడు.

"ఏం చెప్పావురా, నిజము చెప్పు" నిలదీసింది.

"నేనేం చెప్పలేదమ్మా! నిజం" ఎంత అడిగినా వేణు అదేమాట చెప్పాడు.



"నువ్వు మంచిగా అడిగితే నిజం చెబుతావట్రా! సూరుడూ ఆ బెత్తము పట్రా..... ఇదిగో నీకేరా, లేకుంటే నీకు పడతాయి." తల్లి మాటలకు తలవంచిన వాడివలె సూరుడు బెత్తము తెచ్చాడు. వేణు వీపు చిట్లిపోతోంది. నోట ఒక్కమాట రావటము లేదు. ఆక్రందన తప్ప. అతను మాట్లాడకపోవటము తండ్రిని మరీ రెచ్చగొట్టింది. భార్యచేతిలోని బెత్తం లాక్కుని కోటయ్య బాదడము మొదలుపెట్టాడు. ట్యూషన్ చెప్పటానికి వచ్చిన రాధాకృష్ణమూర్తి ఊరుకుండలేకపోయాడు.

"కోటయ్యగారూ! ఏమిటా వెర్రి?" బెత్తము లాగేశాడు.

"మాష్టారూ! మా యింటి విషయాలు...... మ్యా.......మూ.......నేనేం చెప్పాను?" వేణు ఏడుస్తూ అడిగాడు.

"లేదే..... ఆనాడు నేనేదో మాటవరసలో అన్నమాటను మనసులో పెట్టుకుని పిల్లవాడిని కొట్టారా? వాడు చెప్పలేదు."

"ఈరోజు కథ యేమిటండీ? మీరు పెద్దలు. ఇలాంటి వాటిని ఎలా అంగీకరిస్తారు? మీరయినా బుద్ధి చెప్పకూడదా?"

వారితో వాదించి లాభం లేదని బయటకు వచ్చాడు రాధాకృష్ణ. సూరికూడా బయటకు వెళ్ళాడు, వేణు వెక్కుతూ ఓమూల కూర్చున్నాడు.

"కోటయ్య బావా! ఉన్నావా?" నాల్గిళ్ళ కవతలుండే వీరయ్య వచ్చాడు.

"ఏమిటి?" కోటయ్య బయటికి వచ్చాడు.

"ఏం లేదు. మావాడేదో పద్యము రాశాడు. చూపిద్దామని వచ్చాను. ఇదేమిటి? నీ ముఖమలా వుంది? ఇంట్లో అందరికీ బావుంది కదా?"

"అందరికీ బావుందిరా. సూరి పాఠము చెప్పించుకుంటాడు" ఇరువురూ లోపలికివచ్చి కూర్చున్నారు. వీరయ్య కొడుకు ప్రతిభకు మురిసి పోతున్నాడు. అవి స్పష్టంగా వేణుకు వినిపించి, హృదయము తూట్లు పడుతున్నాయి. చాలా సేపటికి అందరూ వెళ్ళిపోయారు. సూరి వచ్చి భోజనానికి రమ్మని పిలిచాడు.

"అక్కరలేదు."

"పెద్ద నీల్గుడు. నాల్గు అంటిస్తేసరి. అమ్మా, నాన్నా అంటించినవి చాలినట్టు లేవు"

"నామీద చేయి వేయడము నీ తరము కాదు. వెళ్ళు"

"ఛీ! అమ్మ ప్రాణానికి రాక్షసుడవు."

"నువ్వు ప్రియమైనవాడవు చాలు."

"అమ్మా! చూడు" సూరి ఫిర్యాదు.

"వాడిని పిలవకురా. వాడివల్ల యెన్ని చూడాలో యింకా. త్వరగా చచ్చిపోతే, పుట్టలేదని ఓ ఏడ్పు ఏడ్చి ఊరుకుందును. సూరి వెళ్ళిపోయాడు.

దెబ్బలకు అలసిపోయిన వేణు అన్ని దుఃఖాలకు నివారిణి అయిన నిద్రాదేవి ఒడిలోకి జారిపోయాడు.

## 3

"అమ్మా! అమ్మా!" వేణు పరుగులు తీస్తూ, నురగలు క్రక్కుతూ వచ్చాడు.

"ఏమిటా గావుకేకలు, అత్తయ్యకు తలనొప్పిగా ఉందట" అరచింది తల్లి. వరదరాజు భార్య వచ్చింది వారం రోజుల క్రితము.

"అదికాదమ్మా! రాధాకృష్ణ మాష్టారు ఇప్పుడే హైద్రాబాద్ నుండి వచ్చారు. అన్నయ్య.... సెకండ్ క్లాసులో పాసయ్యాడట!" చెప్పాడు.

"నిజం! నా సూరుడు ప్యాసయ్యాడా?" ఆవిడ సంబరంగా అడిగింది. "కమలమ్మా! మావాడు పాసయ్యాడుటే. నేను చెప్పలేదూ! జబ్బున పడకుంటే ఫస్టున పాసయ్యేవాడేనే. నా బంగారుతండ్రి" మురిసిపోయింది. స్నేహితులతో వెళ్ళిన సూరి తిరిగి వచ్చి, తమ్ముడు చెప్పిన వార్త నమ్మలేకపోయాడు. వెంటనే మాష్టారి దగ్గరకెళ్ళి కనుక్కువచ్చాడు. అతను సంతోషంగా తండ్రికి యెదురు వెళ్ళాడు.

"మీ మాష్టారు కనిపించి చెప్పారురా" తండ్రికూడా ప్రసన్న వదనంతో వీపు తట్టాడు. రాత్రి విందులాంటిది జరిగింది. రాధాకృష్ణ సతీసమేతుడై వచ్చాడు.

"సిటీ కాలేజీలో చేర్పించండి. అబిడ్స్‌లో రెడ్డి హాస్టల్లో సీటు దొరుకుతుంది. మీరు వెళ్ళేటప్పుడు ఉత్తరము యిస్తాను, అక్కడ తెలిసి నాయనకు యివ్వండి."



"అలాగే మాష్టారూ! మీవల్లే వాడు పాసయింది."

"అదేంలేదు. వాడికి దీక్ష, పట్టుదల లేనిది యెంత చెప్పినా ప్రయోజన మేముంటుంది?" సరదాగా అర్ధరాత్రి వరకూ కబుర్లు చెప్పుకున్నారు. అందరూ నిద్రపోయినా, భవిష్యత్తుకు బంగారు బాటలువేస్తూ వేణు, సూరి నిద్రపోలేక పోతున్నారు.

ఆ యేడే కొత్తగా ప్రవేశపెట్టిన పి.యు.సి.లో చేరాడు సూరి. బయాలజీ గ్రూప్ అతనిది. తండ్రి వెంబడి బజారుకువెళ్ళి కావల్సిన పుస్తకాలు, డిసెక్షన్ బాక్స్, గడియారము, రాబిన్‌హుడ్ సైకిలు, మూడు ఉలెన్ ప్యాంట్లు కొన్నాడు. గాస్‌మియా బజార్‌లో ఓ గది కుదుర్చుకున్నారు. దగ్గరలో ఉన్న హోటల్లో భోజనము చేయుటకై ఏర్పాట్లు జరిగాయి. ఇంటినుండి కావల్సినవి తీసుకుపోవడానికి సూరి, కమలమ్మా, చిట్టెమ్మా కలసి చేగోడీలు, రవ్వలడ్లూ చేయటానికి పూనుకున్నారు.

"ఎన్నడూ మమ్మల్ని విడిచి వుండలేదే వెర్రిపిల్లడు. యెలా వుంటాడో?" మాటిమాటికి కళ్ళనీళ్ళు ఒత్తుకుంది తల్లి.

"ఊరుకో వదినా! నీ కొడుకు డాక్టరయి వస్తే గొప్పకాదూ! తల్లి హృదయము అలా అనిపిస్తుంది. ఒక్కరోజూ అమ్మను విడిచి ఉండలేదు. మీ తమ్ముడు పిలవడానికి వచ్చిన దగ్గరి నుండి ఒకటే ఏడుపు అమ్మ. చూడలేక పోయాను."

"హోటల్లో తిండిట, యెలా వుంటాడో?" అన్నది దిగులుగా. పచ్చళ్ళూ, ఫలహారాలతో సాగనంపారు సూరిని. ఆ రోజంతా యేదో పోగొట్టు కున్నట్టు తిరిగింది చిట్టెమ్మ.

"నిజంగా వేణు గట్టివాడు వదినా! నువ్వు దిగులు పడుతున్నావు కదా? 'అమ్మా' అని వచ్చి దగ్గర కూర్చోకూడదూ?"

"వాడెందుకు వస్తాడే!" అన్నది దిగులుగా. ఇంటికి వచ్చే బంధువుల స్వభావాలు విచిత్రంగా వుంటాయి. అందరివని కాదు కొందరివి. ఇంటి యజమానుల ప్రాపకము పొందాలని వారి ఇష్టాలను తమ ఇష్టాలుగా చేసుకొంటారు. కమలమ్మ హొదిన మనసెరిగి ప్రవర్తించేది. ఏ చిన్న పొరపాటు

జరిగినా వేణుపై నేరాలు చెప్పేది. వాడు నా బిడ్డడేనే, ఇందులో అంత చెప్పాల్సిందేముందని? ఒక్కసారి చిట్టెమ్మ అంటే యే గొడవా లేదు. తనకేదో అన్యాయం తన కురూపి కొడుకు వల్ల లభిస్తుంది. దానికి మరదలి సానుభూతి కూడా లభిస్తుందని తెలిసేసరికి చిట్టెమ్మ మరదలిని పెద్ద క్షేమార్తిగా ఊహించుకునేది. ఫలితంగా వేణు తల్లిముందు దోషిగా నిలబడేవాడు.

"అమ్మా! కాలుకు దెబ్బ తగిలిందే!" కుంటుతూ వచ్చింది ప్రేమ.

"చూసుకుని నడువరుటే" తడిబట్ట కడుతూ అడిగింది చిట్టెమ్మ.

"ఎప్పుడూ గెంతుద్దమ్మా! చెబితే వినదు" వేణు వెనకాలే వచ్చాడు.

"అదికాదు వేణుబాబూ! నువ్వు చూసుకోకూడదూ. పెద్దవాడివి. అమ్మకెంతో సాయంగా వుండాల్సినవాడవు. చిన్నవారేమయిపోయినా చూడవా?" ఆప్యాయంగా అడుగుతూనే ఓ అస్త్రము విసిరింది కమలమ్మ.

"బావుందత్తా! నేనేం చెయ్యాలి? అది గెంతింది" తనింట్లో పెరిగే తనకు నీళ్ళ పెరుగు వేసి, గడ్డపెరుగు మధుకేసే అత్తంటే వేణుకు ఇసుమంత కూడా గౌరవం లేదు.

"పెద్దవాడవు. వాళ్ళను జాగ్రత్తగా చూడాలని తెలియకపోతే ఎలా? నిజంగా సూరి తరహాయే వేరు" అన్నది. ఎన్నోసార్లు సూరిని చూసినట్టు.

"వాడంటే దయాదక్షిణ్యం  కలవాడమ్మా. వీడికి అందరూ ఎప్పుడు చస్తారా అని వుంటుంది". అటువంటి సమయాలలో ఇల్లు విడిచిపోవాలని పించేది వేణుకు. చిన్నప్పుడు నాయనమ్మ పరిహాసానికన్న మాటలు గుర్తుకు వచ్చేవి. "నిన్ను సోలెడు బియ్యం యిచ్చి కాటికాపరివాడి దగ్గర కొన్నాముర" నవ్వేది.

"పో నాయనమ్మా!"

"కావాలంటే మీ అమ్మ నడుగు. మరి నువ్వు ఎవరిలా గున్నావు? "అమ్మలాగా, నాన్నలాగా?" అలక సాగించేవాడు. తన ఆట, పాట అలక అన్నీ ఆమెతోనే పోయాయి. నిజంగా ఆమె అన్నట్టు సోలెడు బియ్యానికి కొనలేదు కదా? వేణు ఆలోచనలతో పాటు కాలము సాగుతూనే వుంది.



మొదటి టర్మ్ సెలవులకు యింటికి వచ్చాడు సూరి. అతను మునుపటి కంటే నాజూకు తేలాడు. దానికి తోడు పట్నం తీరు ఒంటబట్టిం దాయే. క్రొత్త క్రొత్త అలవాట్లు నేర్చుకొచ్చాడు. తల్లి మురిసిపోయింది. చిన్న పిల్లలకు ఆర్డరు జారీ చేసింది, అన్నగారికి ఎదురు చెప్పరాదని, సూరిలో మరో అహంభావము తలెత్తింది. తనూ పట్నములో యెన్నో రకాల మనుష్యుల్ని చూశాడు, నాగరికతలో తనకు తానే సాటి అనుకునేవాడు.

"ఒరేయ్ వేణు, మధూ! అలా షర్టు పైకి వెయ్యకపోతే యిన్‌షర్టు వెయ్యరాదోయ్!"

"బెల్టు బావుండలేదన్నయ్యా"

"ఏడ్చావు, క్రొత్తది కొనుక్కోరాదూ!"

"ఎలా కొనాలి? నేను ఏది అడిగినా ఇప్పించరు."

"నీకు ఏది అడిగినా ఇప్పించరు కదా? కావలసినవన్నీ యెక్కడ నుండి తెచ్చుకుంటున్నావురా?" తల్లి అడిగింది.

"బూట్లు చిరిగిపోయాయంటే ఇప్పించారా? పెన్ను పాడయిందంటే ఇప్పించారేమిటి?"

"అయ్యో తండ్రీ! నీకు ఒక్కవస్తువు తక్కువైనా మేము బ్రతుకు తాముట్రా! ఇప్పించేస్తాములే."

"నీ కసలు బుర్రలేదురా! మన అమ్మ యిప్పించినట్టు యెవరూ ఇప్పించరు" అన్నాడు. మరి తనకు లోటు లేనంతవరకు యెదుటివారిలో చెడ్డతనమే కనిపిస్తుంది. వేణు  ముఖము మాడ్చుకున్నాడు. తల్లి సూరి వంక ప్రసన్నంగా చూసింది.

సాయంత్రం కోటయ్య రాగానే చిట్టెమ్మ పిల్లలకు బట్టలు తెచ్చే విషయం ప్రసావించింది.

"విజయదశమికి ఎలాగూ అందరికీ కొనాలి. సూరికి సెలవులు అందరూ వెళ్ళి తెచ్చుకోరాదటండీ."

"అవును, ఇంట్లో కూర్చుని ఎన్ని మాటలయినా చెబుతావు. నా శ్రమ నీకేం తెలుసు? సూరికి ఎంతయిందో అడుగు."

"ఎవడికోసం చదివిస్తారండీ. రేపు రెండు చేతులా వాడు సంపాదిస్తే తినరూ?"

"సరేలే! మరి నువ్వూ తయారవు" అందరూ వెళ్ళారు. సూరి పెద్ద తరహాగా ప్రవర్తించాడు.

"నాకేం వద్దమ్మా, పాపం నాన్నగారికెంత ఖర్చో?" ఏమీ కొనలేదు. మిగిలిన పిల్లలు కొనితెచ్చుకున్నారు.

"నా నాయనే, నీకెన్ని తెలుసురా? చూశారా?" భర్త వంక గర్వంగా చూసింది. కానీ మర్నాడు ఒంటరిగా సూరి వందరూపాయలు బిల్లు తెచ్చి తండ్రి చేతిలో పెట్టాడు. మారు మాటలేక యిచ్చాడు, ప్రతి సెలవులకు సూరి వచ్చి వెళ్తుంటే తండ్రి ఇచ్చేది కాక తల్లి చాటుగా సూరి చేతిలో పది రూపాయలు పెట్టేది. మొదటి సంవత్సరమంతా అలా గడిచిపోయింది. పరీక్షకు ముందు తనే స్వయంగా వెళ్ళి కొడుక్కు అన్నీ అమర్చి పెట్టేది. సూరికూడా జులాయిగా తిరక్క చక్కగా చదువుకున్నాడు.

పి.యు.సి. రిజల్ట్స్ వచ్చాయి. సెకండ్‌క్లాసు సూరిని వదిలేటట్టు లేదు. ఈసారీ సెకండ్‌క్లాసులోనే పాసయ్యాడు. రోజు రోజుకు, యం.బి.బి.ఎస్.కు డిమాండ్ పెరిగిపోతుంది. అతనికి సీటు వచ్చే సూచనలేం కనిపించలేదు. పాసయ్యాననే సంతోషము లేక దిగులుగా తిరుగుతున్నాడు సూరి.

"మీకు అంతగా అతన్ని చదివించాలని ఉంటే, రిపీట్ చేయించండి. మరోసారి చదివితే ఫస్టుక్లాసు రావచ్చు. జిల్లాలో ఇంగ్లీషు బావుండదు" తెలిసినవారు సలహా యిచ్చారు.

"ఏరా సూరీ! తిరిగి పి.యుసి. చదువుతావా?"

"విసుగేస్తుంది నాన్నా! వరంగల్‌లో, కాకినాడలో డొనేషన్ కడితే సీటు రావచ్చని అన్నారు రాధాకృష్ణగారు."

"డొనేషనా! ఎంత కట్టాల్సి ఉంటుంది?"

"అయిదు వేలనుకంటాను."

"అయిదు వేలే! ఇవి మనవల్ల అయ్యే పనికాదురా? నీకు ఓపిక ఉంటే మరోసారి పి.యు.సి. చదివి నీ అదృష్టం పరీక్షించుకో. లేదా హాయిగా బి.ఎస్సీ చదువు" అన్నాడు కోటయ్య.



"బి.ఎస్సీ చదివి ఏం చేయాలి నాన్నా, చదువు మానేస్తా."

"అదేం మాటరా! నీ చదువు మానిపించడానికేనా ఇంత కష్టపడింది?" చిట్టెమ్మ అందుకుంది. "మీరు మరీనూ, ఒకేసారి తేల్చి వేస్తారేం? వాళ్ళకు చదువు చెప్పించితే అది ధనము కాదా? కష్టపడదాం" తల్లి మాటలకు కొండంత ధైర్యం వచ్చింది.

"నిజం నాన్నా! ఒక్కసారి ఖర్చుపెడితే చాలు, తరువాత అంత ఖర్చులేముంటాయి?"

"ఇప్పుడంత మొత్తమెలా వస్తుంది?"

"నా బంగారమంతా అమ్ముతాను లెద్దురూ, అది పెట్టెలో వుండి యెవర్ని ఉద్ధరిస్తుంది?"

"అవునమ్మా! మళ్ళా కొనవచ్చు?" ఆశగా చూశాడు సూరి.

"వెర్రి తండ్రీ! నీవు కొనాలట్రా? నువ్వు చక్కగా చదివుకుంటే చాలు" కొడుకు తల నిమిరింది.

కోటయ్యకు మాత్రం అంత సమ్మతంగా లేదు. అప్పుడే పురిటికని లలిత వచ్చింది. ఆమె కూడా బలవంతం చేయటముతో డొనేషన్ కట్టక తప్పలేదు. సూత్రము తాడు, రెండు గాజులు తప్ప, బంగారమంతా అమ్మి డొనేషన్ కట్టాడు. పైగా మరో వెయ్యి హరించుకుపోయాయి, హాస్టల్లో ఫీజు, కాలేజీ ఫీజు, పుస్తకాలు వగైరాలు కొనిచ్చి, తేలికగా ఊపిరి పీల్చుకున్నాడు కోటయ్య. కొడుకును కాలేజీలో ఉంచి బస్సులో కూర్చుంటే అతనికి ముందు యేమిటన్న ప్రశ్న తలెత్తింది. నెలనెలా యెనభై రూపాయలు ఖచ్చితంగా కొడుక్కు పంపాలి. ఇంట్లో అన్నం పెట్టి, ఏదో ఖర్చంటే చేస్తాడుగాని, ప్రభుత్వ ఉద్యోగుల జీతాలకు మల్లే ఖచ్చితంగా డబ్బెలా పంపగలుగుతాడు? ఇటు మరో అయిదు వందల ఖర్చు చూపుతూ లలిత వుండనే వుంది. కోటయ్య సంపన్న కుటుంబీకుడని పేరుగాంచాడు. సంపద మాత్రం నేతి బీరకాయలో నెయ్యి ఉన్నంతే, అసలు అతనికి ఇప్పటివరకూ ఇలాంటి సమస్యలే రాలేదు. పండిన వరి పంటలో తాను తినగా, జీతగాళ్ళ జీతాలు పోగా, మిగిలినది తెలిసినవారికి వడ్డీల కిచ్చేవాడు. అది చాలా తక్కువ. ఖర్చులేనప్పుడు మిగులు

పడిన మొత్తం లలిత పెళ్ళికి ఖర్చుపెట్టాడు. అంతకంటే మూడింతలు సూరి చదువుకు అయ్యేలా వుంది

* * *

సూరికి డొనేషను కట్టి హాస్టల్లో చేర్చి తిరుగు ప్రయాణమయ్యాడు. బస్సు గమ్యం చేరగానే దిగాడు. ఇంటి ముఖము పట్టాడు. అతని మనసు ఏం బావుండలేదు. చిట్టెమ్మ ఎదురు వచ్చింది.

"ఏమండీ అలా వున్నారు? సూరి బావున్నాడా? మీ ముఖము చూస్తే..?"

"చూస్తే..... ఆగిపోయావేం? సూరి బాగానే ఉన్నాడు."

"మీరలా ఉన్నారేం?"

"ఎలా వున్నాను?"

"ఏమిటండీ మీ ప్రశ్నలూ మీరూనూ! మీ ముఖమెంత పీక్కుపోయిందో చూడండి." అన్నది.

"అదా! ఊరుగాని ఊరు తిరగటము మాటలా?" అతను కూర్చోగానే మంచి తీర్థము తెచ్చింది.

"వేణూ! ఆముదము తెచ్చి కాస్త కాళ్లకు రాయరా" కేకేశాడు.

వేణు ఆముదము సీసాతోవచ్చి అరికాళ్లకు మర్దన చేశాడు. అలసటగా నిద్రపోయాడు.

వారం రోజులకు కోటయ్య దిగులు తగ్గింది. అంతగా అయితే కొంత పొలము అమ్ముతాను అనుకొని దృఢనిశ్చయానికి వచ్చాడు. అతను తేలికగా నిట్టూర్చి సిగరెట్టు అందుకుంటుండగానే వేణు వచ్చాడు అక్కడికి.

"ఏంరా వేణూ?" వేణు చెప్పడానికి సంకోచించాడు.

"చెప్పరా?" ఈ మధ్య తండ్రికి అన్ని పనులలో సాయపడుతున్నాడని ఆప్యాయంగా మాట్లాడుతున్నాడు. ఏం, ట్యూషన్ కావాలా? నేను మరిచే పోయాను, నీది ఈ సంవత్సరము పబ్లిక్ పరీక్ష కదూ?"



"అక్కరలేదు నాన్నా! మా బడినుండి పిల్లలందరిని ఎల్లోరా, అజంతా తీసుకుపోతున్నారు. నాకయితే ఇష్టములేదు. మాష్టారేమో బలవంతము చేస్తున్నారు నాన్నా."

"అంత బలవంతము చేస్తే సంకోచము దేనికి? వెళ్ళు" తండ్రి యింత తొందరగా అంగీకరిస్తాడని అనుకోలేదు వేణు. సంతోషముగా వెళ్ళిపోయాడు. తన పేరు యిచ్చాడు. మర్నాడు డబ్బు అడిగాడు.

"దేనికిరా?"

"నిన్న చెప్పాను కదా నాన్నా! ఎక్స్‌కర్షన్‌కని. డబ్బు కూడితేగాని యెటూ తేల్చమని అన్నారు హెడ్‌మాష్టరుగారు."

"అదో గొడవా! యెంత కావాలట?"

"పదిహేను రూపాయలు కావాలన్నారు నాన్నా మిగిలితే వచ్చాక యిస్తారట."

"పదిహేను రూపాయలా?" తెల్ల ముఖము వేశాడు. "అయితే మానెయ్యి నాయనా! మీరు సంపాదించి చూద్దురుగాని" తేల్చాడు.

"మిమ్మల్ని అడిగే పేరిచ్చాను కద......"

"ఏమడిగావు? ఇంత డబ్బు కావాలని అడిగావా?"

"మరి ఊరికే తీసుకువెళ్తారా?"

"వెళ్ళకుంటే మానెయ్యి. మొన్న ఆ పెద్ద మహారాజుకు ఫీజు కట్టే వేళకి ప్రాణము పోయింది. ఇంకో సంవత్సరము వరకు నన్నేమీ అడగవద్దు."

"అవును, అందరికి అన్నీ వుంటాయి. నాకంటేనే డబ్బుండదు. అందుకే నేను రానని మొత్తుకున్నా, మాష్టారు వినలేదు" విసురుగా లోపలికి పోబోయాడు. గుమ్మములో లలిత నిలబడి వుంది.

"ఏమిట్రా వేణూ! పెద్దా చిన్నా లేకుండా? నాన్నగారి పరిస్థితి ఆలోచించకూడదా? వచ్చే యేడు వెళ్లవుగాని" హితవు చెప్పింది.

"వాడికంత జ్ఞానముంటే లేందేముంది తల్లీ? ఈ రోజు ఆస్పత్రికెళ్ళి చూపించుకుని రా. పాలిపోయినట్టు కనిపిస్తుంది ముఖము." అన్నాడు కోటయ్య.

"అలాగే నాన్నా!"...

ఆ సాయంత్రమే లలిత మొగపిల్లవాడిని ప్రసవించింది.

"అమ్మ ఒక్కర్తేనండీ. నేను రాలేను" అని మాస్టారితో చెప్పి తప్పించుకున్నాడు విజ్ఞానయాత్ర.

బొమ్మలా వున్న అక్కగారి కొడుకంటే వేణు కెంతో ముద్దు. వాడిమీద ప్రేమచేత తల్లికి పనుల్లో సాయము చేస్తున్నాడు.

"ఇరవై ఒకటోరోజున ఉయ్యాలలో వేసి నామకరణము చేస్తామని వియ్యాలవారికి రాస్తున్నాను" అని వేణుచేత ఉత్తరము వ్రాయించి తను సంతకము పెట్టాడు కోటయ్య. సూరిని పిలిపించాలని వున్నా, రానుపోను ఖర్చులని భర్తకు కోపము రావచ్చునని ఊరుకుంది చిట్టెమ్మ.

"చంటాడికి పుట్టినరోజు పండక్కి కడియాలో, గొలుసో చేయిద్దాము. ఇప్పుడు ఉంగరము, బట్టలు పట్రండి."

"మొదటి మనుమడు కదే! అయినా వియ్యపురాలు ఏమనుకుంటుంది?"

"అనుకోరా! పెట్టేవారుంటే ఆవిడకేం నొప్పి? అబ్బాయి చదువు అయ్యేవరకు మనకు డబ్బుకు పితలాటకంగానే ఉంటుంది."

"అదేమిటమ్మా! వారంతా వెక్కిరించరూ? మా ఆడబడుచుకు అమ్మాయి పుడితే అయిదు కాసుల బంగారము పెట్టారు మా అత్తగారు."

"ఉంటే పెట్టుకోవటానికేమే తల్లీ! మా పరిస్థితి చూస్తున్నావు కదా?"

"ఈ సంతోషము మరోసారి వస్తుందా?"

"అదే వస్తుంది. పుట్టింరోజు నాటికి, మేము కాస్త అప్పులనుండి తేరుకుంటాము. అప్పుడు చూసుకుందాము" అని లేచిపోయింది. కోటయ్య ఊళ్ళోకి వెళ్ళాడు. పసిబిడ్డ తల్లి లలిత అలక సాగించింది. అన్నము తినమంటే ఆకలి లేదని పడుకుంది. వేణు ఆశ్చర్యంగా అక్కవంక చూశాడు. తను తండ్రితో మాట్లాడుతుంటే సానుభూతి చూపిన అక్కేనా?" 'ఉల్లిగడ్డ తినరాదని చెప్పిన బ్రాహ్మణుని శాస్త్రము' గుర్తుకు వచ్చింది. తమదాకా వస్తేగాని అసలు రంగు బయటపడదు కాబోలు! ఆ సాయంత్రము కోటయ్య వడ్లన్నీ కొట్టుకు వచ్చాడు. చిట్టెమ్మ మండిపడింది.



"మీకు దానిమీదున్న అభిమానము ముందు యేదీ గుర్తుకు రాదా? వచ్చేపంట ఏపుగా లేకపోతే, మనమేం తింటాము. పిల్లలకేం పెడతాం?"

"అదంతా నేను చూసుకుంటాను. లలిత ఈ యింటి ఆడబిడ్డ. అది దుఃఖపడితే లాభమేమిటి? మనకూ తొలి మనుమడు" కసురుకుని బండిని పోనిమ్మన్నాడు. చిట్టెమ్మ ఖాళీ అయిన గదికేసి దీనంగా చూసింది. తన వివాహమై ఇరవై రెండేండ్లు అవుతుంది. ఏనాడూ యెప్పటికప్పుడు అమ్ముకోలేదు. 'ఈ ఇంటికేదో శనిపట్టేలా వుంది' అనుకుంది.

సాయంత్రానికి మనుమనికి ఒత్తులు, గొలుసు, కూతురికి, అల్లుడికి బట్టలు తెచ్చాడు కోటయ్య. ప్రసన్న వదనముతో తండ్రితో మాట్లాడింది లలిత.

"నాన్నగారూ! నాకీ పట్టుచీర వద్దండీ. నేతచీర తీసుకుని, మిగిలిన డబ్బుతో మా అత్తగార్కి, ఆడబిడ్డకు చెరో చీర పట్రండి."

"ఉండనియ్యమ్మా, నాకు నచ్చింది తెచ్చాను. ఖర్చులో ఖర్చు మరో యాభై రూపాయలకు ఓడిపోతామా?" అని వెళ్ళిపోయాడు. పద్దురాసి రెండు చీరలు తెచ్చాడు. నామకరణోత్సవానికి సన్నాహాలు జరుగుతున్నాయి. పని చేస్తున్నా చిట్టెమ్మ హృదయములో యేదో వెల్తి అటు ధాన్యము ఖాళీ, ఇటు ఇనపపెట్టిలో ఉన్న నగలు ఖాళీ. పోనీలే ఇవన్నీ నా పిల్లలకంటే యెక్కువా" అనుకుని తృప్తి చెందింది. ఆ సాయంత్రం లలిత అత్తగారి బంధుజనము వచ్చారు. ఘనంగా ముగిసింది నామకరణోత్సవము. వంటా, వార్పూ కూడా కూతురి కోర్కెపైనే జరిగింది. మర్నాడందరూ వెళ్ళిపోయారు.

అప్పు అయినా సరే ఒక శుభకార్యము జరిపించామని దంపతులు తేలికగా నిట్టూర్చారు. ఆ సాయంత్రము సూరి దగ్గర నుండి ఉత్తరము వచ్చింది. "హాస్టలు ఫీజు బొటాబొటీగా పంపితే లాభము లేదు. ఇతరత్రా యెన్నో ఖర్చులుంటాయి. కనీసము పదిహేను రూపాయలు యెక్కువ పంపమని, ఈ నెలలో బొత్తిగా చేతిలో డబ్బులేదు కాబట్టి, వెంటనే ఇరవై రూపాయలు పంపండి" అంటూ వ్రాశాడు. ఉత్తరం చదివి కోటయ్య చిటపటలాడినాడు.

"వీడి అయ్యదగ్గర బ్యాంక్ ఉందా, లేక లక్షాధికారి అనుకుంటాడా! అదనపు ఖర్చులట! పెద్ద ఫోజులూ, వీడూనూ."

"మనము పంపలేకపోతే అది మన దురదృష్టము, వాడిని అనటం దేనికీ? బడిలో చదివే వేలెడు కుర్రవెధవలే పదులకు పదులు తగలేస్తారు. కాలేజీలో చదివే అబ్బాయి, ఆ మాత్రము ఖర్చు ఉండదా?"

"బావుంది సమర్థింపు, పెట్టెలో వుంటే తీసి పంపరాదూ?"

"అలా వుంటే ఈ ఏడుపు దేనికి? ఒక కడుపున పుట్టినా అందరి అదృష్టమొకేలాగుండవద్దూ! మీ కిష్టమయితే ఇల్లయినా అమ్మి పెడతారు" ఆమె ముఖము మాడ్చుకుంది. అప్పుడు లలిత లోపలిగదిలో కొడుక్కు జోలపాట పాడుతోంది. వింటే పెద్దగోలే జరిగేది. వినలేదు.

"నా కిష్టమయిన వారి కోసమేనా బంగారమంతా అమ్మింది. నోరు పారేసుకోగానే సరికాదే, బుర్ర ఉండాలి...... బుర్ర."

"నాకు నిజంగానే బుర్రలేదు. బుర్ర వుంటే మీ ఆటలన్నీ సాగేవా? యింతకీ ఆ వెధవకి డబ్బు పంపుతారా, లేదా?"

"నువ్వు యెంత గింజుకున్నా, నా దగ్గర ఎర్రని ఏగానీ లేదు; మళ్ళా నెలకే పంపేది." ఖచ్చితంగా చెప్పాడు. చిట్టెమ్మ కోపంగా వెళ్ళిపోయింది. ఆమె కోపము తెలియక ఏదో అడిగిన మధును కొట్టింది. మాష్టారింటికి వెళ్ళి అప్పుడే వచ్చిన వేణు, మధు ఏడ్వటము చూసి "ఎందుకు" అన్నట్టు చూశాడు.

"అమ్మ కొట్టింది" స్థంభము చాటున నక్కిన ప్రేమ జవాబు యిచ్చింది.

"ఎందుకు?"

"ఎందుకా? నీ వల్లనే నాయనా! వాడున్నన్ని రోజులు పోటీ పడేవాడవు. ఇప్పుడక్కడ ఒక్కపూట తిని బాధపడుతుంటే, అందరము హాయిగా వున్నాము" తల్లి విరుచుకు పడింది.

"నేనేం చేశానమ్మా?" తెలియని నేరము తల్లి తన మీదికి నెట్టడం సహించలేకపోయాడు.

"ఏం చేశానని అడుగుతున్నావా? ఏం చేస్తావు? మమ్మల్ని కొట్టు, తిట్టు...."



"తమ్ముడెందుకు ఏడుస్తున్నాడంటే, యిన్ని మాటలు దేనికి? ఛీ! ఇంట్లో మాట్లాడటము పొరపాటులా వుంది" అంటూ బయటికి వెళ్ళి కూర్చున్నాడు. కోటయ్య అదివరకే లేచి పొలాలవైపు వెళ్ళాడు. ప్రేమా, మధు బయటకు వచ్చారు. అమ్మా, నాన్నా పోట్లాటకు నవ్వు వచ్చింది. రెండు రోజులు గడిచిపోయాయి.

"వేణూ! యిలా రా!" బడికి వెళ్తుంటే తల్లి ఆప్యాయంగా పిలిచింది.

"ఏం కావాలమ్మా?" అడిగాడు వేణు.

"నీకు ఏ పిరియడ్‌లో ఖాళీ వుందిరా?"

"ఈరోజు అసలు ఖాళీలేదు. అర్జంటు పనైతే చెప్పమ్మా! తెలుగు టీచరును అడిగి వెళ్తాను."

"పెద్ద పనేం లేదు! ఈ ఇరవై రూపాయలు అన్నయ్య పేర మనియార్డరు చేయరా. పాపం, ఎంత ఇబ్బంది పడుతున్నాడో కుర్రవెధవ!" బొడ్లోంచి ఇరవై రూపాయలు తీసి యిచ్చింది.

చూడు, ఈ విషయము నాన్నగారికి తెలియరాదు కోపగిస్తారు." అన్నది. సరేనని డబ్బు తీసుకొని వెళ్ళాడు. రెండవ పీరియడ్‌లో నెమ్మదిగా మాష్టారుకు ఏదో సాకుచెప్పి బయటపడ్డాడు. పోస్టాఫీసులో మనియార్డర్ ఫారమ్ నింపుతుండగా కోటయ్య వచ్చాడు.

"ఇక్కడ ఏం చేస్తున్నావురా?"

"ఆఁ.......ఏంలేదు......నాన్నా" తడబడ్డాడు.

"ఎవరయినా మాష్టారు మనియార్డరు చేయమన్నారా?"

"ఆ......" అంటుండగానే కోటయ్య అందులోకి తొంగిచూశాడు. అతని కనుబొమలు ముడివడినాయి.

"సూర్యనారాయణ........ఎవరికి? సూరిక్కా! డబ్బెక్కడిది?"

"అమ్మ ఇచ్చింది" భయపడుతూ చెప్పాడు.

"ఊఁ. నేనూ పదిరూపాయలు పంపాలనే వచ్చాను. సరే పంపించి రా." కోటయ్య వెళ్ళిపోయాడు. వేణు మనియార్డరు చేసి బయటికి వచ్చాడు. అతని ప్రాణము గుట గుటలాడుతూనే వుంది. అమ్మ ఏమనుకుంటుందోనని.

"ఛీ! అమ్మకేం తెలియదు. నాన్న పంపేవరకూ ఆగలేకపోయిందా?" అనుకున్నాడు. మిగిలిన క్లాసులు కాగానే భోజనానికి ఇంటికి బయలుదేరాడు. అతను ఆశించినట్టే తల్లి కోపంగా ముఖంపెట్టి వెళ్ళిపోయింది. ఆమె ఏడ్చిందనటానికి నిదర్శనంగా కళ్ళు ఎఱ్ఱగా వున్నాయి.

"అమ్మా!"

"........."

"అమ్మా!" రెండోసారి పిలిస్తే కోపంగా చూసింది.

"అమ్మ యెవఱ్ఱా నీకు? నీది యింత విషపూరితమైన బుఱ్ఱని తెలియదు..."

"నా మాట వినమ్మా......"

"మళ్ళీ మాటాడకు. నాల్గు వాయిస్తాను. ఏదో కుఱ్ఱవెధవ, అక్కడ ఏం దిగులు పడతాడోనని డబ్బు పంపితే, వెళ్ళి ఆయనకు చెబుతావా? నేను అనుకుంటూనే ఉన్నాను. వాడంటే నీకసూయ అని"

"ఎందుకరుస్తావమ్మా! నామాట వినవే? నేను వెళ్ళి ఫారాలు నింపుతుండగా నాన్నగారు వచ్చి చూశారు."

"కాస్త రహస్యంగా చేయకూడదు?"

"అక్కడ మనకోసం వేరే గదులుండవు" విసుక్కున్నాడు.

"నాన్న పంపాలని అనుకున్నప్పుడు నువ్వు యెందుకు తొందర పడ్డావమ్మా?"

"నాదే తొందరా! ఆ మాట ఆయన మొదట చెప్పకూడదూ! పైగా నేను వాడిని పాడుచేస్తున్నానని మాటలంటారా! నాకు తెలుసు, మా శని మహాశయుడు యేది చేసినా, అది పోట్లాటగా మారుతుందని" గయ్‌మని లేచింది.

"ఛీ! ఏది జరిగినా నా మీదే తోస్తారు." విసుక్కుని భోజనము చేయకుండా వెళ్ళిపోయాడు వేణు. అతనికి చాలా మంటగా వుంది. ఓ చెట్టుక్రింద కూర్చుని చదువుకుంటూండగా అటుగా పిజికల్ ఇన్‌స్ట్రక్టర్ మనవర్ ఆలీ వచ్చాడు.



"ఏమీ! ఇంటికి పోయిలేవు?"

"లేదు సర్! చదువుకోవాలి"

"సదువేయ్, నీది అన్న ఇంజనీరు అయినాడు. నువ్వు."

"మా అన్న డాక్టర్ చదువుతున్నాడండి" నవ్వు నాపుకుంటూ అన్నాడు.

"అరే. భూల్‌గయారే బా. మీ అన్న డాక్టరీ చదివితే నువ్వు ఇంజనీరింగ్ చదువు."

"మంచిది సర్!"

"అరె. ఒకమాట చెప్తాను వింటావురా?"

"చెప్పండి సార్!"

"గోడాకిమల్లే ఇంత పొడవు యెదిగినావు గదరా! నిక్కర్లు బాగాలేవు. మీ అబ్బాకి చెప్పి, ప్యాంట్లు సిల్వాయించరా."

"మంచిది సర్." అతను నవ్వుతూ వెళ్ళిపోయాడు. అతను ప్రత్యేకంగా తన ప్యాంట్ల విషయము ఎందుకు చెప్పాడో వేణుకు అర్థం కాలేదు. అతను మొదటిసారిగా యెదిగిన తన అవయవాల వంక చూసుకున్నాడు. చెడ్డీలు పైకిపోయి, బలంగా తొడలు బయటికి కనిపించసాగేయి. అతనికి తెలుసు; అతడు అడిగితే లభించే జవాబు- భగవంతుడా! ఒక తల్లితండ్రికి ఇద్దరినే బిడ్డల నివ్వరాదూ!" అతని ఆలోచనలను భగ్నముచేస్తూ అతని స్నేహితుడు రఘు వచ్చాడు. అతడు యెప్పుడూ వుత్సాహంగా ఉంటాడు.

"ఒరేయ్! నేను వచ్చి ప్రక్కన కూర్చున్నా దేవదాసు ఫోజులు మానవేరా?"

"రఘూ! ఓ మాట చెప్పరా. నీవు అమ్మకు ఒక్క కొడుకువు కదూ?"

"చంపావ్ ఫో! అయిదో కొడుకునురా. అన్నలంతా ఉద్యోగాలు చేస్తున్నారు. నల్గురు అక్కల తరువాత నేను. మా చెల్లాయి గరల్స్ స్కూల్లో చదువుతుంది."

"ఊ....."

"ఉన్నట్టుండి ఆ సందేహము ఎందుకు వచ్చింది?"

"ఏం లేదు. మీ అమ్మ ఎవర్ని ప్రేమిస్తుందిరా?"

"నీకేమన్నా పిచ్చా, వెర్రా! అందరినీ ప్రేమిస్తుంది."

"అదృష్టవంతులు" అన్నాడు నిర్లిప్తంగా.

అతనిలో ఓ వెర్రి పట్టుదల బయలుదేర్తింది. తన రూపముచూసి నిరాదరించిన తల్లి దండ్రులు, గుణము, చదువు చూసి అయినా ప్రేమించరా అనే వెర్రి ఆలోచన. పిచ్చివాడు,'ఇష్టమైన పేడ ఇంగువ....' అన్న సామెత మరిచిపోయాడు.

## 4

ఆ యేడు జీతాలు ఇవ్వటములేదని జీతగాళ్ళు మరొకరి దగ్గర చేరారు. కోటయ్య పని ఇరకాటములో పడింది. ఇద్దరు చిన్న కుర్రవాళ్ళు దొరికితే వారిని పెట్టుకున్నాడు. వారికి పనేం రాదు. మృగశిరకార్తె ప్రవేశించింది. వర్షాలు పడ్డాయి. వేరుశనగకాయ వేద్దామని ఉన్నది. వేణు సాయముతో దున్నుకున్నాడు. వేణు నిజంగా పనికి భీముడు అనిపించింది. అతన్ని గనుక వ్యవసాయములో పెడితే తనకేం చింతలేదు అనుకుంటున్నాడు. ఇటు వేణు ఆలోచనలు పరీక్షా ఫలితాల చుట్టూ తిరుగుతున్నాయి. 'ఈసారి ఇంత ఆలస్యము యెందుకయిందో? ఎప్పుడూ మే నెలలోనే వచ్చేవి'. అతనలా అనుకుంటుండగానే, దూరమునుండి మధూ, రాధాకృష్ణ వస్తూ కనిపించారు. వేణు నాగలి వదలి వారి దగ్గరకు వెళ్దామనుకున్నాడు. తండ్రి యేమంటాడోనని ఊరుకున్నాడు. రాధాకృష్ణ నవ్వు ముఖము చూడగానే అతనికి ఎంతో ధైర్యము వచ్చింది.

"కంగ్రాచ్యులేషన్స్ వేణూ! ఫస్టుక్లాసులో పాసయ్యావు."

"నిజంగా సార్!" ఈసారి నాగలి వదిలి పరుగెత్తుకు వచ్చాడు. మాష్టారు చేతిలో పేపరు లాక్కుని చూశాడు.

"ఫస్టే కాదోయ్. మన బడిలో అందరిలోకి ఫస్టు మార్కు నీదేనట, చిత్తరంజన్‌గారు నిన్న బోర్డులో కనుక్కున్నారట."



"నిజం! నేను అనుకోలేదండి. ఆప్షనల్ పేపరు పాడు చేశాను" ఆనందము పొంగి పొర్లగా అతను పేపర్లోకి చూశాడు. తన నంబరు చూసుకున్నాడు. గర్వంగా తరువాత తండ్రివంక చూశాడు. తండ్రి తనకేం పట్టనట్టు పని చేసుకుపోవటము నిజంగా వేణుకు చాలా విచారము వేసింది.

"నాన్నా! నేను ఫస్టుక్లాసులో పాసయ్యాను" తండ్రికి తెలియ జేయాలని చెప్పాడు. కోటయ్య క్షణము నాగలి ఆపాడు.

"సంతోషము. మీరింతదూరము వచ్చారా మాష్టారూ?"

"రావద్దటండీ? ప్రియమైన శిష్యుడాయే" అన్నారాయన.

"ఇదిగో పనులు తెమిలి చావనిదే; అలా గడ్డిపై కూర్చోండి. వస్తాను."

"ఫరవాలేదు. పని కానివ్వండి. వస్తాను. తరువాత కనిపించు వేణూ. సరోజిని నిన్ను చూడాలని అంది" అన్నాడు.

"మంచిదండి"

అంతకంటే మరెక్కువ మాటలు జరగలేదు. తనకు ఫస్టుక్లాసు వస్తుందని టీచర్లంతా అంటే మురిసిపోయాడు. నిజంగా తండ్రి గర్వంగా తనవంక చూస్తాడని అనుకున్నాడు. యేదో వెల్తి మనసంతా ఆవరించుకోగా, నెమ్మదిగా నాగలి చేతబట్టాడు. ప్రొద్దుకుంకే వేళకు పని చాలించి కాళ్ళు చేతులు కడిగి బట్టలు మార్చుకుని, మైల బట్టలు భుజాన వేసుకుని ఇంటిదారి పట్టాడు. తండ్రి యింకా పనివాళ్ళకేమో పనులు పురమాయించి మాట్లాడు తున్నాడు. ఊళ్ళోకి వస్తున్న వేణును అందరూ అభినందించేవారే. స్నేహితులు కౌగిలించుకున్నంత పని చేశారు. అటునుండి తెలుగు మాష్టారింటికి వెళ్ళి చిత్తరంజన్ గారితో మాట్లాడి, అందరి ఆశీర్వాదాలు అందుకుని, సరోజిని దగ్గరకు పోదామనుకున్నాడు. కాని అప్పటికే బాగా చీకటి పడిందని ఇంటికి బయలుదేరాడు. ఇంట్లో నుండి తల్లి అరుపులు వినిపిస్తున్నాయి.

"చెయ్యి నొప్పిగా ఉంది, పెద్దకొడుకు ఏదో పనిచేసి పెడతాడంటే అర్ధరాత్రి వరకు ఇల్లు చేరకపోతే యెలా? మిగిలిన పనులు ఏదో చేస్తాను. నీళ్లు యెవరు తోడుతారు?"

"మరి నాకేం తెలుసే? ప్రొద్దు క్రుంకుతుండగానే బయలుదేరాడు. అన్నట్టు వాడు పాసయ్యాడని తెల్సింది. స్నేహితులతో కబుర్లేమున్నాయో?"

"యెందుకుండవూ? ఇటు నేను చస్తాను. కబుర్లతో కడుపునిండితే బావుండును, సంవత్సరమంతా చదివినవాడు ప్యాసు కావటము గొప్పేనా? వేణు హృదయములో మరో బాకు దిగింది. 'నా తండ్రీ' అంటూ అన్నగారిని అక్కున చేర్చుకున్న దీ తల్లేనా?"

"ఏం దొరగారూ, తీరిందా?"

"నేను పొలమువెళ్ళి పడుకోలేదు" విసురుగా వుంది జవాబు.

"పడుకుంటే కడుపులోకి యెలా వస్తుంది?"

"అబ్బబ్బ, ఏమిటి వెధవగోల! ఏం పనో చెప్పరాదూ?" విసుక్కున్నాడు కోటయ్య.

"నా మాటలు గోలగానే వుంటాయి" ఆమెకప్పుడు దుఃఖము ముంచుకువచ్చింది.

"మరేమిటి! ఏదో కుర్రవాడు సరదాకొద్దీ, పాసయిన సంతోషంలో మాటల్లో పడ్డాడేమో?" కొడుకును తండ్రి సమర్ధించడము ఆమెకెంత మాత్రము యిష్టము లేదు. తండ్రి యెత్తు తండ్రిది. ఈ నాల్గురోజులు అయ్యా, అప్పా అంటే ఇద్దరు చేసే పని కొడుకు ఒక్కడే చేస్తాడు.

"వేణూ! నాల్గు బిందెలు నీళ్ళట తోడిపెట్టరా మీ అమ్మకు." అన్నాడు.

మౌనంగా వెళ్ళి ఆ పని చేసి వచ్చాడు.

"ఏమయ్యా! మీవాడు స్కూలు కంతటికి ఫస్టు అటగా! మావాడు పాసయ్యాడు. అదృష్టమంటే నీదేనయ్యా, ఒకడు డాక్టర్ చదువుతున్నాడా! వీడు కలెక్టరవుతాడు" ప్రక్కింటాయన వచ్చాడు.

"మా అదృష్టాన్ని మీరే మెచ్చుకోవాలి, ఒక అబ్బాయి చదువుతోనే దివాళా తీశాను" అన్నాడు.

"తీస్తేనేమయ్యా! రేపు రెండు చేతులా ఆర్జిస్తాడు" అతడు పిచ్చాపాటి మాట్లాడి వెళ్ళిపోయాడు. వేణు తను ప్రత్యేకంగా ఊహించుకున్న దినము తిట్లతో ముగిసినందుకు చాలా బాధపడ్డాడు.



రెండవరోజు రాధాకృష్ణ ఇంటికి వెళ్ళి, తన విజయానికి నిజమైన సంతోషము అనుభవించాడు. సరోజని హల్వా, బజ్జీలు తెచ్చి పెట్టింది.

"మీరు చాలా శ్రమపడ్డారండి."

"అయ్యో బాబూ! ప్రొద్దుటినుండి మీ గురువుగారు నీ విజయానికి తనే శ్రమ పడినారని ఒకటే ఆయాసపడిపోయాడు. అందుకని చేశాను."

"నిజమేనండి. వారి శ్రమవల్లే కదా!"

"చూశావా! ఇప్పుడైనా నమ్ముతావా, లేదా?"

"నమ్ముతాను మహాప్రభో! నమ్ముతాను" నవ్విందామె. "ఏం చేయాలని అనుకుంటున్నావు వేణూ?" సరోజిని అడిగింది.

"ఇంకా ఏం అనుకోలేదండీ! నాన్నగారు పనులలో మునిగివున్నారు."

"ఇంకా ఆలోచించటానికి, అనుకోవటానికేముంది? పి.యు.సి. మాథ్స్ గ్రూపులో చేరతాడు. నిజాము కాలేజీలో చేరవోయ్."

"అలాగేనండి. స్కాలర్‌షిప్ దొరుకుతుందంటారా? నాన్నగారు ఈసారి డబ్బుకు చాలా ఇబ్బంది పడుతున్నారు."

"తప్పక దొరుకుతుందోయ్! కాని మొదట మాత్రము అంతా కట్టాలి."

"కట్టకేం చేస్తారండీ? డొనేషన్ కట్టగాలేనిది, వేణుకు ఫీజు కట్టడా?" సరోజిని ధైర్యము యిచ్చింది. వారికి తన కృతజ్ఞత తెలుపుకుని బయటకు వచ్చాడు. అలా స్నేహితులతో తిరుగుతుండగానే వారం రోజులు గడిచాయి. తల్లిగాని, తండ్రిగాని వేణు చదువు మాట యెత్తనే లేదు. ఆఖరున తనే యెత్తాడు.

"నాన్నా! అందరూ అప్లికేషన్లు తెచ్చుకుంటున్నారు. అసలే రిజల్టు ఆలస్యంగా వచ్చాయి"

"కాలేజీలో చేరుతావా?"

తండ్రి ప్రశ్నకు నిరుత్సాహము కలిగింది. ఉడుకుమోత్తనము వచ్చింది.

"మరి చేరక ఏం చేయాలి నాన్నా? ఇక్కడి చదువు పూర్తి అయిందిగా?"

"పని చేయాలంటే యేం కరువురా! కాలేజీలో చేరాలా! ఏం?"

"అంటే"

"మిర్యాలగూడాలో యెవరో పిండిమిల్లు అమ్ముతారట తెద్దామనుకుంటున్నాను. అలా రోజూ డబ్బు వచ్చే సదుపాయము లేకుంటే సూరికి డబ్బు పంపడము కష్టమవుతుంది. మిల్లు చూసుకో. అప్పుడప్పుడు వ్యవసాయము చూసుకుందువుగాని."

"ఇంత కష్టపడి చదివింది పిండిమిల్లు చూసుకోడానికా?"

"ఏం, అది మాత్రము పని కాదా! యెంత చదివినా వెధవది మరొకడి చేతిక్రింద వుద్యోగము చెయ్యాలి. ఇదయితే స్వతంత్రంగా, హాయిగా, దర్జాగా ఉండొచ్చు."

"నాకు చదువుకోవాలని వుంది" దృఢంగా చెప్పాడు.

"కోర్కె ఉండగానే సరా, ఇంటి పరిస్థితి చూడవద్దూ? అంతగా చదువుకోవాలని ఉంటే వచ్చే యేడు చూద్దాము. ఈసారి నన్నేం అడగవద్దు" తన నిర్ణయం చెప్పి, బయటకు వెళ్ళిపోయాడు కోటయ్య.

"అమ్మా! నాన్నగారితో నువ్వయినా చెప్పవా? థర్డ్ క్లాసులో పాసయిన స్నేహితులంతా చదువుకోవడానికి వెళ్తున్నారు.

"అవకాశముంటే ఆయన యెందుకు వద్దంటారురా? అన్నయ్య చదువుతోనే యిల్లు గుండమైపోయింది. అందరూ చదువుకోవాలని ఎక్కడుందిరా? అన్న చదువుతున్నాడు చాలు. నువ్వు ఇల్లు, పొలం చూసుకో. తమ్ముడిని చదివించు."

"వాళ్ళే చదవాలా? నేను వద్దా?" అరిచాడు.

"ప్రతి మాటకు నోరు చేస్తావు. ఆలోచన లేదు. డబ్బు యిబ్బందివల్లే కదా జీతగాడిని తీసివేసింది. నాన్నగారెంత కష్టపడతారో ఆలోచించవేం?"

"మరి అన్నయ్యనెలా చదివిస్తున్నారు?

"మళ్ళీ అదే కుళ్ళుమోతుతనమా? అన్నయ్య పాసయినప్పుడు అవకాశాలున్నాయి. చిన్నప్పుడు పనిలేదు కదా అని అందరిని బడికి పంపాము. ఇప్పుడు పని వుంది, అందరూ చదువుకుని దొరబాబులే అయితే, యిక



వ్యవసాయము చేసేదెవరు? కడుపు నిండేదెట్లా?" తల్లి మాటలకు జవాబు లేదు తనవద్ద.

"ఆ మాట యెప్పుడో చెప్పకూడదూ? నేనిప్పుడు మంచి మార్కులతో పాసయ్యాక చెప్పడము దేనికి?"

"మంచి మార్కులతో పాసయినవారంతా చదువుతారా? యజ్ఞశాస్త్రి గారి కొడుకు ఎం.ఏ ఫస్టుక్లాసులో పాసయినాడు. ఉద్యోగము చేస్తున్నాడా, ఊర్లో వుండి వ్యవహారములు చేయటము లేదూ?

"నేనూ ఎం.ఏ చదివినాక ఊర్లోనే వుంటాను."

"వేణూ, మొండివేషాలు వెయ్యకు. మేము ఎందుకు చెబుతున్నామో వినిపించుకో, నీవంటే మాకు పగా, ద్వేషమూ లేవు."

"నోటితో అనగానే సరా? నేనంటే అసలు మీకిష్టం లేదు" చరచర బయటకు వచ్చాడు. అతని మనసు రాధాకృష్ణగారిని చూడాలని వున్నా బడులు తీశారు, ఆయన పనులలో ఆయనుంటారనుకొని ఊరుకున్నాడు. పిచ్చిగా ఊరంతా తిరిగాడు. అన్నము తినాలని లేదు, నీళ్ళు త్రాగాలని లేదు. ఏదో కోరిక, దాన్ని సాధించలేదే అన్న అసహాయత. సాయంత్రము మాస్టారిని కలుసుకున్నాడు. అతను "మీ నాన్నకు నేను చెబుతాను లేవయ్యా" అన్నాక ధైర్యం వచ్చింది. ఇంటికి వచ్చాడు. వాకిట్లోనే రెండు చెంపలు వాయించాడు తండ్రి.

"దొంగ వెధవలు! తిండితిని ఊరుమీద తిరిగితే ఎవరు పని చేస్తారురా? నీకు సిగ్గెలా లేకపోయింది? ఫస్టున పాసవ్వగానే పొట్ట నిండిందా? వేరుశనగ కాయలు కలుపు తీయాలని చెప్పలేదూ?" వేణు బాధ వర్ణనాతీతము. కన్నీరు బిగబట్టి ఇంట్లోకి వెళ్ళాడు. తల్లి ముఖము తిప్పుకుంది.

"వెధవ కీ పూట తిండి పెట్టకు."

"మనం పెట్టకపోతే, వాడికి ఊర్లో ఇండ్లు కరువా? యెక్కడో తింటాడు. ప్రొద్దునకూడా తినలేదు" అన్నది తల్లి.

"అయితే ఊరిమీది వారే చదివించలేరా? ఒరేయ్ మధూ! కాసిన్ని నీళ్ళు పట్రా" తండ్రి మాటలు విని మధు పరుగున వెళ్ళాడు ఉత్తరోజులలో

తండ్రి ఏ పని చెప్పినా మొండికేసి గారాలుపోయే కొడుకు, వేణును కొట్టిననాడు, తిట్టిననాడు భలే చురుకుగా పని చేస్తాడు. ఆ రాత్రంతా కడుపులో పేగులు రొద పెడుతుండగా, భవిష్యత్తు ఏమిటని ఊహిస్తూ నిదురపోలేదు వేణు.

ఉదయమే వచ్చిన రాధాకృష్ణను చూస్తూ ముఖమదోలా పెట్టాడు కోటయ్య.

"యేమిటండీ! ఉదయమే ఎక్కడికో తయారవుతున్నట్టున్నారు?"

"వ్యవసాయము పనులు మాష్టారు! టైమ్ ప్రకారంగా చేసుకోకుంటే కుదురుతాయా? జీతగాళ్ళు లేరు. మా అబ్బాయి అలక సాగించాడు. చేతినిండా పని."

"నాన్నగారంటుండేవారు, వ్యవసాయము పనులు తెమలటమంటూ ఉండదురా అని. వేణు చదువు ఆపుతున్నారట. నేను తమాషాకన్నారు అన్నాను."

"ఇందులో తమాషా ఏం లేదు మాష్టారూ! నిజమే చెప్పాను."

"మీరు కొంచెము శ్రమపడితే వాడు వృద్ధిలోకి వస్తాడండీ! ఖర్చులు అంతగా పెట్టనవసరములేదు. మీరు తిండికి ఏదైనా వసతి కల్పిస్తే చాలు. స్కూలు మొత్తములో ఫస్టు వచ్చినవారికి వందపదహార్లు బహుమతి ఇస్తామన్నారు మేయరు. నిశ్చయంగా వాడు స్కాలర్‌షిప్ తెచ్చుకుంటాడు."

"చెప్పడం తేలికే మాష్టారూ! మా పెద్దాడి విషయములో అలాగే పొరపడ్డాను. 'అయిదువేలు డొనేషను కడితే చాలు నాన్నా'. అన్నాడు. సంవత్సరములో మరో మూడు వేలు అయ్యాయి. మాకా పెద్ద ఆస్తులు లేవు. భూదేవిని నమ్ముకుని బ్రతికేవారము. నా కొడుకు అభివృద్ధి నాకు సంతోషము కాదా! వస్తాను" అతను మరో మాట కవకాశం ఇవ్వకుండా వెళ్ళిపోయాడు. చిన్నబోయిన ముఖంతో, గుమ్మంలో నిల్చున్న వేణు వంక జాలిగా చూసి తనూ బయటకు వచ్చాడు రాధాకృష్ణ

రెండు రోజులు అలకసాగించాడు, అన్నము మానివేశాడు. లాభం లేకపోయింది. వేణు మాటను, కోర్కెను ఎవ్వరూ లక్ష్యపెట్టలేదు. ఎవరన్నా ఒకరు పట్టుదల సడలించుకుంటారు. "నా మాటంటే వేలెడున్న వెధవకు



లక్ష్యం లేదా? నేను వాడిని చదివించనే చదివించను" అనుకున్నాడు కోటయ్య. "ఫస్టురానివారికి, తమ ఇష్టమున్న వారికి, డొనేషను కట్టి చదివించటము లేదూ! నేను ఎలాగైనా చదివే తీరుతాను" అని వేణు పట్టుదల.

మర్నాడు తనతోపాటు ప్యాసయిన కుర్రవాడు సిటీకి వెళ్తుంటే తనకు ఫారాలు పత్రమ్మన్నాడు. వేణు అందరికీ ఎన్నో విధాలుగా సాయం చేశాడు. అతని పని అంటే ఎవరూ కాదనరు. వాడు డబ్బు అడగలేదు. వేణు యివ్వనూ లేదు. రెండు రోజులనంతరము ఫారాలు నింపి, రిజిస్ట్రేషను ఫీజుతో పంపాడు. లైన్సు క్లబ్‌వారు ఇచ్చిన డబ్బు తన దగ్గరే వుంచుకున్నాడు. అల్లరిచేసి, ఆరడిపెట్టి ఏడుస్తాడనుకున్నవాడు మామూలుగా తిరగటము తల్లిదండ్రులను ఆశ్చర్యపరిచింది. వేణు హెడ్‌మాష్టారితో తన అసహాయతను చెప్పుకుని మేయరు ఇస్తానన్న బహుమతి త్వరగా యిప్పించమని కోరాడు. అతను అంగీకరించాడు. అటు నుండి లెక్కల మాష్టారి దగ్గరకుపోయి, ఆయన దగ్గర కొన్ని కావలసిన పుస్తకాలు తీసుకున్నాడు. తన క్లాసుపిల్లలే నల్గురు సిటీ కాలేజీ వద్ద యిల్లు తీసుకుని ఉంటారని తెల్సింది.

"ఒరేయ్! నేను హాస్టల్లో ప్రయత్నం చేసే వరకు మీ రూమ్‌లో ఉండ నియ్యండిరా" బ్రతిమాలాడు.

"అలాగే, నీ వుంటే మాకు నయము కదరా! రానివి చెప్పించుకోవచ్చు" వారంగీకరించారు. ఫీజు కట్టగా తన దగ్గర డబ్బు మిగులుతుందనుకోవడము పొరపాటు. తను చెడ్డీలతో బడికెళ్ళితేనే మనవర్ ఆలీ అలా రావద్దని సలహా యిచ్చాడు. ఎలా? తండ్రిని చచ్చినా అడగరాదనుకున్నాడు. తను పుస్తకాలు పెట్టుకునే ట్రంకుపెట్టెను బాగుచేసుకున్నాడు. గొళ్ళెమూడిపోతే కష్టపడి పెట్టుకున్నాడు. తను సేకరించిన పుస్తకాలు భద్రం చేశాడు. పోయిన సంవత్సరం తనకు డిబేటింగ్ క్లబ్ బహుమతిగా యిచ్చిన మురదాబాద్ ప్లేటు, గ్లాసు పెట్టెలో సర్దుకున్నాడు. మూడు గంటలకల్లా రాధాకృష్ణ ఇంటిముందు నుంచి వెళ్తుంటే, సరోజిని కేకవేసింది. ఇద్దరు గంపలతో జాడీలు పెట్టుకున్న స్త్రీలు కూర్చున్నారు.

"వీళ్ళ దుంపతెగ ఒంటరిగా వున్న ఆడవారిని ఏడిపించుతారట! పిలువనైతే పిలిచాను గాని, భయంగా వుంది. నువ్వుండు కాసేపు."

"ఈ బట్టలన్నీ దేనికండీ?"

"మూడేళ్ళనుండి ఇంట్లోపడి మూల్గుతున్న పాతబట్టలోయ్! వీళ్ళకిచ్చి జాడీలు తీసుకుంటాను."

"అలాగా!" అన్నాడు.

ఆమె బేరం చేస్తుంది. బేరము కుదరటము లేదు. రెండుమూడు గట్టి ఫ్యాంట్లు కనిపించాయి.

"ఈ మూడు ఫ్యాంట్లు నాకివ్వండి. పట్నం నుండి వచ్చేటప్పుడు అంత జాడీ మీకు తెచ్చిపెడతాను.

"నీకు కావాలంటే తీసుకో. అయినా ఏం చేసుకుంటావు?"

"తరువాత చెప్తాను" మిగిలినవి వదిలి మూడూ పాత పేపరులో పొట్లము కట్టాడు. బేరం అయి గంపలవాళ్ళు వెళ్ళిపోయాక, సరోజిని యిచ్చిన కాఫీ త్రాగి బయటపడ్డాడు. సరాసరి దర్జీ బసవయ్య దగ్గరకు వెళ్ళాడు.

"బసవయ్యా! ఈ ఫ్యాంట్లు నాకు సరిపడేలా కుట్టు"

"పట్నం పోతున్నావు. ఉలెన్ ఫ్యాంట్లు కుట్టించుకోరాదూ?"

"మళ్ళీ వచ్చి సూటు కుట్టిస్తానులే! ఇవి కుట్టినందుకు కూలీ, గీలీ లేదు. పనివుంటే చెప్పు చేస్తాను."

"మీ అయ్య చూస్తే నా పీక నొక్కుతాడయ్యా"

"ఏం నొక్కడులేవయ్యా" అతను చూపిన క్రొత్తబట్టలన్నీ నీళ్ళలో తడిపి ఆరేశాడు. ఆరిన బట్టలు తెచ్చుకుని ఇస్త్రీ పెట్టాడు.

"వేణు బాబూ! నిజంగా నీ వంటి కుర్రాడు నా చేతికింద ఉంటే బంగారు గోడలు పెట్టనూ?"

"వద్దులే బసవయ్యా! అప్పుడు దొంగలు వస్తారు" నవ్వుతూ లేచి యింటికి వచ్చాడు. తండ్రి మూతి ముడుచుకున్నాడు.

"సాయంత్రము పొలాలవైపు వెళ్ళి పశువులకు మేత అదీ చూడకూడదుట్రా వేణూ! మీ నాన్నగారు అలసిపోయారు పని చేయలేక"



"నేను మరిచేపోయాను. మధు యేడి?"

"రెండు బిందెల నీళ్ళు చేదమన్నా, నేను ఒక్కర్తినే ఎంతకని చావను?"

"ఆ పసివెధవతో నీళ్ళు తోడించనిదే నీకు తోచదా?" కోటయ్య కంయ్‌మన్నాడు.

"పదమూడు వచ్చాయి. ఇంకా పసివెధవ ఏమిటండీ?"

"పదకొండేళ్ళు వచ్చాయి ప్రేమకి. ఒక యింటికిచ్చే ఆడపిల్ల. దానికి పని నేర్పరాదూ? అంతా గారాబం చేస్తావు."

"మీ కళ్ళు ఆ పిచ్చి సన్నాసిమీద పడ్డాయి. మరో నాల్గేళ్ళయితే మరో యింటికి వెళ్తుంటే ఏడవాల్సిందే. ఇప్పుడే పనులు చేయిస్తూ ఏడ్వాలా? మీరలా వాడిని నెత్తికెక్కించుకుంటున్నారనే ఒక్కమాటా వినడు" వారిద్దరి వాదన వింటూ తనలోతాను నవ్వుకున్నాడు వేణు. తల్లికి కావల్సిన సాయముచేసి, తన చొక్కాలను ఒకచోట వేసి పరీక్షించుకున్నాడు. నాల్గు మంచివి దొరికాయి. వాటిని భద్రంగా మడిచి పెట్టెలో పెట్టుకున్నాడు. అతనికి ముందు ఉజ్వలమైన భవిష్యత్తే తప్ప మరేం కనిపించడము లేదు. మొండి ధైర్యము, తెగింపు అతనిలో బలపడిపోతున్నాయి. పదిహేను దాటి పదహారో యేడులో అడుగుపెట్టిన పిల్లలు అంత తెగింపు చేయలేరు. "నెససిటీ ఈజ్ మదర్ ఆఫ్ ఇన్వెన్షన్" అని ఊరికినే అన్నారా? పెట్టె మూతవేసి తృప్తిగా నిట్టూర్చాడు.

మరురోజు వెళ్ళి మేయరుగారిచ్చిన బహుమతి, లైబ్రరీ వారిచ్చిన డిపాజిట్ తెచ్చుకున్నాడు. ఒకటికి పదిసార్లు లెక్కించి పెట్టెలో పెట్టుకున్నాడు. బసవయ్య దగ్గరకెళ్ళి బట్టలు తెచ్చుకున్నాడు.

తల్లి దండ్రులు తన గురించే మాట్లాడుకుంటున్నారు. "ఆ రోజు మాష్టారు చెప్పారుకదా! మేయర్ వీడికేదో వందరూపాయలు యిస్తామన్నారని. రేపు ఆ విషయమేమిటో కనుక్కోమని అందాము."

"ఆ డబ్బు వస్తే పెద్దాడికి పంపడానికి వాడు యిష్టపడొద్దండి?"

"వాడిష్టమేమిటే బోడిష్టము! తోడబుట్టినవారు ఒకరికొకరు సాయం చేసుకోరా యేం?"

"ఆ అభిమానము వాడికున్నదా?" తల్లి తండ్రుల సంభాషణ విన్నాడు. అంతవరకు వారిపట్ల వున్న సదభిప్రాయము, మినుకు మినుకు మంటున్న గౌరవము నాశనమయింది. అతనికి ఒకే అభిప్రాయం కల్గింది. తనకెవరూ లేరు. తన శక్తి, తన మంచితనము తప్ప. ఆ విషయము మదిలోకి రాగానే కంట నీరూరింది. తెల్లవారితే ఆదివారము త్వరగా తయారయి వెళ్ళాడు. రాధాకృష్ణ ఇంట్లో అడుగు పెడుతుంటే అతని కాళ్ళు వణికాయి.

"ప్రొద్దుటే వచ్చావేం?"

అతని యెదురుగా తలవంచుకుని నిలబడి, పాఠము అప్పగించినట్లు తన నిర్ణయము చెప్పాడు. అతను తెల్ల మొహము వేశాడు.

"వేణూ! నీకిదేం ఆలోచన వచ్చింది? అయ్యేపనేనా? పట్నమంటే అడుగు అడుక్కూ ఖర్చులుంటాయి."

"ఉండే ఖర్చులు ఎక్కడయినా వుంటాయి మాష్టారూ! ఇక్కడ లేవా? ప్రతినెలా రాఘవ, ప్రసాద్ మొదలగు వారంతా పాకెట్టు మనీ అంటూ ఇరవై రూపాయలు తగలబెట్టేవారు. నేను నెలకు ఇరవై పైసలు ఖర్చుపెట్టినట్టు గుర్తు లేదు. అక్కడ ట్యూషన్లు అవి దొరుకుతాయట....." రాధాకృష్ణ అతని మాటలకు జాలిగా నవ్వేడు.

"నిన్ను చూసి ట్యూషన్లు యెవరు చెప్పించుకుంటారోయ్?"

"పాఠాలు చెప్పడానికి రంగు అడ్డు వస్తుందనుకోను మాష్టారూ!"

"ఛ! ఒట్టి పొగరుమోతువోయ్! నేను ఆ ఉద్దేశ్యముతో అనలేదు. నువ్వే ఓ కుర్రాడివి; నీకెవరు పని ఇస్తారు?"

"ప్రయత్నిస్తాను"

"మీ నాన్నగారి మాటవిని ఒక సంవత్సరము వేచివుండరాదూ?"

"మీకు తెలియదు మాష్టారూ! చిన్నప్పటి నుండి ప్రతి విషయములోను నా యెడ చిన్నచూపు చూశారు. సహించాను, మధు నాన్నగారి ప్రియమైన పుత్రుడు, ఇప్పటి నుండే వాడి చదువుకు డబ్బు సమకూరుస్తారు."



"ఊ......" నిట్టూర్చాడు అతను.

"నా నిర్ణయం మీకు అయిష్టంగా ఉందా మాష్టారూ?"

"లేదు. ప్రవహించే సెలయేటికి, పరుగులెత్తే కోర్కెలకు అడ్డు వేయలేం. సరే నేను సాధారణమైన బడిపంతుల్ని, నీకేం ఆర్థికంగా సాయము చేయలేకపోయినా, నా ఆశీర్వాదము నీకుంటుంది వేణూ!" అతని కళ్ళు నిండుకున్నాయి.

"ఇదిగో, మేము జ్ఞాపకముండాలని యిస్తున్నాను. సరోజిని చెక్కతో చేసిన మూడు మారుతీ రూపాల బొమ్మ 'చెడు వినకు, చెడు మాట్లాడకు, చెడు చూడకు' అనే సందేశాన్ని యిస్తున్నాయి." భక్తిపూర్వకముగా అందుకుని దాన్ని జేబులో భద్రపరచి వారిద్దరికి నమస్కరించాడు. అతని కళ్ళనుండి రాలిన నీళ్ళు చెంపలమీదుగా జారి గుండెలవద్ద ఇంకిపోయాయి.

వేణు జేబులోనుండి మారుతీ మూర్తుల బొమ్మతీసి, పెట్టెలో పెట్టబోయాడు. ప్రేమవచ్చి దాన్ని అందుకుని చూసింది.

"చాలా బావుంది అన్నయ్యా! నాకివ్వవూ? నా బొమ్మల కొలువులో పెట్టుకుంటాను."

"నీ బొమ్మల కొలువు దీపావళికి కదే! అప్పటికి కొనిస్తానులే"

"నాకిదే కావాలి."

"చెప్పితే మంచి అమ్మాయిలా వినాలి" ఆమె చేతిలో నుండి తీసుకున్నాడు.

"అమ్మా! చూడవే అన్నయ్యా....." ప్రేమ ఫిర్యాదు చేసింది.

"ఏంరా! దాన్ని యేమన్నావు? చిన్నపిల్లను ఏడిపించక మానవుకదా?" చిట్టెమ్మ వచ్చింది.

"నేనేం అనలేదు. మా మాష్టారు నాకో బొమ్మ బహుమతిగా యిచ్చారు. అది తనకు కావాలంటుందేం?"

"ఇస్తే అరిగిపోయావా?"

"ఇవ్వను, ప్రతి దానికి పోటీయేనా? పోయిన సంవత్సరం నాకొచ్చిన బహుమతులన్నీ తగలేసింది. అందరూ వారి ఇళ్ళల్లో అలమరలలో పెట్టి వుంచారు."

"వాటిని ఏం జేసుకుంటారు! పోనియ్యవే ఈసారి పెద్దన్నయ్య బోలెడు బొమ్మలు తెస్తాడు" అన్నది. ప్రేమ కాసేపు గొణుక్కుని ఊరుకుంది. మర్నాడే అతని ప్రయాణము, పెరట్లో వున్న మొక్కలు తను పెంచిన వాటిని. చేతుల వంక చూసుకున్నాడు. అరచేతులనిండా కాయలే. మూడు నాల్గు రోజుల నుండి వర్షం లేక వాడిపోయినట్టు కనిపించాయి. నీళ్లు తోడి పోస్తుంటే అవి తనకు వీడ్కోలు యిచ్చినట్టు బాధపడ్డాడు. ఆప్యాయంగా ఆకులను ముట్టుకున్నాడు. మల్లె, మందార, రోజా, కనకాంబరాలు; మరో దిక్కు నిమ్మ, జామ ఏపుగా పెరిగి కాపుపట్టేలా వున్నాయి. వాటివంక చూసి యింట్లోకి వచ్చాడు. యింటిముందు కుడిప్రక్కగా వున్న పశువులశాలలో ప్రవేశించాడు. "అంబా" అంటూ లేగలు తలెత్తాయి. వాటి తువ్వాయిని దువ్వాడు. ఈ రెండు సంవత్సరాల నుండి జీతగాళ్ళు రాక వాటి సంరక్షణ తనే చేస్తున్నాడు. రాత్రిపూట పాలు పితుకుతున్నాడు. ఇకమీదట ఎవరు చూస్తారో? ఛీ! చదువులేకుంటే మానే. ఇంటి దగ్గరే ఉండిపోదామనిపించింది వెంటనే అతనికి పట్టుదలా, రోషమూ పెరిగాయి. తల్లి, దండ్రుల ప్రేమకు నోచుకోకపోయినా 'దేవుడిచ్చిన వరాలు' దీక్ష, ఆసక్తి, శక్తి, మేధ ఉన్నాయి. వాటిని ఉపయోగించు కోవాలి. తను వ్యక్తిగా పరిగణింపబడాలి. అతని కండరాలు బిగుసుకున్నాయి. చెదిరిపోయే ధైర్యాన్ని కూడకట్టుకుని పశువులకు గడ్డివేశాడు. పాలు పితికి తల్లికి ఇచ్చాడు. ఆమె పాలందుకుంది.

"నువ్వు తీస్తున్నప్పటి నుండీ పాలు చెంబునిండుగా వస్తున్నాయిరా" అన్నది. అతని చేతులు వణికాయి. రాత్రంతా ఆ విధంగా గడిపాడు. మర్నాడు ఉదయమే లేచి ఎలా చెప్పాలి అని తికమకపడుతుండగా తండ్రే పిలిచాడు.

"వేణూ! తూర్పు వైపు పొలము దున్నుదాము. పెసలు వేద్దాం."

"నాన్నా!.....నేను.........నేను........"

"నువ్వు........నవ్వు ఏమిటి?"

"నేను.......పట్నం........" అతని మాటలు గొంతులోనే ఆగిపోయాయి.

"సరిగ్గా చెప్పి ఏడ్వరాదూ?"

"నేను ఈ రోజు...... కాలేజీలో చేరదామని పట్నం వెళ్తున్నాను."



"ఏమిటీ?" మరోసారి కొడుకు నోటినుండి, అతను పట్నం పోతున్నాడని విని తెల్లబోయాడు.

"ఇంత చెప్పినా నీకు బుర్రకెక్కటం లేదా? నా దగ్గర ఒక్కపైసా లేదు."

"అక్కరలేదు. నా అవసరాలు గడుపుకుంటాను."

"ఏమిట్రా ఆ ధీమా! పట్నములో ఉండటమంటే మాటలా?"

"ఇది నీకు పుట్టిన బుద్దేనట్రా?" తల్లి అడిగింది.

"మీకు ఖర్చులేదు కదా! నన్ను పంపడానికేం అభ్యంతరం?"

"ఓహో! పిచ్చి తలకెక్కిందా! అయితే మేయరుగారిచ్చిన వంద రూపాయలు బుర్రను చెడగొట్టాయిలా వుంది."

"వందరూపాయలు ఎన్నాళ్ళు వస్తాయిరా. ఆ మొండితన మెందుకు?"

"పోనివ్వవే, బికారి వెధవ! నాల్గు రోజుల్లో డబ్బు అయిపోయాక బిక్క మొహము వేసుకుని రాడూ?"

"ఆ డబ్బు పాడు చేస్తే సంతోషమా?"

"చెయ్యనీ, వాడి తలని శని తాండవిస్తుంది" కోటయ్య హూంక రించాడు.

"ఇదంతా ఆ రాధాకృష్ణ ఉపదేశము కాదుగదా?"

"యెవరి ఉపదేశమూ కాదమ్మా! నాకు చదువుకోవాలని ఉంది. వెళ్తున్నాను. అంతే"

"వెళ్ళి ఎక్కడుంటావురా?"

"నాలాంటివారికి ఎన్నో వసతిగృహాలుంటాయిట......."

"ఉంటాయి. వెళ్ళి అమ్మా, అబ్బా చచ్చిపోయారని చెప్పరా" ఆమె కంఠము పూడుకుపోయింది.

"వేణూ! మరొకసారి చెబుతున్నాను, నా మాట విను, నా పరిస్థితులు బాగుపడితే, వచ్చేయేడు వెళ్దువుగాని"

"అన్నయ్య చదువు అయ్యేవరకు మన పరిస్థితులు బాగుపడవు నాన్నా! ఈలోపల నేను పెద్దవాడినవుతాను" లోపలకు వెళ్ళి పెట్టె తెచ్చుకున్నాడు.

చిట్టెమ్మ ఎందుకో యేడుస్తుంది. ఆమె హృదయము ఒక్కసారి మమకారముత
పొంగిపోయింది. తాను నిజంగా వాడికి అన్యాయం చేయడము లేదుకదా?

"వేణు! ఏమిట్రా ఈ పంతము? అందరూ చదివేవారేనా? మ
స్థితి ఆలోచించవేంరా?'' దీనంగా కొడుకు చేతులు పట్టుకుంది. అల
వెళ్ళిపోవటము అతనికిష్టము లేదు. కాని ఏం జేస్తాడు? కళ్ళమ్మట నీరుకా
తల్లి చేతుల మీదుగా జారింది.

"యెందుకే వాడిని బ్రతిమాలడము? యెలా చదువుతాడో నేను
చూస్తాను. ఒరేయ్! ఒక్కసారి ఇల్లు వదిలితే, మళ్ళీ రావద్దు"

"వాడితోపాటు మీకూ మతిపోయిందా ఏమిటి?"

"మతిపోలేదు. వేలెడు వెధవకు ఇంత పంతమా? వెళ్ళు. మళ్ళీ
రాకు. నువ్వు చచ్చిపోయావనుకుంటాను". ఏం మాట్లాడక షర్టుతో కళ్ళు
వొత్తుకుని బయటకివచ్చి, మరోసారి అందరివంకా చూసి ముందుకు
సాగిపోయాడు.

నల్గురు మిత్రులు వచ్చి కూర్చున్నారు బస్సులో. అందరి వెనుక
పెద్దవారున్నారు. తను ఒంటరిగా జీవిత పోరాటములోకి వెడుతున్నాడు.
జయమో, అపజయమో కాలమే నిర్ణయించాలి. ప్రపంచంలో ఎందరో
అనాధలున్నారు. వారందరూ తమ కెవ్వరూ లేరని చెప్పుకుంటూ సాయము
అర్థిస్తారు. తనెలా? అందరూ వున్నారు. కాని తనపట్ల వారి హృదయాలలో
ప్రేమానురాగాలు లేవు. జేబులో చేయిపెట్టి పాత ధోవతిని చింపి తెచ్చుకున్న
రుమాలు తీశాడు. కారే కన్నీరును ఒత్తుకున్నాడు.

"ఏం వేణూ! మీ నాన్న రావటం లేదా?"

"లేదండి. పని వుంది."

"ఒక్కడవు వెళ్ళి ఏం చేస్తావు?"

"ఆయన అవసరమనుకుంటే వస్తారండి'' చెప్పి తప్పించుకున్నాడు.
శ్రీయాదగిరి నర్సింహస్వామి గుట్టకేసి తిరిగి నమస్కారము పెట్టాడు. బస్సు
కదిలింది. ఒక్కసారి అతని హృదయం కదిలింది. ఎవరూ చూడరాదని ముఖం
క్రిందికి దించాడు.



# 5

నిజాం కాలేజీలో, నోటీస్ బోర్డుపై తన పేరు చూసుకుని మహానందం పొందాడు. ఆఫీసు కనుక్కుని వెళ్ళి ఫీజుకట్టి రసీదు పుచ్చుకున్నాడు. ఏదో మొండి ధైర్యము. అక్కడి విద్యార్థులను చూస్తే అతనికి మతిపోయింది. తనలాంటివారు ఎవరూ లేరనిపించింది వేణుకు. హాస్టలు వివరాలు వారిని అడిగే ధైర్యము అతనికి లేదు. వారంతా వెక్కిరిస్తే! నెమ్మదిగా కాలేజి బయటికి వచ్చాడు ఎదురుగా మరో విద్యా సంస్థ- కాలేజీయో, బడియో తెలియలేదు. చక్కని దుస్తులు వేసుకుని అంతా తెల్లగా, ఆరోగ్యంగా వున్న పిల్లలు బయటికి వచ్చారు. ఆ తరువాత వచ్చే చిన్న పిల్లల గ్రూపును చూసి బడి అని నిర్ధారణ చేసుకున్నాడు. అక్కడ నిలబడాలంటే సిగ్గువేసింది. త్వరగా ప్రక్క సందులోకి దూరాడు. దూరాన తనలాంటి మామూలు దుస్తులతో వెళుతున్న కుర్రవాడిని హాస్టలెక్కడ వున్నదో చూపమని అడిగాడు. అతను చెప్పిన అడ్రసునుబట్టి చూస్తూ, దారిలో రిక్షావారిని అడుగుతూ హాస్టల్ కనుక్కున్నాడు. సెక్రటరీని కలవాలని అడిగాడు.

"ఆయన సాయంత్రం ఏడు గంటలకు వస్తాడు'' గేటు దగ్గర కాపలా వున్నతను చెప్పాడు. తిరిగి స్నేహితులున్న బసకువెళ్లే ఓపిక లేదు. సిటీ కాలేజీలో చేరి వారంతా బేగం బజారు పాత వీధిలో ఒక గది తీసుకున్నారు. తనకు నిజాము కాలేజీలో సీటు వచ్చిందాయె. హాస్టలుకు, కాలేజీకి పెద్ద దూరము లేదు. అక్కడ వరండాలో కూర్చున్నాడు. ఏడుకంటే ముందే ఓ కారు వచ్చి ఆగింది. గేటుకీపరు లేచి సలాం కొట్టాడు. వేణు అతని దగ్గరగా వెళ్ళాడు.

"ఇతనేనా సెక్రటరీగారు?"

"ఊఁ!'' అతను ఒకసారి హాస్టలంతా కలయజూసి వచ్చాడు. ఆఫీసులాంటి పెద్ద గదిలోకి వెళ్ళాడు. అతని వెనకాల ఎంతోమంది వెళ్ళి మాట్లాడి వెళ్ళారు. అతను సమయము చూసుకొని వెళ్ళటానికి లేచాడు. వేణు భయంగా లోపలికి అడుగుపెట్టి నమస్కరించాడు.

"ఎవరు? ఏం కావాలబ్బాయ్?"

"హాస్టల్లో చేరాలండి" అన్నాడు తడబడుతూ.

"అయితే, ఇదిగో ప్రాస్పెక్టస్, జాగ్రత్తగా చదివి, రేపు రా."

"నేను....... నేను మీతో కొంచెం మాట్లాడాలి."

"ఈపూట నేనో చోటికి వెళ్ళాలి. రేపు రా" అతను వెళ్ళిపోయాడు. వేణు దిగాలుపడిపోతూ, నడుస్తూ, యెనిమిదిన్నరకు బేగంబజారు చేరుకున్నాడు. అప్పటికే నల్గురు స్నేహితులు, వారి పెద్ద యిల్లు చేరారు.

"ఏరా! ప్రొద్దుననగా వెళ్లినవాడవు ఇప్పుడా రావటం?" రఘు అడిగాడు. తను జరిగిన విషయాలు చెప్పాడు.

"ఒరేయ్! అక్కడంతా రౌడీ పిల్లలుంటారట్రా, ఇక్కడే చేరితే అందరము ఒకే చోట ఉండేవారముగా?"

"నిజమే! బోర్డుమీద లిస్టు చూడగానే నా పేరు కనిపించిందిరా."

"లిస్టు పెట్టాక వారం రోజులు గడువు వుంటుంది. ఆలోచించవద్దా?"

"ఆలోచించటానికేముందిరా! హాస్టల్లో గనుక సీటు వస్తే, సిటీ కాలేజీకి దూరము కాదు."

"హాస్టల్లో వస్తుందని నమ్మకమేమిట్రా?"

"లైబ్రరీయో, లేక యితరత్రా పనులు చేసిపెడితే, సంవత్సరానికి కొందరు బీద విద్యార్థులకు ఉచిత భోజనము పెడతారట! చూడాలి"

"మీ నాన్న కేమైందోయ్! అప్పుడే ఉచిత సౌకర్యాలకై పాటు పడుతున్నావ్?" సత్యం నాన్నగారు అడిగారు.

"ఈ యేడు మా నాన్నగారి స్థితి అంత బాగాలేదండి"

"అమ్మో! ఘటికుడులే మీ నాన్న." అతని కామెంటు మౌనంగా విన్నాడు. ఆకలి అవుతున్నా, అడిగే ధైర్యం లేదు. తను పిడికెడు బియ్యం కూడా తెచ్చుకోలేదాయె?

"గిన్నెలో అన్నం వుంది తినరాదురా" సత్యం అన్నాడు. వెంటనే ఉన్న అన్నము పెట్టుకొని తిని లేచాడు. తను పెట్టెలో పెట్టి తెచ్చుకున్న దుప్పటి సగం పరిచి సగము కప్పుకుని పడుకున్నాడు. అలసివుండుట వలన వెంటనే మైమరచి నిదురబోయాడు.



మర్నాడులేస్తూనే, ఉచితంగా తినడం భావ్యం కాదని, గిన్నెలు తొలచి వంటచేశాడు.

"నిజంగా భలే పనిమంతుడవోయ్! నీవెక్కడున్నా హాయిగా బ్రతుకుతావు. మా శాయికి వడ్డించుకోవటం కూడా చేతకాదు" శాయి తండ్రి అభినందించాడు. వారందరి జతను భోజనం చేసి, కాలేజి నుండి తెచ్చుకున్న సిలబస్ చూస్తూ నాలుగు గంటలవరకు గడిపాడు. తరువాత లేచి, నిన్నటి హాస్టలు చేరాడు. ఆరోజు ఆలస్యంగా వచ్చాడు సెక్రటరీ, హాస్టలు పరివారము వెళ్ళిపోయాక గదిలో అడుగుపెట్టి, అతనికి నమస్కరించి కూర్చున్నాడు.

"ఇప్పుడు చెప్పు" అతను తను ఫీజుకట్టి చేరటానికి వచ్చిన విద్యార్థి అనుకుని మాట్లాడటానికి సమయము యిచ్చినట్టున్నాడు.

"నువ్వు నోరు మూసుకుంటే నాకు ఎలా తెలుస్తుంది?"

"నేను....." తన పరిచయము చెప్పాడు. "మా ఇంటి పరిస్థితులేం బావుండలేదండి. మీ దగ్గర బీద విద్యార్థులకు ఉచిత సౌకర్యము లభిస్తుందని విని వచ్చాను" తన మార్కులు, స్కూలు వారిచ్చిన సర్టిఫికెట్లు మేయరు ఇచ్చిన బహుమతి, అన్నీ అతని ముందుంచాడు. అతడు వాటిని చూసి తృప్తిగా తలాడించటము చూచి వేణు కెంతో ధైర్యము వచ్చింది.

"ఊఁ! అయితే మీ పెద్దవారెవరూ రాలేదా?"

"లేదండి. మా నాన్నగారు వస్తే పొలం పనులు పాడవుతాయి" వినయంగా జవాబు యిచ్చాడు.

"నువ్వు ఆలస్యంగా వచ్చావు. హాస్టలు తెరిచేముందే అన్నీ నిర్ణయిస్తాము. ఈసారి ముగ్గురు విద్యార్థులకు ఉచిత సౌకర్యాలు కలుగజేయాలనుకున్నాము. ముగ్గురూ వచ్చినట్టే ఉన్నారు. వచ్చే యేడు చూద్దాం."

"నేను ఈ హాస్టలు పేరు విని ఎంతో ఆశతో వచ్చానండీ?" అప్పటికే కళ్ళల్లో నీరు సుడులు తిరిగింది. సెక్రటరీ ఆశ్చర్యపోయాడు.

"భలే వాడివోయ్! పెద్దవారెవరూ లేరు, తెలిసినవారు లేరు. ఎలా పనిసానుకూల పడుతుందనుకున్నావు?"

"నాకెవరూ తెలియదండి."

"సరే! రేపు మిగతా కమిటీ మెంబర్లను కనుక్కొని చెప్తాను."నీవు వెళ్ళవచ్చునన్నట్టు చూశాడు. నిరాశగాలేచి, అతనికి నమస్కరించి, బయటకు వచ్చాడు. వర్షము సన్నగా ప్రారంభమయింది. అప్పటికే ఆలస్యమైందని వర్షములో తడుస్తూ స్నేహితుల యింటి ముఖము పట్టాడు. అతని ఆశలు కరిగిపోసాగాయి. అతని ఊహాసౌధాలు కూలిపోసాగేయి. తొమ్మిదిన్నరకు యిల్లు చేరాడు. అందరూ నిద్రబోతున్నారు. విసుక్కుంటూ సత్యము వచ్చి తలుపు తీశాడు. బట్టలు మార్చుకొని, పిండి గదిలో ఒకమూల ఆరవేశాడు. అతని మనసెందుకో తిండివైపు విముఖత చూపింది. అలాగే పడుకున్నాడు.

మర్నాడు లేస్తూనే మామూలుగా వారి పనికి సాయం చేస్తుండగా శాయి తండ్రి అడిగాడు.

"ఏమోయ్! హాస్టల్లో స్థలముందటనా?"

"ఆశగా లేదండి! ఫ్రీ బోర్డర్స్ వేసవిలోనే చేరతారట. రికమండేషన్ ఉంటే పని సానుకూలపడుతుందేమో!"

"మరి అదేదీ తేలనిదే ఫీజు యెలా కట్టావోయ్?"

"నమ్మకంగా వస్తుందనుకున్నాను"

"ఇల్లు అలకగానే పండుగ అవుతుందా? అలాంటి స్థలమున్నా, మన ఊరి కర్ణముగారి వద్ద నుండి నీవు బీదవాడివి అయినట్టు సర్టిఫికెట్టు తేవాలి. మీరంతా తెలివైన వారు లెండి. పైసా లేకుండా పనులు జరుపుకుంటారు. అందరి పిల్లలతోపాటు వస్తున్నావుగా? మీ అమ్మ యిన్ని బియ్యమయినా యిచ్చిందా?" ఇక వినలేక బయటికి వచ్చాడు. నడుస్తుండగా ఆకలి కావటము మొదలుపెట్టింది. అప్పుడతనికి గుర్తుకు వచ్చింది. రాత్రి భోజనం చేయలేదని. ఒక బండి దగ్గర ఆగి రెండు అరటిపండ్లు కొనుక్కొని తిని, ఆకలి చల్లార్చు కున్నాడు. కాలేజీకి వచ్చాడు. జులై ఇరవై అయిదో తారీఖునుండి క్లాసులు రెగ్యులర్‌గా జరుగుతాయని తెల్సింది. జనము కొద్దిమందే వుండటము మూలాన కాలేజీ అంతా ధైర్యంగా తిరిగి చూసుకున్నాడు. హాస్టలు సెక్రటరీ రాత్రికిగాని రాడు. తనేం చెయ్యాలి? స్నేహితుల దగ్గరకు వెళ్ళబుద్ధి కాలేదు. వెళ్ళి పబ్లిక్ గార్డెన్ అంతా తిరిగాడు. బఠానీలు అమ్మే కుర్రవాడి దగ్గర అణా



బఠానీలు కొని తిని పంపుదగ్గర నీళ్ళు త్రాగాడు. ఓ చెట్టుక్రింద కాసేపు నిదురబోయాడు. లేస్తుంటే మనసంతా భారంగా వుంది, "అమ్మా, నాన్నా ఏమనుకుంటున్నారో, తమ్ముడు, చెల్లెలు ఎలా వున్నారో......" ఆలోచనలు తెగటం లేదు. పంపుదగ్గర శుభ్రముగా ముఖము కడుక్కుని రుమాలుతో తుడుచుకుని హాస్టలుకు బయలుదేరాడు.

ఆరోజు అనుకున్న సమయానికంటే ముందే సెక్రటరీగారు వచ్చారు. ఆశగా ఆయన దగ్గరకు వెళ్ళి నిల్చున్నాడు.

"సారీ, అబ్బాయి! నేనెంతో ప్రయత్నించాను. ఇప్పుడేం వీలులేదు."

"అదికాదు సార్......"

"చెప్పాను కదా? వచ్చే యేడు మేలోనే అప్లికేషన్ యివ్వు, ప్రయత్నిస్తాను" అనేసి మరెవరో వస్తే ఆయనతో మాట్లాడుతూ ఉండిపోయాడు. తన ఆశలు కూలిపోగా, ఆశయాలు కరిగి, కలగా మిగిలి పోతాయని విచారిస్తూ వచ్చాడు. వేణు గేటు దగ్గరకు రాగానే యెక్కడలేని దుఃఖం వచ్చింది. తనకేం తెలియదు. తన జీవితము చుక్కానిలేని పడవలాంటిది. పెద్దవారు దగ్గరుండి ఇది దారి అని చూపాలి. రాధాకృష్ణ అయినా రాలేదు. తన తలపై శని వుంది. తను అడుగలేడు. ఆడపిల్లకు మల్లే ఏడుస్తూ గేటు దగ్గర నిల్చున్నాడు. ఎంతసేపలా నిల్చున్నాడో అతనికి తెలియదు. కారు హారన్ గట్టిగా వినిపించేసరికి తలెత్తాడు. హాస్టల్ సెక్రటరీగారు రమ్మన్నట్టు సైగ చేశారు. వెళ్ళాడు.

"ఆడపిల్లలా అదేమిటబ్బాయ్!"

"ఏం లేదండి! ఇక్కడ దొరుకుతుంది ఉచిత వసతని ఎందరో చెబితే నిజమేననుకుని ఫీజు కట్టాను."

"ఆ విషయము మీవారికి రాయి."

"లాభము లేదండీ." అన్నాడు కళ్ళు తుడుచుకుంటూ

"ఎవరింటనైనా వసతి కల్పించవచ్చు కాని, నీవు నమ్మకస్తుడవని ఎలా తెలుస్తుందోయ్?"

"మా రాధాకృష్ణ మాష్టారికి, హెడ్‌మాష్టరుగారికి వ్రాసి కనుక్కోండి" అన్నాడు.

"అయితే కారెక్కు" వెనుక తలుపు తీశాడు. అతనివంక గౌర సూచకంగా చూసి కారెక్కాడు. కారు వెళ్ళి కాచిగూడాలో ఓ యింటిముం ఆగింది. సగముకట్టి వదిలిన ఇంటిముందు రకరకాల పూల మొక్కలున్నాయి ఓ ముసలమ్మ అలికిడి విని బయటకు వచ్చింది.

"అమ్మగారు లేరా?"

"ఇద్దరూ కాలేజీకి వెళ్ళారు బాబూ!"

"సరే. ఈ కుర్రవాడు ఇక్కడే ఉంటాడు. నేను తొమ్మిది గంటలకు వస్తానని చెప్పు."

"మంచిది బాబూ!"

"నీ పేరు వేణు అన్నావ్ కదూ! ఇక్కడ ఉండు. నేను మరో గంట వస్తాను" అతను వెళ్ళిపోయాడు. ఇద్దరు మగపిల్లలు - మూడు, ఒకటిన్న సంవత్సరాలవారు, బొమ్మలముందు ఆడుతున్నారు. ముసలమ్మ అన్నము తినమని బలవంతము చేస్తోంది. ఇద్దరూ ఆమెను ఆటవస్తువులతో కొట్టారు కేరింతలు పెట్టారు.

ఆ ముసలమ్మ ఊరు, పేరు వివరాలు అన్నీ అడుగుతుంటే జవాబ చెప్పాడు వేణు.

తొమ్మిది గంటలు దాటాక, గేటు తీసుకొని ఒక స్త్రీ, పురుషుడ వచ్చారు. వేణు వారికి నమస్కరించాడు. ముసలమ్మ అతని వివరాలు చెప్పింది

"అలాగా!" అన్నారు. వారు దుస్తులు మార్చేలోపలే హాస్టలు సెక్రట గారు వచ్చారు. ఒకరినొకరు పలుకరించుకున్నారు.

"చూడు పురుషోత్తం! నీకు సహాయంగా రాత్రిళ్ళు ఇల్లూ, పిల్లల చూసుకుంటే పాతిక రూపాయలైనా ఇస్తావు కదూ?"

"అవును. ఈ కుర్రాడిని పిలుచుకొచ్చావా యేం?"

"నేను చెప్పేది పూర్తిగా విను. ఈ అబ్బాయి ఫస్టుక్లాసులో మెట్రిక్యులేష ప్యాసయ్యాడు. కాలేజీలో చదవాలని వుంది. పాపం! ఇంటి పరిస్థితుల బాగాలేవుట. డబ్బివ్వక్కరలేదు. రెండుపూటలా భోజనము పెడితే చాలు. వరండాలో పడుకుంటాడు. ఏమోయ్! రాత్రిపూట ఎక్కడికీ వెళ్ళవు కదూ?"



"నా కెవరున్నారండీ? ఇక్కడే వుంటాను."

"గుడ్! నీకు అంగీకారమేనా?"

"అదికాదండీ! ఊరు, పేరు తెలియనివాడు....." మిసెస్ పురుషోత్తం నసిగింది.

"అదేమిటండోయ్! అబ్బాయికి లక్షణంగా వేణుగోపాల్ అని పేరుంది. నల్గొండ అని ఊరుంది."

"నమ్మకస్తుడేనా?" పురుషోత్తం అడిగాడు.

"ఇక మనపై ఆధారపడి వుంది. మొదటిసారి చూడగానే ఈ కుర్రవాడు శ్రమజీవి అనిపించింది. అతను సర్టిఫికెట్లు అందించితే, చాపిన చేతులు చూశాను. కాయలు కాసివున్నాయి. పోనీ హామీగా నేనుండనా?"

"ఛ! తమాషా చేస్తావేం? సరే."

"నా స్వంత ఇంటిలా చూసుకుంటానండీ" వేణు హామీ ఇచ్చాడు, పురుషోత్తంగారిని దూరము తీసుకెళ్లి సెక్రటరీగారేమో చెప్పారు. బహుశ వేణు గుణం తెలిసేవరకు ఇల్లు వదలిపోవద్దని చెప్పి వుంటారు. తిరిగి వచ్చారు.

"బుద్ధిగా వుండు వేణూ! వచ్చే యేడు నీకు నా చేతనైన సహాయము చేస్తాను. వీరిద్దరూ రాత్రిపూట నడిపే కళాశాలలో ఉపన్యాసకులు. వారికి నమ్మకమైన మనిషి కావాలి, నీకు ఆశ్రయము కావాలి. నేను నిన్ను చూస్తూనే ఓ సదభిప్రాయము ఏర్పరచుకున్నాను. దాన్ని నిలపాలి."

"ప్రయత్నిస్తాను సర్!" వినయంగా, గొంతు పూడుకుపోతూవుంటే ఎలాగో సమాధానము చెప్పాడు.

"మరి నీ సామానులవి ఎక్కడున్నాయి?"

"స్నేహితుల వద్ద వున్నాయి."

"రేపు వెళ్ళి తెచ్చుకో" సెక్రటరీ వెనకాల అతని కారువరకు నడిచాడు.

"మీకు ఎలా కృతజ్ఞతలు చెప్పుకోవాలో తెలియటము లేదండి" అతని వంక చూశాడు. అతను వేణు కళ్ళల్లోకి చూశాడు. ఊరిన నీటితో కృతజ్ఞత స్వచ్ఛంగా, నగ్నంగా కనిపించింది.

"అవసరం లేదోయ్! నేనూ ఒకప్పుడు నీలాగే పట్నం చేరాను. శ్రీ రాజా బహద్దుర్ వెంకట్రామారెడ్డిగారి దయవల్ల ఈ స్థితిలో వున్నాను. ఆయన ఋణము ఎలాగూ తీర్చుకోలేను. ఆయన ఆశయాలను కొన్నింటిని అమల్లో పెడితే అదే తృప్తి."

"ఆయనెవరండి?"

"ఎవరని చెప్పేది? ధర్మదాత. మనవంటి బీద విద్యార్థుల పాలిట కల్పవృక్షము. ఆయన నెలకొల్పిన బడులు, వసతిగృహాలు ఉన్నాయి ఈ పట్టణములో. మరోసారి తీరికగా చెబుతాను" అతను అప్యాయంగా వేణు భుజాలు నొక్కి వదిలాడు. కారు స్టార్ట్ అయి వెళ్ళిపోయింది. వేణు కంటిలో రెండు నీటి బిందువులు మెరిసి మాయమయ్యాయి, భారంగా వెనక్కు తిరిగాడు. అంతవరకున్న ముసలమ్మ గొణుక్కుంటూ వెళ్ళిపోయింది. ఆ పూట పురుషోత్తంగారింట్లో భోజనము చేసి, వారిచ్చిన పాత దుప్పటి కప్పుకుని, సోఫాల దగ్గర తివాచిపై నిదురపోయాడు. ఒకే తండ్రి బిడ్డలు - అదే సమయాన సూరి వెచ్చగా దోమతెరలో డిటెక్టివ్ నవల పట్టుకుని, వరంగల్ హాస్టల్ రూంలో పడుకున్నాడు. విరించి లీలలు విచిత్రంగా వుంటాయి. పెద్ద పెద్ద వేదాంతము అభ్యసించిన పండితులకే అతని లీలలు నిర్వచన కందలేదు.

* * *

వేణు ఉదయమే లేచి, పురుషోత్తముగారి భార్య సుగుణకు పనిలో సాయం చేశాడు. ఆవిడలో వున్న తెలివితేటలు అద్భుతము. మెత్తని మాటలతో, పర్వతాలు పెల్లగిస్తుంది, ఆప్యాయతతో పనులు సాధిస్తుంది.

"వేణూ! కాఫీ అలవాటుందా? లేకుంటే చేసుకోకు బాబూ! నా యిల్లు నీకు శాశ్వతమా, రేపు మరోచోట యిబ్బంది పడతావు" అని భర్తకిచ్చి, తను త్రాగింది. పిల్లలకు పాలు పట్టింది. వేణు చెట్లకు నీళ్ళుపోశాడు. పిల్లలను ఆడించాడు, ఆమె చెప్పినట్టు సోఫాలు, బల్లలు దులిపాడు, పదకొండు గంటలకు ఆమె పెట్టింది తిని, స్నేహితుల బస చేరుకున్నాడు. తన వస్తువులు సర్దుకొన్నాడు.

"ఏరా! వసతి లభించిందా?"



"ఆఁ" అన్నాడు వివరాలు చెప్పక.

"అదృష్టవంతుడవంటే నీవేరా" అన్నారు.

తన అదృష్టమెలా వుందో పరీక్షించుకోవాలి. అప్పుడే ఏం తెలిసింది?

చేతిలో ట్రంకుతో నడవటము కష్టమని, బస్సులో వచ్చాడు. బస్సు దిగి, చేతులు మార్చుకుంటూ పురుషోత్తం గారి యిల్లు చేరాడు.

"రాత్రి పండుకోవటము హాల్లో పండుకో, ఉదయము లేవగానే నీ పక్కచుట్టూ, సామాన్లు వెనుకవైపు పెట్టుకో" అన్నది సుగుణ. తలాడించేడు.

"రెండు రోజులలోనే వేణు వల్ల ఉపయోగములు తెలుసుకున్నారా దంపతులు."

"వేణూ! కాస్త బజారుకెళ్ళి కూరలు తెస్తావూ?" సుగుణ అడిగేది.

"అలాగే పేపరు, రేజరు పట్రావోయ్!" పురుషోత్తంగారు పురమాయించేవారు.

"వేణుబాబూ! ఎంత చేసినా తరగదయ్యా! ఆ బాయిలర్లో నీళ్ళు పోసి, కాస్త కూరలు తరిగిపెడతావూ?" పనిమనిషి అర్థింపు.

"వేణూ! నాకు పడవ చేసిపెట్టవూ?" మూడేళ్ళ రాము అడగటం, "నన్ను ఎత్తుకో" మని రెండు సంవత్సరాలు నిండని శరత్ చేతులందించటము. వేణుకు విసుగులేదు. వారం రోజులకు కాస్త తీరిక చేసుకొని తండ్రికి, రాధాకృష్ణకు ఉత్తరాలు వ్రాశాడు. కాలేజీకి ఉత్తరాలు వ్రాయమని చెప్పాడు. తండ్రి జవాబు వ్రాయలేదు. కాని, రాధాకృష్ణ జవాబు వెంటనే వ్రాశాడు. కోటయ్య చాలా కోపంగా ఉన్నాడనీ, మీరే మా పిల్లాడిని కోతిని చేశారని హెడ్‌మాష్టారిపైనా, ఇతర మాష్టార్లపైనా విరుచుకుపడ్డాడనీ, దీక్షతో తన లక్ష్యముసాధించమని వ్రాశారాయన. ఒకటికి పదిసార్లు చదువుకున్నాడు వుత్తరాన్ని.

ఉదయము నాలుగ్గంటలకు లేచి, ఆరువరకు పాఠాలు చదువు కుంటాడు. తరువాత ముఖము కడుక్కొని, బాయిలర్ అంటించి, హాల్లో సామాన్లు సర్దిపెట్టి, పనిమనిషికి సహాయము చేస్తుండగానే, యింటివారు మేల్కొంటారు. వారికి కావల్సిన చిన్నచిన్న పనులు చేసి, యెనిమిదిన్నరకు

భోజనానికి కూర్చుంటాడు. అప్పటికి వంట అవదు. రాత్రి పదార్థాలు వడ్డిస్తే తింటాడు. లేచి కాలేజీకి వెళ్తాడు. నడిచిపోవటము. కాచిగూడా నుండి నిజాం కాలేజీకి వెళ్ళాలి. మధ్యాహ్నం అందరూ కాంట్యీన్లవైపు వెళ్ళితే, చల్లని నీళ్ళు కడుపునిండా త్రాగి, యే చెట్టుక్రిందనో కూర్చుని చదువుకునేవాడు. కాలేజీ వదలగానే ఇల్లుచేరి చేయవలసిన పనులు ఏమైనావుంటే చేసి పనిమనిషి పెట్టిన అన్నము తినేవాడు. మధ్యాహ్నము మిగిలిన రొట్టెలో, అన్నమో ఏది వుంటే అదే పెట్టేవారు. అది తిని పిల్లలతో వేణు వుంటే దంపతులు కాలేజీకి వెళ్ళేవారు. వారిని ఆడిస్తూ తన చదువు చదువుకుంటూ, రాత్రికి వారు తిరిగివచ్చేవరకు కాలక్షేపము చేసేవాడు. ఒకోసారి పిల్లలు నిద్రపోయేవారు. వారు భోజనాలు చేశాక తలుపులువేసి పడుకునేవాడు. ఆదివారము ప్రొద్దున లేవగానే ఇస్త్రీ పని వుండేది.

"వేణూ! ఈ ఇడ్లీ తీసుకో. ఏం గుణమో, ఇంట్లో ఎవరయినా ఉంటే గొంతు దిగదు." తనను తాను అభినందించుకుని, రెండు ఇడ్లీలు పెట్టేది సుగుణ. సాధారణంగా ఆదివారాలు మధ్యాహ్నం వేడిభోజనం లభించేది. వారు పెట్టిందే మహా ప్రసాదమని తినేవాడు. ఒక్కనాడు కూడా ఎదురు చెప్పి ఎరగడు. తను వారికేమవుతాడని? ఒకటి రెండుసార్లు హాస్టల్ సెక్రటరీగారు వచ్చి చూసి, తృప్తిగా నిట్టూర్చి వెళ్ళిపోయాడు. దినమంతా వ్యాపకాలతో గడిచినా, రాత్రిపూట ఇంటి జ్ఞాపకాలు వచ్చి పుండుగా రేగి, హృదయమంతా అల్లకల్లోలమయ్యేది. ఛీ! ఈ బ్రతుకు దేనికి? హాయిగా ఇంటికి వెళ్ళి అమ్మా, నాన్నల మాట విని వ్యవసాయము చేసుకోవాలనిపించేది. మరుక్షణమే అతని అంతరాత్మ ఎదురు తిరిగేది. తను యెంత త్యాగము చేసినా, వారికి తృప్తి వుండదని అతనికి తెలుసు. మనసు రాయి చేసుకుని ఊరుకునేవాడు. అటు కన్నవారికి అతని ధ్యాస లేదా అంటే లేదని చెప్పలేం. పసివాడికే ఇంత పంతమయితే మాకు లేదా అని వారు బిగదీసుకున్నారు. అతను బ్రతికే ఉన్నాడు, నిజాం కళాశాలలో చదువుతున్నాడని అతని తల్లిదండ్రులకు స్నేహితుల ద్వారా తెలుస్తూనే వుంది.



ఆదివారం ఉదయమే సుగుణ ఎంతో ఆప్యాయంగా పిలిచింది. వేణు దగ్గరకు వెళ్ళి నిల్చున్నాడు.

"చూడు వేణు, ప్రొద్దుట ఏమంత పనిగనుక, వెళ్లి కాస్త పాలు పట్టుకొస్తావూ?"

"ఎక్కడినుండి తేవాలండీ?"

"ఎక్కడో లేదోయ్! బర్కత్‌పురా లోనే" మర్నాటినుండి ఒక గంట పాలు తేవడానికి వృథా అవుతుంది. సాయంత్రము అలసటగా వుంటుంది. క్యూలో కనీసం అర్థగంట నిల్చుని, తరువాత ఇంటికి రావటము. నడిచి కాలేజీకి పోవటము, రావటము వల్ల, నిద్ర త్వరగా వస్తుంది. తను చదువు అలక్ష్యము చేస్తున్నానా అనిపించేది. మధ్యాహ్నము దొరికిన సమయము సద్వినియోగము చేసుకోవాలని, చెట్టునీడలో కూర్చున్నాడు. ఇంగ్లీషు వ్యాసము వ్రాస్తున్నాడు.

"ఒరేయ్! మన క్లాసులోకి ఓ గొరిల్లాను పట్టుకొచ్చారు తెలుసా?"

"ఆఁ గొరిల్లా కూడా సినిమాలలో వాటి ట్రైనింగ్ యిస్తే బాగా నటిస్తుందిరా. ఆఫ్రికా అడవుల నుండి పట్టుకొచ్చారీ అవతారాన్ని" వేణుకు తెలుసు, ఆ మాటలు తనను గూర్చే అంటున్నారని. విననట్టే తన పని చేసుకుపోతున్నాడు.

"ఈ అవతారానికి తోడు, చెముడు కూడానా?"

"స్పర్శజ్ఞానముందో, లేదో చూద్దామురా" రెండో అబ్బాయి చిన్న కంకరరాయి తీసి విసిరాడు. అది సూటిగా వేణు కణతల వద్ద తాకింది. వెంటనే బొలబొలమంటూ రక్తం కారసాగింది. అసహాయుడైన వేణు రుమాలుతో అద్దుకున్నాడు. దూరంలో నిలబడి ఈ తతంగమంతా చూస్తున్న ఓ ముస్లిమ్ కుర్రవాడు ముందుకువచ్చి రాయితో కొట్టినతని షర్టు పట్టుకున్నాడు.

"ఆ అబ్బాయిని అనవసరంగా కొట్టేవు. పద, ప్రిన్సిపాల్ దగ్గరకు" మరో నల్గురు చేరినారు. వేణుకు తెలుసు, పగతోని పగ ఆరదని; తనలాంటి వాడు రిపోర్టులంటూ నల్గురి దృష్టిలో పడటము అంత మంచిది కూడా కాదు.

"బ్రదర్! అతన్ని వదిలివేయండి. అతడు కాదు నన్ను కొట్టింది,

అతనిలోని అహంభావము! రోజా ఇస్త్రీ నలగని బట్టలతో వచ్చే అతని నాలాంటి బీద విద్యార్థులంటే చులకన."

"అందరూ ఆశ్చర్యంగా చూశారు. తమలాంటి వారు తెలుగులో రెండు వాక్యాలు చెప్పాలంటే చస్తారు. నెమ్మదిగా ఒకమూల కూర్చునే సాధారణమైన విద్యార్థి, చక్కగా, స్పష్టంగా ఇంగ్లీషులో మాట్లాడటమా? అతని వంక చూసి వారు వెళ్ళిపోయారు. ఆ రాత్రి అతను కణతనొప్పితో పడుకోలేక పోయాడు. అటు యిటు వెతికి ఆరు తెల్ల కాయితాలు సంపాదించాడు 'నల్లపిల్లడు' అని ఓ కథానిక వ్రాసి, కవరులో పెట్టిగాని నిద్రపోలేదు. మర్నాడు కలంపేరుతో దాన్ని పోస్టుచేశాడు. అతనికి నమ్మకము లేదు, ప్రచురిస్తారని అది పేరుమోసిన వారపత్రిక, తన గుండెలలోని బరువు తీర్చుకున్నాడు.

"రాత్రివి రెండే రొట్టెలున్నాయి అమ్మా!" పనిమనిషి చెబుతోంది.

"ఉన్నంతే పెట్టు. కడుపుకు పరిమితి ఎక్కడుంది? యెంత ఎక్కువ అలవాటు చేసుకుంటే అంత సాగుతుంది రబ్బరు తిత్తిలా" రెండు ఎండిపోయిన రొట్టెలు, కందిపచ్చడి తెచ్చి పెట్టింది. అదే అమృతములా తిన్నాడు. కాని మధ్యాహ్నం కాలేజీలో విపరీతమైన దాహము, ఆకలి మొదలయ్యాయి. పంపుదగ్గరకు పోయి కడుపునిండా నీళ్ళు త్రాగాడు. విద్యార్థులు హోటళ్ళలోకిపోక, చెట్లక్రిందకు తెప్పించుకొని తింటున్నారు. తనెప్పుడైనా అలా తెప్పించుకోగలడా? అసంభవము. ఛ! మనసు అంత ప్రలోభపెడుతుందేమిటి హెచ్చరించుకున్నాడు. మరునాడు పాలు తెస్తుంటే ప్రక్కింటి గుమ్మంలో నిల్చొని వున్న ఓ నడివయసు స్త్రీ "అబ్బాయ్, మాట!" అని పిలిచింది.

ఆవిడ పిలిస్తే కాదనలేక దగ్గరగా వెళ్ళాడు.

"ఈ ప్రక్కింటి లెక్చరరుగారింట్లో వుంటున్నావా?"

"అవునండీ."

"ఆవిడ కూడు పెడుతుందా? స్వంత పెత్తల్లే వారం రోజులలో ఉడాయించింది."

"లేదు, వారు నన్ను చాలా ప్రేమగా చూస్తున్నారు."



"సడేలే! మరో నెల పోతే తెలుస్తుంది. మాకో సీసా పాలు తెచ్చి పెడతావూ? డబ్బులిస్తాను."

"అలాగే. రేపు వెళ్ళేటప్పుడు సీసా యివ్వండి తెస్తాను" మార్నాటి నుండి ఆమెకు పాలు తేవటము మొదలుపెట్టాడు. కాలం వేగంగా గడుస్తోంది. ఫస్టు టర్మ్ సెలవులిచ్చారు. ఎటుపోవాలి? తల్లిదండ్రులు రానిస్తారా? అతని ఆలోచనలు కట్టిపెడుతూ పురుషోత్తంగారు ఓ నిర్ణయం చెప్పారు.

"సంక్రాంతి సెలవులకు మీ వూరు వెళ్ళాలని వుంటే వెళ్ళు వేణూ! ఇప్పుడు మేము మాఊరు వెళ్ళివస్తాము. ఈ పేటలో పగలే దొంగతనాలు జరుగుతాయి."

"అలాగేనండి" అన్నాడు. వారు కొలిచి పెట్టిపోయిన రేషన్ బియ్యము వండుకొని తిని, ఆ యింటికాపలా కాశాడు. ఓ రోజు అప్రయత్నంగా హాల్లోని నిలువుటద్దములో తన ప్రతిబింబము చూసుకున్నాడు. కండరాలు తిరిగి బలిష్టంగా వున్న తన శరీరము వ్రేళ్ళాడినట్టు కనిపించింది. చెంపలు జారిపోయాయి. తనపై తనకే జాలి వేసింది. మూడుపూటలా శుభ్రంగా తినేవాడికి, రెండు పూటలు కొలత ప్రకారమైతే ఏమవుతుంది? అతనికి మిగిలిన తృప్తి అల్లా ఒక్కటే, సెలవులలో కాలము వృధా కాకుండా చదువుకున్నాడు. అతను పాఠము చదువుతుండగా ప్రక్కింటామె పిలిచింది.

"ఏమిటండీ?"

"నీవు పాలు తెచ్చిపెట్టటము నెలనుండి కదూ! ఈమూడు రూపాయలు ఉంచు" వేణు సందిగ్ధావస్థలో పడ్డాడు. డబ్బు తీసుకోవాలా వద్దా? తనకు తిరిగి టర్మ్‌ఫీజు కట్టాలి. అయినా తీసుకోకపోవటమే మంచిదని తోచింది.

"వద్దండి, నేను మీ కోసము ప్రత్యేకముగా వెళ్ళటము లేదుగా! పనిలో పని" అన్నాడు. ఆవిడ కాఫీ పలహారము పెట్టింది. అవి తీసుకుని ఇంటికిరాగానే పోస్టు వచ్చింది.

"వేణుగోపాల్ కావాలండి."

"నేనే, ఎందుకు?"

"మీకు....ఆఫీసువారు ఒక కాంప్లిమెంటరీ కాపీ, పదిహేను రూపాయలు పంపారు. అయితే మీ పెన్ నేమ్ "విద్యా!" నవ్వుతూ అడిగాడు.

"అవునండి. మీకెలా తెలుసు?"

"విద్య కేరాఫ్ వేణుగోపాల్ అని వుంది" అతను సంతకము తీసుకుని డబ్బిచ్చాడు. వేణుకు పట్టలేని ఆనందము... తను మొదటిసారిగా డబ్బు సంపాదించాడు. కాని వెంటనే నిరాశ అలముకొన్నది. తన సంతోషాన్ని పంచుకునే వారెవరూ లేరే అని ఆత్రంగా తను వ్రాసిన కథే ఒకటికి రెండుసార్లు చదువుకున్నాడు. పత్రికతీసి భద్రంగా పెట్టె అడుగున దాచుకున్నాడు. వారము రోజుల తరువాత పురుషోత్తం దంపతులు తిరిగివచ్చారు. సాయంత్రం సావడిలో కూర్చుని పత్రికలు చదువుతూ, అతడు భార్యను కేకవేశాడు. ఆవిడరాగానే అతడు చెప్పాడు.

"చూడు సుగుణా! ఈ కథ ఎంత బావుందో....." అక్కడే పిల్లల నాడిస్తున్న వేణూ తొంగిచూశాడు. తను వ్రాసిందే అతని ఒళ్ళు ఝల్లు మంది. సంతోషంతో అణువణువు పులకరించింది.

"ఇలాంటి కథలు చదువక యెన్నాళ్ళయిందో! ఇద్దరబ్బాయిలు ఒకమ్మాయి, లేదా ఒక అబ్బాయి ఇద్దరమ్మాయిలు ప్రేమ, విరహము, త్యాగము - ఇలాంటివి కాలక్షేపానికి చదువుతాము. ఈ కథ చూడు యెంత నాచురల్‌గా మూవింగ్‌గా ఉందో" సుగుణ పత్రిక అందుకుని గబగబా చదివింది.

"నిజమేనండి! ఇలాంటి సంఘటనలు మనము కాలేజీలో యెన్నో చూస్తాము. రంగు, స్టయిల్‌ను బట్టి గౌరవము దొరుకుతుంది. కొందరు లెక్చరర్లు కూడా ఇతను రాసినట్టే స్టయిల్‌గా వున్నా విద్యార్థులను ఒకటి రెండుసార్లు అడిగి సందేహాలు తీరుస్తారు. మామూలుగా వున్న విద్యార్థులంటే చులకన. వారెంత తెలివైన వారైనా సరే" వారలా మాట్లాడుతుంటే వేణు చెవులు రిక్కబొడిచి విన్నాడు. అతని ఆనందమింతా అంతా కాదు.

కాలేజీలు తీశారు. ఆ రోజు క్లాసులో అడుగు పెడుతుంటే వేణు వేసుకున్న హవాయి చెప్పు తెగిపోయింది. ముందుకు పడబోయి నిలద్రొక్కు కున్నాడు. క్లాసంతా గొల్లుమన్నారు. వేణుకు తల కొట్టినట్టు అయింది. వెంట



హైస్కూల్‌లో ముసఫర్ ఆలి అనే సామెత గుర్తుకువచ్చింది. "గరీంబోకా జీనా, కంగాలోంకా హసనా" (బీదవారి జీవితము సంస్కారులకు నవ్వులాట). నిజంగా తన జీవితము వారికి నవ్వులాటగానే వుంటుంది. వాటిని గుమ్మము దగ్గరే వదలి వెళ్ళి కూర్చున్నాడు. పాఠము అయిపోగానే బయటకు వచ్చి, తన చెప్పులకు దారము కడుతూ కూర్చున్నాడు.

"వేణూ- సారీ వేణుగారూ! కాలేజీలో చదవటము దేనికీ? హాయిగా షూస్ రిపేరింగు షాప్ పెట్టుకోరాదటండీ!" మొన్న రాయితో కొట్టిన అబ్బాయి అడిగాడు.

"పార్టనర్‌గా చేరుదామని ఉందేమిటి?" తన పని చేసుకుంటూ అడిగాడు.

"ఏమన్నావ్? నాకంత గతి యేం పట్టలేదు" హుంకరించాడు.

"ఇతరులకు ఉచిత సలహా యిచ్చే గతెందుకు పట్టింది మహాశయా?"

"ఇడియట్......ఫూల్......."

"నిజంగా ఆ బిరుదులన్నీ నీకు తగినవే. కోపమెందుకు బ్రదర్! వెళ్ళి చల్లని మంచినీళ్ళు త్రాగరాదూ?"

"ఏమన్నావురా?" పైకి వచ్చాడు.

"అయ్యో! నీలాగ డబ్బు తగలేసి, సగము గతికి పెంచిన శరీరం కాదిది. ఆస్పత్రిలో పడుకొని చింతించవద్దు...." విదిలించాడు. వేణు బలము అర్థం చేసుకున్నవాడులా ఉంది, తిట్టుకుంటూ వెళ్ళిపోయాడు. ఎలాగో రెండు రోజులు కాలేజీకి అటెండ్ అయి, ఆదివారము సుగుణను అడిగి, స్నేహితుల దగ్గరకు బయలుదేరాడు. వేణును చూస్తూనే సత్యము, రఘు ఎగిరి గంతేశారు. శాయివచ్చి కౌగిలించుకున్నాడు.

"ఎక్కడ మాయమయ్యావురా?" సంబరంగా అడిగాడు.

"యిక్కడే వున్నాను. మనూరికి వెళ్ళి వచ్చారా, విశేషాలేమిటి?"

"ఏమున్నాయి? ఒకరోజు మీ యింటికి వెళ్ళాము, మీ అమ్మగారు కంట తడిపెట్టుకున్నారు. మీ నాన్నగారు కోపములో వున్నారు. అబ్బో?

సూర్యనారాయణ సెలవులకు వచ్చాడు. ఏం తీవిరా నాయనా, మాట్లాడనై లేదు."

"అమ్మ నా విషయాలు అడగలేదా?"

"అడిగింది. మాకు తెలిసినంత వరకు చెప్పాము. రాధాకృష్ణ గారు నిన్ను చాలా జ్ఞాపకం చేశారు" ఊరి విషయాలు మాట్లాడుతుంటే కాలమే తెలియలేదు.

"సినిమా కెళ్దామురా" స్నేహితులు బలవంతం చేసి తీసుకెళ్ళారు సినిమా పాటలను కాపీ చేస్తూ తిరిగివచ్చాడు. సుగుణ ధుమధుమ లాడుతూ యెదురు వచ్చింది.

"ఆలస్యంగా వస్తానని చెప్పొద్దా వేణూ! మేము ప్రోగ్రాము వేసుకు వారము కాదు"

"నేను అనుకోలేదండి. స్నేహితులు బలవంతంగా సినిమాకి లాక్కుపోయారు"

"అతను మ్యాటినీ చూసివచ్చాడు. మనం సెకండ్‌షో చూద్దాం పురుషోత్తంగారు అన్నారు.

"మీకేం? అలాగే అంటారు. ఇదిగో! పార్వతి మరిది కనిపించాడు అన్నీ ఇంటినుండే తెచ్చుకుంటాడట. గది అద్దె, చిల్లర ఖర్చులే ముప్పై దా అవుతున్నాయిట" పార్వతి మరిది సంగతి ఇప్పుడెందుకో పురుషోత్తం అర్థంకాక పోయినా, వేణు అర్థం చేసుకున్నాడు. పరోక్షంగా వారు తన చేయు సాయము ఎంత విలువ అయిందో తెలుపుతుందన్న మాట. నిట్టూ వెళ్ళిపోయాడు.

## 6

ఆ రోజు సాయంత్రం కాలేజీలో ఫిజిక్స్ ప్రాక్టికల్స్ చేస్తుంటే ఆలస్య అయింది. అతనికి భయంగా వుంది. నడచి వెళ్ళితే యిల్లు చేరేసరి యెంతలేదన్నా ఆరున్నరా, ఏడు అవుతుంది. సుగుణ తప్పక విసుక్కుంటుం అసలు కోపముతో వెళ్ళిపొమ్మంటే? భయపడుతూ అడుగులు వేస్తున్నాడు



బషీర్‌బాగ్ క్రాసురోడ్డు దగ్గర నల్గురు కుర్రవాళ్ళు తన క్లాసుమేటును కొట్టడం కనిపించింది. "పొగరుమోతుకు శాస్తి కావల్సిందే. తననంటే రాయితో కొడితే ఊరుకున్నాడు. రోజా హేళనచేస్తే సహించాడు. అందరూ ఊర్కుంటారా?" వెంటనే అతనిలో దాగిన సంస్కారం, మంచితనం మేల్కొన్నాయి. స్నేహితుడు కాకపోయినా, ఆపదలో ఆదుకోవటము తన విధిగా భవించాడు. చేతిలోవున్న ఒకే నోట్‌బుక్ జేబులో కుక్కుకుని, వారితో చేయి కలిపాడు. యిద్దర్నీ లాగి దూరము నెట్టాడు. ఈసారి క్లాసుమేటు కాస్త ధైర్యము తెచ్చుకుని లేచాడు. మళ్ళీ కలియబడబోయారు. మధ్యలో నిలబడి ఆపాడు.

"అసలు మీకు బుద్ధి వుందా? నడిరోడ్డుమీద ఏమిటా పోట్లాట?"

"అడగడానికి నువ్వెవరవోయ్? వాడి పని పట్టందే వదలం."

"అసలు సంగతేమిటి?"

"ఏమిటా? విను. ఈ మహానుభావుడు రోజా బస్సు స్టేజి దగ్గర నిలబడి, మా చెల్లెలు మహబూబియా స్కూల్‌కు వెడుతుంటే, రిబ్బన్లులాగి, పూలు లాగి గొడవ చేస్తున్నాడట! దానికి జవాబు చెప్పాలని, నడిరోడ్డుమీద తన్నితే మిగతా వారికి కూడా బుద్ధివస్తుంది" హుంకరిస్తున్నాడో అబ్బాయి. వేణు తన క్లాసుమేటువంక చూశాడు, దర్పమంతా వదలి దీనంగా చూస్తున్నాడు.

"ఆఁ ఏదో పొరపాటు జరిగి వుంటుంది. ఈసారికి వదలి వేయండి."

"పిప్పిపిప్పిగా కొట్టి వదులుతాము"

"మరోసారి అమ్మాయి దగ్గరకొస్తే అలాగే చేద్దురు. ఏం బ్రదర్! 'సారీ' చెప్పరాదూ?"

"సారీ" అన్నాడు తల వంచుకుని.

"ఛీ! యింతపాటి ధైర్యానికి ఆడపిల్లలను ఏడ్పించాలా? వెళ్ళు" ముగ్గురూ వెళ్ళిపోయారు.

"వెళ్తారా, నన్ను రమ్మంటారా?" వేణు పోబోతూ అడిగాడు.

"క్షమించు వేణూ! నిన్నంత అవమానపరచినా నాకు సహాయము చేశావు" దీనంగా చూశాడు.

"దానిదేముందిలే! వస్తాను. యింతకీ మీ పేరు చెప్పలేదు?"

"నా పేరు జగన్"

"నేను త్వరగా వెళ్ళాలి" పరుగులు దీసినట్టే నడిచి ఇల్లు చేరాడు

"అమ్మగారు....... వెళ్ళిపోయారా....ఫిజిక్స్ ప్రాక్టికల్స్ చేస్తుంటే.... ఆలస్యమయింది" దమ్ముతీస్తూ చెప్పాడు.

"తొందరలేదులే. సుగుణ అప్పుడప్పుడు తొందర పడుతుంది ఏమనుకోకు. నాకు ఫస్టు పీరియడ్ లేదు. అందుకే వెయిట్ చేస్తున్నాను పురుషోత్తంగారు లేచి తయారయ్యారు.

"బల్లమీద ప్లేటులో నీకోసం భోజనం పెట్టానంది సుగుణ" అతని చెప్పి వెళ్ళిపోయాడు. వేణు కాళ్లు, చేతులు కడుక్కుని, పిల్లలను ఆడించి అన్నము తెచ్చుకొని కూర్చున్నాడు. చిన్న గిన్నెలో పప్పు గుప్పుమని పాసికం కొట్టింది. అతనికి బాగా గుర్తు, మూడురోజుల క్రితం తోటకూర వేసి చేసింది అదింకా తన కోసం దాచారు కాబోలు! పప్పు పంపుదగ్గర పారవేసి, భోజనా బల్లమీదున్న ఉప్పు అన్నములో ద్రిమ్మరించుకొని, కాసిని నీళ్ళుపోసి పిసి నోట్లో ముద్దలు కుక్కుతుంటే, అతని కళ్ళమ్మట నీరు కారసాగింది.

"ఎందుకు ఏడుస్తున్నావ్?" చిన్నారి రాము అడిగాడు.

"ఏం లేదు రామూ!" అన్నాడు.

"నాకు తెలుసు. అమ్మ సాయంత్రము అప్పచ్చి చేసింది. నీకు పెట్టలేదు కదూ?"

"ఛ! లేదే" అన్నాడు మాట మారుస్తూ. వారికి కబుర్లు చెప్పాడు ఈ మధ్య సుగుణ మరోపని చెప్పింది. వంటమనిషి వంటచేసి వెళ్ళిపో చల్లారిపోతుంది కాబట్టి ఎనిమిది దాటాక, బియ్యము స్టౌమీద పెట్టాలి. పిల్లలకి పాలు పట్టాలి. పిల్లలకు పాలు త్రాగించగానే నిద్రబోయారు. వారిని పడకల చేర్చి, అన్నము వండుతూ చదువుకున్నాడు. దంపతులు వచ్చారు. సుగుణ అనుమానంగా వంటింట్లోకి వెళ్ళింది.

"వేణు! వంకాయ వేపుడెలా వుంది?"

"ఏ వంకాయ?" అతను తెల్లబోయి చూశాడు.



"అంతలా నటిస్తావేమోయ్! చూద్దాము, ఏం చేస్తావోనని పాసిపోయిన పప్పు పెట్టాను. దాంతోనే తిన్నావా?" నీ సంగతి కనుక్కోలేనా అన్నట్టు చూసింది.

"పప్పు పారేసి, కాసింత ఉప్పు వేసుకు తిన్నానండి"

"సుగుణా!" పురుషోత్తంగారి కేక వినిపించింది. "ఛీ, నీలో ఈ అనుమాన పిశాచము యెప్పుడు వదులుతుంది? అతను వచ్చి ఇన్ని రోజులయిందే, పాపం! ఒక్కరోజైనా మారు అడిగాడా? నీ ప్రయోగం బాగానే వుంది. సంస్కారం, విశాల హృదయములేని చదువెందుకు?"

"నేనేమన్నానని అన్ని మాటలు" సుగుణ చిన్న బుచ్చుకుంది.

"నోటితో అనాలా! నీ ప్రయోగం కోసం ఆ అబ్బాయికి అంత శిక్షా? వడ్డించు అతనికి కూడా....."

"లేదండి. నేనిప్పుడే భోజనము చేశాను."

"చేస్తే చేశావు. రెండు ముద్దలు నా జతను తిను" వేణు కళ్ళలో నీళ్ళు తిరిగాయి. భాషకందని కృతజ్ఞతా భావముతో ఆయన వంక చూశాడు. సుగుణ తన పొరపాటుకు కళ్ళతోనే క్షమార్పణ చెప్పుకుంది. సంక్రాంతి సెలవులు రానే వచ్చాయి అందరిని చూడాలని ఆరాటము. ఫీజు కట్టగా రెండు రూపాయలు మాత్రము మిగిలాయి. అవి ఖర్చుచేస్తే యెలా? అతనికి ఏమీ తోచలేదు. ఏమయితే అయిందని ఊరికి వెళ్ళాడు. బస్సు దిగి యిల్లు సమీపిస్తూంటే అతని ధైర్యం సన్నగిల్ల సాగింది. నెమ్మదిగా వాకిట్లో అడుగు పెట్టాడు.

"అమ్మా! వేణు అన్నయ్య వచ్చాడే" ప్రేమ కేకవేసింది. యీ అయిదు నెలలకే ప్రేమ ఎంతో ఎదిగినట్టు కనిపించింది. పెట్టె అరుగుమీద పెట్టి ప్రేమ భుజాలు తట్టాడు.

"ఎవరే.......?" చిట్టెమ్మ గుమ్మములోకి వచ్చింది.

"నువ్వా తండ్రీ! మళ్ళీ యెందుకు వచ్చావురా? ఆనాడే చచ్చావను కున్నాము...."

"ఏం మాటలమ్మా! అందరూ యిటే చూస్తున్నారు. యింట్లోకి పద" బలవంతంగా తల్లిని త్రోసుకుని యింట్లోకి వెళ్ళాడు.

"అన్నయ్యా, పట్నము నుండి నాకేం తెచ్చావు?" ప్రేమ అడిగింది.

"ఈసారి వచ్చేటప్పుడు తెస్తానమ్మా"

"సూరి అన్న రిబ్బన్లూ, జెడకుచ్చులూ తెచ్చాడు"

"యెందుకు తేడూ? నెలనెలా డబ్బు పంపుతుంటే?" అందామను కుని మింగేశాడు. తను పోట్లాడటానికి రాలేదు.

"ఈ ప్యాంటు ఎక్కడిదిరా?"

"రాధాకృష్ణ మాష్టారిదమ్మా" అప్పుడే యింట్లోకి వచ్చి అన్న వంక చూస్తున్న మధు చెప్పాడు.

"అయ్యో! నా కడుపున యెలా పుట్టావురా? బిచ్చమెత్తుతావా?"

"మరి మీరు చేసిన నిర్వాహకానికి మరేం చేయాలి?" అతనికి విపరీతమైన కోపము, విసుగు వచ్చాయి. తను యిన్నాళ్లు ఎంతో ఆశతో వస్తే మాటలనడము, ఒక్కమాటయినా ప్రేమగా మాట్లాడకపోవటము.

"అయితే పట్నము వెళ్ళి బాగానే నేర్చుకొచ్చావన్నమాట!" సాగదీస్తూ లోపలికి నడిచింది.

"యేమిటే?" లోపలికి వచ్చిన కోటయ్య కొడుకును చూసి ముఖం చిట్లించాడు. ఆ చూపులకు వేణు గుండెల్లో బాకు దిగబడిందని చెప్పాలి.

"ఎందురా వచ్చావు? మాకున్న మానమర్యాదలు మంటకలుపు దామనా?" వేణు జవాబు చెప్పలేదు. అతనికి తెలుసు. మాట కలిపితే మర్యాద ఉండదని. కోటయ్య గొణుగుతుండగానే వీధిలో ఉన్నవారు అక్కడ చేరారు. ఏదో పనిమీద వచ్చారని కూర్చోబెట్టి తన బాధ అంతా వెళ్ళబోసుకున్నాడు కోటయ్య.

"బుద్ధిమంతుడిలా నాన్నకు చేదోడు వాదోడుగా వుండకూడ దుటయ్యా."

"ఈ కాలము పిల్లలే అంత."



"మా బంధువులబ్బాయి నీలాగే చదువుతానని వెళ్ళి కోడిగ్రుడ్ల బేరం చేస్తున్నాడయ్యా, పిచ్చిదొర" నలుగురు నాలుగు రకాలుగా అంటుంటే కోటయ్యకు తృప్తిగా వుంది.

"మా వాడు ఏనాడో ఓనాడు హోటల్లో సర్వరుగా చేరకపోతే అడగండి. వంశములో చెడబుట్టాడు."

"అంతేలే, వాడి ఖర్మకు నువ్వేం చేస్తావ్?" కోటయ్యను ఓదార్చి వెళ్ళిపోయారు అందరూ.

చీకటి పడింది. ఎవరు చెప్పకపోయినా తనంతట తానే దీపాలు తుడిచి, పశువులకు మేతవేసి, పాలు పితికి తెచ్చాడు.

"ఏం చెయ్యనక్కరలేదు. ఒక్కరోజు చేస్తే కడుపు నిండిపోయిందా యేం?" కసురుకున్నారు. అయినా లెక్క చేయలేదు. రెండవరోజు రాధాకృష్ణను కలుసుకున్నాడు. అతనెంతో ఆప్యాయంగా కష్టసుఖాలు కనుక్కున్నాడు. పదిరోజులు తండ్రికి చేయి అందిస్తూ పనులు పూర్తిచేశాడు.

"యెదిగిన కొడుకువు. ఎందుకురా; మమ్మల్ని క్షోభపెడతావు? హాయిగా నాన్నగారు చెప్పినట్టు వినరాదూ!" తిరిగి వెళ్ళడానికి ప్రయాణమయ్యే కొడుకును అడిగిందామె.

"సవ్యమయిందయితే వినేవాడిని" అన్నాడు. తల్లిదండ్రులకు చూపించాలని తెచ్చిన తన కథ పడిన పత్రిక బయటికే తీయలేదు.

"కన్నకొడుక్కు యివ్వలేదని అందరూ అంటారు. ఏదైనా డబ్బు...." నసిగింది చిట్టెమ్మ.

"కన్న కొడుకు కొడుకులా ప్రవర్తించితే ఇచ్చేవాడినే" కోటయ్య సిగరెట్టు కాలుస్తూ అన్నాడు. కడకు పది రూపాయలు తెచ్చి అతనిముందు గిరాటేశాడు. అదక్కడే వదలిపోవాలనుకున్నాడు. కాని "పేదవాని కోపము......" సామెత గుర్తుకొచ్చి అది తీసి జేబులో పెట్టుకున్నాడు, అందరికి చెప్పి బస్టాండ్ చేరాడు. ఈసారి అతనికెందుకో దుఃఖము రాలేదు. సాయంత్రానికి పురుషోత్తము గారిల్లు చేరాడు.

"మీ అమ్మగారు ఏమేమి యిచ్చి పంపిందోయ్!" నవ్వుతూ అడిగింది సుగుణ. వేణు ముఖము నల్లగా మారిపోయింది.

"నీకు అసలేం పని లేదు. అతనికి ఏమిస్తే నీకెందుకు?" కసురుకున్నాడు పురుషోత్తం. వేణు మర్నాటి నుండి కాలేజీకి బయలుదేరాడు. వస్తూ పోతూ ఉంటే దారిలో యెన్నో రకాల పండ్ల బండ్లపై నుండి అతన్ని ఆహ్వానించేవి. మిఠాయి అంగళ్ళనుండి కమ్మటి వాసనలు వచ్చి నాసికా పుటాలను ఆనందపరిచేవి. నోరూరినా నిగ్రహించుకొని తన దారిన తాను వెళ్ళేవాడు. సుగుణ మిఠాయిలు, పిండివంటలూ చేస్తూ యెన్నోసార్లు వేణు సాయము అర్థించింది. చక్కెర పిండి చేయడము, యాలక్కాయలు నలగగొట్టడము లాంటివి. వాటి వాసనలే యెరుగును. "నేను సంపాదన పరుడిని అయ్యాక హాయిగా అన్నీ తింటాను. మనసుతీరా, కరువుతీరా, అనుకునేవాడు. రాత్రి యెంత మిగిలితే అంతే. అతనికోసం ఉదయము ఎవరు వండుతారు? ఒకోసారి పిడికెడు అన్నం మాత్రం మిగిలివుండేది. ప్రొద్దు నిలుస్తుంది. యెండలు ముదురుతున్నాయి. ఒక్కొక్కరోజు మధ్యాహ్నము విపరీతముగా ఆకలి వేసేది. తనను తాను సంబాళించు కొనేవాడు. ఆరోజు ఒకే ఒక రొట్టె తిని వచ్చాడు. నీరసంగా వుంది. ఓ చెట్టుక్రింద కూర్చున్నాడు. పుస్తకం తీసి పట్టుకున్నాడు. మనసు అటు మళ్ళటం లేదు.

"వేణూ! ఒంటరిగా ఏం తోస్తుంది? అలా వెళ్దాము రా" జగన్ పిలిచాడు.

"చూడు జగన్! మీరు క్యాంటీన్‌కు వెళ్తారు. ఖర్చుచేసే సత్తా నా దగ్గర లేదు. నన్ను పిలిచి అవమానించకండి" అన్నాడు. జగన్ దెబ్బతిన్నట్టు చూశాడు. 'నువ్వింకా నన్ను నమ్మటం లేదు' అన్నట్టున్నాయి అతని చూపులు.

"అవమానించాలని నా ఉద్దేశము కాదు. నువ్వు ఒంటరిగా ఉంటూ, నీ చుట్టూ నువ్వే ఎందుకు పరిధి గీసుకుంటావు? మా అందరిలో తెలివైన వాడవు."

"కష్టపడి చదవటము తెలివి కాదు, మీలో వున్న హంగులు నాకేవి జగన్? ఇస్త్రీ నలగని ఖరీదయిన దుస్తులలో మీరు వస్తారు, వారానికోసారి



ఉతికిన దుస్తులు కూడా నాకు లేవు. పాలిష్ మాయని బూట్లు మీవి, అడుగు తేలిన ఆకు చెప్పులు నావి......"

"వేణూ! వందసార్లు చెప్పాను, నా ప్రవర్తన మనసులో పెట్టుకోరాదని. పొరపాటు క్షమించరాని నేరమా?"

"నీవు చేసింది మనసులో వుంచుకుని అనటము లేదు జగన్. వాస్తవము చెబుతున్నాను. మీతోపాటు క్యాంటీన్‌కు వస్తే అయిదు పైసలు ఖర్చుపెట్టే శక్తి లేదు. మీ ముఖాలు చూడాలా?"

"మేము ఊరికే కాఫీ త్రాగుతాము. హోటల్‌లోని ఆరోగ్యానికి మంచివి కావని, అమ్మ ఇదిగో రొట్టెలు కట్టి యిస్తుంది."

"జగన్! రా?" దూరం నుండి వొక అబ్బాయి కేకవేశాడు.

"నువ్వు వెళ్ళు" అతన్ని పంపి, వేణు దగ్గర కూర్చుని టిఫిను తీశాడు. మూడు చపాతీలు చెరిసగము పంచాడు.

"ఊఁ తీసుకో"

"నీకు సరిపోతాయా?"

"నేనేం బకాసురుడిని కాను. ఇది వద్దంటే నాపైన ఒట్టే" వేణు స్నేహపిపాసి. చిన్నప్పటి నుండి ఇంట్లో అతని కది కరువే అయింది. బయటివారు ఆ మాత్రము ప్రేమ చూపుతుంటే కాదనటం మంచిది కాదనిపించింది.

"బావుందోయి ఒట్టు. అంతకంటే మరో విషయములో ప్రమాణం చేస్తే సంతోషిస్తాను" అన్నాడు రొట్టె త్రుంచుతూ.

"చెప్పు. తప్పక చేస్తాను."

"కోపము తెచ్చుకోకూడదు."

"ఊహుఁ"

"అయితే అమ్మాయిల నేడ్పించడము మానెయ్యి...... అదిగో ముఖం ఎర్రబడుతుంది. మా మాష్టారిగారి భార్య వచ్చేటప్పుడు, నా నుండి తీసుకున్న వాగ్దానమది."

"ఛ! డల్‌గా ఉంటే లైఫ్‌లో త్రిల్ ఏముందోయ్?"

"అందుకని అలాంటి పనులు చేయాలా? దేహశుద్ధి చేస్తే త్రిల్ బాగానే వుంటుంది."

"పోనిద్దు బాబూ! ఇకనుండి చేయనుగా" అన్నాడు. మర్నాడు కూడా లంచ్ బ్రేకులో పిలిచాడు జగన్.

"చూడు జగన్ ! రోజూ నీ దగ్గర తీసుకుని, ఒక్కరోజైనా నీకు పెట్టే సత్తాలేదు."

"పెట్టేవులే మహా! అన్నింటికి లెక్కలు. అసలు నువ్వు రాకపోతే నేను తినను."

"ఇదెక్కడి వితండవాదము."

"అదంతే, రోజూ నేను పిలువగానే రావాలి. రాకపోతే చపాతీలు గిరాటేసి నీ పేరు మీదుగా ఉపవాసము చేస్తాను."

"బావుంది" నవ్వుతూ అతని దగ్గర కూర్చున్నాడు. వారము రోజులలో వేణు ముఖముపై జీవకళ వచ్చింది. వేణుకు క్రొత్త సమస్య యెదురయింది. తెల్లవారితే పరీక్షఫీజు కట్టడానికి ఆఖరిరోజు. యెవరిని అడగాలి? తను పొరపాటు చేశాడు. రాధాకృష్ణ యిచ్చేవాడే. అడగలేదు. నెమ్మదిగా పురుషోత్తముగారి దగ్గరకు వెళ్ళాడు. సుగుణ కూడా కూర్చుంది.

"సర్! నా స్కాలర్‌షిప్ అమౌంట్ రాగానే, మీ డబ్బు తిరిగి యిస్తాను. పాతిక రూపాయలు కావాలండి. ఫీజు కట్టటానికి రేపు ఆఖరిరోజు."

"మొన్న యింటికెళ్ళినప్పుడు మీ నాన్న దగ్గర తీసుకురావద్దూ" సుగుణ అడిగింది.

"అలాంటి పరిస్థితి ఉంటే తప్పక తెచ్చుకునేవాడినండీ! నేను తిరిగి యిస్తాను."

"చూడబ్బాయ్! ఏదో పెద్దమనిషి చెప్పారని కష్టమో నిష్ఠురమో, అన్నం పెడుతున్నాము. డబ్బూ అదీ మా దగ్గర రాసులు పోసిలేవు." అన్నది

వేణుకు కళ్ళనీళ్ళ పర్యంతరమైంది. నెమ్మదిగా తాను పాదులుచేసి పెంచిన మొక్కలలో వచ్చి కూర్చున్నాడు. హాస్టల్ సెక్రటరీ దగ్గరకు వెళ్ళితే?



పోనీ బదులేకదా, జగన్‌ను అడిగితే! రాత్రంతా ఆలోచనలతో నిదురలేక, మరో కథానిక వ్రాశాడు. 'పేదరికము' ఆ కథ పేరు. దాన్ని కవరులో పెట్టి నవ్వుకున్నాడు. ఒకవంక ఫీజు సమస్య వుండగా, మరోవంక కథను పోస్టు చేయడానికి డబ్బు కావద్దూ? దాన్ని పెట్టెలో దాచి నిద్రపోయాడు. ఉదయమే లేచి ప్రక్కింటిలో పాలసీసా తీసుకుంటూ డబ్బు అడుగుదామా అనిపించింది. ఆవిడ సీసా యిచ్చి వెళ్ళిపోయింది. పాలు తెచ్చాక అడుగుదామని ఊరుకున్నాడు. పాలు యిచ్చేటప్పుడు ఆమె తన సమస్య చెప్పుకుంది. "ఈ డైరీ ఫార్మ్‌వారి పద్ధతి ఏం బావుండలేదు. పైసలు ముందుగానైనా తీసుకోరు. నెల అయ్యాక తీసుకోరు. రోజూ నగదు ఎక్కడ తేవాలి? ఆయన ఊర్లోలేరు. చేతిలో ఒక్కపైసా లేదు" ఆమె సోది విని తిరిగి వచ్చాడు. వేణుకు నవ్వు వచ్చింది. "దరిద్రుడు స్నానమాడ నిర్ణయించుకుంటే వడగళ్ళవాన పడిందని" పెట్టింది తిని, నిస్పృహగా లేచి వెళ్ళాడు.

"వేణూ! ఫీజుకిచ్చిన డబ్బు ఖర్చు పెట్టేశాను. అమ్మను రెండోసారి అడిగితే తిడుతుంది. బదులిచ్చేవారు కూడా లేరు" జగన్ మాటలకు వేణు నోరు కట్టుబడిపోయింది. తన అవసరాన్ని గ్రహించి అందరూ అలా తప్పుకుంటున్నారా? ఎటూ తోచలేదు. లీజరు పీరియెడ్‌లో సత్యము దగ్గరకు పోవాలని బయటకు వచ్చేసరికి పురుషోత్తముగారు నిల్చున్నారు.

"నీ కోసమే చూస్తున్నాను వేణూ!"

"ఏమండీ! పని వుందా?"

"లేదు, ఫీజు కట్టు" జేబులో నుండి రూపాయలు తీసిచ్చాడు. "వేణూ! ఉదయం సుగుణ అన్న మాటలు మనసులో పెట్టుకోకు. ఆమెకు జీవితమంటే పూలబాటనే తెలుసు. ఒకప్పుడు మేము నీలాంటి బీద విద్యార్థులమే. శ్రీరామ్..... అదే హాస్టల్ సెక్రటరీగారు చెప్పేరనుకుంటాను. మా జీవితాలన్నీ శ్రీరాజా బహుద్దూర్ వెంకట్రామారెడ్డి గారు తీర్చిదిద్దారు. ఒకనాడు ఫీజుకు డబ్బులేక, ఆయన కారుకు అడ్డంగా నిలబడి సత్యాగ్రహం మొదలుపెట్టాను. నాల్గు తిట్టి 'ప్రస్తుతం నా దగ్గర డబ్బులేదు. ఈ వాచి తాకట్టుపెట్టి తెచ్చుకో' అని వాచి యిచ్చాడు" విప్పారిన నేత్రాలతో అతని

మాటలు విన్నాడు. అతను వస్తానని చెప్పినప్పుడు కృతజ్ఞత చెప్పటము కూడా మరిచిపోయాడు.

## 7

హాస్టలు జీవితము క్రొత్తగా ఉన్నా సర్దుకుపోతున్నాడు. కాని, అతన్ని పి.పి.సి. కోర్స్‌లో యూనివర్శిటీకి వేశారు. యెక్కడ అబిడ్స్. యెక్కడ యూనివర్శిటీ బిల్డింగ్స్! నడిచివెళ్ళి రావడమంటే మాటలా? ఫీజుకు, పుస్తకాలకు యెంతోమంది మంచితనాన్ని యెరగా పెట్టాడాయె? తనకు వేలు, వందలు అక్కరలేదు, నెలకు పదిరూపాయలు పంపమంటూ తండ్రికి ఉత్తరము వ్రాశాడు వేణు. "తన మాట విననివారికి ఒక్క కానీ పంపేదిలేదని" ఖచ్చితంగా జవాబు వ్రాశాడు తండ్రి.

"ఓహ్! పి.యు.సిలో ఫస్టుక్లాసు రాకున్నా బావుండేది. చదువు ఆపేవాడిని" అనుకున్నాడు. త్వరగా బయలు దేరాలంటే యెలా వీలవుతుంది? తొమ్మిదిలోపల వంట తయారుకాదు.

"వీరయ్యా! ఏదుంటే అదే వేసి అన్నము పెట్టు. లేటవుతుంది" వెళ్ళి నిల్చున్నాడు.

"కూరలు, చారు ఏం కాలేదయ్యా!"

"ఫరవాలేదు"

ఆవిర్లు క్రక్కుతున్న అన్నము తెచ్చిపెట్టాడు. దాన్ని కంచము నిండా పేర్చాడు. సగం చెమ్మాడు కారపుపొడి తెచ్చి దానిపై చల్లాడు వీరయ్య.

"ఈసారి యింటికి వెడితే పచ్చళ్ళు తెచ్చుకోవయ్యా" సలహా యిచ్చాడు. ఆ అన్నమలాగే తిని, కాలేజీకి బయలుదేరాడు. రోడ్డుమీద నడవాలంటే మరో భయం. తెలిసినవారెవరైనా కనిపించి నిలేస్తారు. కాచిగూడా వరకు వచ్చి, అటునుండి రైలుపట్టాల వెంబడి పరుగెత్తేవాడు. ఆ రోజు అలాగే పరుగెత్తుతున్నాడు. వర్షాలు పడటము మూలంగా బాగా గడ్డి పెరిగింది. గడ్డిలో నుండి కోడెనాగు బుస్సుమని లేచింది. పట్టాల మీదికి తప్పుకోబోయాడు. యెదురుగుండా సికింద్రాబాద్ నుండి వచ్చే రైలు పొగలు క్రక్కుతూ వస్తుంది.



అదరిపాటున అడుగు వెనక్కి వేశాడు. జర్రున జారి క్రిందపడిపోయాడు. గడ్డి వుండటము మూలాన దెబ్బలు పెద్దగా తగలలేదు. కాని ఉన్న ఒక్క గట్టి షర్టు చిరిగిపోయింది. లేచి బట్టలు దులుపుకున్నాడు. నెమ్మదిగా నడచి వెళ్ళాడు. ఫ్రీ ఇంజనీరింగ్ స్టూడెంట్స్ అంతా స్టయిలుగా, నీటుగా తిరుగుతుంటే సిగ్గుగా, భీతిగా ప్రాక్టికల్ క్లాసులో ప్రవేశించాడు. సాయంత్రము అందరూ వెళ్ళిపోయాక నెమ్మదిగా బయలుదేరాడు. "ఏమిటయ్యా, ఇంతాలస్యము?" వార్డెన్ అడిగితే క్లుప్తంగా తన విషయము చెప్పాడు. అతను ముసిముసిగా నవ్వుకోవటము చూశాడు. రాత్రి పెట్టె అడుగున వున్న సూది, దారం తీశాడు. కుడుతుంటే పాతదయి చీకిపోయిన గుడ్డ సూదివెంబడే రావటం మొదలుపెట్టింది. నిస్పృహగా అన్నీ క్రింద పెట్టేడు. రెండవరోజు బయటికి ఎలా వెళ్ళాలి? రాత్రంతా నిద్రలేక, పొర్లాడుతూ దొర్లాడు. ఉదయం లేస్తూనే బయటికి రాగానే, కాఫీకని కాబోలు ఇద్దరు విద్యార్థులు బయటికి వెళ్తున్నారు. ఒకతను బాగా మాసిన షర్టు వేసుకున్నాడు.

"ఒరేయ్! దానిపై స్వెట్టరు తగలేసుకురా! యెంత మైల అయినా కప్పిపోతుంది" అతను సలహా యిచ్చాడు. అతని సలహా వేణులో హుషారు రేకెత్తించింది. పెద్ద పదవి దొరికినంత సంబరపడ్డాడు. చెప్పినతని స్నేహితుడు పాటించాడో లేదోగాని, వేణు మాత్రం, మూడు సంవత్సరాల క్రితం కొన్న స్వెట్టరు దుమ్ము దులిపి, చిరుగులు పట్టిన షర్టుపైన వేసుకున్నాడు. కొన్నాళ్ళ వరకు సమస్య తీరింది అనుకున్నాడు.

ఆ రోజు బయట బాగా యెండ కొడుతుంది. ఉక్కగా వుంది. వర్షం వచ్చే సూచనలున్నాయి. కెమిస్ట్రీ లాబ్‌లో అందరూ తమ తమ పనులు చేసుకుంటున్నారు.

"ఒరేయ్! మన పాత గోడ ఎంత వర్షంలో తడిసినా, వణికేవాడు కాదు. ఈరోజు ఇంత ఉక్కగా ఉంటే, స్వెట్టరు వేసుకున్నాడేమిటిరా?"

"అమ్మాయిలు ఫ్యాషన్లు మార్చినట్టు, అతనూ మారుస్తున్నాడేమోరా? జనవరిలో ఎముకలు కొరికే చలిలో స్లీవ్‌లెస్ బ్లవుజ్ వేసుకుని సుతారంగా తిరుగుతారు. ఫిబ్రవరి టెంత్‌న వెళ్ళి వస్తు ప్రదర్శనశాలలో చౌకగా దొరుకు

తున్నాయని కాశ్మీర్ కోట్లు, కేప్‌లు కొని అవి చూపించడానికి ఎండ దంచుతున్నా వేసుకు రారూ?" అదేదో పెద్ద విట్టయినట్టు అతను నవ్వాడు. అతన్ని అనుసరించకపోతే బావుండదని మిగిలినవారూ నవ్వారు. తనను గూర్చేనని తెలుసు కున్నాడు వేణు. అన్నింటిని విని ఊర్కుండటము తప్ప అతనేం చేయలేడు.

సాయంత్రం హాస్టలు చేరి అక్కడ వరండాలో స్థంభాన్ని ఆనుకుని నిల్చుని అలసట తీర్చుకుంటుండగా పురుషోత్తం వచ్చాడు.

"నమస్కారమండి!"

"రాము, అమ్మగారు బావున్నారా?"

"అంతా బావున్నారోయ్! నువ్వు పెద్దవాడివయ్యావోయ్" అన్నారు.

"ఎందుకండీ? అసలేం చేశాను నేను?" అదిరిపడి చూశాడు.

"పైగా ప్రశ్నలు. నీ కథ పత్రికలో పడిందని చెబితే మేమూ సంతోషించే వారముగా?"

"అదా? ఇప్పుడెలా తెలిసింది?"

"పేదరికము" అనే కథ పడింది. పోస్టుమాన్ కాంప్లిమెంటరీ కాపీ డబ్బూ తెచ్చాడు. రేపు వెళ్ళి తెచ్చుకో. నాకివ్వనన్నాడు."

"థాంక్స్, అంత దూరం నుండి వచ్చారా?"

"చాల్లే నేర్చావు. పద, కాఫీ త్రాగుదువుగాని" వేణు గుండెలో రాయిపడింది. తన పెట్టెలో గాలిస్తే మహా అయితే పదిపైసలు దొరుకుతాయేమో!

"అలా తెల్ల మొహం వేస్తావేమోయ్! నిజంగా ఇంత చిన్న వయసులో అంత నిశితంగా ప్రపంచాన్ని అర్థము చేసుకుని రాయటము గొప్ప విషయమోయి. నాకు చాలా సంతోషంగా వుంది. నేను తీసుకువెళ్తాను పద."

"ఇప్పటికే మీకు చాలా రుణపడి వున్నాను."

"అంతంత పెద్దమాటలు వద్దు" అతని వెనకాల నడిచాడు. పెద్ద రెస్టారెంట్‌లో అడుగుపెట్టాడు. వేణు కుంచించుకుపోయాడు. అక్కడి సర్వర్లు కూడా తనలాంటి బట్ట వేసుకోలేదు. యెదురుగా కనిపించిన నిలువుటద్దము ముందు తలెత్తి తన ప్రతిబింబం చూసుకోవడానికి కూడా సాహసించలేదు. మౌనంగా అతనిప్పించిన ఐస్‌క్రీమ్, కట్‌లెట్ తిని బయటికి వచ్చాడు. మరోసారి అభినందించి బస్సులో వెళ్ళిపోయాడు పురుషోత్తం.



మర్నాడు వెళ్ళి పదిహేను రూపాయలు తెచ్చుకున్నాడు. శనివారము సాయంత్రము డబ్బు తీసుకుని సత్యం, రఘు, శాయి దగ్గరకు వెళ్ళాడు.

"నేను ఓ ఫ్యాంటు, షర్టు కుట్టించుకోవాలిరా"

"ఓయ్ చెప్పవూ! మీ నాన్న డబ్బు పంపాడేమిట్రా?"

"లేదు"

"మరి డబ్బెక్కడిది?" సత్యం అడిగాడు.

"నీ వెర్రిగాని వాడికి డబ్బుకేం కరువురా? మనమంతా వెర్రివెంగళప్పలము. ఇంటి నుండి తెచ్చుకుని చదువుతున్నాం, వాడు కానీ ఖర్చులేకుండా, బిచ్చమెత్తో, ఏదో చేసి చదువుతున్నాడు."

"శాయీ!" బాధగా అరిచాడు వేణు.

"అబద్ధమేముందిరా! పోనీ ఈ డబ్బు ఎక్కడిదో చెప్పు?" తామింత ఖర్చుపెట్టి, ఇంత చదివినా ఫస్టుక్లాసు రాలేదు. వేణుకు రావటం శాయికి మంటగా వుంది.

"చెప్పవేంరా! పి.యు.సి అంతా రాధాకృష్ణగారి వద్ద భిక్షమెత్తిన ఫ్యాంట్లతో గడిపావు."

"ఛీ! స్నేహితులు, ఊరివారనుకుని రావటం నాదే బుద్ధి తక్కువరా" వెనక్కు తిరిగాడు వేణు.

"నా వంక అలా చూస్తావేంరా? భిక్షమెత్తింది కాకపోతే యెలా వచ్చిందో చెప్పడు చూడరా."

"శాయీ!" తిరిగి వచ్చాడు వేణు. "బీదరికం కూడా ఒక జబ్బులాంటిదిరా. ఎంత వున్నవాడికైనా ఒకసారి బీదరికము రుచి చూడాలి. నీవనుకున్నట్టు భిక్షమెత్తలేదు. నా స్వంత కష్టార్జితము తెలిసిందా." వెనక్కు తిరిగాడు.

"ఛ! వాడేదో వస్తే, మధ్య నీ గొడవేమిట్రా శాయీ! ఉండరా వేణూ నేనూ వస్తాను" త్వరగా బూట్లేసుకుని వచ్చాడు సత్యం. వేణు కళ్ళు తుడుచుకోవటము చూశాడు.

"ఊరుకో వేణూ! వాడిదంతా చాదస్తం. ఒకచోట ఉంటాము. మమ్మల్నే ఎన్నోసార్లు అవమానిస్తాడు" ఓదార్చేడు. ఇరువురూ నడిచి పత్తర్‌గట్టి వైపు వెళ్ళారు.

"సత్యం, పది రూపాయలలో బట్టలు రావాలిరా. అంతకంటె యెక్కువ లేవు" మొదటే చెప్పాడు. స్నేహితుడు ఖరీదయినవి బేరము చేసి అవమానము పాలుకావటము ఇష్టం లేదు. ఒక చిన్న కొట్టులోకి వెళ్ళి మామూలు ప్యాంటు గుడ్డ అడిగితే మూడు రూపాయలు అన్నాడతను.

"మూడు రూపాయలా? చాలా ఖరీదు. రూపాయి యాభైపైసలు చాలు."

"సత్యం, చవక రకముంటే చూపించమనరా. మూడుది అంత చవకగా యిస్తాడేమిటీ?"

"ఉష్! నువ్వుండు. పత్తర్‌గట్టిలో సగానికి సగము తగ్గించి అడగాలి" బేరము రూపాయి డెబ్బయి అయిదు పైసలకు మీటరు చొప్పున కుదిరింది. అలాగే ఓ షర్టుగుడ్డ తీసుకుని వచ్చాడు. అవి రెండూ సత్యానికి తెలిసిన దర్జీవాడికి యిచ్చి వచ్చారు. మూడు రోజుల తరువాత కూలి యిచ్చి బట్టలు తెచ్చుకున్నాడు. వాటిని చూసుకుంటే ఎంతో గర్వం కలిగాయి. నా స్వార్జితము అనుకున్నాడు.

రెండవరోజు క్లాసులో కూర్చున్నాడు. లెక్చరరు రాలేదు. తోటి విద్యార్థులంతా కబుర్లు చెప్పుకుంటున్నారు.

"ఓయ్! మన పాతగోడకు సున్నం పడిందిరా" ఉన్నట్టుండి ఓ అబ్బాయి అన్నాడు.

"నిజమేరోయ్ అందుకే ఆకాశాన మబ్బులు పట్టేయి" మరొకడన్నాడు. తనను గూర్చేనని తెలుసుకున్నాడు వేణు. సుష్టుగా భోజనము చేసి, నీటుగా ముస్తాబై, కాలేజీకి వచ్చేవారికి, కష్టజీవుల బ్రతుకెలా అర్థము అవుతుంది?



నిట్టూర్చాడు. అతని బాధల్లా ఒక్కటే. చదువుకోడానికి అసలు సమయము దొరకటము లేదు. యూనివర్శిటీ నుండి వచ్చేసరికి అలసి పోతున్నాడు. యెక్కడలేని నిరాశా, నిస్పృహలు అలముకొన్నాయి.

"ఫస్ట్ టర్మ్ సెలవులిచ్చారు. ఈ సెలవులలో బాగా చదువుకోవాలని. ఆ రోజంతా డ్రాయింగ్ షీట్స్ తయారుచేస్తూ కూర్చున్నాడు. మేడ గదిలో వుండే ఎం.ఏ స్టూడెంట్ వచ్చాడు. వేణు కంగారుగా లేచాడు.

"అంత తొందర దేనికోయ్? బయట నీకోసమెవరో వచ్చారు?" వేణు ఆశ్చర్యంగా చూశాడు. తనకోసమొచ్చే వారెవరు? ఊరు వెడుతూ చెప్పిపోదామని స్నేహితులయితే రాలేదు కదా? తొందరగా లేచి బయటికి వచ్చాడు. అక్క భర్త సుదర్శన్ నిలబడి వున్నాడు.

"నమస్కారం బావగారు! ఏమిటిలా దయచేశారు?" నవ్వుతూ ఎదురు వెళ్ళాడు.

"అందరినీ నువ్వు మరిచిపోయినా, మేము ఎలా మరిచిపోతామోయ్?"

ఇంటికి వచ్చినా, తన్ను నిర్లక్ష్యం చేసి, పెద్ద ఫోజులుకొట్టే బావ ఈ రోజు నిష్ఠూరము వేస్తుంటే గమ్మత్తుగా అనిపించింది, తన్ను చూడటానికి వచ్చిన వ్యక్తిని పట్టుకుని అవన్నీ అడిగితే లాభములేదని ఊరుకున్నాడు.

"రండి, గదిలో కూర్చుందాము" యిరువురూ వచ్చి గదిలో కూర్చున్నారు.

"లలిత ఇంటికి వెళ్ళివచ్చింది. మీ నాన్నగారు చాలా బాధ పడ్డారట. సూరి సెలవుల్లో పాండిచ్చేరి, కొడైకెనాల్ చూడ్డానికి వెళ్ళాడట!"

"తెల్సిందండీ, వేసవిలో నాన్నకు సాయము చేద్దామని ఊరు వెళ్లాను. విసుక్కోవడము, తన కళ్ళముందునుండి వెళ్ళిపొమ్మనటము. రోజూ ఒకటే తిట్లు."

"పిచ్చి మనిషిలే. నువ్వేం బాధపడకు. ఈ సెలవులలో వెళ్తున్నావా?"

"లేదండి. వెళ్ళి ఏం చేయాలి? అనవసరంగా వాళ్ళు మాటలనడము, నేను బాధపడటము."

"అదేమిటోయ్ ఇక్కడే వుంటే విసుగ్గా ఉండదూ?"

"అయినా తప్పదు కదా."

"పరాయివారమా? మనింటికి వెళ్దాము పద."

"ఎందుకండి. ఇక్కడే ఉండి చదువుకుంటాను."

"చూడు మొండితనము చేయకు. నిన్ను గూర్చి లలితకూడా చాల బాధపడుతోంది. వెళ్దాము రా" వేణుకు తెలుసు, బావగారి మాటల్లో నేతి బీరకాయలో నెయ్యి ఉన్నంత సత్యమని. కాని తను అనలేడు కదా!"

"పద, ఆలోచనదేనికి?" లేవదీశాడు. కొద్దిపాటి సామానులు తీసుకు బావగారి వూరికి ప్రయాణమయ్యాడు.

"ఏంరా వేణూ! అందరినీ మరిచిపోయావా?" నవ్వుతూ యెదురు వచ్చింది లలిత.

"మీ తమ్ముడు మరిచిపోవటమే కాదు, మొనగాడు అయ్యాడు ఎంత రమ్మన్నా వస్తేనా? బలవంతంగా తీసుకువచ్చాను."

"తనే పొరపడ్డాడు. చిన్నతనములో తెలియక నిర్లక్ష్యము చేసిన యెంత ఆప్యాయంగా చూస్తున్నారు" అనుకున్నాడు. అక్క పిల్లలకు ఏ తేనందుకు నొచ్చుకున్నాడు.

సాయంత్రము బావగారి వెంట వూర్లోకి వెళ్ళాడు. అతను కొత్త పిండిమిల్లు, వడ్లు ఆడించే మిల్లు పెట్టాడు. మరికొంతదూరము వెళ్ళాక కొ బంగళాకు పునాది వేసి వుంచారు.

"రేపటి నుండి పని ప్రారంభమవుతుందోయ్. రేపు సున్నపు మిష వస్తుంది. పరుగులుతీస్తే పని సాగవద్దూ?"

"నిజమేనండి" అని తిరిగివచ్చారు. రెండవరోజు తిరిగి అక్కడి వెళ్ళారు. సున్నపు మిషన్ వద్ద ఒక మనిషి రెక్కలు దాచుకోనివారయి ఉండాలి. పని సాగుతుంది. సుదర్శన్ అలాంటి మనిషి దొరక్క అవ పడుతుంటే ఆ ఛార్జీ తను తీసుకున్నాడు, వేణు ఉదయము లేస్తూ కాలకృత్యాలు తీర్చుకొని, లలిత పెట్టిన ఫలహారము, కాఫీ తీసుకుని వెళ్ళేవా సున్నపుమరలో సున్నము, ఇసుక, నీళ్ళు పోయిస్తూ, నలిగిన సున్నమో ప్రక్క నెడుతూ, పనివాళ్ళచేత పని చేయిస్తుంటే అసలు సమయమే తెలిసేది కా



ఒంటిగంటకు ఇంటికి వచ్చి అన్నము తిని, అరగంట విశ్రాంతి తరువాత తిరిగి పని, సెలవులన్నీ అక్కడే పనులతో గడిచిపోయాయి. నాల్గు రోజులకు కాలేజీలు తీస్తారనగా ప్రయాణం అయ్యాడు. అతనికి భయంగా వుంది. ఒక్కరోజైనా పుస్తకాలు ముట్టుకోలేదు. ఆ పూట లలిత మరదులు కూడా వచ్చారని వడలు - లడ్డూలు చేసింది. అందరికీ పెట్టింది. ఫలహారాలు కానిచ్చి, తన వస్తువులన్నీ సర్దుకున్నాడు. అక్క కోసము కాబోలు పెరటి గుమ్మము దగ్గరే ఆగిపోయాడు.

"అబ్బ... ఆ హాస్టల్ యెలా భరిస్తుందో ఈ మనిషిని..." ఒకతను పక్కున నవ్వాడు.

"నిజమే అన్నయ్యా! నేను తినడము ఆపి లెక్కబెట్టాను. తొమ్మిది వడలు తిన్నాడు."

"వూరుకోండిరా. రోజూ అర్ధశేరు బియ్యపు అన్నము యిట్టే యెగరేసేవాడు. పైగా మీ వదిన దిలాసా, తన తమ్ముడి శ్రమవల్లే పని అయిందని".

"పనికి రెండింతలు తిన్నాడని చెప్పలేకపోయావు" వేణు కాస్త తొంగి చూశాడు. లలిత మరదులు, అత్తగారు మాట్లాడుకుంటున్నారు. అంతవరకు తిన్న ఫలహారము కక్కేద్దామా అనిపించింది. నిజంగా తాను తొమ్మిది తిన్నాడా? అతను జీవితములో మరో పాఠము నేర్చుకున్నాడు. యెవరి దగ్గరకు పోయినా, నాజూకులు పోతూ తినాలని, తిండిని లెక్కించే చదువు.... ఏం చేసుకోను? అయినా వారందరికి రక్షా, దక్షత కలదు. యెన్ని అయినా మాట్లాడుతారు.

"అప్పుడప్పుడు వస్తుండరా ఇంటికి. రూఫ్ వేసేటప్పుడు యెలాగూ మీ బావ వచ్చి పిలుస్తారనుకో!"

"అలాగే" అన్నాడు. అందరికి నమస్కరించి బస్టాండ్ వైపు నడిచాడు. వెనకాలే బావ వచ్చాడు. టిక్కెట్టు కొనిపెట్టి, పదిరూపాయలు చేతిలో పెట్టాడు.

"యెందుకు బావా! ఉండనియ్యండి."

"ఫరవాలేదోయ్ ఉంచు. నాకు యెవరన్నా పనిచేస్తే వెంటనే ఇవ్వటం నాకు అలవాటు. నువ్వు అన్యధా భావించకు. నీవు చేయవల్సినవాడవు. మేము

చేయించుకోవలసినవారము. కాని విద్యార్థివి, యెన్నో అవసరాలుంటాయని తెలుసు" అన్నాడు దానకర్ణుడిలా. వేణుకు నవ్వు వచ్చింది. తను పార్ట్‌టైమ్ జాబ్‌లో పది రూపాయలు అర్జించేడన్నమాట. అసహాయత మనుష్యుల్ని మరలుగా చేస్తుందా? ఆవేదనా పూర్వకమైన నిట్టూర్పు వదిలి సర్దుకుని కూర్చున్నాడు.

* * *

మామూలుగా వెళ్తున్నాడు, వస్తున్నాడు. పుస్తకము ముట్టుకోవడమే పడటము లేదు. ఆ రోజు త్వరగా వచ్చి ముఖము కడుక్కుని, పుస్తకము తీశాడు.

"వేణుబాబూ! దొర పిలుస్తున్నాడు" గేటు కీపరువచ్చి చెప్పాడు. వారంతా శ్రీరామ్‌ని దొర అనే పిలుస్తారు, లేచి వెళ్ళాడు.

"రా వేణూ, కూర్చో" వేణు అతని కెదురు కుర్చీలో కూర్చున్నాడు.

"హాస్టల్ గేటు దగ్గర డాక్టరు తెలుసుగా! ఆయన చేతిక్రింద పని చేసే అబ్బాయికి సుస్తీ చేసిందట. ఒక నెలరోజులపాటు సహాయము చేస్తావేమోనని....వూరికే కాదు, డబ్బిస్తారు. నీ ఫీజుకు యిబ్బంది ఉండదు" ఆయాచితంగా లభించిన సహాయాన్ని యెలా వదులుకుంటాడు? అంగీకరించాడు.

"రెండే గంటలు, యేడు నుండి తొమ్మిది వరకు"

"మంచిదండి" అని బయటలకు వచ్చాడు. రెండవరోజు నుండి పనిలో చేరేడు. ఒకోరోజు వచ్చే పేషెంట్లను బట్టి పని రాత్రి పదకొండు వరకూ ఉండేది. పని చేసుకుని వచ్చి బలవంతముగా పుస్తకము ముట్టుకుంటే తెల్లవారి నడవడానికి కాళ్లు తేలిపోయేవి. "భగవాన్! ఈ ప్రపంచమంతా నీ సృష్టే. సౌకర్యాలు అందరికీ సమానంగా యెందుకు కల్పించవు" అని ఆక్రోశించేవాడు. కొందరి దగ్గర తప్ప అందరివద్దా హీటర్లు, చిన్న చిన్న పాత్రలు ఉండేవి. బలహీనమంటూ గ్రుడ్డు, పాలు త్రాగేవారు. హాస్టల్లో అన్నము సరిగ్గా పెట్టటము లేదని గొడవ చేసేవారు. పప్పులో పోపు వేగలేదని, పులుసులో ముక్కలు వుడకలేదని, కూరలో నూనె లేదని, అన్నము పాత బియ్యపుదని ఇలాంటి కంప్లయింట్సు చాలా వుండేవి. డబ్బిస్తున్నారు కాబట్టి వారికి వొంకలు



కనిపిస్తాయి అనుకున్నాడు. పుస్తకము తీసి కూర్చున్నాడు. రూమ్‌మేటు ఆవులిస్తూ లేచాడు.

"ఏమిటి వేణూ! అర్ధరాత్రి లైటు వేసుకుంటే మాకు నిద్ర పట్టాలా వద్దా?"

"నాకు ఇప్పుడే టైమ్ దొరుకుతుందండి."

"అదంతా నాకు తెలియదు. పది దాటాక గదిలో లైటువేస్తే ఒప్పుకోను" నిట్టూర్చి లైటు ఆర్పాడు. యేం చేయాలో తెలియలేదు. బయటికి వచ్చి గేటు దగ్గర లైటుచూసి అతనికి ప్రాణం లేచివచ్చింది. రోజూ అక్కడ కూర్చొని అరగంట, గంట చదువుకునేవాడు. రోజులా చదువుతుంటే, ప్రక్కన దభీమని శబ్దం అయింది. అతని ప్రాణాలు యెగిరిపోయాయి. భయంగా ప్రక్కకు చూశాడు. గేటు దూకి వస్తున్నాడో అబ్బాయి. అతని వెనకాలే మరో నల్గురు దూకారు. వారంతా సెకండ్‌షో చూసి వస్తున్నారని తెలిసింది. మరో అయిదునిమిషాలలో వారంతా తమ గదులలోకి మాయమయ్యారు. వేదాంతిలా నవ్వుకున్నాడు. మనిషికో సమస్య. తనకు జీవితమెలా సాగించాలా అని, మిగిలిన వారికి వార్డెను కన్ను ఎలా కప్పాలా అని.

ఒకరోజు అలాగే చదువుతుంటే కళ్ళుమూతలు పడ్డాయి. కాసేపటికి ఎవరో అరుస్తుంటే కళ్ళు విప్పాడు.

"చాలించవయ్యా నీ యేశాలు" గేటుకీపరు అరుస్తున్నాడు.

"ఏమిటి?" అయోమయంగా చూశాడు.

"ఎంత నంగనాచి తుంగబుర్రలా మాట్లాడుతున్నావు! రేపు దొరతో చెప్పకుంటే అడుగు. రాత్రిళ్ళు షికారుకెళ్ళి, దొంగచాటుగా గోడదూకి, నేను చూస్తున్నానని కూర్చుని కళ్ళు మూసుకుంటావా? నేను కనిపెడుతున్నాను."

"నేనా, గోడ దూకేనా?"

"నువ్వో, నేనో, రేపు దొరదగ్గిర తేలుతుంది" వాడికి నచ్చజెప్పినా లాభములేదని ఊరుకున్నాడు.

రెండవ రోజు శ్రీరామ్ చాలా గంభీరంగా కనిపించాడు. వేణుకు తెలుసు అతనలా ఉంటాడని.

"నమస్కారమండీ!"

"ఊ...వేణు! నీ నుండి ఇలాంటి ప్రవర్తన ఆశించలేదు."

"నేను చెప్పేది వినండి....."

"అక్కరలేదు, మరోసారి ఇలా జరుగకూడదు."

"ఎప్పుడూ జరగదు. నామాట వినండి. నాకేం తెలియదు. నే అర్ధరాత్రి వరకు బయట ఎందుకు తిరుగుతాను? నా రూమ్‌మేట్స్ లై వేసుకోవద్దంటే, గేటు దగ్గర లైటుందికదా అని అక్కడ కూర్చుని చదువుకుం నండి. నాకు మొన్ననే తెలిసింది కొందరు విద్యార్థులు గేటు దూకి వస్తారని..."

"వెంటనే ఎందుకు చెప్పలేదు!"

"నేను ఫ్రీ బోర్డరుని, నామాట ఎవరు వింటారు? నేను చెప్పా తెలిస్తే వారంతా నాపై పగ బూనుతారు. అలాగే రాత్రి ఎవరో దూ తప్పించుకుని ఉంటారు. అప్పుడే నా కళ్ళు మూతపడినాయి. అతను అపా చేసుకున్నాడు, నన్ను నమ్మండి సార్!"

అతని స్వచ్ఛమైన కళ్ళు బొంకలేవని తెలుసుకున్నాడు.

"మంచిది వెళ్ళు"

అమ్మయ్య! అనుకుని బయటపడ్డాడు. అతని మనసు స్థిమితం లేదు. చెయ్యాల్సిన పని బోలెడుంది. డ్రాయింగ్స్, రికార్డ్సు.... దిక్కు తోచలే ఆ సంవత్సరం పరీక్ష పోతుందేమోనని భయము కల్గింది. తన ప్రయత్నం లోపముండరాదని వీలు చేసుకుని చదువుతున్నాడు.

## 8

తండ్రి ముభావంగా వున్నా, తల్లి సాధిస్తున్నా తెంచుకోలేని బంధ కాబట్టి ఇంట్లో పనులు, పొలములో పనులు చేస్తున్నాడు. అతనికి పరీ ప్యాసవుతాననే ధైర్యము లేదు. సూరి డాక్టరీఫోజులు యెక్కువయ్యాయి. బయ గదిలో ప్రత్యేకముగా మంచము, బల్లా, కుర్చీ అమర్చుకున్నాడు. అక్కడ ప్రేఘు అన్నీ మొయ్యాలి. అందరిపైనా అధికారము చెలాయిస్తాడు. ఆ రో



అందరూ భోజనాలు చేస్తున్నారు. సూరి మొదటే చేసి అలా బయటికి వెళ్ళి పేపరు తెచ్చాడు.

"ఒరేయ్ వేణూ! నీ నెంబరెంతరా?"

చెప్పాడు వేణు. వెంటనే అతను పేపరు చూడసాగేడు.

"పి.యు.సి.రిజల్ట్స్ వచ్చాయా అన్నయ్యా?"

"వచ్చాయి. నీ నంబరు మాత్రం కనిపించటము లేదు"

"ఏదీ?" పేపరు అందుకుని ఎంగిలి చేత్తోనే విప్పాడు. అతని అనుమానము నిజమైంది. నంబరెక్కడా లేదు. అతని కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. పేపరు క్రింద పడవేసి, చేయి కడుక్కున్నాడు.

"ఏమిట్రా సూరీ?" కోటయ్య అడిగాడు.

"వేణు పరీక్ష తప్పాడు నాన్నగారూ."

"నాకు మొదటే తెలుసు. వాడు ఏదో కష్టపడ్డా ప్యాసవడని. అందుకే చదివించవద్దనుకున్నాను. సరే, నా మాట నిర్లక్ష్యం చేశాడు. వానికే తెల్సివచ్చిందిగా."

"ఈ సంవత్సరం డబ్బు పంపితే పాసయ్యేవాడేమో" నెమ్మదిగా అన్నది తల్లి. అనేమీ వినకుండా బయటకు వెళ్ళాడు వేణు.

"నా పరీక్ష పోయింది మాష్టారూ!" ఏడ్చినట్టే రాధాకృష్ణతో చెప్పుకున్నాడు.

"ఛ! అంత అధైర్యం ఎందుకోయ్. మహామహా వాళ్ళకే అపజయము తప్పలేదు. ఈసారి చక్కగా చదువుదువులే"

"చదవాలని లేదు మాష్టారూ! ఇంటి దగ్గరే వుండిపోతాను."

"పిచ్చిగా మాట్లాడకు. సాహసము చెయ్యి వేణూ" అతను ధైర్యం చెప్పాడు. ఇంటికి వచ్చాడు. మామూలుగా తిరగసాగాడు. లాబొరేటరీ కోసము రెండు కాటన్ ప్యాంట్స్ కావాలని సూరి అడిగితే, యే కళనున్నాడో, సూరితో పాటు అతనికీ కుట్టించాడు తండ్రి. వేణుకు తీసుకోబుద్ధి కాలేదు. అభిమానపడితే లాభము లేదు. బట్టలు, తల్లిని అడిగి నాల్గు శేర్లు బియ్యము, తీసుకుని బయలుదేరాడు. పరీక్షపోయినా చదవాలనే కొడుక్కు ఒక్కపైసా ఇవ్వనని శపథము చేశాడు కోటయ్య. రెండు రూపాయలున్నాయి. వాటిని ఖర్చుచేస్తే, రేపు ఎన్ని ఖర్చులుంటాయి? తిరిగి జీవిత పోరాటములోకి

ఒంటరిగా ప్రవేశించాడు. యెక్కడి నల్గొండ? యెక్కడి హైద్రాబాద్. చేతి
ట్రంకుపెట్టె పట్టుకుని నడక ప్రారంభించాడు. అరవై మైళ్ళు! నడుస్తున్నా
దీక్ష, పట్టుదల అతన్ని ముందంజ వేయిస్తున్నాయి. దారిలో వొక లారీ అ
ఉంటే వారిని బ్రతిమాలాడు. రూపాయి యిస్తే ఎక్కనిస్తానన్నాడు. ఇం
దూరం నడిచి రూపాయి ఎందుకివ్వాలి, కాసేపు చెట్టుక్రింద అలసట తీర్చుకు
తిరిగి లేచాడు. చీకటి పడేసరికి ఓ ఊరు చేరుకున్నాడు. ఊరవతి
దేవాలయములా కనిపిస్తే వెళ్ళి బావిలో నుండి నీళ్ళు చేదుకుని కడుపునిం
త్రాగి తేన్చేడు. ట్రంకు తలక్రింద పెట్టుకుని నడుము వాల్చాడు. ఎదురు
పశువులను కాసే పిల్లలు పచ్చి సీతాఫలంకాయలు తెచ్చి, మంటవేసి, కా
తింటున్నారు. కాసేపటికి ఓ కుర్రవాడు రెండుకాయలు తెచ్చి వేణు
ముందుంచాడు.

"తింటావా? చాలా బావుంటాయి" చిరునవ్వుతోనే ధన్యవాదాలర్పిం
యెంతో ప్రీతిగా తిన్నాడు. ఆకలి చల్లారినా, చెయ్యి లాగడము మొదలుపెట్టింది
ఉన్నవి కొద్దిపాటి బట్టలే అయినా, బియ్యమున్నాయి. నిద్రపోతే ఆ బియ్య
ఎవరయినా కొట్టేస్తారేమోనని భయము వేసింది. కలతనిదురతో గడిపాడు
ఎక్కడో కోడికూసిన చప్పుడయితే లేచి, నడక ప్రారంభించేడు. మిట్టమధ్యాహ్నా
కల్లా మరో ఊరు చేరుకున్నాడు. బస్సుస్టేజి ఉంది కాబోలు అలుకు నీళ్ళవం
టీ, చవకరకము బిస్కెట్లు, బొప్పాయి పండ్లు, అరటి పండ్లూ అమ్ముతున్నారు
దూరాన వొక గుడిసె కనిపించింది. అక్కడ కాసిని నీళ్లు అడిగి ముఖము
కడుక్కొని, పదిపైసలు పెట్టి టీ నీళ్ళు, పది పైసల బొప్పాయి కాయి కొ
కడుపు నింపుకొని, పది నిమిషాలు విశ్రాంతి తీసుకొని బయలుదేరాడు
సాయంత్రానికి సిటీ చేరుకున్నాడు. అప్పుడు యెక్కడ వుండాలన్న ప్ర
ఎదురయ్యింది. హాస్టల్లో తనకు స్థానము లేదు. పోయిన యేడు ఉన్న
స్నేహితులు తలొకచోట అయ్యారు. జగన్ గుల్బర్గా కాలేజీకి వెళ్ళిపోయాడు
అతనికి కనిపించిన ఆశల్లా ఒక్కటే - పురుషోత్తంగారు. చెమట ఒత్తుకొ
ఆయన యింటికి వెళ్ళాడు. ప్రక్కన వదిలిన గదులు పూర్తిచేశారులా వుంది



అద్దెకుండేవారు, పిల్లలు, సందడిగా వుంది. సుగుణ యింట్లోనే వుంది. వేణు నమస్కరించాడు. ముఖమంతా చిట్లించుకుంది.

"ఊరి నుండి సరాసరి యిక్కడివే వస్తున్నావా?"

"అవునండి."

"ఏం కొంపో నాయనా! వద్దో అంటే సిటీలో తెచ్చి పెట్టేరు. అడ్డమైన వారికి ధర్మసత్రమైపోయింది."

"నేను వుండామని రాలేదండి. మిమ్మల్ని చూద్దామని వచ్చాను."

"మాకేం నాయనా! నిక్షేపంగా వున్నాము" విసురుగా అన్నది. అక్కడ ఒక్క నిముషము ఉండబుద్ధి కాలేదు. వెనుదిరిగాడు. గేటుదాటి ఇవతలకు వస్తుంటే ప్రక్కింటామె చూసింది.

"ఎవరదీ? వేణుబాబూ!..... ఇంత దూరమువచ్చి పలుకరించకుండా వెళ్ళిపోతున్నావేం?"

"లేదండీ! మీ దగ్గరకే వస్తున్నాను" అన్నాడు. అవసరానికి అబద్ధాలు కూడా ఆడుతున్నాడు. వరండాలో పెట్టె పెట్టి హుస్సురంటూ కూర్చున్నాడు.

"ఎక్కడి నుండి వస్తున్నావు వేణూ?"

"ఊరి నుండి ఆంటీ! మీరొక చిన్న సాయము చేస్తారా?"

"చెప్పుబాబూ! డబ్బు కావాలా?"

"లేదండి. మీ వరండా బల్లక్రింద నా పెట్టె పెట్టుకుంటాను. వెనుకవైపు పంపు దగ్గర కాసిన్ని బియ్యము వండుకుంటాను. వారము రోజులలో బస కుదుర్చుకొని వెళ్ళిపోతాను" అన్నాడు.

"దానికేం. అలాగే వుండు. మావారికి ఆచారము జాస్తి. అంటూ, గింటూ అంటుంటారు. ఆయన ఆఫీసుకు వెళ్ళాక వండుకో" ఆమెకు ధన్యవాదాలు చెప్పాడు. ట్రంకుపెట్టె వరండా కటకటాలలో పెట్టి బయటికి వెళ్ళి రెండణాల అరటిపళ్ళు కొనుక్కున్నాడు. అవి తినివచ్చి, వారి వరండాలో నిద్రబోయాడు.

రెండవరోజు నారాయణగూడా మార్కెట్టుకు వెళ్ళి పదిహేను పైసలు పెట్టి ఒక కుండ, అణా ఉప్పు తెచ్చుకున్నాడు. దారిలో కొట్టుదగ్గర ఆగి

రెండు పుల్లల కట్టలు కొన్నాడు. మూడు ఇటికరాళ్ళు పేర్చి నిప్పుచేసి కొత్తకుండలో బియ్యముపోసి పెట్టాడు. ఉడికి అదంతా కుండకే అంటుకు పోయింది. చిన్న రాయి తెచ్చి శుభ్రంగా గీకాడు. సగముతిని సగము ఆకుల మడిచి పెట్టెమాటున దాచుకున్నాడు. ఇంటావిడ ఎప్పుడూ తలుపు వేసుకుని లోపల తన పని చేసుకుంటుంది. గేటు వేసుకోమని పిలిచి చెప్పాడు.

"అదేమిటయ్యా, వంట ఎప్పుడయ్యింది? ఎప్పుడు తిన్నావు?"

"చాలాసేపు అయిందండి."

"ఏం చేసుకున్నావు?"

"అన్నము చేసుకున్నానండీ."

"ఏం కూర? నన్ను అడగవద్దా?"

"ఫరవాలేదండి. అన్నము ఉడికేటప్పుడే ఉప్పు వేసుకున్నాను."

"అవసరమైతే అడుగు బాబూ! పచ్చడో యేదో యిస్తాను" అని ఆవిడ గేటు వేసుకుంది. మెమోరాండము తెలుసుకోవడానికి కూడా ఫీజు కావాలి. మొదట ఏదైనా పని సంపాదించాలి. అలోచిస్తూ పదిగజాలు నడిచాడో లేదో, పురుషోత్తముగారు కనిపించారు.

"పాసయ్యావా?"

"లేదు సర్. పరీక్షపోయింది."

"అయ్యో పాపం? మరెలా?"

"ఇంట్లో కూర్చుని ఇవ్వాలనుకుంటున్నాను. నాకెక్కడయినా పార్ట్ టైమ్ జాబ్‌గాని, ట్యూషన్‌గాని యిప్పించాలండీ."

"తప్పకుండానోయ్. రేపు కనపడు. యెక్కడున్నావు? యింటికి రావాదూ?"

"నిన్నవచ్చి అమ్మగార్ని, పిల్లలను చూశానండి."

"ఆహా! సుగుణ చెప్పలేదే ఆ మాట?" అతను ఏదో అర్థం చేసుకున్నట్టు తలాడించాడు.

"ఎక్కడుంటున్నావ్?"



"ఈ ప్రక్క యింట్లోనే" అని అతని దగ్గర సెలవు తీసుకుని, హాస్టలుకు వెళ్ళాడు. అప్పుడే కాలేజీలు తీశారు. ఎక్కువమంది లేరు. బలవంతముగా వీరయ్య కడుపునిండా భోజనము పెట్టాడు. 'పేదవారికున్న ప్రేమ కాస్త కల్గిన వారికెందుకుండదో' అనుకున్నాడు. అటు యిటు తిరిగాడు. సినిమా వింత పోస్టర్స్ చూశాడు. సాయంత్రము ఒకసారి పురుషోత్తము గారింటికి వెళ్ళి, ఆవిడ ముభావంగా వున్నా పిల్లలతో మాట్లాడి వచ్చేశాడు. మధ్యాహ్నము తిన్నది అరగనట్టు అనిపించి అలాగే పడుకోబోయాడు. ఎనిమిది దాటింది. నిద్రెలా వస్తుంది? పెట్టెలో మడిచిన కాగితాలు, పెన్ను తీసుకుని వరండా మెట్లమీద కూర్చుని రాయటము మొదలుపెట్టాడు. కథ మంచి ఇంటరెస్టింగ్ ఘట్టములో వుండగా లైటు ఆరిపోయింది. నిస్పృహగా పేపర్లు మడిచి, దుప్పటి తీసుకుని పడుకున్నాడు. లేస్తుండగానే ఆ ఇంటావిడ ప్రేమగా పలకరించింది.

"చూడు వేణూ! రెండు వానలకే గడ్డి ఎలా మొలిచిందో! కాస్త కోసి పడేస్తావు. చీకట్లో రావాలంటే భయం. ఏ పురుగో, బూచో ఉంటుందని" కొడవలి తెచ్చి ఇచ్చింది. వేణు ముఖము కడిగి గడ్డికోస్తుంటే, ఇంటాయన మరికొన్ని ఇన్‌స్ట్రక్షన్స్ యిచ్చి వెళ్ళాడు. గడ్డికోసి అదంతా శుభ్రంచేసి లేచేసరికి యిల్లాలు భోజనము చేసి, పట్టుచీర మార్చుకుని వచ్చింది.

"వంట చేసుకోవు వేణూ?"

"అన్నము వుందండి" అన్నాడు ముఖము కడుక్కుని వస్తూ.

"రాత్రి పులుసు మూతవేశాను వుందు" ఆమె వెళ్ళి పులుసుగిన్నె తెచ్చింది. తన జిగురు వంటి అన్నము యితరులకు చూపడం యిష్టంలేక, ఇంటి చుట్టు తిరిగి వెనక్కువెళ్ళాడు. అన్నము విప్పి, పులుసు పోసుకుందామని చూశాడు. ప్రాణాలు కోల్పోయిన బొద్దెంక దాంట్లో తేలుతోంది. దాన్ని తీసివేసి, అన్నంలో కాసిన్ని నీళ్ళుపోసి పిసికితిన్నాడు. పురుషోత్తం గారి వద్దకు వెళ్ళాడు.

"రావోయ్! నిన్న వాకబుచేశాను. మా స్నేహితులంతా కలసి ట్యుటోరియల్ కాలేజి తీశారు. చిన్న గదిలో లాబొరేటరీకూడా తీశారు. అక్కడ పనిచేస్తావా?"

"తప్పకుండానండి."

"వారు మరొక పని చెప్పారోయ్! ఏమనుకోవద్దు. కాస్త ఇన్స్టిట్యూట్ పని వుంటే బయటకు వెళ్ళాలట" వేణుకు చప్రాసిపని అని అర్థం అయింది తను పని చేస్తున్నాడు, దొంగతనము చెయ్యటము లేదు.

"ఫరవాలేదు సర్! పని చెయ్యటానికేం?" అన్నాడు.

"సాయంత్రం కాచిగూడా క్రాస్‌రోడ్డు దగ్గర ఉండు, తీసుకెళ్తాను" పోబోయాడు వేణు.

"ఆగవోయ్, భోజనము చేద్దువుగాని"

"మరెప్పుడైనా చేస్తాను సర్. ఇంతకు క్రితమే భోజనం చేశాను" తప్పించుకున్నాడు.

సాయంత్రం పురుషోత్తంగారి వెంట వెళ్ళి, ముప్పై రూపాయలకు ఉద్యోగములో చేరాడు. దినమంతా అసలేం పని వుండదు. సాయంత్రం ఆరునుండి తొమ్మిదిన్నర, పది వరకు క్షణం తీరిక దొరకదు. అయినా శ్రమ అనిపించలేదు. ఇన్స్టిట్యూట్‌లో దినమంతా ప్రాథమిక పాఠశాల నడుస్తుంది. దాని చౌకీదారు ముసలివాడు. అతన్ని మంచి చేసుకుని, ఆ ఇంటిలో వుండటానికి అనుమతి సంపాదించేడు. అన్నము వండుకుని యిరువురూ తింటారు. వేణు రావడముతో ఆ వృద్ధునికి యెన్నో పనులు తప్పాయి, సంతోషించాడు. మొదటి నెల జీతము అందుకోగానే పరీక్షకు ఫీజుకట్టి, మెమోరాండం తీశాడు. ఇంగ్లీష్‌లో ఫేలయ్యాడు.

కొన్నిసార్లు చిన్న పొరపాటు, ఆశ, మానవుని జీవితము అనుకోని మలుపును త్రిప్పుతుంది. వేణు అలాగే ముప్పై రూపాయలు తెచ్చుకుంటూ దినమంతా చదువుకుంటూ, ఆ సంవత్సరము పూర్తిచేస్తే అతను ఇంజనీరు అయ్యేవాడేమో; అనుకోకుండా ఒకరోజు రోడ్డుపై శ్రీరామ్ కనిపించాడు.

"నువ్వా వేణూ! యెన్నాళ్ళకు" పలుకరించాడు. అతనేం చేస్తుంది వివరాలు, విశేషాలు అడిగాడు. వేణు దాచకుండా అంతా చెప్పాడు. గర్ల్స్ స్కూలుకు నేను కమిటీ మెంబరునోయ్! అక్కడే క్లర్క్‌గా వేయించేవాడిని.

"అప్పుడేదో దొరికిందే చాలనుకున్నాను సర్."



"ఆలోచించుకుని వీలుంటే, ఫీల్‌ఖానాలో ఈ అడ్రసుకు రా" అతనొక అడ్రసు ఇచ్చి వెళ్ళిపోయాడు. ఇంకా కొన్ని రోజులలో పరీక్షలున్నాయి. తరువాత చూద్దామని వేణు కూడా ఆలోచించలేదు.

అకస్మాత్తుగా ఆ రోజు తన్ను వెతుక్కుంటూ వచ్చిన తండ్రిని చూసి ఎదురు వెళ్ళాడు వేణు.

"బాపున్నారా నాన్నా? అడ్రసు తేలికగానే దొరికిందా" అన్నాడు.

అతను కొడుకు వెంబడి వచ్చి తాత గదిలో కూర్చున్నాడు.

"వేణూ! నువ్వు చేస్తున్న పనేమిటి?"

"అంటే?"

"తెలియనట్టు నటిస్తే తెలియదనుకోకు. అక్కవైపు బంధువులెవరో చూసి వెళ్ళి లలితను అడిగారట, మీ తమ్ముడు చప్రాసి పని చేస్తున్నాడని. కంటికి మంటికి ఏకధారగా ఏడ్చింది పిచ్చిపిల్ల."

"ఏడ్వడము దేనికి, నేనేం దొంగతనము చేయటము లేదే."

"అని నువ్వనుకుంటే చాలా, యింత సిగ్గులేనివాడవు మా కడుపున ఎలా పుట్టావురా? ఆనాడే చచ్చిపోయినా బావుండేది."

"ఇప్పుడు చచ్చినవాడినే అనుకోండి. నిజమే! నేను సిగ్గులేనివాడను. తల్లిదండ్రులు అనర్హుడని వేసిన ముద్ర చెరుపుకుని, మనిషిలా బ్రతకాలని ఈ కష్టాలన్నీను, మీ దగ్గర వ్యవసాయము చేయటములో నాకు అభ్యంతరము లేదు. కాని మీరు నన్ను నన్నుగా ఎప్పుడు గౌరవించారు. మీరు ఇష్టపడే కొడుకులకు, కూతుర్లకు నౌకరుగా బ్రతకమంటారు. అది నేను సహించలేను."

"ఇక్కడ నౌకరుగా కాక మహారాజులా బ్రతుకుతున్నావా?"

"అది వేరు సంగతి. కొడుకుగా చూసిననాడు తప్పక తిరిగి వస్తాను."

"ఇప్పుడు శత్రువులా చూస్తున్నామట్రా?"

"అంతకన్న అన్యాయంగా నాన్నా! నల్లగా పుట్టడము నా తప్పు కాదు. పుట్టినవెంటనే ఏదో విషయము యిచ్చి చంపాల్సింది. పెంచారు. ప్రతి అడుగులో నన్ను అవమానించటము అన్యాయము కాదా? అందరం ఒకే ఇంటిలో పుట్టాము. నాకంటే పెద్దవారు, చిన్నవారు మహారాజుల్లా తమ కోర్కెలు చెల్లించుకుంటూ వుంటే, నేను ముఖము చూస్తూ ఊర్కోలేదా?"

"ఇంట్లో ప్రతిదీ అన్నీ కొలిచి పెట్టాలంటే సాధ్యమా? ఒకరికి ఎక్కు ఒకరికి తక్కువ. రేపు ముందు ముందు మీ సంసారాలలో అలా కొలి పెడుదురుగాని " ఒక క్షణం తండ్రి వంక పరీక్షగా చూశాడు. తనవల్ల కొడు అన్యాయమయిపోయాడన్న బాధగాని, ధ్యాసగాని అతని కళ్ళల్లో కనిపించలేదు అటువంటి వ్యక్తితో మాట్లాడటము వృథా. రెండవది చూసిన వారికి యెబ్బెట్టు ఉంటుంది. స్వంత తండ్రితో కొడుకు ప్రవర్తన, పరాయివారయితే బావుండే ఒక్కసారి అయినా తండ్రికి, తల్లికి ఆలోచన రాదా? ఒక కొడుకు కోసము సర్వము అమ్మిపెట్టి, రెండవ కొడుకును ఏవగించుకుని, పైగా నిందించడము అన్న చదువుకోసము బంగారమంతా అమ్మగా లేనిది, తన చదువుకోసము అర యెకరము పొలము అమ్మలేడా? అని అడిగే హక్కు లేదు. తరతరాలు హైందవ కుటుంబాలలో ఒక విధమైన సంకుచితత్వము పాతుకుపోయిం ఇంట్లో ఒకడు విద్యావంతుడయితే చాలని. అది ఒకేసారి తనలాంటివా యెదురుతిరిగితే లాభము లేదు. పైగా పెద్దవారి దృష్టిలో విప్లవకారుడు పరిగణింపబడుతాడు కూడాను. తండ్రికి అన్నముపెట్టి పంపించాడు. కోటయ్య అసంతృప్తిగా వెళ్ళిపోయాడు. ఆ రోజు సాయంత్రమే మరో సంఘటన జరిగిం అతను బల్లలు సర్దుతుండగా ఇద్దరబ్బాయిలను వెంటబెట్టుకుని వరదర్ వచ్చాడు. మేనమామను చూసి ముందుకు వెళ్ళాడు.

"నమస్కారము మామయ్యా! బావున్నారా?"

"ఊఁ, నీవిక్కడికెలా ఊడిపడ్డావు?"

తను చేసేపని చెప్పడానికి అభిమానము అడ్డు వచ్చింది. "ఇక్క రూమ్‌లో ఉంటున్నాను"అన్నాడు. ఛీ! తనంత పిరికివాడా! అబద్ధం ఆడా అని అనుకున్నాడు.

"ఆహా!" అని మరేం మాట్లాడక ముందుకు నడిచాడు.

"ఎవరండి అతను?" వెనుక వెళ్ళే అబ్బాయి అడిగాడు.

"అతను.....అతనా తెలిసినవాడులే" వేణు హృదయము చురుక్కు మంది. స్వంత మేనమామ, తన నిజసంబంధం తెలుపడానికి సంకోచిస్తున్నా ఆ రోజంతా అతని మనసు అల్లకల్లోలమే.



"ఏయ్ అబ్బాయ్!" లెక్కలుచెప్పే అతను పిలిచాడు.

"ఏమిటండి?"

"ఒక చార్మినార్ సిగరెట్టు ప్యాకెట్టు తెచ్చిపెట్టు" వేణు జవాబు చెప్పాలనుకునేలోగా, తన పరిధి గుర్తుకు వచ్చింది. వెంటనే డబ్బులు తీసుకెళ్ళి తెచ్చిపెట్టాడు. మరొకరోజు ఓ లేడి టీచర్ టీ తెచ్చిపెట్టమంది. అతనికి యేదో అభిమానము అడ్డుపడసాగింది. రెండవరోజు ఓ నిర్ణయానికి వచ్చి, శ్రీరామ్ దగ్గరకు వెళ్ళాడు.

"రా, నేనే పద్దామనుకుంటున్నాను"అతను పిలిచాడు. వెళ్ళి కూర్చున్నాడు వేణు.

"చూడవయ్యా వేణూ! గవర్నమెంటులో పని దొరికిందని, మా 'శ్రీలక్ష్మి బాలికా పాఠశాల' క్లర్క్ చెప్పాపెట్టకుండా ఉడాయించాడు. డెబ్భై అయిదు రూపాయలు ఇస్తారు. ఆఫీసుపని చూస్తూ, హిందీ పండిట్ మెటర్నటి లీవు తీసుకుంది. ఆమె వచ్చేవరకు ఏదో చెప్పు."

"అడగకుండానే పని చూపారు. చాలా థాంక్స్ అండి"

"ఫరవాలేదోయ్. వాళ్ళకు ఇబ్బంది కాకూడదు. నాల్గు రోజులు ముందు చెప్పు"

"అలాగేనండి" నమస్కరించి వచ్చాడు. ఇన్‌స్టిట్యూట్‌లో రిజైన్ చేశాడు. నాల్గు రోజులలో వెళ్ళిపోతానని క్రొత్తపనిలో చేరాడు. గది కుదుర్చుకోవటము, చెంబు గ్లాసు వంటి చిన్న చిన్న సామాన్లు కొనటము, మరో వారము అతని చదువు పాడుచేశాయి.

బడిలో మాత్రము ఊపిరి సలపని పని ఉంటుంది. ఆఫీస్ వర్క్, అటు హిందీ క్లాసులు, తనేం హిందీలో డిప్లొమా పుచ్చుకున్నాడా? బాగా స్టడీచేసి చెప్పాలి. ఒకవంక సప్లిమెంటరీ పరీక్షలు దగ్గర కొస్తున్నాయి. సాయంత్రము అయిదు అయిదున్నరకు ఇంటికివచ్చి, అలసటగా కూర్చుండి పోయేవాడు. కొన్నిసార్లు కాంపోజిషన్స్ దిద్దాలి. అంతా ఆడవారున్న దగ్గర తను ఒక్కడు, ఏ మాత్రము పొరపాటు చేసినా అది బయటపడుతుంది. ఉదయము లేస్తూనే వంట తయారు, నానా గొడవ. అతను వారము రోజులలో

తెల్సుకున్నాడు. తను మారితే తప్ప పరీక్ష వ్రాయలేనని. పోనీలే, సప్లిమెంటరీ పాసయి యెవర్ని ఉద్ధరించేది అనుకుని నిశ్చింతగా ఊరుకున్నాడు. పదిహేను దాటిన వేణు ఉపాధ్యాయుడయ్యాడు. అతనికి నవ్వు వచ్చేది. కాని తన పనిలో లోపం చూపకూడదనే తహతహ ఉండేది.

దసరా సెలవులకు ఇంటికి వెడుతూ చెల్లెలికి రిబ్బన్లు, గాజులు, తమ్మునికి పెన్ను, పుస్తకాలు కొనుక్కుని వెళ్లాడు. అదిచూసి వారు ఆనందించారు. వేణుకదే తృప్తి.

"యెందుకురా వేణు! డబ్బు ఖర్చు. ఇంటి పరిస్థితి యెంత ఘోరంగా ఉందో చెప్పలేను. రంగనాధశెట్టి దగ్గర నాన్నగారు డబ్బు తీసుకున్నారట. ఆయన గేదెలనమ్మి ఇవ్వమంటున్నాడురా. అటు అన్నయ్యకు పంపలేక చస్తున్నాము" దీనంగా చూసే తల్లిని చూసి కరిగిపోయాడు వేణు. ఆ యేడే మధు మెట్రిక్యులేషన్‌కు వచ్చాడు. అటు ప్రేమ పెద్దమనిషి అయింది, తను కొంత శ్రమపడితే తల్లిదండ్రులకు కనువిప్పు కల్గుతుందని ఆశించాడు వేణు.

"చూస్తానమ్మా! నెలకు కొంత డబ్బు పంపుతాను" అని వాగ్దానము చేశాడు. ఆ సెలవులు మాత్రము మనస్పర్థలు, గొడవలు లేకుండా గడిచిపోయాయి.

* * *

ఇద్దరమ్మాయిలకు లెక్కలు చెప్తానని అంగీకరించాడు. మాట్లాడుకోవటము గంట అని అయినా వారు కూర్చునేది రెండుగంటలు అవుతుంది. అయినా తను కష్టపడాలి. అమ్మకు పంపుతానన్న డబ్బు పంపాలి. వచ్చే యేడు తన చదువుకోసము డబ్బు కూర్చుకోవాలి. తన భోజనము చూసుకోవాలి. రచనా వ్యాసంగము త్రాగుడు, జూదము వంటి వ్యసనమే. అయితే కొందరు భావాలను అణగద్రొక్కి ఇతరత్రా పనులు చేస్తుంటారు. మరికొందరు ఆ భావాలకు, ఊహలకు రూపకల్పన చేయనిదే నిద్రపోరు. ఆ కోవకు చెందినవాడే వేణు. ఏ మాత్రము ఏకాంతము, ప్రశాంతత లభించినా ఏదో వ్రాసేవాడు.

ఆ రోజు ఎనిమిదో తరగతి నుండి బయటకు వస్తుంటే గుమ్మము దగ్గర ఓ అమ్మాయి నిల్చుంది. పద్దెనిమిది, పంధొమ్మిదేళ్ళుంటాయేమో, ముతక నీలము చీర, మోచేతులవరకు స్లీవ్స్ వున్న తెల్ల జాకెట్టు వేసుకుంది.



"నమస్కారము సర్!" వేణు చిత్రంగా చూశాడు. తనకంటే పెద్ద అమ్మాయి తనను సర్..... అయినా ఇప్పుడు తన హోదా ఉపాధ్యాయుడుగా? చిన్నగా నవ్వుకుని ఆమె వంక సూటిగా చూశాడు.

"ఏమిటమ్మా?"

"మా కమల చెప్పింది, మీరు లెక్కలు బాగా చెప్తారని...."

"కమల మీ చెల్లెలా?"

"కాదండి. మా మామయ్య కూతురు. నాకు మెంసురేషన్ అర్థం కావటము లేదండి. దయచేసి.... చెప్పగలరా?"

"ఏ క్లాసు?"

"తొమ్మిదండి" ఎందుకో అమ్మాయి చూపులు దీనంగా ఉన్నాయి.

"సాయంత్రము రండి. ఇంతకూ మీ పేరు?"

"రాధ " అని వెళ్లిపోయింది. సాయంత్రము మిగిలిన పిల్లలతోపాటు వచ్చింది. ఇద్దరు చిన్న పిల్లలకు చెప్పాలంటే యెలాంటి సంకోచము కలగలేదు వేణుకు. తన వయసు స్త్రీకి చెప్పాలంటే ఇబ్బందిగా ఉంది. తన తెలివినంతా ఉపయోగించి చెప్పాడు. ఆమె తృప్తిగా వెళ్ళింది. కాని వేణుకు క్రొత్త బెడద వచ్చిపడింది. తొమ్మిదో క్లాసునుండి మరో యిద్దరు, ముగ్గురమ్మాయిలు రావటము మొదలుపెట్టారు. యువతులు అర్థిస్తే కాదని యెలా అనగలడు. అతను వచ్చిన పనిని సాధించవలసిన లక్ష్యమును నిర్లక్ష్యము చెయ్యసాగేడు.

ఆ వయసు అటువంటిది. అడలిసెన్స్ చాలా ప్రమాదకరమయింది కూడాను. యువతీ యువకులకు తమ నిర్ణయముపట్ల చాలా నమ్మకము కల్గుతుంది. మైకము కమ్మిన కండ్లకు ప్రపంచమంతా పచ్చగానే కన్పిస్తుంది. అటువంటి తరుణములోనే మరో సంఘటన జరిగింది. స్కూల్‌డే జరిగింది! తెల్లవారి సెలవులు ఇచ్చారు. సెలవురోజున చదువుదామని పుస్తకము తీసి పట్టుకోగానే యువతులంతా బిలబిలమంటూ వచ్చారు. కొందరు పరికిణీ, పల్లెవాటు వేసుకుని చక్కగా తయారయ్యారు.

"సర్! మనమీ రోజు కేరమ్స్ ఆడుదాము. గేమ్స్‌రూమ్ తాళాలు
దగ్గరే ఉన్నాయి."

"లేదు, నేను చదువుకోవాలి"

"మేమంతా పనిలేని దద్దమ్మలము కాబోలు! రండే, వెళ్దాము
ఒకమ్మాయి కోపంగా పోబోయింది.

"ఉండవే అనసూయా! నీకన్నింటికీ తొందరే. ఈ ఒకరోజు సర్

"నాకు చాలా పనులున్నాయి. వంటా, వార్పూ..."

"ఓస్, అంతేకదా! వేం చేస్తాము" ఒకమ్మాయి కుంప
వెలిగించబోయింది.

"అన్నంతపని చేసేరు. వంట చేసుకుంటాను లెండి. మీరిలా
కూర్చోండి" అన్నాడు. వారు గిన్నెలు మూత తీసి చూశారా, పరువు పోతుం
రాత్రి వండిన వంకాయకూర బొగ్గుల రూపములో వుంది. అందరు అత
కెదురుగా చాపమీద కూర్చున్నారు.

"బోర్డు తీసుకురానా?" రాధ అడిగింది. ఈ లోపల పోస్టుమే
వచ్చి, ఓ మాసపత్రిక, కాంప్లిమెంటరీ కాపీ, పదిరూపాయలు వేణు కిచ్చాడ
వేణు రచయిత అని, అతని కలంపేరు "విద్య" అని అందరికి తెలిసిపోయిం

"ఎంత చెడ్డవారండీ మీరు! ఒక్కసారి ఈమాట చెప్పారా?" రా
ఓరగా చూసి కోపము నటించింది.

"అవును మాష్టారూ! సంతోషించేవారముగాని తిట్టేవారము కాదుగా

"అబ్బబ్బ! మీ వూహాలు మీరు, మీరు ఈ మాసపత్రిక కొంటా
చదవరా ఏం?"

"అంత విసుగు దేనికండి. సంతోషం కొద్ది అంటున్నాం" రా
చిన్నబుచ్చుకుంది.

"విసుగుకాదు, ఏం కాదు, రేపు మాత్రము ఈ విషయం అంద
చాటకండి. పుణ్యముంటుంది."

"అబ్బే. అదేం లేదు" అన్నారు. అన్నట్టే మరురోజే టీచర్ల దగ్గ
చాటింపు వేశారు రాధా తదితరులు. అందరూ వేణును అభినందించార



కొందరు ఏవో ప్రశ్నలు అడిగారు. యెందుకో యువతుల మధ్య అందరి పొగడ్తలు వింటుంటే, రెండు అంగుళాలు పెరిగానని అనిపించింది. రెండవ విషయము ఏమిటంటే, ఇంట్లో బంధువుల వద్ద నిరాదరణ, నిరసన లభించిన వేణుకు, ఆ చిన్న గౌరవమే, ఎంతో ఆనందంగా అనిపించింది. వారితో ఆట, పాట కబుర్లతో కాలమే తెలియలేదు.

# 9

ఈసారి కూడా పేపరు చూసి నిరాశగా క్రింద పెట్టాడు. తిరిగి ఇంగ్లీషు పరీక్ష పోయింది. తను ఫేలయ్యాడు. అతని అవయవాలన్నీ డీలా పడిపోయాయి. తనేకాదు, హెచ్.ఎస్.సిలో మధుకూడా ఫేలయ్యాడు. వేణు పేపరు క్రిందపెట్టి నిట్టూర్చాడు. ఒకప్పుడు బడికి పేరు తెచ్చిన విద్యార్థిగా పరిగణింపబడి నేడు యిలా అపజయము పాలు కావటానికి యెవరు బాధ్యులు? తనా? అతని ఆలోచనలు బహుముఖంగా పయనిస్తున్నాయి. పెద్దవారి మాటలు విననందుకు ఫలితమా? ఇంక తన అదృష్టము పరీక్షించుకోవటము దండగ అనిపించింది. తండ్రి అప్పుచేసి పెట్టిన మిల్లులో ఉండిపోదామనుకున్నాడు. ఈసారి తండ్రే అంగీకరించలేదు.

"హాయిగా చేసే కొలువు వదులుకొనటము దేనికి? మధు యెలాగూ చదవనన్నాడు. మిల్లు వాడు చూసుకుంటాడు. అటు ప్రేమ పెళ్ళికి యెదిగింది. రోజుకు రోజు కట్నాలు పెరిగిపోతున్నాయి. నూరి ఒక సంవత్సరము సంపాదిస్తే, పెళ్ళి సమస్య తీరినా, మీ అందరి పెళ్ళిళ్లూ చేయాలి" నిజమేననిపించింది. ఈసారి తల్లి యిచ్చిన బియ్యము, పచ్చళ్ళు తీసుకుని పట్టణము చేరాడు. అందరి సానుభూతి భరించటము చాలా కష్టమైపోయింది. యెలాగో అందరిని వదిలించుకుని ఇల్లు చేరాడు. అద్దంలో తన ముఖము చూసుకున్నాడు. గడ్డం పెరిగింది, చెంపల దగ్గర ఒకటి రెండు తెల్ల వెంట్రుకలు కనిపించాయి. ఉలిక్కిపడ్డాడు. పంథొమ్మిదిలోనే తల నెరుపా? అద్దం ప్రక్కన పెట్టి కూర్చున్నాడు.

"మాష్టారూ!" అతను తలెత్తి చూశాడు. మసక చీకటిలో ఓ స్త్రీ ఆకారము కనిపించింది.

"ఎవరు? రాధా!" ఆశ్చర్యంగా చూశాడు. మసక చీకటి పడ్డాక ఓ యువతి తన గదికి రావటమా!

"అవును, నేనే మాష్టారూ!" గదిలో లైటు వెలిగించింది.

"ఏమిటి రాధా, ఇలా వచ్చేవు?" వారిని బహువచనములో పిలవడము మాని, స్టూడెంట్స్‌గా చూడటం మొదలుపెట్టాడు.

"మీరు ఒంటరిగా బాధపడుతుంటారని వచ్చాను."

"ఇంత రాత్రి బయటకు వెళ్ళితే మీవారు ఏమనరా రాధా?"

"అత్తయ్య, మామయ్య, పిల్లలు సినిమాకు వెళ్ళారు. నాకు చూడాలనిపించలేదు. ఇంట్లో కూర్చుంటే మీరొక్కరు కూర్చుని ఆలోచిస్తారనుకుంటే బాధ అనిపించి వచ్చేశాను."

"నాలాంటి నిర్భాగ్యుడిపై మీలాంటి వారికైనా సానుభూతి వుండ నయము."

"ఎందుకండి. మిమ్మల్ని మీరు చిన్నబుచ్చుకుంటారు. ఈ ప్రపంచంలో మీకంటే కూడా నిర్భాగ్యులున్నారని ఎందుకు భావించరు?"

"నీ మాటలు నా కర్థం కావటము లేదు. కూర్చో" చాప చివర అతని ప్రక్కన కూర్చుంది.

"కాదు మాష్టారూ! మీరు పురుషులు. ఎంతటి నిర్భాగ్యత్వమైనా పేదరికమూ, సమస్యలూ ఉంటాయి. నాలాంటి వారిని చూడండి. జీవితానికో అర్థము, సంతోషము లేవు."

"అసలేం జరిగిందో సరిగ్గా చెప్పండి."

"అమ్మా, నాన్న చిన్నప్పుడే పోయారు మాష్టారూ! మామయ్య పెంచారు. ఈ పెళ్ళిళ్ళ సమస్య నాలాంటివారి జీవితాలను బలిగొంటుంది. ఆయనకు అన్నం పెట్టడమే గొప్ప అంటే, వేలకువేలు పోసి పెళ్ళి ఎలా చేస్తారు? కరీంనగర్‌లో ఒక ధనవంతుని భార్య చనిపోయింది. ఆయనకిచ్చి నన్ను పెళ్ళిచేశారు. ఆయన వయసు యాభై సంవత్సరాలు, నా వయసు పదిహేను



సంవత్సరాలు. సరే, ఖర్మ అనుకుంటే, పెళ్ళయి నెల తిరగకుండానే ఆయన పక్షవాతముతో మంచాన పడ్డారు. అందరూ నన్ను ఆడిపోసుకున్నారు. నా పాదమహిమ అన్నారు. ఆయనకు బోలెడాస్తి వుంది. దానికి నన్ను వారసురాలుగా వారంతా ఊహించలేకపోతున్నారు. ఆయన మనసులో ఏముందో గాని మామయ్యతో నన్ను చదివించమని, ఖర్చంతా తాను భరిస్తానని అన్నారు" రాధ కన్నీరు కార్చింది.

"ఛీ! అదేమిటి ఊరుకో"

"ఊరుకోక చేసేది ఏం లేదు. ఆయనకు నయమవదనే అంటున్నారు. నయమయినా జీవితములో నాదేముంది చెప్పండి మాష్టారూ?"

"కాలము మారిపోతుంది. పునర్వివాహము చేసుకోవచ్చుగా!"

"అది నిజమే. పునర్వివాహము చేసుకునేవారేరి? అంత విశాల హృదయులు యెక్కడున్నారు?" అన్నది నిరాశగా.

"యెవరో పుణ్యాత్ములు వుంటారులే రాధా! నీకేం! అందము లేదా? చదువులేదా?

"నేనందంగా వున్నానా మాష్టారూ?...." నీరునిండిన కళ్ళు తళాతళా మెరిశాయి.

"నిజంగా చాలా బావుంటావు రాధా!"

"మాష్టారూ.....మాష్టారూ! నాలాంటి దీనుల నుద్ధరించే పుణ్యాత్ములు మీరే యెందుకు కాకూడదు?" అడిగి అతని రెండు పాదాలపై చేతులుంచింది.

"అరే..... అదేం పని! నేనా?" అతని ముఖము వెలవెలబోయింది.

"సంకోచిస్తున్నారు కదూ! అవునులెండి. నా దగ్గరేముంది? మీరంతా మాటలు చెప్తారుకాని, చేతలకొచ్చేసరికి వెనుకాడుతారు" అన్నది అలకలుపోతూ.

"అదికాదు రాధా! మనిద్దరికెలా కుదురుతుంది?"

"యెందుకు కుదరదేం? వయసు ఒకటే అవ్వవచ్చు అలాంటి వారెందరు లేరు. యిక ధనమంటారా, ఈ మెట్రిక్ బెడద ఒదిలితే, యెక్కడో ఒకచోట నేనూ పనిచేస్తాను. సంతోషంగా ఉండొచ్చు."

"నన్ను ఆలోచించుకోనివ్వు రాధా! అసలే పరీక్షపోయి నేను బాధపడుతున్నాను."

"పరీక్షపోతే బాధ యెందుకు? తిరిగి సాధించవచ్చుగా"

"నీకలాగే వుంటుంది. నాకెంత నిరాశగా ఉందో నీకు తెలియదు."

"అందుకే ఆశలో మీవెంట వుండి, మన జీవితాలు చక్కదిద్దాలని కాదనకండి" వంగి అతని నుదురు ముద్దుపెట్టుకుని, గది వదలి వెళ్ళిపోయింది ఆ యువతి చనువుకు చకితుడయ్యాడు. పులకితుడు కూడా అయ్యాడు. ఆయాచితంగా లభించిన ఈ తీయని అనుభూతి అతన్ని ఏదోలోకాలకు తీసుకుపోయింది. వయసు భేదం తప్పిస్తే తనకు రాధకంటే మంచి వారెలా లభిస్తారు? మామయ్య తన ఎర్రని కూతుర్ని యిస్తానా అన్నాడు. రాధ పసిమిఛాయ చూసి కళ్ళుకుట్టాలి. అతని ఆలోచనలు సాగిపోతున్నాయి.

"వేణూ!" బయటినుండి చిరపరిచితమైన గొంతు వినిపించింది.

"రారా సత్యం" లేచి సర్దుకు కూర్చున్నాడు.

"ఈరోజే వచ్చావా?"

"ఊఁ. నీ పరీక్ష ఏమయిందిరా?"

"అది వేరే అడగాలా? నీలాంటి వీరుడిని ఓడించి, నాలాంటి వాడిని వరిస్తుందటరా! ఒరే మనము మంచిరోజున ఊరు వదలలేదురా"

"శకునాలపిచ్చి యెప్పటినుండిరా?"

"నిజమురా! నేనంటే ఏదో కష్టపడి బార్డరుమీద ఫస్టుక్లాసుమార్కులతో పాసయినవాడిని. నీకేంరా, టాప్ చేశావు. పి.యు.సిలో చూడు కర్మ."

"మనము బట్టీపెట్టే పద్ధతిని గుడ్డిగా అనుసరించాము చిన్న క్లాసులలో తక్కువ పోర్షన్ నెట్టుకు వచ్చాము. పై క్లాసులలో ఎలా? పోర్షను ఎక్కువే. ఇన్‌డైరెక్టు ప్రశ్నలు జనరల్‌గా ఇస్తారు. లాంగ్వేజిపై కమాండ్ లేని మనలాంటి వారము ఎలా పాసవుతామురా? కాస్త ఇంగ్లీషు భాషను ఇంప్రూవ్ చేయాలి."

"వేణు....... ఒరేయ్ ! అచ్చు పాఠము చెప్పినట్లేరా మాట్లాడేది. అందుకే అన్నారు 'ఆరునెలల సావాస'మని. ఆరు నెలలు బడిపంతులుగా చేరావో లేదో ఏమిట్రా ఈ నీతులు, సూక్తులు"



"పోరా! నిజం చెబితే నీతంటావు. నీ తలకాయలో ఏముందిరా?"

"అది పరీక్ష పాసయితే తేలేది. ప్రస్తుతము మట్టేరా నాయనా!"

"సరే, అకస్మాత్తుగా నన్ను చూడాలని దుర్బుద్ధి యెందుకు పుట్టిందిరా?"

"నాయనా! ఊళ్లో నువ్వో వీరుడివి అయిపోయావు. 'ఇలా ఫేలవుతుంటే చదివించటం మావల్ల గాదు. ఆ వేణులాగే ఎక్కడో ఒకచోట ఉద్యోగము చేసుకుంటూ, చదువుకో. లేదా, మేనమామకున్న హిడింబిలాంటి కూతుర్ని కట్టుకుని ఇల్లరికము పో!' అన్నారురా, ఏం చేయను? నీ అడుగుజాడలలో నడుద్దామని వచ్చాను" నిస్పృహగా వెనక్కు వాలిపోయాడు సత్యము.

"ఎక్కడయినా పనిదొరికిందా?"

"ఉండరా, పనికి ప్రయత్నించుతూ నిలవడానికి నీడకావాలని నీ దగ్గరకొచ్చాను. నీ కాళ్ళు పట్టుకునేవాడిని గాని నాకంటే రెండు ఏళ్ళు చిన్నవాడివిరా! నీ రూమ్‌లో ఆశ్రయము కావాలిరా."

"రూమ్‌లో ఉండటానికి అభ్యంతరమేముందిరా. వుండు"

"అభ్యంతరము కాదురా. నిన్ను అడగాలంటే సిగ్గు. యిదివరకు నీవు తొలుత పట్టణం వచ్చినప్పుడు, ఆ శాయిగారు వాళ్ళేదో అంటే అడ్డుపడి ఆదుకోలేకపోయాను"

"దాందేముందిరా. మరచిపో. కాని గాడిద వేషాలువేస్తూ తొమ్మిది వరకు పడుకుంటే నాలుగు తంతాను."

"అమ్మమ్మ యెంతమాటరా! మెస్‌కయ్యే ఖర్చు యిద్దరం భరించుదాం రా. మొదటే అన్నీ నిక్కచ్చిగా మాట్లాడుకోవాలి."

"మంచిదిరా. రాతలు కోతలంటే నా కసహ్యం. ఒక నెల నువ్వు నడుపు. ఒక నెల నేను నడుపుతాను."

"కరెక్ట్. తెలివంటే నీదిరా! పనిమాత్రం సగము చెయ్యలేదని తిట్టకురా."

"సరేలే, దాంటో కన్‌సెషన్" ఇరువురు నవ్వుకున్నారు.

"ఇప్పుడేమన్నా వుందా, హోటల్ కెళ్ళాలా?"

"యేదో ఆలోచిస్తూ వంట తలపెట్టలేదురా. ఎంతసేపు చేద్దాం"

"ఇప్పుడు వంట దేనికిరా! హాయిగా హోటల్ కెళ్దాం"

"ఒరేయ్! నా సావాసంలో ఉంటూ హోటళ్ళ పేరు ఎత్తవద్దురా"

"ఈ ఒక్కరోజురా! అలాగే ఒక స్నేహితుని యింట్లో నా సామాన్లున్నాయి. తెచ్చుకుంటాను."

"సరే, పద" ఇరువురు లేచారు. హోటల్లో భోజనముచేసి, సత్యం సామాను తీసుకుని వచ్చేశారు. రాత్రి కబుర్లు చెప్పుకుని నిద్రపోయారు. వేణు ఎంత హెచ్చరిస్తేనేం. సత్యం తొమ్మిదిదాటందే లేచేది లేదు.

"ఒరేయ్! మనమింకా నిరుద్యోగ స్వాములమురా; ఈనెల మె నువ్వు రన్ చేయి."

"అలాగేలే, తిండికయినా తగలడు" విసుక్కున్నాడు వేణు.

"కాఫీ లేందే, పరగడుపున తిండెలా?" దిగులుపడ్డాడు.

"మా గది సూత్రాలు మొదటే చెప్పాను."

"ఖర్చులో ఖర్చురా. ఎంత అవుతుంది. పొక్కపూట కాఫీ కాచుకుందాం"

"కావాలంటే కాచుకో. లేదా బయట ఎక్కడయినా త్రాగు. నే మాత్రం తాగనురా" ఖచ్చితంగా చెప్పేశాడు వేణు. రెండవ రోజు తన కా సరంజామా తెచ్చుకున్నాడు సత్యం.

"ఒరేయ్! నీ పని అయిపోగానే నిప్పులమీద కాసిన్ని నీళ్ళ పడెయ్యరా" పడుకుని బ్రతిమాలేవాడు సత్యం. అలాగే చేసి, ఎప్పుడయినా లేవనీ అని వేణు వెళ్ళిపోయేవాడు. ఆరోజు ఆఫీసులో కూర్చుని స్టాక్ రిజిస్టరు చూస్తున్నాడు. నెమ్మదిగా దొంగ చూపులు చూస్తూ రాధ వచ్చింది.

"ఏం రాధా?"

"మీరు..... మీరు ఏం నిర్ణయించుకున్నారు?"

"కొంటెదానివి. ఇంకా నిర్ణయించుకోవాలని అనుకుంటున్నావా?" ఆ రోజు తన చర్య గుర్తుకువచ్చి లజ్జితురాలైంది.

"నాన్నగారిని వొప్పించటం కష్టమనుకుంటాను. సరే."



"అంటే ప్రస్తుతము నన్ను వెళ్ళిపొమ్మంటారా?"

"అనకపోతే రేపు హెడ్ మిస్ట్రెస్ నన్ను వెళ్ళిపొమ్మంటుంది" అంటుండగానే! మరో తెలుగు పండితుడైన వృద్ధుడు అక్కడకు వచ్చాడు.

"వేణూ! కాస్త నేనడిగిన అప్లికేషన్ రాసిపెట్టవయ్యా, గొప్పగా కథలు రాస్తావు"

"టైమ్ లేదు సర్! యెలాగైనా ఈ రోజు వ్రాస్తాను" రాధ వెళ్ళిపోయింది. మరి రెండు రోజులకు కమల ఓ చిన్న కాగితముతెచ్చి, వేణుకిచ్చింది.

"మా రాధ ఇవ్వమంది" అని వెళ్ళిపోయింది. నెమ్మదిగా విప్పాడు. 'వీలుంటే సాయంత్రము మా ఇంటికి రండి' అని వ్రాసి వుంది. ఏమిటీ అమ్మాయి ధైర్యం! యింటికి వెళ్తే అందరూ చూడరా! వద్దనుకున్నాడు. గదిలో ఒంటరిగా కూర్చుంటే ఏం తోచలేదు. తాళంపెట్టి బయలు దేరాడు. పదిళ్ళ కవతల వుంది రాధ వాళ్ళ మామయ్య ఇల్లు. ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది. నెమ్మదిగా తలుపుమీద కొట్టాడు. రాధే ఎదురు వచ్చింది.

"వచ్చారా, వస్తారో రారో అని ఒకటే దిగులుపడ్డాను" ఆమె వంక చూశాడు. ప్రత్యేకముగా అలంకరించుకుంది. తలనిండా మల్లెపూలు పెట్టుకుంది.

"మీ వాళ్ళంతా యేరి?"

"వాళ్ళంతా గండిపేటకు పిక్‌నిక్‌కు వెళ్ళారు. రాత్రికి ఉండి, రేపు వస్తారు."

"నువ్వు వెళ్ళలేదేమిటి?"

"వాళ్ళ వెంట వెళ్ళితే ఏం సరదా?"

"మరి?"

"యిలా మీతో మాట్లాడుతుంటే హాయిగా, సరదాగా ఉంటుంది."

"బావుంది" అన్నాడు. ఏమనాలో తెలియక. రాధవెళ్ళి ఒక ప్లేటులో కారప్పూస, హల్వా తెచ్చి పెట్టింది.

"ఇప్పుడివన్నీ ఎందుకు?"

"మీకోసమని చేయలేదు లెండి. వాళ్ళు తీసుకెళ్ళటానికి చేసి, కొంత నాకు పెట్టారు"

"మరి నువ్వు నాకు పెట్టావేం?"

"అబ్బ! తినండి. ఇంకా మీరు, నేను అనే భేదము దేనికి? అతని దగ్గరగా వచ్చింది. "పోనీ తినిపించమంటారా చెప్పండి?"

"అహఁ!" ఆమె వంక చూశాడు. మత్తుగా చూస్తోంది. ఆ చూపులు సూటిగావెళ్ళి గుండెలను చీలుస్తున్నాయి. అతని మనసు క్షణము ఆవేశాని లోనయింది. ఆమె చేతిని అందుకుని వెంటనే వదిలివేశాడు.

"అబ్బ పిరికివారు" నవ్వుతూ అతని భుజముమీద వాలింది.

"పిరికితనము కాదు. మనకే ఠికానా లేదు. ఇంకా ప్రేమంటూ మితిమీరితే..."

"మీరితే?..."

"ఛ, సిగ్గులేదు నీకు" అన్నాడు. రాధ అతని భుజము వదిలి ఎదుటి వచ్చి కళ్ళల్లోకి దీక్షగా చూసింది. కష్టాల రాపిడి కరుకుతేరిన శరీరము పురుషత్వము కన్పింపచేసినా, కనులలో పసిపిల్లలకుండే అమాయకత చదువకల్గింది. యెందుకో ఆమె ముఖము నిరాశగా మారిపోయింది.

"ఏమిటి ముఖమలా మాడ్చావు? నేనన్నమాటకు కోపం వచ్చిందా?"

"కోపమా? లేదే. సినిమాకు వెళ్దామా?"

"ఈరోజు వద్దు రాధా! మరోసారి వెళ్దాం"

"మరోసారి అవకాశము రావద్దూ, కాదనకండి"

"అమ్మాయ్ రాధా! ఉన్నావా?" బయటినుండి కేకపెడుతూ ఓ ముసలమ్మ వచ్చింది.

"ఉన్నాను రండి" ముఖం చిట్లించుకుంది.

"ఈ అబ్బాయి యెవరూ?"

"కమల మాస్టారే. రాత్రిపూట యిలా వచ్చేవు? పని లేదా?"

"పని లేకేం తల్లీ! నీకు తోడుగా వుండమని మీ అత్త మరీ మరీ చెప్పింది" అంది ఆవిడ హుస్సురంటూ కూలబడి. వేణు లేచాడు. రాధ అసహాయంగా చూసి అతన్ని గుమ్మం వరకు సాగనంపింది.



వేణు ఇంటికి వచ్చేసరికి సత్యం భోజనం చేస్తున్నాడు. తను వచ్చి కూర్చున్నాడు.

"ఏం వేణూ! ఇది మనుషులు తినే తిండేనట్రా?"

"ఏమైందిరా?"

"ఒక్క కూర వండకపోతే పప్పో, పులుసో చేయగూడదట్రా"

"అవన్నీ యిల్లాలు వచ్చాక. ఇప్పుడిలాగే తినాలి" అని అన్నం గిన్నె చూశాడు. పిడికెడు మెతుకులున్నాయి. తను ఫలహారం చెయ్యటం మూలాన ఆకలి అనిపించలేదు. అదే తిని పడుకున్నాడు. రోజురోజుకు సత్యం ప్రవర్తన మారిపోసాగింది. వేణుకు మిగులుతుందా లేదా అనే విషయం మరిచిపోతున్నాడు. ఇష్టమొచ్చినట్లు బొగ్గులు ఖర్చుపెట్టి నీళ్ళు కాయటం, పాడు తలనొప్పి అంటూ కాఫీ కాయటము అలవాటు అయింది. వేణుకు అదంతా ఇష్టము లేదు. ప్రతినెల కంటే రెండింతలు వచ్చింది ఖర్చు. ఈ నెల తను మిగల్చవచ్చు అనుకుని తృప్తి చెందాడు. పనిమాత్రం తప్పటం లేదు.

* * *

"ఏమిటండీ! అంత నిరాశగా కనిపిస్తున్నారు?" ఒకరోజు రాధ అడిగింది.

"ఏమిటో రాధా! నేను వచ్చిన ధ్యేయము పూర్తి చేస్తాననిపించటం లేదు. ఒకవంక పని, రెండోవంక బడి, నా చదువు, కథలు అన్నీ మూల పడ్డాయి.

"నేను వచ్చి మీ పనులు చేసేదాన్ని, ఓ తోకయ్యను వెంబడి పెట్టుకున్నారాయె! ఓ మాట చెప్పనా, ఆరో క్లాసులో 'కుట్టి' అనే పిల్ల వుంది చూడు. దానికి లెక్కలు రావు. ఓ అరగంట లెక్కలు చెప్పితిరా, మీకు కొన్ని పనులు చేస్తుంది."

"ఏదో చూడు" అన్నాడు.

"నేనెంతో సంతోషముతో, ఆశతో మిమ్ము చేరవస్తే మీరేమో ఎప్పుడూ ముఖం మాడ్చుకునే వుంటారు."

"నిన్ను చూసి కాదు రాధా! నా సమస్యలు నన్ను భయపెడతాయి."

మాదిరెడ్డి సులోచన

# దేవుడిచ్చిన వరాలు



"నన్ను చూసి మరిచిపోలేరా. రేపు ఆదివారం పది గంటలకల్లా అఫ్జల్‌గంజ్ బస్‌స్టాప్ వద్దకు రండి. కిద్వాయి గార్డెన్స్‌కి వెళ్దాము. డబ్బు లేదు అని మానేయకండి! అన్నీ నేను చూసుకుంటాను. అడ్డు చెప్పవద్దు" రాధ త్వరగా వెళ్ళిపోయింది. అతనింటికి వచ్చి, తన బడిలో మిగిలిపోయిన ప చేసుకుంటూ కూర్చున్నాడు. ఏడుగంటలకు కడుపులో చుర్రుమంటే లేచి డబ్బాలు తీశాడు. అన్నీ ఖాళీ. సత్యం ఎక్కడో పని కూడా చేస్తున్నాడు. అతను వాటిని సర్దుతుండగానే సత్యము వచ్చాడు.

"ఏరా ఇంట్లో ఏమీ లేవే..."

"అబ్బబ్బ! ఏమిట్రా నీ సాధింపు, ఇల్లాలులా, లేవగానే బ్రెడ్ తెచ్చాను తిందాము. ఈ పూట గడుపుకోవాలి" బ్రెడ్ తిని నిద్రపోయాడు.

ఆదివారము ఉదయము లేచి గడ్డం గీసుకుని తయారవుతున్నాడు వేణు.

"యెక్కడికయినా వెళ్ళాలా?"

"ఊఁ. ఒక స్నేహితునివెంట పిక్నిక్‌కు వెళ్తున్నాను."

"ఒరేయ్! నీ మాటలు నమ్మమనేనా? నాకంటే నీకున్న స్నేహితులెవరురా? నీకు ఇస్త్రీ బాగా పెట్టవస్తుంది. నావి రెండు ప్యాంట్లు వున్నాయి."

"ఒక్కసారి హోటల్‌కెళ్ళేది మానితే హాయిగా లాండ్రికి యివ్వవచ్చు" నిర్లక్ష్యంగా జవాబు చెప్పి, డ్రస్సు వేసుకుని వెళ్ళిపోయాడు. బస్‌స్టాప్ వద్ద రాధ ప్రత్యేక అలంకారముతో యెదురు చూస్తోంది.

"వచ్చారా! పిరికివారు. రారనుకున్నాను."

"మాటి మాటికలా అంటే ఊరుకునేది లేదు" కోపముగా చూశాడు.

"అలా మీకు కోపమువస్తే చూడాలని ఉందండీ" బస్సు రాగానే యెక్కారు. రాధ కూర్చుని తన ప్రక్కన సీటు వేణుకు చూపించింది. ఇబ్బందిగా కూర్చున్నాడు.

"రాధా! నీలో తెగింపు చాలా వుంది సుమా! ఎవరయినా తెలిసినవారు చూస్తే?"

"చూస్తే!" వెక్కిరించింది. ఇవ్వాళ, రేపు స్త్రీ పురుషులు కలిసి తిరిగే రోజులు. ఎవరో స్థలములేక కూర్చున్నారంటారే తప్ప. ప్రేయసీ, ప్రియులనుకోరు



లెండి" బస్సులో సంభాషణ పెంచే యిష్టములేక ఊరుకున్నాడు. కిద్వాయి గార్డెన్స్‌లో కూర్చున్నా వేణు మనసు ప్రకృతి పరిశీలనతో మునిగిపోయింది. రాధ అసంతృప్తిగా నిట్టూర్చింది.

"వేణూ! నీ మనసు.....యింకా వికసించలేదు" అన్నది మొదటిసారిగా పేరుపెట్టి పిలుస్తూ.

"ఎందుకు రాధా?"

"ఇంత దూరము మనము వచ్చింది చెట్లను, గుట్టలను చూడడానికా?"

"అంతే. పట్టణాలలో ఈ సహజసౌందర్య మెక్కడ లభిస్తుంది రాధా! చూడు, ఆ చెరువు దూరమునుండి నురగులు క్రక్కుతూ ఎలా మెరుస్తుందో, ఇటు చూడు, రెండు వృక్షాలు, తమ శిఖరాలను కలిపి, తల్లిదండ్రులు పిల్లలకు రక్షణ యిచ్చినట్టు బాటసారులకు నీడ నిస్తున్నాయి. అటు చూడు, ఆ పక్షులు ఎంత మత్తుగా కనురెప్ప మూశాయో! మన యెదురుగా వున్న లత చూడు, ఆ వృక్షాన్ని ఎలా పెనవేసుకుని, తన ఆలంబనను గర్వంగా చాటుతుందో."

"అదే వేణూ నేను అలాగ......... అలాగ నీ ఆలంబనతో ఈ ప్రపంచములో తలెత్తుకు తిరుగుతున్నాను. నన్ను కాదనకు" అతని వడిలో ఒదిగి పోయింది.

నిన్ను కాదని ఎవరన్నారు రాధా! మనము స్వతంత్రులము కాము. మొదట మీవారి దగ్గర నుండి విడాకులు తీసుకో.

"అంతవరకు ఇలా దూరంగా ఉండాల్సిందేనా?"

"తప్పదు రాధా"

"లేదు వేణూ! నా మనసును అర్థం చేసుకో" అన్నది.

"రాధా! అటు చూడు ఎవరో విదేశీయులు ఇటే వస్తున్నారు" ఆమెలోని వికారాన్ని కనిపెట్టి, ఆమెను లేపి కూర్చుండబెట్టి, తాను లేచాడు. ఇరువురూ సుందర ప్రదేశాలు తిరిగారు. వేణు మనసు తృప్తిగా మూల్గినా, రాధ అసంతృప్తితో ఇల్లు చేరింది. ఆమె ఆశించినది ప్రకృతి సౌందర్యము కాదు. ఉరకలేసే, యవ్వనపు పొంగును సార్థకపరుచుకోవాలనుకుంది.

# 10

వేణు ఇంటికి వచ్చి అన్నము వడ్డించుకోబోయాడు. అన్ని గిన్నె
ఖాళీ. సత్యం నిద్రపోతున్నాడు.

"సత్యం! ఈ రోజు వంట చేయలేదుట్రా?"

"నాకేం తెలుసురా, నీ శిష్యురాలు కుట్టిని అడుగు. నా ప్రాణా
ఓ రాక్షసిని పెట్టావురా బాబూ" అటు తిరిగి పడుకున్నాడు. టైము తొమ్మి
దాటింది. వండుకునే ఓపికలేక గ్లాసెడు మంచినీళ్ళు త్రాగి పండుకున్నాడు

రోజూ ఉదయమే అసెంబ్లీలో కనిపించి చిరునవ్వులు విసిరే రా
ఆ రోజు కనిపించలేదు. ఒంట్లో బావుండలేదా? కమలను పిలిచి అడ
లనుకుని ఊరుకున్నాడు. ఆ పిల్ల కూడా పెద్దదవుతుంది. పెడర్థాలు తీ
కష్టం అనుకున్నాడు. లీజరుంది, ఆఫీసులో పని కూడా లేదు. అలాంటప్పు
లైబ్రరీలో కూర్చుంటాడు. ఆ రోజు అలాగే కూర్చుని వార్తాపత్రిక చదు
తూండగా, దీనవదనయై రాధ వచ్చింది.

"ఏం రాధా! ఒంట్లో బావుండలేదా?"

"ఒంట్లో బావుంది. అదే...... మా వారికి చాలా సీరియస్‌గా ఉంద
రాత్రి టెలిగ్రామ్ వచ్చింది. మామయ్య, నేను వెళ్తున్నాము. నాకయి
యిష్టంలేదు. మామయ్య కోపగిస్తున్నారు"

"వెళ్ళిరా రాధా! ఇంకా ఆ బంధమునుండి నీవు విడుదల కాలేదుగా"

"మీ అడ్రసు యివ్వండి. అక్కడ వివరాలు రాస్తాను" అన్నది. చి
కాగితముపై అడ్రసు రాశాడు. అది తీసుకుంది.

"నేను ఉత్తరము వ్రాస్తే జవాబు వ్రాస్తారుగా?" దీనంగా అడిగింది

"తప్పక రాస్తాను రాధా" అటూ ఇటూ చూసి ఎవరూ లేరని తెలిశా
ఆమె కన్నీరు ఒత్తాడు.

"నా జీవితము మీ ముందు ఉంచి వెడుతున్నాను" అతని చేతుల
కళ్ళకద్దుకుని వెళ్ళిపోయింది. ఆమెవంక జాలిగా చూశాడు. సాయంత్రం ఇంటి
వచ్చేసరికి కుట్టి ఏడుస్తూ కూర్చుంది.



"ఏమైంది కుట్టీ! యెవరేమన్నారు?"

"సత్యంగారు..... సత్యంగారేమో, నా బుగ్గలు గిల్లారు. చెడ్డమాట లన్నారు. నేను మీతో చెబుతానంటే పారిపో! అంటూ గట్టిగా కొట్టారు."

"నేను అడుగుతాను. నీ పని చూసుకో పో"

"ఇంట్లో ఏమీ లేవండి. పిడికెడు బియ్యము మాత్రమున్నాయి."

"అవే కొంచెము ఉప్పువేసి వండు" కుట్టి కళ్ళు తుడుచుకుని బియ్యం పడేసి వచ్చింది. దానికి గ్రామరు, లెక్కలు చెప్పి పంపాడు. అన్నము దింపేసి తిన్నాడు. రాత్రి... తొమ్మిది గంటలకు వచ్చాడు సత్యము.

"ఈ కుట్టి వంట చేయలేదా ఏం?"

"సత్యం! దాని దగ్గర అక్షయపాత్రగాని ఉందా ఏం? యింట్లో ఏం లేవుట. పైగా పదకొండేళ్ళ పిల్లతో పరాచికాలెందుకురా?"

"ఏదో తమాషా చేశా, ఈ రోజు అన్ని వస్తువులూ తెద్దామని లిస్టు రాసుకున్నాను. దారిలో స్నేహితులు కలసి టాంక్‌బండ్ వైపు పట్టుకుపోయారు"

"ఇది నీవు నడుపుతున్నది మొదటిసారి కాదు. మొదటి నెలలో ఉపవాసాలు చేయించావు. అప్పుడే పనిలో చేరావు. డబ్బుకిబ్బంది అని వూరుకున్నాను. రెండవ తడవా అంతే. సెలవులకు ఇంటికివెళ్ళి పది కిలోల బియ్యము తెచ్చావు. చేతులు దులుపుకున్నావు దినమంతా కష్టపడేది ఎందుకురా?"

"అంత నిష్ఠూరము దేనికిరా, మనయిద్దరికి యాభై రూపాయలు ఎక్కువేమో అనిపిస్తుంది. ఇంత ఖర్చు ఎందుకవుతుందంటావు?"

"నాకేం తెలుసు? సగము కడుపుకు తిని ఉండలేనురా. నీకు చవక అనిపించిన చోటికి వెళ్ళి ఉండు. లేదా మెస్సు లేదు, నడిపేది లేదు. ఆ పాతిక రూపాయలు నాకు ఇవ్వు. నెలనెలా నేనే చూసుకుంటాను" వేణు కాస్త తీవ్రంగానే చెప్పాడు. సత్యం ముఖం మాడ్చుకుని పడుకున్నాడు. మర్నాడు బియ్యము, పప్పులు తెచ్చినా, వేణును తప్పుకునే తిరిగాడు. అలా వారము రోజులు గడిచాయి. సాయంత్రము వచ్చి దుస్తులు మార్చి కూర్చున్నాడు.

"గ్రంథసాంగుడ వెప్పుడయ్యావోమ్?" సత్యం అడిగాడు.

"చెప్పేది సరిగ్గా చెప్పి ఏడ్వరాదూ!"

"రాధనే ప్రియురాలు తన ప్రేమనంతా ఒలకబోస్తూ ఉత్తరం రాసింది. ఇదిగో" కవరు అందించాడు.

"నిన్నెవరు చించమన్నారు?"

ప్రియురాలిదని నాకేం తెలుసు. రచయితవు కదా! యెవరో పాఠకుల వ్రాశారనుకుని చింపానులే."

"యెవరు వ్రాసినా, నా పేరు మీద వచ్చిన ఉత్తరాలు చించే అధికారము నీకు లేదు" సత్యం మౌనం వహించాడు. సత్యం చింపిన ఉత్తరము చదవాలనిపించలేదు. కాని రాధ ఏం రాసిందో? సత్యం బయటకు వెళ్ళిపోయాక విప్పాడు!

వేణూ!

"నేను వెళ్ళినా, నా మనసు నీ దగ్గరే వదిలివచ్చాను. నీవు చాలా కఠినాత్ముడవు, నేను ఇక్కడ నిన్ను తలచి తపించిపోతున్నా, నీవు మాత్రం నిబ్బరంగా ఉంటావు. నీ కోపము, ఉద్రేకం చూడాలని ఉండేది. ఎందుకో జడపదార్థంలా ఉండిపోతావు, నేను వచ్చేటప్పుడయినా, నీ నుండి ఆశించిన అనుభూతుల్ని తెచ్చుకోలేకపోయాను. ఈసారి నేను వచ్చేసరికి మారాలి."

వేణూ! నాకోసం, నీ రాధ కోసం నా మనసు విప్పాను. యేం అనుకోవు కదూ!

ఇక మా వారి సంగతి. మాట పడిపోయింది. మొదటే వీలునామా వ్రాశారట. ఏం రాశారో తెలియదు. రాబందుల్లా బంధువులంతా కాచుకుని కూర్చున్నారు. మామయ్య పదే పదే నన్ను పోరుతుంటారు? వెళ్ళి ఏడుస్తూ ఆయన దగ్గర కూర్చోమని. ఏం చెయ్యాలి? ఏడుపు రానిదే. నౌకర్లు, యితరత్రా ఆయన భార్యగా నన్ను గౌరవిస్తున్నారు. నాకేమిటో ఈ వాతావరణము సరిపడలేదు, మామయ్యకూడా వెళ్ళిపోయారు. త్వరగా వుత్తరం వ్రాయి. నీ ఉత్తరానికై యెదురుతెన్నులు చూసే పరితప్తహృదయ అబల రాధ ఇక్కడున్నదని మరిచిపోకు...." చాలా ప్రేమ వాక్యాలే వ్రాసింది. వెంటనే క్లుప్తంగా జవాబు



వ్రాశాడు. మరోవారం రోజులకు 'నీవు రచయితవెలా అయ్యావ'ని తిడుతూ ఉత్తరం వ్రాసింది. నవ్వుకున్నాడు వేణు.

"ప్రేమిస్తే ప్రేమించావురా! వివాహమైన అమ్మాయినా?" సత్యం అడిగాడు.

"వివాహమైనా! కన్యేగా? పాపము ఆమె జీవితము అడవిగాచిన వెన్నెల కాకూడదురా?"

"నీకు ఎలా మనసొప్పిందో? నాకయితే నచ్చలేదురా"

"ఎవరి యిష్టం వారిది" తేల్చాడు వేణు.

ఇదివరకు అనుభవించిన కష్టాలు, ఆర్థిక పరిస్థితులు దృష్టిలో పెట్టుకుని, ఇంజనీరింగ్ చదివే ఆశ వదులుకున్నాడు వేణు. నైట్ కాలేజీలో బి.ఏ.లో చేరాలని అనుకున్నాడు. ఈ లోపల సత్యం రాధా, వేణుల ప్రణయ వృత్తాంతం ఊరికి చేరవేశాడు. కోటయ్య దంపతులు వేణును నానా మాటలన్నారు. అన్నింటికి మౌనము వహించాడు వేణు. సత్యంపై కోపం వచ్చింది.

"ఒరేయ్! అలా గడ్డము పెంచుకు తిరుగుతావేమిట్రా?" నీ మేలు కోరి చెప్పాను. అలా సెకండ్‌హాండ్ స్త్రీని చేసుకోవటానికి నీకేం ఖర్మ పట్టిందిరా! కో అంటే కోటిమంది వచ్చి నీ కాళ్ళపై పడతారు"

"చాల్లే, కొన్నాళ్ళు నీవు నోరు మూసుకుంటే ఏం బోయింది?" కోపంగా చూశాడు. సత్యం మాట్లాడలేదు. రాధ గొడవమూలంగా వేసవి సెలవులకు ఇంటికి పోలేకపోయాడు వేణు. అటు ఆమె రాసే ఉత్తరాల నిండా ప్రేమ వర్షం కురుస్తూనే ఉంది. అలాంటి ప్రేమమయిని వదిలిపెట్టుట భావ్యము కాదనిపించింది. కమిటీని కలిసి నైట్ కాలేజీలో చదవటానికి అనుమతి తీసుకున్నాడు. తోచక ఒకసారి అక్క దగ్గరకు పోతే, అందరి పరువు తీస్తున్నావని నిరసనగా మాట్లాడింది. వరదరాజు దగ్గరా అలాంటి అవమానమే లభించింది. హైదరాబాద్ రోడ్లు కొలుస్తూ రాధ ఉత్తరాలకు జవాబులు యిస్తూ వేసవి గడిపాడు. కమలవల్ల ఒకరోజు దుఃఖవార్త తెలిసింది. రాధ భర్త పోయాడని, యింటివాళ్ళంతా వెళ్ళారని. తను వెళ్ళటం సమంజసం కాదని ఊరుకున్నాడు.

పదిహేను రోజులకు ఒక రోజు అకస్మాత్తుగా రాధ అతని గదికి వచ్చింది. సుమంగళి చిహ్నాలన్నీ తీసి బోసిగా వున్న రాధను చూస్తే అతని గుండెలు తరుక్కుపోయాయి. అతని చేతులలో వాలి ఉపశమనము పొందింది.

"నేను వస్తే, అందరూ యెవరని అడుగుతారని రాలేదు రాధ! యేమనుకోవు కదూ!"

"అది నిజమే, కాని నిన్నెప్పుడు చూద్దామా అనిపించింది వేణు" ఆమె గుమ్మంలో కనపడిన నీడను చూసి దూరం తప్పుకుంది.

"ఓ, సారీ" సత్యం వెటకారం చేశాడు.

"ఫలానా సమయములోనే రావాలని బోర్డు పెట్టలేదు" అన్నాడు వేణు. సత్యము రాధవంక దాహంగా చూసే చూపులు అతని కెంతమాత్రము నచ్చలేదు. మర్యాదకు కట్టుబడి ఊరుకున్నాడు.

"మీవారు పోయారని, మీ పునర్వివాహానికి అడ్డంకి తీరిపోయింది విన్నాను."

"సత్యం! ఏమిట్రా మర్యాదలేని మాటలు?"

"అననివ్వండి. మీరు వెటకారం చేయాల్సిన పనిలేదండి సత్యం గారూ! మరో విషయము చెప్పనా, ఆయన బ్రతికి ఉండగానే తన ఆస్తిలో నాల్గవ భాగం, అంటే ఇంచుమించు లక్షరూపాయల విలువచేసేవి నాపేర పెట్టి పునర్వివాహము చేసుకోవచ్చునని వ్రాశారండి"

"ఏమిటీ! అందుకేనా మా వేణు అందరినీ ఎదిరించి మీపైకి మొగ్గింది."

"ఆయనకు ఈ విషయాలేం తెలియవు"

"అలాగా!" అన్నాడు.

"చీకటి పడుతుంది. నిన్ను పంపించివస్తాను పద రాధా" వేణు కెందుకో ఆ వాతావరణం నచ్చలేదు. రాధ కూడా లేచింది. యిరువురు బయటకు వచ్చారు.

"మీ స్నేహితుడు మీ గదిలో వుంటూ మీమీదే అలా అసూయ కనపరుస్తాడేం?"



"అది వాడి నైజము"

"ఏం నైజమో? ఆయన పోయిన దగ్గర నుండి మామయ్య ఉపదేశం చెయ్యని క్షణం లేదు"

"ఏదో ప్రగతి మార్గమువైపు పయనిస్తున్నామని నేటి యువతీ యువకులు పునర్వివాహానికి అంగీకరించినా శాస్త్రరీత్యా అది మంచిది కాదట. పాపమట. నీతి సూత్రాలు వల్లిస్తున్నాడు. లక్ష ఆస్తి ఆయన పరము చేసుకోవాలని"

"నిజంగా లక్ష ఆస్తి వ్రాసి పోయారేమిటి మీవారు?"

"అబద్ధం దేనికి చెబుతాను వేణూ?"

"నేను మా సత్యాన్ని ఉడికిస్తున్నావనుకున్నాను. అంత ఆస్తి నీకు లభిస్తున్నప్పుడు మంచి వరుడే లభించవచ్చు రాధా..." నిజంగానే అన్నాడు.

"వేణూ!" కోపంగా అరిచింది. "నన్నంత స్వార్ధపరురాలుగా భావించావా! ఆస్తి లేనినాడు కూడా నీ చల్లని నీడ యిస్తానన్నావు. నా హృదయ పీఠముపై నిన్ను ప్రతిష్టించి, అలనాటి ఆ రాధలా పూజిస్తాను. ఆస్తి అంతా వాకొచ్చేవరకు మరో ఆరు నెలలు పట్టవచ్చు. మామయ్య మెట్రిక్యులేషన్ పూర్తిచేయమంటున్నాడు. నాకయితే ఇష్టంలేదు గాని, నిన్ను చూడవచ్చుననే ఉద్దేశముతో చేరుతున్నాను."

"నిజమా రాధా!" ఆమె చెయ్యి పట్టుకున్నాడు. చీకటిలో ఆమె కళ్ళు మెరవటము కన్పించింది.

"నన్నింకా నమ్మవా వేణూ!" అన్నది ఆమె. ఇల్లు చేరగానే వేణు వెనక్కి తిరిగాడు. రాధ మాత్రం ఏదో వేళలో వేణు గదికి వస్తూండేది. అందరూ ఏమనుకుంటారోనని అతనికి బాధగా వుండేది. కొన్నిసార్లు అతను లేనప్పుడు వచ్చి అతని కోసము యెదురుచూస్తూ సత్యంతో మాట్లాడుతూ కూర్చునేది. వారిద్దరినలా దగ్గరగా చూసిన వేణుకు చాలా చికాకు వేసేది. వొకరోజు వేణు వంటరిగా కూర్చున్నప్పుడు రాధ వచ్చింది. చుట్టూ కలయ చూసింది.

"మీ స్నేహితులు యేరండి?"

"వాడితో నీకేం పని?" కాస్త తీవ్రంగానే అడిగాడు.

"ఏనేముంది? సరదాగా మాట్లాడుతాడని" అన్నది.

"ఎలా చదువుతున్నావు?"

"అబ్బబ్బ, ఏమిటా ప్రశ్న? 'ఇంకెన్నాళ్ళీ వనవాసము రాధా!' అని ఒక్కసారి అనరు. చదువు, పనితప్ప జీవితంలో ఏం లేవా?" కాస్త చికాకుగా చూసింది.

"ప్రస్తుతము నాకు కనిపించేవి అవే సుమా!" అన్నాడు.

ఆమె నిట్టూర్చి వెళ్ళిపోయింది.

సత్యం రెండు మూడుసార్లు రాధను పొగడడం విన్నాడు. అలాగే మరో నెల గడిచింది. వేణు సాయంత్రం వచ్చేసరికి తలుపులు వేసి వున్నాయి. తట్టినాక రాధ వచ్చి తలుపు తీసింది. వికసించబోయిన అతని ముఖము లోపల సత్యం కనిపించేసరికి ముడుచుకుపోయింది.

"నువ్వెప్పుడొచ్చావు రాధా?"

"ఇప్పుడే వస్తూనే తమాషాకు తలుపు వేశాను. మీరు కొట్టారు"

"ఆహా!" అన్నాడేగాని రాధ అబద్ధం చెబుతుందనిపించింది.

"అసలు నువ్వింత తొందరగా వచ్చావేం?" సత్యం అడిగాడు.

"ఆలస్యంగా వస్తానని చెప్పలేదే" అన్నాడు

మరి కాసేపుండి రాధ వెళ్ళిపోయింది.

## 11

"అయ్యగారూ! దొర పిలుస్తున్నారు" ఫ్యూన్ వచ్చి చెప్పాడు.

నెమ్మదిగా ఫైల్ కట్టిపెట్టి, హెడ్‌మిస్ట్రెస్ గదివైపు వెళ్ళాడు. అక్కడ ఆమె, శ్రీరామ్ కూర్చుని వున్నారు. వెళ్ళి నమస్కరించాడు.

"అలా కూర్చో" పొడిగా అన్నాడు శ్రీరామ్. వారి కెదురుగా ఉన్న కుర్చీలో కూర్చున్నాడు. వారి గంభీరత అతన్ని కృంగతీసింది.

"నువ్వీ బడిలో చేరింది ఎందుకు?"

"పని చేసుకుందామని"

"అయితే పని చేస్తున్నావా?"



"ఏం లోపం కనిపించింది నా పనిలో! ప్రధానోపాధ్యాయిని ఇక్కడే ఉన్నారుగా అడగండి" అన్నాడు రోషంగా.

"పని చేసుకుని, నీ మానాన నువ్వు చదువుకుని వృద్ధిలోకి వస్తావని ఆశించాను. నేను నిన్ను ఇక్కడ కుదర్చినప్పుడు పేరెంట్స్ అసోసియేషన్ వారు చాలా అభ్యంతరం తెలిపారు. నిప్పులాంటి కుర్రవాడని నీకు సర్టిఫికెట్ ఇచ్చాను."

"కాదని యెలా అంటానండి. దానికి ఆజన్మాంతం కృతజ్ఞుడను"

"కృతజ్ఞతను చూపే విధానమిదా?" శ్రీరామ్ ఓ కాగితం తీసి వేణు మీదికి విసిరాడు. హెడ్‌మిస్ట్రెస్ అసహ్యంగా ముఖం ప్రక్కకు త్రిప్పుకుంది. వేణు వణుకుతున్న చేతులతో విప్పాడు.

"ప్రియమైన రాధా!

ఈరోజు సాయంత్రము ఒంటరిగా నీతో మాట్లాడాలి. గదికి రా. యెదురు చూస్తుంటాను. భయములేదు. నీ నిర్ణయాన్ని కాదనను.

నీ వేణు."

వేణుకు అర్థం అయింది. మూడు రోజుల క్రితం సత్యంతో రాధను సినిమాహాలు దగ్గర చూశాడు. అసలు రాధ అభిప్రాయము కనుక్కుందామని వ్రాశాడు. అది వీరి చేతికెలా వచ్చింది? కుట్టి యిచ్చిందా?

"ఏం చెప్పాలా, అని ఆలోచిస్తున్నావా? అబద్ధాలు వద్దు. పరువు మర్యాదలు గల ఆడపిల్లకు యిలాగేనా వ్రాసేది?" ప్రధానోపాధ్యాయిని అడిగింది.

"అంత పెద్ద పిల్లకు ఉత్తరము వ్రాయటానికి సిగ్గెలా లేకపోయింది వేణూ! యించుమించు ఆమెది నీ వయసో, ఇంకా పెద్దదేనో!"

"పాపం! ఆ అమ్మాయి ఏడుస్తూ చీటీ నా చేతికిచ్చింది. లేకుంటే వారింటివాళ్ళు నీకు దేహశుద్ధి చేసేవారు."

"ఆమె ఇచ్చిందా?" మాట పెగుల్చుకొని అడిగాడు.

"ఆఁ! దీనికి నీ సంజాయిషీ ఏమిటి?"

"శ్రీరామ్‌గారూ! నేనో విషయము చెప్తాను దయచేసి నన్ను నమ్మండి" అని, తనకు రాధకు గల పరిచయం, తను నిర్ణయము క్లుప్తంగా చెప్పాడు.

"అలా అయితే ఆ అమ్మాయి రిపోర్టు యెందుకు చేస్తుంది?"

"అదే నాకూ అర్థం కావటం లేదండీ!"

"ఇది శుద్ధ అబద్ధం" అరిచిందావిడ.

"రాధను పిలిపించండి" శ్రీరామ్ చెప్పగానే, బెల్ నొక్కింది హెడ్ మిస్ట్రెస్. ప్యూను రాగానే యేదో చెప్పి పంపింది. మరో అయిదు నిమిషాలలో రాధ వచ్చింది. పెద్దలకు నమస్కరించి యెంతో వినయంగా నిల్చుంది.

"రాధా! ఇతను నీకు తెలుసా!"

"అదేం ప్రశ్నండి. అతను ఇక్కడ టీచరుగా!"

"అంటే నా అభిప్రాయము, పరిచయముందా అని."

"అతను కథలు రాస్తాడని అభిమానంగా పలకరించేదానను"

"అంతేనా?"

"అంతే" తల వంచి చెప్పింది.

వేణు ఆశ్చర్యపోయాడు.

"అతన్ని పెళ్ళి చేసుకుంటానని అన్నావట. నీ దీనగాథ చెప్పుకున్నావట"

"ఈ అభియోగము బావుంది! అతను రచయిత కాబట్టి నా విషయం ఊహించవచ్చు, అతను చెప్పితే మీరెలా నమ్మారు? వయసు, రూపము, ధనము దేనిలో నాకు సాటి?"

"రాధా!" కోపాశ్చర్యాలతో అరిచాడు. "ఏమిటి నువ్వంటున్నది?"

"ఆ అమ్మాయి నీ ముఖానే చెప్తుంటే ఇంకా అరుస్తావేమయ్యా" ఆమె గర్జించింది. అసహాయుడైపోయాడు.

"అయితే ఆమె నాకు వ్రాసిన ఉత్తరాలు తెస్తాను ఉండండి" వారి మాట కెదురు చూడకుండానే బయటికి వచ్చాడు. ఈసారి రాధ ముఖము మారిపోతుందని వెనక్కు చూశాడు. కాని ఆమె చిరునవ్వుతో నిర్లక్ష్యంగా నిల్చుంది. త్వరగా గది తాళం తీసి, గదంతా వెతికాడు. పెట్టె అంతా వెతికాడు,



ఉత్తరాలు పెట్టి దాచి వుంచిన గోధుమరంగు కవరు మాయమయింది. తను లేనప్పుడు వచ్చిన రాధ సత్యం సాయంతో మాయం చేసిందా? అందుకేనా రాధ అబద్ధం ఆడికూడా అంత నిబ్బరంగా వుంది చిరునవ్వు నవ్వుతూ. ఇదంతా ప్రణాళిక ప్రకారం జరిగింది. ఈ కుట్రలో సత్యం పాత్ర కూడా ఉండవచ్చుననే నమ్మకం కలిగింది. వెంటనే కాగితం కలముతీసి రిజిగ్నేషన్ పత్రం వ్రాశాడు. అది తీసుకుని బడికి వెళ్ళాడు. అందరూ ఆత్రంగా అతని వంక చూశారు.

"శ్రీరామ్ గారూ! దయవుంచి నన్ను అపార్థం చేసుకోకండి. యే కారణం చేతనో మనసు మార్చుకున్న రాధ మొదటే జాగ్రత్తపడి నా ఉత్తరాలన్నీ మాయం చేసింది."

"ఎంత ధైర్యం! ఆడపిల్లకు దొంగతనం అంటగడతావా!" అధికారిణి ఉరిమింది.

"క్షమించండి. నేను చెప్పేది నిజముగా ఆధారము లేనిదే. ఇదిగో నా రాజీనామా. ఒక్కనాటికైనా నిజం తెలుస్తుంది. రాధా! నిజంగా నీ చాతుర్యాన్ని మెచ్చుకోకుండా ఉండలేను, అలనాటి నాగమ్మను తలంపుకు తెస్తున్నావు. శ్రీరామ్‌గారూ! మీరు దయార్ద్ర హృదయముతో కల్పించిన వసతిని సద్వినియోగము చేసుకోలేకపోయాను. అది నా దురదృష్టము. ఒకనాటికైనా నిజము తెలుసుకున్ననాడు మీరు బాధపడతారు. హెడ్‌మిస్ట్రెస్ గారూ! నా ఈ పదిరోజుల జీతము మీ దగ్గరే ఉంచి, కుట్టికి ఫీజు కట్టండి. నమస్తే" రాధ వంక చూడనైనా చూడకుండా వెళ్ళిపోయాడు. శ్రీరామ్ నిజమేదో తెలుసుకోలేక అలా చూస్తూ వుండిపోయాడు.

సాయంత్రం తన సామానులన్నీ సర్దుకున్నాడు వేణు. తనలో మార్పేమీ కన్పించరాదని అతని ప్రయత్నము. సన్నని కూనిరాగం తీస్తూ, బెడ్డింగు కడుతుండగా సత్యం వచ్చాడు.

"ఎక్కడికిరా ప్రయాణమవుతున్నావ్?"

"నాకు వేరేచోట మంచి ఉద్యోగము దొరికిందిరా! వెళ్తున్నాను. గది కావాలంటే ఉంచుకో. వద్దనుకుంటే ఫస్టున ఖాళీచేయి. అంతవరకు అద్దె కట్టాను."

"బడిలో యేమన్నా అన్నారా?"

"యెందుకంటారు? సరే, నేను వెళ్ళి చిరునామా పంపుతా" అన్నాడు. యెక్కడికి వెళ్ళాలి? ఆ ప్రశ్న అతనిముందు నిలిచింది. ప్రవర్తనకు కారణం సత్యంలోని ఆకర్షణా! అంత అబద్ధం ఆడి, జీవితముతో చెలగాటమాడితే, ఆ పిల్లకేం వచ్చింది? ఒకవేళ తను నచ్చకపో ఇక మన స్నేహము త్రెంచుకుందామని చెప్పవచ్చుగా! అతని మదిలో మెదిలాడు. అతని చదువు వదిలి వ్యాపారం చేస్తున్నానని, సికింద్రాబా కాస్త దూరంలో వున్న మల్కాజ్‌గిరి అనే ఊళ్ళో ఇల్లు తీసుకొని ఉంటున్నా వ్రాశాడు. అక్కడికి వెళ్ళి ఏదైనా పని చూసుకుని, తప్పక రాత్రిపూట చ బి.ఏ. పూర్తి చేయాలనుకున్నాడు. సామానులు రిక్షాలో పెట్టుకొని, కాచిగూ స్టేషనుకు పోనిమ్మన్నాడు. సత్యం గుడ్లప్పగించి చూస్తూ ఉండిపోయాడు!

సామాన్లు పట్టుకుని బంగళా చేరేసరికి వేణును గుర్తుపట్టి జ ఎదురు వచ్చాడు.

"ఏరా! బావున్నావా? పెద్దమనిషిలా అయ్యావే!" అప్యాయం పలకరించాడు. చేయిపట్టి లోనికి తీసుకెళ్ళాడు. ఇంట్లోవారిని పరిచయ చేశాడు. తండ్రి, భార్య పోయిన పెత్తండ్రి, తల్లి, యిద్దరు తమ్ములు ఉన్నా ఒక గదిలో అతని సామానులు పెట్టించాడు. ఫలహారముచేసి యిరువు సంధ్యాదేవి ప్రకృతిపై వెదజల్లే అందాలను చూస్తూ నడుస్తున్నారు. జగన్ కొ పొలమువైపు తీసుకువెళ్ళాడు. చక్కని కూరగాయల తోట, మరోవైపు మామి జామ, నారింజ మొక్కలు మరో నాల్గు సంవత్సరాలలో కాపుపట్టేలా వున్నాయి

"ఈ తోటలు, వ్యవసాయము నాన్న చూసుకుంటారు. నే పెద్దనాన్న వ్యాపారము, గుత్తాలపని, స్కూల్ బిల్డింగ్‌లు మొదలగు కట్టిస్తున్నాము."

"అది వినే నీ దగ్గరకు వచ్చానురా జగన్! ప్రస్తుతమేదయినా ప చూపించు"

"నీకు చదవాలనే ఆసక్తి ఉంది. అయినా నీలాంటి నిజాయితీపరుడ వ్యాపారములో రాణించడురా. బి.యస్.సిలో చేరు"



"తరువాత ఏం చెయ్యాలి?"

"అది కాలమే నిర్ణయిస్తుంది. నీకు డబ్బు కావాలంటే నేను యిస్తాను"

"డబ్బు పోయిన సంవత్సరము కొంత కూడబెట్టుకున్నానురా"

"యెందుకు చెబుతున్నానంటే మా పెద్దనాన్నకు డబ్బంటే మహా ప్రీతి. ఆయనకు వారసులంటూ ఎవరూ లేరు గాని, ఉంటే ప్రమాదమే. వాడెంత నీచుడైనా డబ్బుంటేనే ఆయన గౌరవిస్తారు. నీతి, నిజాయితీపరులంటే పడదు. హాయిగా చదువు."

"సీటు వస్తుందా?"

"తప్పక దొరుకుతుంది. పోయిన సంవత్సరము మా బంధువుల అబ్బాయి నవంబరులో చేరాడు. రెండు ట్యూషన్లు సంపాదించావా చాలు. దురలవాట్లేం లేవుగా?"

సరే అతను చెప్పింది నిజమేననిపించింది, "కొన్నాళ్ళు మీ ఇంట్లో రాత్రులు పడుకుంటానురా"

"అదేం, భోజనం కూడా చేయి."

"వద్దురా! నీ మంచితనము అలా ఉపయోగించుకోవటము యిష్టం లేదు. బస దొరికేవరకూ ఉంటాను" అన్నాడు. ఆ రాత్రి వారికి అతిథిగా వుండి, రెండవరోజు యూనివర్శిటీ వైపు వెళ్ళాడు. గదిలో మరో యిరవై రోజులుండే హక్కు ఉంది, పదార్థాలు ఉన్నాయి తను సత్యం ముఖము చూస్తూ ఉండలేడు. వీధిలో వున్న విద్యార్థినులకంతా తనపై మంచి అభిప్రాయము. వారికి విషయాలు తెలిస్తే ముఖమెత్తుకు తిరిగేదెలా? జగన్ చెప్పినట్టు యూనివర్శిటీలో బి.ఎస్‌సి. ఫస్టు ఇయర్‌లో సీటు లభించింది. జగన్ ఇంట్లో రాత్రిళ్ళు పడుకుంటున్నాడు. ఒకపూట హోటల్లో, మరోపూట బ్రెడ్డో, పండో తిని కాలము వెళ్ళదీస్తున్నాడు. యూనివర్శిటీ చుట్టుప్రక్కల గదులు అద్దె మండి పోతోంది. అతను వెతుకుతూనే ఉన్నాడు. ఆరోజు 'సీతాఫల్‌మండీ'లో ఒక గది దొరికింది. పన్నెండు రూపాయలు అద్దె, ఇద్దరు పడుకునే స్థలముంది.

అంతకంటే గత్యంతరం లేదు. అద్వాన్నుకట్టి తేలికపడిన హృదయముతో స్నేహితుని ఇల్లు చేరాడు. జగన్ పెదనాన్న హాల్లో కూర్చుని చుట్ట కాలుస్తున్నాడు.

"అబ్బాయ్! ఇలా రా" వేణు దగ్గరగా వెళ్ళాడు. "ఇది సంసారుల కొంపా, ధర్మసత్రమా? ఇలా యెప్పుడుపడితే అప్పుడు రావటములో ఏ ఉద్దేశ్యం?"

"గది దొరకలేదండి. ఈరోజు దొరికింది".

"గదులకేం కరువు? మా జగన్‌కి అసలు బుద్ధిలేదు. అద్దాల కిటికీలు క్యాంప్‌కాట్ వదలిపోవాలంటే బాధగా వుందా?"

"రేపు వెళ్ళిపోతానండి" ఖిన్నవదనముతో చెప్పి గదిలోకి వెళ్ళాడు. అతని హృదయమెందుకో ఆనాడు రంపపుకోతకు గురైంది. 'ఛీ! ఆనాడే పెద్దలు చెప్పినట్లు విని, వ్యవసాయము చేసుకుంటే ఈ అవమానముండేది కాదు' అనుకున్నాడు. మొదటిసారిగా తన నిర్ణయముపట్ల నిరసన కలగసాగింది. ఆడపిల్లలా ఏడ్చాడు. జగన్ వచ్చిన చప్పుడు విని నిండుగా దుప్పటి కప్పుకున్నాడు. మర్నాడు తన సామాన్లతో గది చేరుకున్నాడు. రెండు, మూడు రోజులలో చుట్టుప్రక్కలవారితో స్నేహము చేసి, ముప్పై రూపాయల ప్రయివేట్లు సంపాదించాడు. ఒక్కోసారి ఒక్కపూట వండుకుని, మూడు పూటలు తినేవాడు. కాలము గడుస్తూనే ఉంది.

* * *

"ఆరోజు అకస్మాత్తుగా పేపర్లో ప్రకటించిన ఫోటోలు, పేర్లు చూసి ఆశ్చర్యపోయాడు. 'ఆదర్శపురుషుడైన సత్యం ఒక వితంతువును రిజిస్ట్రారాఫీసులో వివాహము చేసుకున్నాడనియూ, అతను యువతరం వారికి మార్గదర్శి అనీ' చాలా చాలా ప్రకటించారు. వధువు రాధ. అతను నవ్వుకున్నాడు. సత్యం డబ్బు మనిషని తెలుసు. కానీ మరీ స్నేహితుని పట్ల అన్యాయముగా ప్రవర్తిస్తాడని తెలియదు. రాధ భర్త వ్రాసిన ఆస్తి అతన్ని ఆదర్శంవైపు మళ్ళించిందన్న మాట.

"వేణూ! అంత దీక్షగా చూస్తున్నావేమోయ్! ఇలాంటి వార్తలు రోజూ చూస్తూనే వున్నాం" అన్నాడు. క్లాసుమేట్ అయిన వైశ్యుల అబ్బాయి నగేశం.



"ఏం లేదు. ఈ అబ్బాయి హైస్కూల్లో క్లాసుమేట్‌లే" అన్నాడు.

"కాస్త ఫిజిక్స్‌లో ఈ ప్రోబ్లమ్ వివరించవూ!" ఇరువురూ కూర్చుని లెక్క చేస్తుండగానే, అక్కడకు కోటయ్య వచ్చాడు.

"మీరెప్పుడొచ్చారు నాన్నా?" లేచాడు వేణు. "తరువాత చేద్దాం నగేశం" ఇరువురూ వెళ్ళి లాండ్‌స్కేప్ గార్డెన్‌లో కూర్చున్నారు.

"నేను వ్రాసిన ఉత్తరము అందిందా నాన్నా?"

"అందబట్టే యిక్కడికి రాగలిగాను. నీమీద అన్ని మాటలు చెప్పిన సత్యం తనలా చేశాడేమిటిరా! వాళ్ళ అత్తకూతుర్ని యివ్వాలనుకున్నారట. వాళ్ళ నాన్న డబ్బుకూడా కట్నం క్రింద పుచ్చుకున్నాడట."

"ఆ అమ్మాయికి లక్షరూపాయల విలువగల ఆస్తి వచ్చింది. పోనీలెండి. ఇంటి దగ్గర అంతా క్షేమంగా ఉన్నారా?"

కోటయ్యకు కొడుకును యెన్నో అడగాలని వుంది. నువ్వు చేసుకుంటానన్న అమ్మాయిని నీ స్నేహితుడెలా చేసుకున్నాడురా అని అడగలేకపోయాడు.

"ఏం క్షేమమో! సూరి సంపాదిస్తే ప్రేమ పెళ్ళి చేయాలని యెన్నో ఆశలు పెంచుకున్నాను. వాడు వుత్తరము వ్రాశాడు. తనతో చదివే అమ్మాయిని ప్రేమించాడట. పెళ్ళి చేసుకుంటాడట. వాళ్ళంతా నాగరికులట. అమ్మగాని, లలితగాని వివాహానికి రాదలిస్తే ముక్కు పుడకలు తీసి, మంచి బట్టలు కొనుక్కొని రావాలట. ఇంకా ఏమేమో వ్రాశాడు."

"అన్నయ్య అలా వ్రాశాడా నాన్నా?"

"నిజమేరా ఉత్తరం తెద్దామని మరిచిపోయాను. వాడలా నిర్మొహమాటంగా వ్రాశాక పోవటము దేనికని వూరుకుందామని అనుకున్నాము. మీ అమ్మ చాలా దిగులు పడుతోంది. కార్తీకంలో వివాహమట. ఒకసారి ఇంటికి వచ్చి పో."

"వస్తాను నాన్నా! గదికి వెళ్దాము రండి" ఇరువురూ లేచి బస్సెక్కి గది చేరారు. అన్నం వండి తండ్రికి పెట్టాడు. ఆయనను చూస్తే చాలా జాలేసింది. తండ్రి మర్నాడు వెళ్ళిపోయాడు. వేణుకు అన్న ప్రవర్తన చాలా

బాధ కల్గింది. విద్య మనసును వికసింపజేస్తుందంటారే, ఇంత స్వార్థ సంకుచితత్వం యెలా వచ్చింది? ఇన్నాళ్ళనుండి, అందరి బిడ్డలనో ఎత్తు తననో యెత్తుగా ప్రేమించిన అమ్మను నాగరికత అలవర్చుకొమ్మంటాడా! భగవాన్! నీ లీలలు బహు విచిత్రాలు అనుకున్నాడు. తనలాంటి వారినైతే అసలు లెక్కే పెట్టడన్నమాట. నిట్టూర్చాడు. రెండు రోజులు సెలవులు కలిసి రాగానే తల్లిని ఓదార్చి వచ్చాడు. ఆమె యెంతో దిగజారిపోయింది.

తరచూ నగరేశం వేణు దగ్గరకు చదువుకోవటానికి వచ్చేవాడు. అతను హైద్రాబాద్‌లో పేరు మోసిన శెట్టి ఇల్లరికపు టల్లుడు. అతనికి చదవాలని లేదు. మామకు చదివించాలని మహా సరదా. నగరేశంతో కలిసి చదివితే వేణుకు చాలా ఉపయోగంగా వుంది. తనకు వస్తుంది, అటు ఒకరికి సాయము చేశానే అన్న తృప్తి మిగులుతుంది.

"వేణూ! ఈ గాలి, వెలుతురు లేని గదిలో ఎలా వుంటున్నావురా?"

"ఏం చేయాలి నాగూ! మీలాంటి లక్షాధికార్లము కాము మేము. ఎంతో కష్టంమీద ఈ గది దొరికింది."

"నీకు అభ్యంతరం లేకుంటే మా యింట్లో వచ్చి ఉండరాదూ! మామయ్యతో చెబితే కాదనరు. అంత పెద్ద యింటిలో మేము నల్గురమే. నిశ్శబ్దంగా వుంటుంది."

"నాకు ట్యూషన్లకు దూరమవుతుంది."

"ఏపాటి దూరమురా. కాదనకు"

"చూద్దాంలే" జగన్ పెత్తండ్రి అన్న మాటలు గుర్తుకు వచ్చాయి. ధనవంతుల కెప్పుడూ తమ ధనమును, హోదాను చాటుకోవాలనే తాపత్రయం ఉంటుంది. వారికి దూరంగా వుండాలని తలచాడు. మర్నాడు నగరేశం మామగారే స్వయంగా వచ్చాడు.

"ఏంటయ్యా వేణుబాబూ! మా చిన్నవాడు రమ్మని యెంత చెప్పినా వినటము లేదట. లంకంత కొంప వెంట కట్టుకుపోతామా? ఈరోజు రావాల్సిందే"

"దూరముంటేనే ప్రేమలుంటాయిలెండి"



"అలా తీసివేయకు, పెద్దవాడిని చెబుతున్నాను"

"అవును వేణూ! మా యింట్లో నీకు యెలాంటి ఇబ్బంది ఉండదు" నగరేశం బలవంతం చేశాడు. గది ఖాళీచేసి వారివెంట వెళ్ళాడు. నిజంగా నగరేశం గౌరవానికి పొంగిపోయాడు. ఇరువురికి మంచాలు, మధ్యగా చదువుకునే బల్ల, టేబుల్ లాంప్, రెండు కుర్చీలు, ఆ గదికి ఆనుకుని వున్న చిన్న గదిలో వేణుకు వంట చేసుకునేందుకు వీలుగా వుంటుంది. దూరంగా వున్న ఒక ప్రయివేటు వదలిపెట్టాడు. ఒకటి మాత్రం చేస్తున్నాడు. ఇంటి అద్దె లేదు, ఇంటి నుండి బియ్యము వస్తున్నాయి. కాలము హాయిగానే గడిచి పోతుంది. సూరి వివాహము వేసవి వరకు పొడిగించారని మధు వ్రాశాడు.

నిశ్చింతగా చదువు మొదలు పెట్టాడు. నగరేశం మామగారి, అత్తగారి పద్ధతులు గమ్మత్తుగా వున్నా, అతను పట్టించుకునేవాడే కాదు.

"ఏమే! చెగోడీలున్నాయేమోగదా. అబ్బాయికి పట్రా!"

"అయ్యో! ఇంట్లో తినేది యెవరని యిప్పుడే పనిమనిషికిచ్చానండి"

"అత్తయ్యా! ఈ ఆదివారము వేణు మనింట్లో భోజనము చేస్తాడు" నగరేశం చెప్పేవాడు. అతన్ని నిరాశపరచలేక వెళ్ళేవాడు.

"ఏమిటో బాబూ! ఇంత డబ్బుంది, ఖర్చేది? పావు బియ్యము వండితే నల్గురము తినగా గుప్పెడు అన్నము మిగులుతుంది. మా నగరేశమంటావా గుప్పెడన్నము కంటే తినడు" ఆవిడ వడ్డిస్తూ చెప్పేది. గుప్పెడు అన్నం కంచములో పడగానే చాలనేవాడు.

"మా వైశ్యులు వంటలకు పెట్టింది పేరోయ్! ఇంత మంచివారు నీకెక్కడ దొరుకుతారు?" మామగారి వ్యాఖ్యానము.

"నెయ్యి వంచవేమే" లోపలనుండి నగరేశం భార్య సన్నగా పలికేది.

"అయ్యో తల్లీ! నాకా మాత్రం తెలియదుటే! అబ్బాయి పరాయివాడా! ఈ వాసన నెయ్యిని భరించవద్దూ". వారి మాటలెలా వున్నా నగరేశం భార్య దొంగచాటుగా ఫలహారాలు తెచ్చి, అన్నయ్యా అంటూ ఆప్యాయంగా పెట్టేది. నగరేశం మామగారు దయతలచి గది యివ్వలేదు. అల్లుడికి ఫిజిక్స్ చెప్పమని ఓ ఉపన్యాసకుడిని అడిగాడు. అతను యాభై రూపాయలు అడిగాడు, అందుకే

వేణు సహచర్యం కోరాడు. పెద్దమార్పులేమీ లేకుండా బి.ఎస్‌సి మొదటి సంవత్సరం ముగిసింది. నగరేశాన్ని తనింటికి రమ్మని ఆహ్వానించి ఊరు వచ్చాడు.

## 12

మధు మర ఆడిస్తుంటే, అతనికి సహాయముచేస్తూ సాయంత్రం వరకూ ఉండి ఇంటికి వచ్చాడు.

"అన్నయ్యా! పెద్దన్నయ్య పెళ్ళి అయిపోయిందట. వచ్చే వారం వస్తారట. ఇల్లూ, అదీ శుభ్రము చేయించమన్నాడు. ఆయన స్నేహితుడొక కుర్చీలు, మంచము తెస్తాడట. గదిలో వేయించమన్నాడు" ప్రేమ ఒగరుస్తూ చెప్పింది.

"అన్నయ్య వచ్చాడా?"

"లేదన్నయ్యా! ఉత్తరం వ్రాశాడు" అన్నది. అయిందానికి చేసేదేమీ లేదని తల్లిని సమాధానపరిచాడు. అతని మనసు అశాంతిగా ఉంది. అలాంటప్పుడు రాధాకృష్ణ దగ్గరకు వెళ్ళి వుపశమనం పొందేవాడు. ఆయన బదిలీ అయి వెళ్ళిపోయాడు. తన ఆవేదన రచనల రూపములో పెట్టాలని తలచాడు.

ఎదురుచూసిన రోజున సూరి తన భార్యతో దిగాడు. ప్రేమ ఆమె వంక వింతగా చూసింది. మోచేతులు దాటిన జాకెట్టు, మొగవారి షర్టులా హైనెక్, ఒక చేతినిండా మలారములో ఉన్నట్టు గాజులు, మరొక చేతికి గడియారము, క్రేపుచీర, అంచుల వద్ద అక్కడక్కడ అద్దాలు కుట్టి ఉన్నాయి. మనిషి తెలుపు, నలుపు కాదు, పూసుకున్న రంగువల్ల తెల్లగానే కనిపిస్తుంది ముఖము. కోటయ్య దంపతుల కయిష్టంగా వున్నా, కోడలు డాక్టర్ అనుకుంటే ఎక్కడలేని గర్వము పుట్టుకు వచ్చింది. ఆ ఊరిలో ఎవరి కోడలు డాక్టరు చదివింది గనుక? అన్నీ మరిచి కొడుకు, కోడల్ని సాదరంగా ఆహ్వానించారు.

"సుజా! మా అమ్మా, నాన్న, చెల్లెలు ప్రేమ, వీరిద్దరూ తమ్ముళ్ళు" పరిచయము చేశాడు. అందరికి నమస్కరించిందామె. సూటులో నిండుగా



ఉన్న కొడుకుని కళ్ళింతచేసి చూసింది చిట్టెమ్మ. పసిమి ఛాయతో యవ్వనముతో మిసమిస లాడుతున్న సూరి అందరినీ ఆకర్షిస్తున్నాడు.

రెండు రోజులలో వేణు గమనించిందేమిటంటే, సుజాత సహజముగా మంచిదే అయినా, సుపీరియారిటీ కాంప్లెక్స్. తనముందు అందరూ అల్పులే అన్నట్టు చూస్తుంది. దానికి సూరి వత్తాసు. భయభక్తులతో తిరిగే అత్తమామల ప్రవర్తన.

"ఏయ్!.....ఈ వూర్లో గ్రంథాలయం వుందా?" ప్రేమను అడుగుతుంది.

"ఉంది వదినా! చిన్నన్నకు వారంతా బాగా తెలుసు. అడగండి తెచ్చిపెడతాడు"

"ఇద్దరు చిన్నన్నలుగా! ఎవరు?"

"వేణు అన్నయ్య"

"ఆ నల్లటబ్బాయా?" అని లోపలికి వెళ్ళింది. నిద్రపోతున్న సూరిని లేపింది.

"వద్దు మొర్రో, ఏ బెంగుళూరో వెళ్దామంటే, పల్లెటూరికి పట్టుకొచ్చావు. ఏం తోచడం లేదు. మీ తమ్ముడికి చెప్పి, లైబ్రరీ పుస్తకాలు తెప్పించి పెట్టు" అంతా వింటున్నాడు వేణు. వారి కోసం తనే కష్టపడి గది అలంకరించాడు. కాని ఎందుకో అలాంటివారికి పనులు చేయరాదనిపించింది.

"వేణూ!" సూరి పిలుపు వినిపించింది. అన్నగారిని నిర్లక్ష్యము చేయమని ఏ శాస్త్రమూ చెప్పలేదు. అందుకే వెళ్ళాడు. నవ్వుతూనే వదినను మార్చాలని ప్రయత్నించాడు.

"సుజాతకేం తోచడంలేదటరా! లైబ్రరీ నుండి పుస్తకాలు తెస్తావా?"

"తప్పక. వదినకు మా అందరిపేర్లు మరోసారి చెప్పి కంఠతా చేయించు అన్నయ్యా! ఇది అసలే పల్లెటూరు, పట్టణం గాని ఊరేమో, చిన్న మాటకూడా అంటువ్యాధిలా ఊరంతా సోకుతుంది. 'ఫలానా సూర్యనారాయణ భార్య ఆడపడుచును 'ఏయ్' అనీ, మరిదిని 'నల్లపిల్లవా'డంటుందనీ, ఎందుకమ్మా అంత పెద్ద చదువులు అంటారు."

సుజాత ముఖము నల్లబడింది. సూరి భార్యని, తమ్ముడిని మార్చి మార్చి చూశాడు. వేణు నవ్వుకున్నాడు.

"సాయంత్రము తెస్తానన్నయ్యా" అని వచ్చేశాడు. మరురోజు భోజనాల దగ్గర అత్తగారి వంటలు బావుండవనే అభిప్రాయము వెలిబుచ్చింది సుజాత. కోడలికి తన సరసన కూర్చుని తినటానికి అభ్యంతరము లేకపోయినా, కోటయ్య మొదటే భోజనముచేసి తప్పుకుంటాడు.

"ఈ పదార్థాలు ఏమిటండీ! మరీ పదిహేనో శతాబ్దపు మనుషులు తిన్నట్టు."

"వదినగారూ! ఇరవయ్యో శతాబ్దపు మనుష్యులు తినే వంటకాలు నీవు చేయరాదమ్మా, తిని తరిస్తాం" అన్నాడు వేణు.

"ఏమిట్రా వేణూ! అతివాగుడు" సూరి మందలించాడు.

"వదినా, మరదుల సరసము అన్నయ్యా! నీకు ఉక్రోషం దేనికి? సరసము, హాస్యము లేనిది జీవితము ఏం బావుంటుంది?"

"నాకు వంట చేయాల్సిన గతేం పట్టలేదు. నేను డాక్టరుని" బింకంగా అంది సుజాత.

"వదినా డాక్టర్లయినా చిన్నపిల్లలా తర్కము చేస్తున్నారు అంటే, మీ విద్య పరీక్షలు పాసవటానికే ఉపయోగించారన్నమాట! స్త్రీ యెంత చదివినా, రాజ్యాలు ఏలినా, ఏదో ఒక సందర్భములో పాకశాస్త్రములో ప్రావీణ్యతను చాటుతుంది. మమత, మానవత ఆమె సొత్తు. ఆ నిజము మరిచిపోకు. స్త్రీ అబల. ప్రకృతి ఆమెకో పరిధి గీచింది."

"నాన్‌సెన్స్! అదంతా పాత కాలపు మాటలు."

"కాలము ఒక చైతన్యము వదినా! దానికి క్రొత్త, పాతలంటూ లేవు. మానవుడు తన మనుగడ విధానములో మార్పులు తెచ్చుకుని కాలం పేరిట చలామణి చేస్తున్నాడు, ఒక విషయములో చెప్పు తాత్కాలిక మోహావేశములో అనాగరికులంటూ, తన కుటుంబ ప్రమేయంలేక వివాహము చేసుకున్న అన్నయ్య వివాహబంధము పడగానే నిన్ను ఆజ్ఞాపించి మా వద్దకు యెలా తెచ్చాడు?" పల్లెటూరి పిల్లడు. అనాగరికుడు, తన వేషబాషలు చూసి



ఇన్ఫీరియారిటీ కాంప్లెక్సుతో ఓ మూల పడి వుంటాడనుకున్న మరిదేనా! సుజాత మౌనము వహించింది.

"ఊరుకోరా వేణూ! ఏదో మన వంట సరిపడలేదులా వుంది. ఏం చెయ్యాలో చెప్పమ్మా, రేపటి నుండి" అన్నది చిట్టెమ్మ. కోటయ్యను అందరూ కానీ ఖర్చు లేకుండా కొడుకు పెళ్ళి చేశానని సాధించటం మొదలు పెట్టారు. బంధువులకు, స్నేహితులకు ఆహ్వానాలు పంపారు సత్యనారాయణ వ్రతము రమ్మని. అందరూ వచ్చారు. రెండుచేతులా ఆర్జిస్తాడనుకున్న కోటయ్య కొడుకు నాల్గుచేతులా ఆర్జిస్తాడని అందరూ పొగడి వెళ్ళిపోయారు. శుభకార్యము జయప్రదంగా ముగిసినందుకు సంతోషించారంతా. మరో రెండు రోజులుండి, సుజాత, సూరి వెళ్ళిపోయారు. సెలవులు పూర్తి అయ్యేవరకుండి తండ్రికి సాయము చేసి వచ్చేశాడు వేణు.

ఈసారి మరి రెండు ట్యూషన్స్ దొరికాయి. హాయిగా గడిచిపోతుంది కాలము. మునుపటిలా కాక అప్పుడప్పుడు కోటయ్య వచ్చి క్షేమము అడిగిపోతున్నాడు. బియ్యము, పచ్చళ్ళు తెచ్చి ఇస్తున్నాడు. రెండవ సంవత్సరము చదువుతున్నా ట్యూషన్లవల్ల విరామము లేదు, మొదటి టర్మ్ సెలవులకు ఇంటికి వెళ్ళరాదనుకున్నాడు వేణు. అంతలోనే తండ్రి ఉత్తరము వచ్చింది. అత్యవసరమైన విషయాలు మాట్లాడాలి, రమ్మని వ్రాశాడు. ఈసారి శెట్టిగారిని అడిగి నగరేశాన్ని వెంటబెట్టుకుని వెళ్ళాడు. ఈ రెండు నెలలకే తండ్రి యెంతో పెద్దవాడయినట్టు అనిపించింది. మధుతో మిల్లుకు వెళ్లిపోయాడు నగరేశం. తండ్రి కొడుకులు మిగిలారు.

"యెందుకు నాన్నా! అత్యవసరంగా రమ్మని వ్రాశారు?"

"మాట్లాడాలనే. లలిత పిన్నత్త కొడుకు. బి.కామ్, ఏదో ప్యాసయ్యాడట. ప్రేమకు కుదిర్చాను. సూరికి ఉత్తరము వ్రాస్తే మీ యిష్టం అన్నాడు. ఏడువేలు అడుగుతున్నారు సాహెబ్‌గుట్ట దూరం. అక్కడి పొలం పదివేలకు బేరం పెట్టాను. అలాగే నీవూ అంగీకరిస్తే, పెళ్ళిళ్ళన్నీ ఒకేసారి చెయొచ్చునని....."

"అన్నీ అంటారు ఎన్ని నాన్నగారూ" నవ్వాడు వేణు. "మేము మొగపిల్లలము. మా పెళ్ళికేం తొందర. ప్రేమది కానియ్యండి. అమ్మకున్న

బంగారమంతా అమ్మారు. అది కొనండి. తరవాత మా పెళ్ళి విషయము ఆలోచించుదురుగాని."

"నేను అలాగే ఆలోచించానురా కాని... కాని మధుగాడు తన పెళ్ళి చేయమంటున్నాడు" కోటయ్య నెమ్మదిగా గొణిగాడు.

"వాడే తన పెళ్ళి చేయమని అడిగాడా నాన్నా!" నమ్మలేక పోతున్నాడు వేణు.

"అయ్యో, అదొక్కటేనా తండ్రీ! మీ నాన్న వాడిని నెత్తిన ఎక్కించుకుని పాడు చేశాడు. అడ్డమైన వేషాలు వేస్తున్నాడు. పైగా సూరి చదువుకయ్యే ఖర్చు అంతా జమచేసి వాడికి ఇవ్వాలంటాడు. మిల్లుమీద వచ్చిన ఒక్కపైసా ఇంట్లోకి ఇవ్వటము లేదురా" చిట్టెమ్మ కంటతడిబెట్టింది.

"నేను కాదు నెత్తికెక్కించుకుంది. నీ గారాల కొడుకు సూర్య నారాయణ దొర పెళ్ళి చేసుకుని ఈ యింటికో ఉదాహరణగా నిలిచాడే"

"వాడంటే చదువుకున్నవాడు...."

"చాల్లే బడాయి" కోటయ్య కసిరాడు. ఎందుకో వేణు హృదయము బాధగా మూల్గింది. తండ్రి ఒక కొడుకు పక్షము, తల్లి మరో కొడుకు పక్షం. నిజంగా సూరి, మధు అదృష్టవంతులు. భగవాన్ మరోజన్మ అంటూ వుంటే నాకిలాంటి ప్రేమ ప్రసాదించు తండ్రీ అనుకున్నాడు. వారు చూడకుండా సజల నేత్రాలను తుడుచుకున్నాడు.

"నాన్నా! మామయ్య కూతుర్ని మాట్లాడకూడదూ? అమ్మకు సాయంగా వుంటుంది."

"అడిగాముర! వాళ్ళమ్మాయిని చదివిస్తారట. అయినా ఇప్పుడే పెళ్ళి ఏమిటని వెక్కిరించాడు. చిట్యాలలో బంధువులమ్మాయి వుంది అందరము చూశాము. కాస్త వీడికి పెద్దదవుతుందేమోననుకున్నాము. వాడికి నచ్చింది. ఇక నీ విషయము తేల్చు?"

"నా విషయమా! నేను బ్రతికేదే కష్టం. పెళ్ళిదేనికి?"

"అది వేరుసంగతి. పెద్దవాడిని వుంచి చిన్నవాడి పెళ్ళిచేస్తే అందరే మనుకుంటారు? ఆ మధ్య నువ్వుకూడా చేసుకోవాలని అనుకున్నావుగా?"



"క్షమించండి నాన్నగారూ! నా దృష్టి అటువైపుకు తిరగనేలేదు. యేదో ఆ అమ్మాయి తన దీన చరిత్ర చెప్పుకుని ఏడిస్తే అంగీకరించాను. ఇప్పుడాలోచిస్తే పిచ్చిగా తొందరపడ్డానేమో అనిపిస్తుంది. యెవరేమనుకోరు. మధు వివాహము చెయ్యండి."

"నీవు పోషించాల్సిందేముందిరా! అమ్మాయి నీ చదువు అయ్యే వరకు మా దగ్గర వుంటుంది. అప్పో, సప్పో అందరూ ఒక యింటివారయితే మాకు నిశ్చింత" అన్నది చిట్టెమ్మ.

"నిశ్చింతగా ఉంటామనుకోవటము పొరపాటమ్మా! యెప్పుడూ ఏదో ఉంటూనే వుంటుంది. నాకప్పుడే పెళ్ళి చేసుకోవాలని లేదమ్మా!" నిక్కచ్చిగా చెప్పాడు.

"మా వైపు నుండి తప్పులేకుండా అడిగాము, ఇక నీ యిష్టం" అన్నారు. మరో నాల్గురోజులు వుండి వచ్చేశాడు వేణు.

డిసెంబర్‌లో ప్రేమ పెళ్ళి, మరో నాల్గురోజులకు మధు పెళ్ళి అని తండ్రి తెలిపాడు. వేణు సెలవుచీటీ యిచ్చి ఇంటికి వెళ్ళాడు. తల్లి దండ్రుల అవస్థ చూస్తే కళ్ళు చెమర్చాయి. మధు కాబోయే పెళ్ళికొడుకు. సూరి నూతన వరుడు అతను గది విడిచి వచ్చేది లేదు. అక్కడికే వధువుగా అలంకరింపబడిన ప్రేమ అన్నీ మోయాలి.

"అమ్మా! అతనేనా చదివింది బోడి డాక్టరు. వెళ్ళి పిలవరాదూ? గదిలో కూర్చుంటే పనులెలా అవుతాయి?" లలిత కేకలు వేసింది.

"ఏదో క్రొత్తగా వివాహమైన దంపతులు, సరదా లేవే. ఈ మధు గాడిద చూడు. అప్పుడే బాసికము కట్టుకున్నట్టు వేషాలు" అని పెద్దకొడుకును వెనకేసుకు వచ్చింది చిట్టెమ్మ.

"మొదట పెద్దకొడుకు చేస్తే, అందరూ వాడినే అనుసరిస్తారు. అమ్మా ప్రేమా! కాసిన్ని మంచినీళ్ళివ్వు. నా కండువా యెక్కడుందో పట్రా."

"పెళ్ళికూతురయినా దాన్ని ఓ చోట కూర్చోనివ్వరా. ఎక్కడి మనుషులు బాబూ. పెద్దమ్మాయితో తెప్పించుకో రాదండీ?"

"అంటే కోపంగాని పెళ్ళికూతురని ఊరుకుంటున్నావా, నీ కొడుకు చాకిరీ చేయటము లేదూ! నాన్నగార్కి పనిచేస్తే వచ్చిన నష్టమేమిటి!" విసుక్కుంది లలిత.

"అక్కయ్యా! తీరికగా తగవులాడుదాం. వెళ్ళి ముస్తాబయిరా. పెళ్ళి వంక వారు దేవాలయములో దిగారు. అలక సాగించేరు" వేణు విసుక్కున్నాడు.

"ఒదినా! మీ వేణుబాబు చూడమ్మా! పదేసి కూరలు దేనికి పారవెయ్యటానికా అంటున్నాడు. మూడు కూరలు చాలుట" వరదరాజు భార్య కమలమ్మ ఫిర్యాదు.

"అన్నయ్యకేం తెలయదత్తా ఘనంగా వుండాలి" పెళ్ళికూతురు ప్రేమ కలగచేసుకుంది. వేణు చిత్రంగా చెల్లెలి వంక చూశాడు.

"విషయాలు, విందులు చూసుకోవటానికి మేము ఉన్నాం. కాస్త పెళ్ళి కూతురిలా నోరు మూసుకుని కూర్చో"

"చూడమ్మా! అన్నయ్య" ప్రేమ గారాలు కురిసింది.

"అన్నయ్యలు పెద్దవారయ్యారే. నువ్వూరుకో" చిట్టెమ్మ కసురుకుంది. వేణు, అతని స్నేహితులు కలసి యెలాగైతేనేం పెళ్ళివారితో మాట రాకుండా చేశారు. ప్రేమ వివాహముచేసి అత్తవారింటికి పంపారు. ఉదయం ఆరు గంటలకు ప్రయాణమయినా, సూరి, భార్య లేవలేదు.

"చిన్నవాడి పెళ్ళి పెద్దవాడు చూడరాదు. వేణును యిక్కడే ఉంచి పొమ్మని" కొందరు పెద్దలు సలహా యిచ్చారు.

"అదంతా పాత పద్ధతి సింగినాదం, ఏమవుతుంది! వాడు లేకుంటే చేయి విరిగినట్టు ఉంటుంది. రానివ్వండి" అంది తల్లి.

"వద్దు రేపు మంచి, చెడు ఏది జరిగినా మన నెత్తినే రుద్దుతారు నేరము. ఎలాగో మన తిప్పలు మనము పడదాము" అన్నాడు కోటయ్య. అన్నట్టే చాలా యిబ్బంది పడ్డారుగాని మగపెళ్ళివారు కావటము మూలాన రగడ జరగలేదు. క్షేమంగా తిరిగి వచ్చారు. ఆరోజు అందరూ నిశ్చింతగా కూర్చున్నప్పుడు, లైబ్రరీలో పనిచేసే వేణు చిన్నప్పటి నేస్తం పరుగెత్తుకు వచ్చాడు.



"వేణూ! నీ కథ 'స్త్రీ' మేగజైన్‌లో పడిందిరా" మహా సంతోషముగా చెప్పాడు.

"అలాగా! అంత చాటింపు దేనికిరా?" కసురుకున్నాడు.

"అయితే నీవు కథలు కూడా రాస్తావా? నీ పేరు ఎప్పుడూ చూడలేదే!" అన్నది సుజాత.

"వాడు 'విద్య' అనే పేరుతో వ్రాస్తాడండి" వేణు స్నేహితునికి ఉత్సాహముగా వుంది.

"నిజమా వేణూ!" ఆశ్చర్యంగా చూశాడు సూరి. "నువ్వేదో రాస్తావని తెలుసు కాని, 'విద్య' నీ పేరని తెలియదు."

"అయితే రెండు నెలల క్రితము పడిన 'సంసారం' కథ మీ తమ్ముడేనా రాసింది?" సాలోచనగా తలాడించింది సుజాత.

"అవును వదినా! మీకు నచ్చలేదా యేం?"

"నచ్చుట, నచ్చకపోవుట కాదు సమస్య. నువ్వా బ్రహ్మచారివి, సంసారాన్ని గురించి అంత మధురంగా, భార్యాభర్తల సరస సంభాషణలను గూర్చి అంత కట్టుదిట్టంగా యెలా వ్రాశావు? దాన్ని బట్టి యేం తెలుస్తుందంటే..." ఆగిపోయింది.

"ఆగిపోయావేం? చెప్పు" అన్నాడు సూరి.

"చెప్పండి వదినా" వేణు ఉత్సాహంగా అడిగాడు. యిన్నాళ్ళకు తన కుటుంబములో ఒక వ్యక్తి తన రచనలు విమర్శిస్తుంటే వినాలనే ఉంది.

"అంటే, మీరు సంసార సుఖాన్ని అనుభవించారని తెలుస్తుంది." ఆ మాట కందరూ అదిరిపడ్డారు. వేణు కోపగించుకుంటాడని భావించారు. అతను చిరునవ్వు నవ్వాడు.

"మీ ఆలోచనలకు నవ్వు వస్తుంది వదినా! అనుభవించిన విషయం మీరు రాయగలరు. అయితే నేను వ్రాసిన 'రాలిన రేకులు' అనే కథ చదివి ఉంటారు. ఎనభై ఏళ్ళ వృద్ధుని భావాలు వర్ణించాను. అయితే వృద్ధాప్యము అనుభవించానంటారా?"

"నిజమే..." సూరి తలాడించాడు.

"రచయిత అంటే ప్రతి విషయము తన జీవితములో జరిగింది తీసుకోవాలంటే కష్టం! ఆఁ, ఏదో ఓ సంఘటన యెక్కడో ఒకచోట వ్రాయవచ్చు పసిపాప పుట్టగానే పాలకోసం తడుముకుంటుంది. అదెవరు నేర్పారు? ప్రకృతి. అలాగే ప్రకృతిసిద్ధంగా లభించిన ఈ రచనాశక్తికి యెన్నో రకాల ఊహలూ, అనుభవాలూ తడతాయి. వాటికి రూపకల్పన చేయడమే రచయితలోని ఘనత. ఇప్పుడే వచ్చిన 'స్త్రీ' కథ తీసుకోండి. అందులో పురుషపాత్ర ప్రాముఖ్యమే లేదు. స్త్రీ తన భావాలను, వయసు పెరిగిన కొద్దీ యెలా మార్చుకుని, తన వృద్ధాప్యాన్ని అంగీకరించదో చూపా. అయితే నేను స్త్రీని అయ్యానా?"

"అమ్మ బాబోయ్! మీరు బడిపంతులుగా బాగా రాణిస్తారు. నవ్వింది. వేణుకు తృప్తిగా వుంది. కనీసము వదినగారి దురభిప్రాయము తొలగించాను కదా అని. ఆ రోజు నుండి సుజాత కాస్త చనువుగానే పలుకరించేది, మాట్లాడించేది. వేణు ప్రయాణమై అన్నగారిని వెతుక్కుంటూ పెరటిలోకి వెళ్ళాడు. అక్కడ సూరి, సుజాత ఏదో విషయమై తీవ్రంగా చర్చించు కుంటున్నారు. గుమ్మములోనే ఆగిపోయాడు.

"మీరు అడిగి చూడరాదండి! ఒక కన్ను లేనంత మాత్రాన ఏమైంది? ఆస్తిపాస్థులున్నాయి."

"వాడికేం వంకని గుడ్డిపిల్లను చేసుకుంటాడు సుజా!"

"అయితే మీ నల్లతమ్ముడికి మాలాంటి అమ్మాయిలు దొరుకుతా రనుకోవటం భ్రమ."

"సరేలే..." ఇక వినాలనిపించలేదు. వదిన మాట్లాడిన మాటలు అతని హృదయాన్ని గాయపరిచాయి. పెళ్ళి కెదిగిన తన పిన్ని కూతురొకర్తె కన్ను పోగొట్టుకొని వుంది. ఎవరయినా విశాల భావాలు గల అబ్బాయి వుంటే చూడమంది. దాని అర్థం యిదా?

"వేణూ! నన్ను మా యింటి దగ్గర వదిలిపోరా!" లలిత అడిగింది. ఆమెను తీసుకెళ్ళి వారింట్లో వదిలాడు. క్రొత్తఇంట్లో అన్నీ అధునాతనమైన సామాన్లు వున్నాయి.

"ఈ టేప్ రికార్డరు ఎప్పుడు కొన్నారక్కయ్యా?"



"మీ బావ స్నేహితుడు జోర్డాన్ వెళ్ళాడు. తిరిగి వస్తూ తెచ్చాడు. ఈకుక్కింగ్ రేంజ్ మా రెండో మరిది పెట్టించారు. కెమేరా డచ్ నుండి వీరి మామ కొడుకు తెచ్చాడు. రిఫ్రిజిరేటరు బావగారే కొన్నారు. ఈ రికార్డు ప్లేయర్ మా చిన్న మరిది కొన్నారు" లలిత చెబుతుంటే రికార్డు ప్లేయర్ ఆన్ చేయబోయాడు.

"ఉండరా, నీకు రాదు. నేను వేస్తాను" అని వచ్చింది లలిత. అదెంతకూ ఆన్ కాలేదు.

"చెయ్యిపెట్టి ఏం చేశావురా? పాడయింది. ఆయనొచ్చి యేమంటారో?"

"నేను ఊరికే ముట్టుకున్నాను. అంతే"

"అది నీకు తెలుసా, పాడా? అందుకే ఆయన అంటుంటారు తాళం వేస్తానని. నేనే వద్దన్నాను" వేణుకు తల కొట్టేసినట్టయింది.

"ఎప్పుడొచ్చారోయ్? ఏమిటి లలితా అరుస్తున్నావ్?"

"వీ డీ రికార్డు ప్లేయర్ని ముట్టుకుని పాడుచేశాడు."

"అది మొదటే పాడయింది. నేను ఇప్పుడే మెకానిక్ దగ్గరకెళ్ళి వస్తున్నాను."

వేణు ఊపిరి పీల్చుకున్నాడు. జన్మలో అలాంటి వస్తువులు ముట్టుకోరాదని లెంపలు వాయించుకున్నాడు మనసులోనే. ఆ రాత్రి వారింట గడిపి రెండవరోజు తన బసకు చేరుకున్నాడు. అప్పుడప్పుడు నగరేశం మామగారితో తన ఇంటిలోని యిబ్బందులు చెప్పుకునేవాడు. కాలము గడుస్తోంది. పరీక్షలు దగ్గరకొస్తున్నాయని దీక్షగా చదవటం మొదలు పెట్టాడు. ఆ రోజు ట్యూషన్ పూర్తిచేసి వచ్చేసరికి ఇంటిలో గొడవ జరుగుతూ వుంది.

"ఏమిటి నగరేశం?"

"రాత్రి మామయ్య వచ్చి కోటు యిక్కడ తగిలించారట. మరిచి పోయారు. ఈపూట చూస్తే అందులో పెట్టిన రెండు వందల రూపాయలు లేవు."

"మనమే వున్నాము కదా! రాత్రి యెవరూ రాలేదు కూడాను. ఇంకెక్కడైనా పెట్టి మరిచిపోయాడేమో! జ్ఞాపకం చేసుకొమ్మను."

"లేదు వేణూ! నేను జేబులో వేసుకువచ్చాను. పోనీ, డబ్బంటే ఆశలేనిది యెవరికి? యెవరు తీసినా రేపు ఉదయానికి నా బల్లమీద పడేస్తే పదిరూపాయలు ఇస్తాను" శెట్టిగారు అన్నారు. వేణు ఉలిక్కిపడ్డాడు. కుటుంబ సభ్యులు తప్ప అక్కడ తనే పరాయివాడు తనను అనుమానిస్తున్నారా!

"ఈ బహుమతి యెవర్ని దృష్టిలో పెట్టుకొని ప్రకటించారండీ!"

"తీసినవారిని. నాదే తప్పు బాబూ! మంచీ, చెడూ చూసుకోకుండా దారినపోయే వారిని యింట్లో తెచ్చి పెట్టుకోవటము. మా అల్లుడో తెలివి తక్కువవాడు. నా తెలివి ఏమయింది? ఆశకుపోగా గోతిలోపడ్డాను."

"శెట్టిగారూ! మీరు ధనవంతులే కావచ్చు. మీ దగ్గర రాసులకొలది ధనమే ఉండవచ్చు. కాని, మేము మాత్రం నీచులము, నికృష్టులము కాదని తెలుసుకోండి."

"అంత రోషం దేనికయ్యా! నికృష్టుడిని కాకపోయినా, పరిస్థితులు నీచేత అలా చేయించాయి. తన అవసరాన్ని బట్టి మానవుడు మారుతుంటాడు."

"అసంభవము! మీరే ఆధారముతో అలా మాట్లాడుతున్నారు? మీరు మాట్లాడిన ప్రతిమాట నిరూపించాలి."

"ఆఁ. పోలీసుల్ని పిలిస్తే అదే నిరూపించబడుతుంది" వెటకారం చేశాడు.

"మామయ్యా...." ముందుకు వచ్చాడు నగరేశం.

"నువ్వో తెలివిలేని పిల్లాడివి. నీ కోసము అతన్ని వదులుతున్నాను తక్షణం ఇంట్లోనుండి వెళ్ళిపొమ్మను. మరోచోట బుద్ధిగా బ్రతకమని చెప్పు"

"శెట్టిగారూ! ఆ సంగతి నేను చూసుకుంటాను. మీ తొందరపాటుకు మాత్రము మీరు చింతించాల్సి ఉంటుంది. కాలగతిలో ఆలస్యము అప్పుడు కాని అంధకారము కాదు. యెప్పుడో ఒకప్పుడు మీ కనులు విచ్చుకుంటాయి ఆనాడు మీ అంతట మీరే వేణును వెతుక్కుంటూ రావాలి. మీ యింట్లో యిన్నాళ్ళిచ్చిన ఆతిథ్యానికి ధన్యవాదాలు" వాళ్ళు ఏదో మాట్లాడుకుంటుండగా తను రెండు పెట్టెల్లో సామాన్లు సర్దుకున్నాడు. బెడ్డింగ్‌చుట్టి పట్టుకొని



బెడ్డింగ్ ట్రంకుపెట్టెకేసి తాడుతో కట్టి రెండూ రెండు చేతులతో పట్టుకుని బయలు దేరాడు. యెక్కడికి వెళ్ళాలి? పరీక్షలు దూరంగా వున్నా ఇంటికి వెళ్ళేవాడు. లాంగ్వేజెస్ ఇవ్వాలి. బస్సులో స్థలము చేసుకొని ముందున్న ఇంటివైపు వెళ్ళాడు. అక్కడేం ఖాళీలు లేవన్నారు. ఆ యింటాయన వేణును అభిమానించే వాడు.

"నీవు సామాన్లు పట్టుకొని వచ్చావు. అవి చేతిలో వుంటే యెక్కడని వెతుకుతావు? అవి మా యింటి వరండాలో పెట్టు. భయం లేదు. ఇల్లు చూసుకురా. రాత్రికి యిక్కడ పడుకో." అతని ఆయాచిత సహాయానికి కృతజ్ఞత తెలుపుకున్నాడు.

సామాన్లు వారి ఇంటిలోపెట్టి గది వెతకటానికి బయలుదేరాడు. ఇరవై, పాతిక అంతకంటే తక్కువ లేనే లేవు. యూనివర్శిటీ దగ్గర వెతకాలని అనుకున్నాడు. భోజనము చేయాలనిపించలేదు. వచ్చి పడుకున్నాడు. మర్నాడు యూనివర్శిటీకి తయారయి వెళ్ళిపోయాడు. నగరేశం యెందుకో వేణు ముఖం చూడలేకపోతున్నాడు.

కెమిస్ట్రీ డిమాన్‌స్ట్రేటర్ పిలిచాడు.

"వేణు! ఇదివరకు ట్యూషన్‌లు వుంటే చెప్పమన్నావు కదా!"

"అవునండి. ఇప్పుడా....."

"నీకు పరీక్షలు దగ్గరకొస్తున్నాయని తెలుసు. అయినా పెద్ద రిస్కు తీసుకోవాల్సిందేం లేదు. ఇద్దరు తొమ్మిది, ఏడు చదివే మొగపిల్లలకు తెలుగు చెప్పాలి. ఆయన చాలా మంచి వారు. నువ్వెంతడిగినా వెనుదీయడు.

"నాకున్న ట్యూషన్లే ఈ నెలాఖరు నుండి వదిలేస్తున్నాను. వారికంతా చెప్పాను."

"అది నిజమే. సెకెండ్ లాంగ్వేజ్ తెలుగు. నువ్వు చదువుకుంటూ చెప్పొచ్చు. దూరము లేదు. తారనాక దగ్గర కనిపించే తెల్లబంగళా వారిది. పంజాబ్ నుండి యిక్కడికి వచ్చి యెప్పుడో సెటిలయ్యారు. మంచివారు. లంచ్ బ్రేక్‌లో వెళ్దాము" అన్నాడు.

వేణు వెళ్ళేసరికి, వారింటిముందున్న కుక్క గయ్‌మంది. వెనకాలే వచ్చిన డిమాన్‌స్ట్రేటరుగారు, గేటుపై కొట్టాడు. ఓ పదిహేడేళ్ళ అందమైన అమ్మాయి బయటికి వచ్చింది.

"టామి.... టామి! షటప్!" కుక్కను బెదిరించింది. "గుడ్ ఆఫ్టర్ నూన్! కమిన్ ప్లీజ్." గేటు తీసుకుని ఇరువురు లోపలికి వెళ్ళారు.

"అంకుల్ లేరా, మంజూ?"

"ఇప్పుడే.... తిండి.... తిన్నారు. కూసోండి" అన్నది. వేణుకు నవ్వు వచ్చింది.

"వీళ్ళ తెలుగు మాష్టర్లు పనివారోయ్! అందుకే" అన్నాడతను.

"ఎగ్‌జాట్లీ సర్! మాకు యింత వచ్చిందని తారీఫ్ చెయ్యాలె."

"ఆ?, ఆఁ, తప్పక, వెళ్ళి మేము వచ్చామని అంకుల్‌తో చెప్పు."

"ఓ.కే" లేడిలా పరుగెత్తింది. మరో అయిదు నిమిషాలకు హుక్కా పీలుస్తూ, అజానుబాహుడైన ఆరడుగుల రెండంగుళాల మనిషి వచ్చాడు. అతని బుగ్గలు రక్తాన్ని కక్కుతున్నాయి. సంతోషంగా కరచాలనము చేశాడు.

"ఐ యాం....మిష్టర్ ఓం ప్రకాష్ చౌదరీ. మే ఐ నో యువర్ నేమ్?"

"మై నేమ్ ఈజ్ వేణు" క్లుప్తంగా చెప్పాడు. డిమాన్‌స్ట్రేటరు గారు తాము వచ్చిన పని చెప్పారు.

"ఓ! ఐ సీ," అన్నాడు. రెండు దమ్ములు పైపు పీల్చి పిల్లల అజాగ్రత్తను చెప్పి, యెంత ఫీజు కావాలో అడగమన్నాడు.

"చూడండి, నాకు ఫీజు అంటూ ఏం వద్దు. పరీక్షలు దగ్గరకొచ్చాయి. కొన్ని కారణాలవల్ల, ప్రస్తుతం ఉండే యిల్లు ఖాళీ చేశాను. ఒక చిన్న గది యిస్తే పిల్లల చదువు పర్యవేక్షిస్తాను. నేను యూనివర్శిటీ దగ్గర చదువు కుంటాను" అన్నాడు.

"ఓ, అలాగే. ఆ ఎదురుగావున్న సర్వెంట్ క్వార్టర్స్ అన్నీ ఖాళీగానే వున్నాయి. మీ కభ్యంతరము లేకపోతే వుండండి. పేరుకు సర్వెంట్ క్వార్టర్సైనా చాలా బాగా వున్నాయి"

"ఫరవాలేదండి. కాలము గడుపుటకు ఏదైతేనేం?"



"ఫీజా అదీ...." నసిగారు.

"మీరు గది యిచ్చారు, అదే చాలు"

"అలాగంటే ఎలాగండి? గదులు ఖాళీగా వుంటే ఇచ్చాం"

"అతను కుర్రాడు. ఏం అడుగుతాడు చౌదరిగారూ! మీరే తోచినంత యివ్వండి" డిమాన్‌స్ట్రేటర్ రాజీ కుదిర్చాడు.

"ఆల్‌రైట్. సాయంత్రము రండి. మా అబ్బాయిలు వుంటారు. నాకు వచ్చినట్టు మాయింట్లో తెలుగు ఎవరికీ రాదు. మీకు హిందీవచ్చుగా?"

"వచ్చునండి"

"అంకుల్! ఇట్ ఈజ్ టైమ్ ఫార్ యు టు గో టు కంపెనీ" మంజు వచ్చి హెచ్చరించింది.

"మా మంజుకు క్రమశిక్షణ అంటే చాలా యిష్టం. ఈరోజు వారికి సెలవుట" అని వెళ్ళిపోయాడు. వీరు బయటికి వచ్చారు.

సాయంత్రము తన సామాన్లతో ఓ.పి. చౌదరి ఇంట్లో ప్రవేశించాడు. నౌకరు చూపించిన గదిలో సామాన్లు పెట్టాడు. వాటిని సర్దుకుంటుండగా మంజుల వచ్చింది.

"మీకు కాట్, చైర్స్ లేవా?"

"లేవండి" అన్నాడు బిడియపడుతూ.

"ఐ సీ.....ఆంటీ" త్వరగా లోపలికి వెళ్ళింది. మరో పది నిమిషాలలో ఓ నవారు మంచము, టేబుల్, కుర్చీలు పట్టించుకు వచ్చింది.

"యెందుకండీ శ్రమపడుతున్నారు?"

"నథింగ్" చల్లని చిరునవ్వు విసిరింది. నిజంగా కవులు వర్ణించిన శ్వేతసుందరిలా వుంది. పంజాబీ దుస్తులలో నుండి ఒంటిసొంపులు బయట పడుతున్నాయి.

"ఇంకేం కావాలి? నీళ్ళకూజా - సోమూ...! అరే సోమూ! పానీ భర్‌కే కూజా లావ్"

ఆ యువతి హడావుడికి ఉక్కిరిబిక్కిరి అయ్యాడు. తెల్ల చీర కట్టుకుని, తలపైగా ముసుగు వేసుకుని, ఒక చేతికి ఇరవై బంగారు గాజులు వేసుకుని వచ్చిందో నలభై యేళ్ళ స్త్రీ.

"మంజూ!.... మీరు..... మా బిడ్డల టీచరు... సంతోషము..... ఏమి కావాలి అన్నా శరమ్ వద్దు. ఆఁ..." నవ్వుతూ చెప్పింది. "ఆ....తుజే కామ్ హై" మంజును పిలుచుకుపోయింది. ఆయింట ఏ కష్టము కలగదు. పిల్లలు చాలా నెమ్మదస్తులు. తండ్రిపేరు వింటే జడుస్తారు. అల్లరి, పనివారితో అరిచే దెవరంటే మంజు మాత్రవే. వీలున్నప్పుడల్లా, వేణుకు ఫలహారాలు అందుతాయి. అయినా అతను మాత్రం తన పరిధిలోనే ఉంటున్నాడు. ధనవంతుల చెలిమి ప్రాణ సంకటమని తెలిసి వచ్చింది. తనపై దొంగన్న ముద్ర పడిందనుకుంటే అతని హృదయము కుతకుత లాడిపోతుంది. వారికి చదువు చెప్పినాక ఆ యింటివైపు చూసేది లేదు. ఎన్నోసార్లు యింట్లోకి రమ్మని పిలిచినా, బయటే నిలబడి మాట్లాడి వచ్చేసేవాడు. తను ఏమాత్రం పొరపాటుగా ప్రవర్తించినా, తను జీవితాంతం చింతించాల్సి వుంటుంది.

తన పరీక్ష వ్రాశాక, విద్యార్థులకు రాత్రిబవళ్ళు కూర్చుండబెట్టి చదివించి వ్రాయించాడు. వారిద్దరూ పరీక్షలు వ్రాశారు. ఆ రోజు సుఖంగా నిద్రపోయాడు. లేచేసరికి నిమ్మరసంతో ఉడికించిన సెనగలు పట్టుకుని నిల్చున్నాడు సోము.

"ఏం సోమూ! యింట్లో యెవరూ లేరా?"

"లేరండి. మంజమ్మ నాయనమ్మకు జ్వరంగా ఉందట చూడాలని వెళ్ళారు."

"మంజమ్మ వీరికేమవుతుంది?"

"అయ్యగారి స్నేహితుడికి, అమ్మగారి చిన్నమ్మ బిడ్డ నిచ్చారట. వారిద్దరికీ ఒక కులముకాదట. మంజమ్మ నాయనమ్మ వారిని యింటిలోకి రానియ్యలేదు. ఆయన వ్యాపారం చేసి బాగా డబ్బు సంపాదించారు. తెలవదుకాని ఈ బంగళా వారిదే అంటారు. రెండేళ్ళ క్రితము మంజమ్మను, ఆస్తిని అయ్యగారికి అప్పగించి, భార్యాభర్తలు కేన్సరుతో పోయారు బాబూ.."

"ప్చ్! పాపం! మంజుకు అమ్మా, నాన్న లేరన్నమాట"

"ఏమాట కామాటే చెప్పుకోవాలి. ఆయమ్మ అంటే అయ్యగారికి అమ్మగారికి ప్రాణం.యింటిలో వంట కూడా ఆమె యిష్టప్రకారమే జరుగు



తుంది" అతనిమాట పూర్తి అవకుండానే గేటులో కారు హారన్ వినిపించింది. సోము వెళ్ళి గేటు తీశాడు. కారు లోపలికి వచ్చింది.

"అబ్బాయికి ఫలహారము పెట్టావా!" గృహిణి ప్రశ్న.

"పెట్టానండి" వినయంగా చెప్పాడు సోము.

"రావోయి వేణూ! కేరమ్స్ ఆడదాము" బయటినుండే ఓ.పి. చౌదరిగారు కేకవేశారు. బయటికివచ్చి వారందరికి నమస్కరించాడు.

"ఇంటిలో ఉక్కగా వుంది. బయట అయితే ఆడుతాను" వెంటనే సోముచేత కుర్చీలు, బల్ల తెప్పించి వేశాడు. ఆట ప్రారంభమైంది. మాటి మాటికి అతని దృష్టి మంజు వ్రేళ్ళవైపు పోతుంది. మృదువుగా, పొడుగ్గా అందంగా కనిపిస్తున్నాయి.

"టరన్ మీది సర్! డాడీ స్ట్రైగర్ పడేశారు. పప్పు హెచ్చరించాడు. తేరుకుని ఆట ప్రారంభించాడు. ఇంతలో టీ వచ్చింది. అందరూ తీసుకున్నారు.

"నా కలవాటు లేదండి" అన్నాడు మృదువుగా.

"అన్నీ పుట్టుకతో వస్తాయా? తీసుకోండి" మంజు బలవంతము చేస్తే కాదనలేకపోయాడు.

"డాడీ! ఎగ్జామ్స్ అయ్యాక సినిమా అన్నారు" హిందీలో అడిగాడు పప్పు.

"ఏం మంజూ వెళదామా?"

"ఒ.కే. ఊరికే అడగరాదు. మళ్ళీ నా రిజల్ట్సు వచ్చాక"

"నిజమే, చిన్నపిల్లలు ఊరికే చూడరాదు. నువ్వూ రా వేణూ!"

"క్షమించండి. నాకు వేరే పనులున్నాయి" తప్పించుకోబోయాడు. మంజు నవ్వింది.

"రాత్రి తొమ్మిదినుండి పన్నెండు వరకు చేయు పనులేమిటండి?" అతను తలవాల్చాడు. మా కంపెనీ యిష్టము లేదంటే చెప్పండి."

"ఛ! ఎంతమాట. ఇబ్బంది అని."

"నో మాష్టారు! యు హేవ్ టు కమ్..."

పిల్లలు బలవంతము చేయగానే వస్తానని బయలు దేరాడు.

# 13

సెలవులలో యింటిదగ్గర పరిస్థితిని చూసి, ఎందుకొచ్చానా అనిపించింది. మధు, అతని భార్య సావిత్రి పెత్తనము. అత్త మామలిని మూలకు నెట్టింది. కోటయ్య పొలము పనులు చూడాలి. చిట్టెమ్మ వంటపని చూడాలి. పెద్దలున్నారు అన్న భయభక్తులేం లేవు సావిత్రికి. తన పొడుగాటి జుట్టు విప్పి చిక్కులు తీస్తూ, బయటకు ఇంట్లోకి తిరుగుతూ, అత్తగారి పనులను పర్యవేక్షిస్తుంది. వేణు బావగారే అయినా, తన భర్త ప్రయోజకుడై సంపాదిస్తుంటే అతనింకా చదవటము అప్రయోజకత్వమనిపించింది. కాళ్ళమీద కాలు వేసుకుని కూర్చుని కూనిరాగాలు తీస్తుంటే ఆ ప్రదేశాల నుండి సిగ్గుతో వేణే తప్పుకునేవాడు. అతనికి చికాకుగా వుంది. ఆ రోజు ఏదో రాసుకుంటూ బయటిగదిలో కూర్చున్నాడు.

"అమ్మాయ్! మీ అత్తగారు లేరా?" ప్రక్కింటామె వచ్చింది.

"లేరండి. ఇంట్లో కోడల్ని ఉన్నానుగా, పెత్తనాలకి బయలుదేరింది రండి."

"ఆవిడ వచ్చాక వస్తానమ్మా."

"ఫరవాలేదు రండి." అని బలవంతంగా పిలిచి తనేదో కష్టపడినట్లు సోది మొదలు పెట్టింది. వినే ఆవిడకు, అంత చిన్నపిల్ల అలాంటి కబుర్లు చెప్పటము ఉచితంగా తోచలేదేమో, అసహనంగా ముఖం పెట్టింది. గదిలో నుండి అంతా వేణు చూస్తూనే ఉన్నాడు.

"వేణుబాబు పట్టణం వెళ్ళిపోయాడా?"

"అప్పుడేనా! తమ్ముడి సంపాదన తీసుకెళ్లి చదవాలిగా. అయినా మనిషికి కాస్త లజ్జ ఉండాలి."

"వేణు గురించేనా నువ్వనేది! బుద్ధిమంతుడు, తండ్రికి శ్రమలేకుండా చదివాడు."

"మీకేం తెలుసు లోపలిగుట్టు, బంగారమంతా పెద్దకొడుకు చదువుకు, నగదంతా రెండో కొడుకు చదువుకు తగలేశారు. మధ్యన చెడిపోయాం మేము."



"ఏమోనమ్మా, పాడు కాలము! అన్నీ క్రొత్త సంగతులు వింటున్నాము. వస్తా" ఆవిడ వెళ్ళిపోయింది.

సాయంత్రం తల్లి నీళ్ళు తోడుతుంటే అడ్డగించి నీళ్ళు తోడాడు వేణు.

"అసలు మరదలికేం పనిరాదా అమ్మా!"

"యెందుకు రాదు నాయనా! అధికారము, అలకలు సాగించటము వచ్చు. నీ తమ్ముడు ఈ యింటికి తనను సర్వాధికారిని చేస్తానన్నాడట."

"పిచ్చి సన్నాసి" నవ్వాడు వేణు.

"అయ్యో! నిజంగా తండ్రీ! సూరిగాడికి పిల్ల పుట్టి చనిపోయిందని, చూచిరావాలనుకున్నాము. చేతిలో చిల్లిగవ్వ లేదు. అడిగితే కసిరికొట్టింది."

"అప్పుడే ఆమెకు ఇల్లంతా ఎందుకప్పగించారమ్మా?"

"మీ నాయనరా బాబూ! చెబితే వింటాడా? సూరి ప్రాక్టీస్ పెట్టాడట. వాడి పెళ్ళాం యెక్కడో పనిచేస్తుందట. వాళ్ళ చదువుకు పెట్టిన డబ్బు తెమ్మని మధు తగవు" అని తన గోడు చెప్పుకుంది.

"ఒక్కసారి అయినా అన్నయ్య రాలేదా?"

"చేసేది డాక్టరీ పని గదా? తీరిక ఉండొద్దురా?"

"ఈసారి వెళ్ళి చూడాలి. పాప పోయింది కదూ!" వేణుకు ఒక ఆశాకిరణం తళుక్కుమంది. అన్న హైదరాబాద్‌లో కాపురం పెట్టాడు. తను అక్కడే వుండి, ట్యూషన్లు బెడద లేకుండా చదువుకుని ఫస్టుక్లాసు తెచ్చుకుంటే యం.యస్‌సి చేయవచ్చు. మధు వచ్చాడు. యిరువురూ పెరడులో కూర్చున్నారు.

"ఏంటన్నయ్యా! ఏమో ఆలోచిస్తున్నావు?"

"నిన్ను గూర్చేరా!"

"నన్ను గురించా? అంత ఆలోచించవలసిన విషయమేం కనిపించింది అన్నయ్యా?"

"నువ్వెంతగా మారిపోయావురా. నాకంటే చిన్నవాడివి. నా కంటి కిప్పటికి పసివాడిలాగే కనిపిస్తావు. అలాంటి నువ్వు అమ్మా నాన్నలమీద అధికారం చెలాయిస్తావేంటి?"

"అయితే నామీద చాడీలు బాగానే చెప్పారన్నమాట!" అతని ముఖము ఎఱ్రబడింది.

"వాళ్ళేం చెప్పలేదు. నేను చూస్తున్నానుగా. కోడలంటే బానిస అని నేను అనను. కాని ఇంటి గౌరవము వారివల్లే పెంపొందుతుందని మరచిపోతే యెలా మధూ! నాయనమ్మ బ్రతికి వుండగా అమ్మ బయటికి రాగా చూశావా? సావిత్రి వివాహమై ఆరు నెలలు. వీధిలో నిలబడి యింటి వారిని గుర్చి కబుర్లు చెప్పటం సమంజసమంటావా? భార్య అంటే ప్రేమాదరణలుండాలి. ఆమె తన వారినంతా వదులుకుని మన యింటికి వస్తుంది. అంతేకాని, అధికారి మాత్రము కాదు."

"అధికారమన్నది ఒకరిస్తే వచ్చేది కాదన్నయ్యా! నా భార్యకు అందరిలా బ్రతికే యోగము పట్టలేదు. నేను కష్టపడతాను. మహారాణిలా బ్రతుకుతుంది. అమ్మా, నాన్నను రోజూ భరించేది మేము. మీరిలా సెలవులకు వచ్చి తినిపోయేది కాక పైగా హితబోధ చేస్తారా?" చివ్వునలేచి వెళ్ళిపోయాడు మధు. తనేం చేయగలడు. తండ్రి విపరీతంగా గారాబము చేసినందుకు అనుభవించనీ! అక్కడ తను ఉండకూడదు. పొలాలలో తన భాగము వున్నా అది తను అడగలేడు. అడిగినా తండ్రి యెవరి పక్షమో తెలుసు. రెండవరోజే తన సామాన్లన్నీ కట్టుకుని బయలుదేరాడు.

"ఏమైనా కట్టి యిద్దామన్నా ఈ ఇంటిలో నాకు స్వాతంత్ర్యం లేదురా" చిట్టెమ్మ విలపించింది. 'స్వాతంత్ర్యమున్ననాడు మాత్రం ఏం కట్టించావమ్మా' అని అడగాలనుకున్నాడు. కాని అనువు కాదని, అసలే బాధపడుతున్న తల్లి మరీ బాధ పడుతుందని ఊరుకున్నాడు. తండ్రిమాత్రం వెళ్ళి మధును అడిగాడు.

"వంద రూపాయలుంటే అన్నయ్యకియ్యరా. గడ్డివాములమ్మి యిస్తాను."

"అందరు అన్నలు తమ్ముళ్ళను చదివిస్తే, యిక్కడి తమ్ముడు అన్నను చదివించాలా? బావుంది వరస" గుమ్మములో నిల్చున్న సావిత్రి మాటలు.



"నాన్నా! మీ చేతిలో డబ్బున్ననాడు, పంపగల్గిననాడే పంపలేదు. ఇప్పుడు దేనికీగోల? నన్ను తమ్ముడు చదివించనక్కరలేదు. భగవంతుడు ఉన్నాడు" సావిత్రి వంక చురుకుగా చూసి ముందుకు సాగేడు.

* * *

సూరి విశాలమైన భాగమే తీసుకున్నాడు. అధునాతనమైన ఫర్నిచరు, అందమైన పెయింటింగ్స్ ఆ యింటికి శోభను తెచ్చాయి. కిటికీలకు కట్టిన తెరలు చూసి సుజాత గర్విష్టి అయినా పనిమంతురాలని తెలిసి పోయింది.

"ఓహో, మరిదిగారా! దయచేయండి" నవ్వుతూ యెదురు వచ్చింది.

"అన్నయ్య లేడా వదినా?"

"జాయింట్ ప్రాక్టీస్ బాబూ, అంతా జూనియర్ల మీద నెట్టి వారు కూర్చుంటారు. నా పనే హాయి టంచన్‌గా వెళ్ళి వస్తాను."

"ఈ మధ్య మీ ఆరోగ్యము పాడయిందట"

"అవును ప్రీమెచూర్డ్ పాప పుట్టి పోయింది. మెంటల్‌గా వర్రీస్. దానిదేముంది. కోల్డు తీసుకుంటావా, హాటా?"

"నాకు రెండూ అలవాటు లేవు. చల్లని మంచినీళ్ళు యిప్పించండి" లేచి ఓ గ్లాసు నీళ్ళు తెచ్చింది. యేడు గంటలు దాటాక సూరి హడావుడిగా వచ్చి ఓ కప్పు టీ త్రాగి వెళ్ళిపోయాడు. వదినగారే భోజనము వడ్డించింది. అలసటగా వుంది. పడుకుందామని లేచాడు.

"అది గెస్టుకని వేశాము స్ప్రింగ్ కాట్. నీకు దొర్లటము కష్టము. ఇక్కడ పడుకో" నేల చూపింది వదిన. అతనికి నవ్వు వచ్చింది. తను సోఫాలో కూర్చుని వెనక్కు వాలినపుడు వదిన అంతలా ముఖమెందుకు మాడ్చిందో అర్థమయింది. వారు అలాంటి ఖరీదయిన వస్తువులు కొనగలరు. తనలాంటి వారు పాడుచేయటము తప్ప కొనేది, పెట్టేది లేదు. ప్రపంచంలో బీదరికము ఇంత చెడ్డదా? దాని ముందు రక్తసంబంధము, బంధుత్వము బలాదూరా! అక్కడ ఉన్నా లభించే సత్కార మూహించవచ్చు..." అతని ఆలోచనలు సాగుతుండగానే, లలిత, ఆమె భర్త క్రొత్తగా కొన్న పాత హిందుస్తాన్ కార్లో వేంచేశారు.

"రండి, రండి" అత్యంత ప్రీతిగా యెదురేగింది సుజాత. వారు కూర్చోగానే, ఆరంజి క్రష్ కలిపి షర్బత్ చేసి తెచ్చింది. బావుండదని వేణు తనూ లేచాడు.

"ఏమోయ్! నీ జాడా, జవాబూ లేదు. ఏం చేస్తున్నావేమిటి?" బావగారు పలకరించారు.

"ఉస్మానియా యూనివర్శిటీలో బి.ఎస్‌సి. చదువుతున్నాను బావా"

"ముసలాడివయ్యాక కూడా చదువుతావుటోయ్" హాస్యం చేశాడు. ఇరవై రెండేళ్ళకే ముసలితనము వచ్చినట్లేనా? ధనమున్న వాడి నోరు యెటుమాట్లాడినా అందమే. నవ్వి ఊరుకున్నాడు.

"ఏరా! మమ్మల్ని మరిచిపోయావా?" అక్క అడిగింది. ఏమీ మాట్లాడ లేదు. వారికి ప్రత్యేకంగా వంట చేయించి భోజనాల కేర్పాటు చేయించింది. రాత్రి అందరూ అక్కడే వుండి, మరురోజు అన్నకు సెలవని, లలిత యింటికి వెళ్ళారు. లలిత ఆమె భర్త సూరికి చేసిన మర్యాదలు ఇంతా అంతా కాదు. వేణును నిర్లక్ష్యము చేయుటమేకాక అతన్ని, అతని చదువును హేళన చేశారు. యెందుకొచ్చానా అనుకుని ఆ రోజు గడిపి తన బసకు వచ్చాడు. ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది.

"వాళ్ళంతా డార్జింగ్ వెళ్ళారు బాబూ!"

"డార్జిలింగ్ సోమూ!" నవ్వుతూ చెప్పాడు. సోము వంట చేసుకోవద్దని బలవంతము చేశాడు. బియ్యమిచ్చి అతను వండిందే తినేవాడు. ఆరోజు ఏమీ తోచక మార్కెట్టువైపు వెళ్ళాడు. సికింద్రాబాద్ మార్కెట్టంత రద్దీ మరొకటి లేదు. యెంత ప్రయత్నించినా మనుషుల్ని మనుషులు రాసుకోక తప్పదు. అకస్మాత్తుగా యెదుటివ్యక్తిని ఢీకొని వెంటనే తేరుకున్నాడు.

"నువ్వా వేణూ!" నగరేశం సంతోషంగా భుజాలు చరిచాడు.

"మా మామయ్య తొందరపడ్డాడు. క్షమించు వేణూ! అసలా డబ్బు తీసింది గుమస్తా. అతను ఆ రోజు నుంచి యింటికి రావడమే లేదు. నిన్ను పట్టుపడ్డాడు. మామయ్య కూడా చాలా బాధ పడ్డారు."



"ఫరవాలేదు. నేను దొంగతనము చేయకపోయినా, నా చుట్టూ వున్న బీదరికము మీచేత అలా అనిపించింది."

"పొరపాటన్నానుగా, రా ఇంటికి వెళ్దాము."

"మరోసారి వస్తాను. ఈరోజు మా ఇంటి యజమానులు వస్తున్నారు."

"ఇల్లెక్కడ?" అడ్రసు చెప్పాడు. నగరేశం వెళ్ళిపోయాడు. వేణు కూరగాయలుకొని తిరిగి వచ్చాడు. మర్నాడు చౌదరిగారి కుటుంబం వచ్చారు. అందరూ నమస్కరించుకున్నారు.

"అరే! మీరు లావయి వస్తారనుకుంటే బాగా చిక్కిపోయారే" నవ్వింది మంజు.

"నిజమే.... అతను బాగా ఆలోచిస్తాడులా వుంది" అన్నాడు చౌదరి.

"మరిచేపోయాను. మీరు చాలా దొంగవారు. కథలు వ్రాస్తామని చెప్పలేదేం?"

"మీ కెవరు చెప్పారు?" అతని ప్రశ్న వింటూనే మంజు వెళ్ళి ఓ కార్డు, అంతకు ముందుపడిన కథకు రాయల్టీగా వచ్చిన డ్రాఫ్టు తెచ్చి యిచ్చింది.

"కంగ్రాచ్యులేషన్స్! మాకు చాలా సంతోషంగా వుంది" చౌదరి కరచాలనము చేశాడు.

"థాంక్యూ సార్" కాస్త సిగ్గుపడ్డాడు.

"అంకుల్! వీరి పెన్ నేమ్ బావుంది కదూ?" మంజు అడిగింది. వారు ఇంట్లోకి రమ్మని, వారితో కూర్చోమని యెంత బలవంతం చేసినా వెళ్ళలేదు. ఆ రోజు సాయంత్రం పాతపత్రిక తీసుకుని చదువుతూ చెట్ల దగ్గర కూర్చున్నాడు. మంజు, పప్పూ, భిల్లూ వచ్చారు. వారు కూడా అతనికి కాస్త దూరములో కూర్చున్నారు.

"నేనో మాట అడగనా?"

"నిరభ్యంతరంగా అడగవచ్చు"

"మా ఇంటిలో మిమ్మల్ని భయపెట్టే వస్తువులేమున్నాయి? మా యింట్లోకి రారు."

"............?"

"జవాబు చెప్పరేం" రెట్టించింది మంజు.

"చెప్పక తప్పదా?"

"ఊహుఁ" మంజు తలాడించింది.

"విలువైన వస్తువులు, అలంకారాలు మీరు యెక్కడ పడితే అక్కడ పెడతారు. నాలాంటివారు రావటము అంత మంచిది కాదు" అన్నాడు. ఆమె ఏం మాట్లాడక యోచనలో పడింది. కాసేపటికి తన అభిప్రాయము చెప్పింది.

"వివరాలు చెప్పమని నేను అడగను లెండి. ఎవరో మీ హృదయమును చాలా గాయపరిచి వుంటారు. అందరూ ఒకలాంటివారే అనుకోవటము పొరపాటు" అన్నది.

"కావచ్చు. 'పాలతో మూతి కాల్చుకున్న పిల్లి, మజ్జిగను ఊది ఊది త్రాగిం'దనే సామెత ఉందిగా, నా జాగ్రత్తలో నేనుండాలి. అజాగ్రత్తవల్ల ఇప్పటికే నా జీవితము తిరగవలసిన మలుపు నుండి వక్రంగా తిరిగింది.

"పోనివ్వండి. ఏమేమి కథలు వ్రాశారు?" ఆమె అడిగిన ప్రశ్నలకు జవాబులు చెప్పాడు.

అలాగే కాలము గడిచిపోసాగింది. మంజు పి.యు.సి పాసయింది. ఆరోజు పండగ చేశారు చౌదరిగారు. ఆమె యూనివర్శిటీలో బి.ఏ.లో చేరింది. వేణు ఎంత వాదించినా మంజుతోపాటు వేణును కార్లో తీసుకు వెళ్ళేవాడు చౌదరి. అయినా తన పరిధినుండి ఒక్క అంగుళం ముందుకు పోలేదు. కొన్నాళ్ళు అతన్ని మాట్లాడించాలని, నవ్వించాలని ప్రయత్నించి విఫలురాలయింది మంజు.

మంజు విచారంగా, గంభీరముగా ఉండగా యేనాడు చూడలేదు వేణు. ఆరోజు సాయంత్రం రాజ్యాలు కోల్పోయిన రాణిలా విచారంగా వరండా మెట్ల దగ్గర కూర్చుంది. చౌదరి దంపతులు తయారయి వెళ్ళిపోయారు. ట్యూషన్ అయిపోగానే వేణు మంజును మాట్లాడించాలా, వద్దా అని అయిదు నిమిషాలు తటపటాయించాడు.

"ఏమిటండి, మీరు ఈరోజు బయటకు వెళ్ళలేదూ?"



"ఓ....... మీరా మాష్టారూ! వరండాలోకే లెండి, రండి అన్నది. వెళ్ళి వరండాలో వున్న కేన్ ఛైర్స్‌లో ఇరువురూ కూర్చున్నారు.

"ఈ రోజు ఏదో వింత జరుగుతుంది. మీ అంతట మీరు పలుకరించారు" నవ్విందిగాని, ఆ నవ్వులో ప్రాణము లేదు.

"వింతేముంది? ఎప్పుడూ నవ్వుతూ, చలాకీగా తిరిగే మీరు ఈ రోజు విచారంగా కూర్చుంటే మాట్లాడాలనిపించింది."

"సంతోషం. నా విచారానికి కారణం అడుగువారు కూడా ఉన్నారు. అదో తృప్తి."

"మీరలా సగం మాట్లాడితే తెలుసుకునే తెలివితేటలు లేవు. అసలు సంగతి యేమిటో చెప్పండి. మీ విచారానికి కారణమడిగేవారు లేరంటే నేను నమ్మను. చౌదరిగారు, వారి సతీమణి తమ ప్రాణంకంటె ఎక్కువగానే చూసుకుంటారు నిన్ను..... సారీ మిమ్మల్ని."

"ఫరవాలేదు, మీకంటే చిన్నదాన్నే కదా, ఏకవచనములో పిలవవచ్చు. ప్రేమకూడా మితిమీరితే చేదుగా అన్పిస్తుందండీ! అమ్మ ఆస్పత్రిలో, నాన్నగారు వ్యాపార విషయాలపై ఎప్పుడూ టూర్‌లో ఉంటే, నేను ఆంటీ దగ్గరే ఉండేదాన్ని. నా రాకవల్లే తనకు పప్పూ, భిల్లూ పుట్టారని ఆమె నమ్మకము. అప్పుడు హైదరాబాద్‌లో ఉండేవారము. మానాన్నగారి మాతృభాష తెలుగు కాబట్టి, ఆయన ఆంధ్ర గరల్స్ హైస్కూలులో చేర్పించమని వ్రాశారు. అంకుల్‌కు ఇష్టం లేకపోయినా చేర్పించారు. వారెప్పుడూ నా తల్లిదండ్రులను గుర్తుకు తెచ్చుకునే అవకాశం ఇవ్వలేదు." నిట్టూర్చింది. "వారిద్దరూ మరణించిననాడు కూడా నాకు పెద్ద లోటు కనిపించలేదు. అందరితోపాటు ఏడ్చాను. ఆంటీ చల్లని ఒడిలో స్వాంతన పొందాను. నాన్న వదిలిపోయిన ఆస్తి నాకేదో ముప్పు కలుగజేస్తుందని భయంగా వుంది. అన్ని విషయాల్లో నన్ను స్వతంత్రంగా మెలగనిచ్చి నా మాటకే విలువయిచ్చే అంకుల్ నా వివాహవిషయంలో నిరంకుశత్వం చూపిస్తున్నారు. ఆంటీ కూడా అలాగే ప్రవర్తిస్తోంది."

"వారు చూసిన వరుడు మీకిష్టం లేదా?"

"ఒకరయితే కదా! అటు ఆయనొక బుద్ధిమంతుడిని చూశారు అతనికిచ్చి వివాహము చేయాలనుకుంటారు. పిల్లవాడు పరాయివాడు, యింత ఆస్తీ అతనికి పోవడమేమిటి, తన అన్నగారి కొడుక్కివ్వాలని పిన్ని పట్టుదల. మొన్న డార్జిలింగ్ వెడితే, ఇరువురు వరుల ఇంట్లో ఘనమైన సత్కారము జరిగింది. ఇప్పుడు ఉత్తరాలు వస్తున్నాయి. నన్ను గూర్చి, ఆ దంపతులు పోట్లాడుకోవటము నాకేం బావుండలేదు. సంప్రదింపులు జరుగుతున్నాయి."

"పోనీ, ఇరువురిలో మీ కెవరిష్టము?"

"నా కెవరూ ఇష్టము లేదు. నిజంగా చెప్పాలంటే, నాకిప్పుడే పెళ్ళి చేసుకోవాలని లేదు. నాకు ప్రపంచమంతా తిరిగి చూడాలని వుంది. కానీ అంకుల్ అంగీకరిస్తారని అనుకోను. పోనీ యిరువురూ ఓ నిర్ణయానికి వచ్చినా బావుండేది. అలా రారు. నాకు చాలా బాధగా వుంది."

"విచారించి ప్రయోజనము లేదు. కాలమే నిర్ణయిస్తుంది లెండి."

"అంతే అనుకుని తృప్తి చెందుతున్నాను" సోము టీ తెచ్చాడు ఇరువురూ త్రాగారు.

"వస్తానండి. విష్ యు గుడ్ లక్"

"థాంక్యూ" నవ్వుతూ లేచింది. అతను బయటకు వచ్చేసరికి నగరేశం, అతని మామ నిల్చున్నారు. వారిని పిలిచి కూర్చుండబెట్టాడు.

"చిన్నవాడివైనా క్షమించాలి బాబూ. పొరపాటు జరిగిపోయింది"

"నగరేశము అంతా చెప్పాడు లెండి. మీరు ఇంతదూరం రావటం దేనికి?"

"మళ్ళీ ఎప్పటిలా వచ్చి ఉండు బాబూ! మా అబ్బాయి ఒక్కడు ఏదో పోగొట్టుకున్నట్టు తిరుగుతున్నాడు"

"క్షమించండి. వీరి పిల్లలకు ట్యూషన్ కాంట్రాక్ట్ వుంది" అతనెంత బ్రతిమాలినా వెళ్ళటానికి అంగీకరించలేదు. అప్పుడప్పుడు రమ్మని చెప్పి అతను వెళ్ళిపోయాడు. వేణు క్లాసు తెచ్చుకోవాలని ఎక్కువ శ్రద్ధతో చదువుతున్నాడు.



# 14

పన్నెండు గంటలకు గేటు తీసుకుని వస్తుండగా చౌదరిగారు చూడనే చూశాడు. అతనేమంటాడోనని భయపడసాగేడు.

"మా పెళ్ళి పనులతో, అల్లరితో నీ చదువు సాగటం లేదుకదూ వేణూ" ఆయన మృదువుగా అడిగారు.

"లేదండి. చల్లగాలికని అలా వెళ్ళాను."

"భలేవాడివోయ్! నాకు తెలుసులే. ఎల్లుండితో అయిపోతుందోయ్"

"మీరింకా పడుకోలేదా?"

"మంజు తల్లి వెళ్ళిపోతుందంటే నిద్రెలా వస్తుంది? దాన్ని పంపించటం యిష్టం లేదోయ్! దాని జాతకం బావుండ లేదట పదిహేడు రాకపూర్వమే వివాహము చేయమని దాని తండ్రి మృత్యుముఖంలోమాట తీసుకున్నాడు. చాలా ఆలస్యం అయింది పడుకో" అన్నారు.

ధనవంతులకుండే సమస్యలు వారికి ఉంటాయి, వారము రోజుల నుండి వంటా, వార్పూ లేదు. మంజు పెళ్ళి విందులే. చౌదరిగారు కచ్చితంగా చెప్పారు. వంట చేసుకుంటే మాట్లాడనని. అలసటగా నిద్రపోయాడు. రెండవరోజు కార్లూ, మోటార్‌సైకిళ్ళూ వారింటి ముందు బారులు తీరి నిల్చున్నాయి. బంధువులంతా విలువైన దుస్తులతో, నీటుగా తిరుగుతున్నారు. తనకున్న గుడ్డలతో వారి మధ్యకు పోవాలంటే సంకోచంగా వుంది. తను జీవితాంతం కష్టపడ్డా, అలాంటి దుస్తులు కొనగలడా? వారివంటి కార్లు కొనగలడా? లక్ష్మీపుత్రులు. మంజూపై ఓ పద్యము రాసి ఓ చిన్న నిర్మల్ ఉడ్ బాక్సులో పెట్టి, మధ్యాహ్నము రద్దీ తక్కువగా ఉన్నప్పుడు లోపలికి తీసుకెళ్ళాడు. మంజును అత్యంత సుందరంగా అలంకరిస్తున్నారు.

"రండి మాష్టారూ!" ఆమె బంధువుల కెవరికీ తెలుగురాదు. ఊరికే చూడసాగేరు. వెళ్ళి అది ఆమెకిచ్చాడు.

"అదేమిటి? రాత్రికి ఉండరా?"

"ఉన్నా, నాకు ఇంతమందిలోకి రావాలంటే సిగ్గు, క్షమించండి" అన్నాడు.

"క్యాహై? క్యాహై...." అంటూ అతనిచ్చిన పెట్టెమీద దాడి చేశారు చుట్టూ వున్న యువతులు. ఆమె వారికివ్వకుండా తీసి దాచిపెట్టి వచ్చింది. అతను కృతజ్ఞతా పూర్వకంగా నవ్వి వచ్చేశాడు.

రాత్రి తొమ్మిది గంటలకు పప్పు, భిల్లూ వచ్చారు.

"బరాత్ వస్తోంది. పెళ్ళి కొడుకును చూద్దురుగాని రండి" చేతులు పట్టి లాగారు.

"వద్దు, నాకు నిద్ర వస్తోంది" తప్పించుకున్నాడు. నిజంగానే నిద్రకై ప్రయత్నించసాగేడు. బ్యాండు మేళముతో చదువెలాగూ సాగదని తెలుసు. కళ్ళు మూసుకున్నాయి. కలత నిద్ర... యేదో మధురమైన స్వప్నము. కళ్ళముందు ఓ భీకరాకారము నిలిచింది.

"వేణూ!..... వేణూ!" కుదిపినట్లు అయింది. కళ్ళు విప్పి లేచాడు. ఓ.పి. చౌదరిగారు నిల్చున్నారు. అతని కళ్ళు నిప్పులు కక్కుతున్నాయి. తను వర్ణించిన పద్యము చదువ లేదు కదా?

"వేణు! చిన్న నాటకము ఆడాలి. సమయము లేదు. ఎంత డబ్బు అడిగినా యిస్తాను. డామిట్! నన్నే మోసము చేస్తారా?" హూంకరించాడు.

"ఏం చెయ్యాలండి?" తడారిన గొంతుతో అడిగాడు.

చౌదరి చేతిలో పిస్టల్ మెరుస్తోంది.

"ఇదిగో ఈ దుస్తులు ధరించు. ఈ పూలు ముఖము కనబడకుండా కప్పుకో, ఈ పూలు చేతులకు చుట్టుకో" అన్నీ చూపించాడు. "ఆలస్యం కాకూడదు"

"అసలెందుకు నటించాలి?"

"వేణూ! అంతా వివరముగా చెప్పే సమయము లేదు. ఈ చౌదరికి రెండు అత్యంత ప్రియమైనవి. ఒకటి మంజూ, రెండవది పరువు. నాకు మతిపోతోంది. ఏం చేస్తానో తెలియదు. నాకోసం.... ఒక్క అయిదు నిమిషాలు నటించలేవా?" త్వరగాలేచి అతను చెప్పినట్టు తయారయ్యాడు. చౌదరిగారు



దారి చూపగా వెనుకవైపున్న చిన్నగేటు తీసుకుని బయటకు వెళ్ళారు. అక్కడున్న కారులో కూర్చున్నారు. ఆ కారు చుట్టూ తిరిగి మెయిన్‌గేటు వద్దకు వచ్చింది. షామియానాలో కూర్చున్న జనములో కలకలము బయలుదేరింది.

"మమ్మీ! దుల్హాసాబ్, డాడీ ఆయేఁ..." పప్పూ పరుగులు పెట్టాడు. వేణుకేం అర్థం కాలేదు. అతని చెయ్యిపట్టి క్రిందికి దిగాడు. పూలసందులో నుండి చూశాడు. అత్యంత సౌందర్యంగా అలంకరింపబడిన వధువు చెలుల సాయంతో వస్తోంది.

"జయమాలా సినావ్...." చౌదరిగారి ఆజ్ఞ అవుతూనే వధువు వేణు మెడలో పూలదండ వేసింది. మరో దండ చౌదరిగారు వేణు కందించాడు. అతని సాయంతో వణికే చేతులతో ఆమె మెడలో వేశాడు. బ్యాండు మేళాలు మ్రోగాయి. వధువు చెలులంతా ఆమెను హాస్యాలు చేస్తున్నారు.

"క్యా దుల్హేభాయ్! ఆకేలే  కైసే ఆయే (ఏమిటి పెళ్ళికొడుకా! ఒంటరిగా ఎలా వచ్చావు?)" ఎవరో ప్రశ్నించారు.

"ఛుప్! ఉన్‌కీ తబీయత్ టీక్ నహీ, థక్ గయే. అరే శ్యామ్, కుండాల్... ఖానేకా ఇంత జామ్ కరో (ఊర్కోండి. అతని ఆరోగ్యము బావుండలేదు. బాగా అలసిపోయాడు. శ్యామ్, కుందాల్! భోజనాలకేర్పాట్లు చెయ్యండి)" అందరినీ ఆజ్ఞాపిస్తూ వేణు చెయ్యి పట్టి మేడమీదికి తీసుకెళ్ళాడు. అటు నుండి ఎవరూ చూడకుండా వెనుకవైపు మెట్లద్వారా క్రిందికి దిగారు. ఇందాక దిగిన కారు అక్కడ సిద్ధంగా వుంది.

"వేణూ! నీ మేలు జన్మలో మరిచిపోను. నువ్విక్కడుండడము మంచిది కాదు. డ్రైవరు తీసుకెళ్ళినచోటుకు వెళ్ళి నిశ్చింతగా చదువుకో. రేపు ఉదయమే నీ సామానులన్నీ పంపిస్తాను" మర్లోమాటకు ఎదురుచూడక అతను వెళ్ళిపోయాడు. డ్రైవరు తీసుకెళ్ళి ఓ యింటిముందు కారాపి, ఎవరినో లేపి, వేణుకు పడుకోవటానికి ఏర్పాట్లు చేయమని చెప్పాడు. విద్యానగర్ క్వార్టర్సు దగ్గరుందా ఇల్లు. వారు మంచము, పరుపు ఇచ్చారు. డ్రైవరు వెళ్ళిపోయాడు.

జరిగిందంతా కలా? నిజమా? అతను తన చేతిని గిల్లి చూసుకున్నాడు. వెంటనే నిజమేనని తెలిసింది. నిద్ర రాక దొర్లుతూ తెల్లవార్లూ గడిపాడు. తెల్లవారినాక డ్రైవరు వచ్చి సామానులిచ్చి ఓ గది చూపాడు.

"మీ చదువు పాడుకావద్దన్నారు. యిక్కడే హాయిగా చదువుకుని పరీక్షలయ్యాక వెళ్ళిపొమ్మన్నారు"

"అసలు విషయమేమిటి డ్రైవర్?"

"నాకు తెలిస్తే కదా, నీకు చెప్పటానికి? అదంతా మరిచిపో, ఇట్టే నిమిషాలు డ్రామాలో యాక్ట్ చేశానని అనుకో, అంతే" అతను వెళ్ళిపోయాడు. రెండు మూడు రోజులు జరిగిన సంఘటనలు మనసును బాధించినా తరువాత అన్నీ మరిచి తన చదువులో లీనమయ్యాడు. పరీక్షలు వ్రాసి, తేలికపడిన హృదయముతో గది చేరాడు. ఆ యింటివారు పంజాబీయులే. వారిప్పుడే వచ్చారట. వారికి హిందీ కూడా సరిగా రాదు.

"క్యాగల్ హై?" (యేం సంగతీ)

"చంగీల్ హై!" (అంతా మంచి సంగతే) ఇవి రెండు మాటలే వారి మధ్య జరిగేవి. ఆ రోజంతా నిద్రపోయాడు. లేచి, ముందు యేం చేయాలన్నది ఆలోచించాడు. ఇంటికి వెడితే మధు పెత్తనము, సావిత్రి మాటలు వినాలి. సూరి దగ్గరకు పోలేడు. ఏం చేయాలన్నదే ప్రశ్న? అటువంటి సమయములో నగరేశం వచ్చి 'తమ కొట్టులో పద్దులు వ్రాసే గుమాస్తా వెళ్ళిపోయాడనీ నమ్మకస్థుడు దొరికేవరకు ఉండమని' చాలా ప్రాధేయపడ్డాడు. తనలాంటి వారికి బిగదీసుకుంటే పనులు అవ్వవు. నూట యాభై రూపాయలకు రెండు నెలలు పని చేయటానికి ఒప్పుకున్నాడు. ఆదివారమునాడు ఎందుకో తన వారిని చూడాలని బలమైన కోరిక కలిగింది. ఒక వారము ఇంటికి వెళ్ళాడు. మధులో మార్పేమీ లేదు. అతనికి కొడుకు పుట్టాడు. వున్నంతసేపు మారు మర్మముతెలియని పసివాడితో ఆడుకున్నాడు.

"మీ అన్నగారు పిల్లలతో ఆడుతూ బ్రతికేలా వున్నారే...." సావిత్రి భర్తతో అంటోంది.



"చేసిపెట్టేవాడు వుంటే ఆయనకేం? యింకా పదేళ్ళయినా చదువుతాడు. పిల్లలలో పిల్లాడై ఆడతాడు" మధు నవ్వులు. వేణుకు అసహ్యము వేసింది, మనుషులు యింత నీచానికి ఎందుకు దిగుతారో! తనకు ఎవరు పెడుతున్నారు గనక! మరురోజు వచ్చేశాడు, మరోవారము అక్క దగ్గరకు వెళ్ళాడు. ఇన్నాళ్ళకు తమ్ముడొచ్చాడనే ప్రత్యేకత ఏం లేదు.

"ఒరే వేణూ! గ్రాడ్యుయేట్లు రిక్షాలు త్రొక్కేకాలమురా. మీ బావగారు వ్యాపారమంతా చూసుకోలేకపోతున్నారు. వచ్చి సాయంగా చేరరాదూ?"

"ఏం వ్యాపారం చేస్తున్నారక్కా?"

"పాల వ్యాపారము, బియ్యము..... ఒకటేమిటి అన్నీను"

"నాకు వ్యాపారములో ప్రావీణ్యం లేదని నీకు తెలుసు"

"కడకెక్కడో గుమస్తాగా చేరతావులేరా!" విసుక్కుందావిడ. తను ప్రస్తుతము చేసేపని అదేగా. అటునుండి వచ్చి, మరో వారానికి చెల్లెలి దగ్గరకు వెళ్ళాడు. అతని రాక కెవరూ సంతోషించినట్టు లేదు.

"అన్నయ్యా! కాస్త మంచి చోటికివస్తే, మంచి బట్టలు వేసుకోవాలి. ఆయనకు నీటుగా ఉండేవారంటే ఇష్టం."

"నువ్వు నీటుగా వున్నావు చాలులేవే. మీ ఆయన దగ్గర నేనుండలేను" అని వచ్చేశాడు.

మరో వారము యెక్కడికీ వెళ్ళలేదు. అన్నగారికి కూతురు పుట్టిందని తెలియగానే ఉండలేకపోయాడు. సూరి ఇంట్లో లేడు. సుజాత పసిదాన్ని తెచ్చి చూపింది.

"ఏమయ్యా మరిదీ, కూతురికి బంగారు గాజులు కావాలట"

"ఇప్పుడు బాబాయి బీదవాడని తెలియదా! ఉద్యోగము దొరకగానే మొదటి జీతముతో గాజులే చేయిస్తాను. గొప్పేముంది వదినా."

"మాటలే" నవ్వింది. ఆరోజు అక్కడుండి వచ్చేశాడు. నిజంగా తన తల్లి సంతానమంతా మంచిగానే బ్రతుకుతున్నారు తనిలా కావడానికి కారణం స్వయంకృతాపరాధమా? పెద్దల ఆశీర్వాదము తనకు లేదా? తను

ఒక్కనాటికైనా వారిలో ఒకడుగా బ్రతుకుతాడా, లేక అక్కయ్య అన్నట్లు రిక్షా...... వద్దు అలాంటి ఆలోచనే రావద్దు, అనుకున్నాడు.

పరీక్షా ఫలితాలు తెలిశాయి. విధి కూడా కొన్నిసార్లు మానవునితో ఆడుకుంటుంది. బొటా బొటీగా అరవైశాతంతో ఫస్టుక్లాసులో ప్యాసయ్యాడు వేణు. అతనికి తెలుసు. ఎమ్.ఎస్‌సి.లో సీటు రాదని. ఉపాధ్యాయ వృత్తే తనకు రాసిపెట్టి ఉందేమో? పోనీలే ఒక విధంగా అదీ మంచిదే. తను రచయితగా రాణించడానికి కావల్సినంత విరామమూ, సమయమూ లభిస్తాయి అనుకున్నాడు. తన విజయవార్త చెప్పాలని చౌదరి ఇంటికి వెళ్ళాడు. అక్కడ క్రొత్తవారు దర్శనమిచ్చారు. వారిని చౌదరిని గూర్చి అడిగాడు.

"వారంతా ఢిల్లీలో ఉంటున్నారు" అంతకంటే వివరాలు తెలియలేదు. ఆ యింటినుండి, తిరిగి వస్తుంటే చైతన్యస్రవంతిలా తిరిగే మంజు అతని కళ్ళముందు మెరిసి మాయమయింది. మంజూ! రాధ ప్రవర్తనతో రాయిగా మారిన నా మనస్సును స్పందింపచేశావు. నిజంగా స్త్రీ మూర్తివి నీవే. భర్త అదృష్టవంతుడు' అనుకున్నాడు. అటు నుండి నెమ్మదిగా ట్రెనింగ్ కాలేజీకి వెళ్ళాడు. అప్లికేషన్ ఫారాలు కొని, నగరేశం దగ్గరకొచ్చాడు. మామగారికి ఆస్తమా కాబట్టి తను చదువలేనని చెప్పాడు. ఫారాలు నింపాక, ఇంటర్వ్యూ అన్నారు. అక్కడికి వెళ్ళి ఫార్మాలిటీస్ పూర్తి చేసుకుని వచ్చాడు. రెండవరోజు మొదటి లిస్టులోనే తన పేరు చూసుకుని తృప్తిగా నిట్టూర్చాడు. నాలుగు నోట్‌బుక్స్ కొని ఇంటికి వెళ్ళాడు.

మరురోజు కాలేజీకి వెళ్ళి రెండు క్లాసులు అటెండ్ అయి బయటికి వచ్చేసరికి ఒక వ్యక్తి చుట్టూ విద్యార్థులు గుంపులుగా చేరి ఉన్నారు. ఎక్కువగా అమ్మాయిలు. ఏమిటా అని అటు వెళ్ళాడు. ఏదో ఊరు నోట్సుట, ట్రైన్‌డ్ మెటీరియల్. అందరూ కొంటున్నారు. వేణుకు నవ్వు వచ్చింది. 'ఆవూరి చీరలు, ఈవూరి చీరలు, పండ్లు అని విన్నాడుగాని, నోట్స్ అని మాత్రం క్రొత్తగా వింటున్నాడు. విద్య ఇంత చౌక యెలా అవుతుంది? విద్యా విధానములో లోపమా, లేక విద్యార్థుల మనస్తత్వములో లోపమా? లేదు. బోధనా పద్ధతిలోనే లోపముంది. ప్రతి విద్యార్థి తను ప్యాసుకావాలి, ఫస్టు రావాలనే



కోరుకుంటాడు. పి.యు.సి. చదివేటప్పుడు గైడ్ చదవకూడదు. దానిని అనుసరిస్తూ రాసేస్తున్నారు. ఉపన్యాసకులే గైడ్ ఉన్నవారికి ఫస్టుమార్కులిచ్చే వారు. ఆ మాట అనరాదు విద్య అంటే సాధన. సాధించే ఓపిక ఎవరికీ లేదా?

"అలా నిలబడ్డారేమండీ! అయిపోతున్నాయి నోట్స్. కొనుక్కోండి" సన్నగా, పల్చగావున్న ఓ అబ్బాయి వచ్చి వేణును హెచ్చరించాడు.

"కాస్త చూడనిస్తారా?" ఒక పుస్తకంలా కుట్టిన పదార్థాన్ని అందుకుని చూశాడు. మొదటిపేజీలోనే కావల్సినన్ని అచ్చుతప్పులు. తిరిగి యిచ్చేశాడు. వేణు క్లాసులో కూర్చుంటే ముళ్ళమీదున్నట్టే వుంది. ఉపన్యాసకులకు ట్రెనింగ్ విద్యార్థులంటే చులకన. అంతా విధిలేక థర్డు క్లాసులో ప్యాసయినవారు వస్తారని భావన. వేణుకు మహా చికాకుగా వుంది. అంతక్రితము రోజే, 'విదేశాలలో విద్య, ఉపాధ్యాయులు' అనే వ్యాసము ఏదో బులెటిన్‌లో చదివాడు. ఉపాధ్యాయుడంటే ఎంతో గౌరవం, అధిక వేతనములిస్తారు. ఇంకో ఉపన్యాసకుడు వచ్చాడు. అందరూ నమస్కరిస్తే, తలాడించి, తన పాఠము మొదలుపెట్టి రెండు మూడుసార్లు యెందుకూ కొరగానివారు, ఇతరత్రా యెక్కడా సీటు ఉద్యోగం దొరకనివారు బి.ఇడి.కి వస్తారని నవ్వుతూనే అవమానించాడు.

"క్షమించండి సర్! మీ మాటలను తిరగి తీసుకోండి. కావాలంటే నా సర్టిఫికెట్ తెస్తాను. నేను ఫస్టుక్లాసులో ప్యాసయ్యాను" వేణు లేచాడు.

"నేనూనండి" మరో అమ్మాయి లేచింది.

"ఐ ఆల్సో" మరో ముస్లిమ్స్ కుర్రాడు లేచాడు. దాంతో అతనా టాపిక్ మార్చి, నవ్వుతూ తనన్న మాటను సమర్థించుకున్నాడు. "మన వారికి ప్రణాళికలు వేయుటము బ్రహ్మాండంగా తెలుసు. అది అమలులోకి వస్తుందా, లేదా అన్నది అనవసరము. ఏదో ప్రాబ్లంపై వ్యాసం రాయాలి. దానిని పరిష్కరించే విధానము రాయాలి. నిజంగా ఇది చాలా మంచి విషయమే. అన్నింటికంటే ప్రస్తుత సమస్య భాష. ప్రతివారు తెలుసుకోవలసినదే. అయితే యెంతమంది తెలుసుకుంటారన్నదే అనూహ్యము. 'ఏ' రాసుకొస్తాడు. 'బి' అతని స్నేహితుడు కాబట్టి దానినే కాపీ చేస్తాడు. 'సి', 'బి' చెల్లాయి కాబట్టి

ఆమెకిస్తాడు. ఆమె మిగతావారికిస్తుంది. మూడు రోజులలో ఒకరు వ్రాసిందే మిగతావారు కాపీ చేస్తారు. అయితే 'ఏ' స్వంతంగా వ్రాసిందా అంటే అదేం లేదు. అతను పోయిన సంవత్సరపు విద్యార్థిది కాపీ చేశాడు. అతన్ని అడిగితే అతనెక్కడ తెచ్చాడో చెబుతాడు. నవ్వు వచ్చింది. మరో క్లాసుకెళ్ళారు. ఆ ఉపన్యాసకుడు నలభై అయిదు నిముషాలలో ముప్పైమంది రచయితల పేర్లు చెప్పి, ఆపుస్తకాలన్నీ చదవమని చెప్పాడు. అది అయ్యే పనేనా? ఆ విషయము అడిగితే ప్రొఫెషనల్ కాలేజీ కాబట్టి ఫేల్ చెయ్యడానికి యెంతయినా అవకాశముంది. ప్రతి ఉపాధ్యాయుడు నల్లబల్లపై బొమ్మలు గీయాలి కాబట్టి డ్రాయింగ్ క్లాసులు అటెండ్ అవ్వాలి. అక్కడ హాజరు యిచ్చి, హోమ్‌వర్క్ తెచ్చుకోవటము, ఏ పేద ఆర్టిస్టునో పట్టుకొని కొంత డబ్బిచ్చి తనకు హోమ్‌వర్కుగా యిచ్చిన పనంతా వారితో చేయించుకోవటము. ఎవరయినా న్యాయంగా ఉందామని స్వంతంగా వేస్తే, అందరూ నిపుణులు కారు. కోతికి బదులు కొండముచ్చు, నాతికి బదులు కోతి వస్తాయి. మార్కులు అంతే. ట్రెనింగ్ విధానమేమిటో బోధపడలేదు. అలాగే క్లాసులకు వెళ్ళి వస్తున్నాడు.

"ఏమిటండీ! మీరెప్పుడూ క్లాసులో కనిపించటం లేదు. మీ నంబరు మా గ్రూపులో వుంది. మాష్టారు చాలా మండిపడుతున్నారు" ఒక యువతి చెప్పింది.

"క్రాఫ్ట్ క్లాసుందా? నాకు తెలియనే తెలియదు సుమా! అక్కడేం నేర్పుతారండీ?"

"ఏముందండి! అకస్మాత్తుగా ఏ కుర్చీయో, బల్లో విరిగిపోతే, మనము అక్కడికక్కడే క్లాసురూంలో బాగుచేసుకోవాలి. అదే వారి లక్ష్యం. నెయిలింగ్ కటింగ్, బోటింగ్ నేర్పుతారు" మరొకతను జవాబు చెప్పాడు.

"సరే, ఈరోజు వస్తాను పదండి" అందరూ క్లాసుకు వెళ్ళారు. ఉపన్యాసకుని తిట్లు, దీవెనలు సహించి, అతనిచ్చిన కర్రముక్కలు తీసుకుని ఏం చేయాలని అడిగాడు.

"అన్నింటిని బోర్డుపై వ్రాసిన కొలతల ప్రకారము కట్ చేయండి" అతని అజ్ఞానానికి నవ్వు వచ్చింది. ఆ పని మూడోక్లాసు చదివే పిల్లవాడు



చేస్తాడు. విద్యకు ఒక ఉపన్యాసకుడిచ్చిన నిర్వచనము గుర్తుకు వచ్చి, అనుభవాల కూర్పే విద్య అని, అయితే యిది కూడా ఒక అనుభవమేనని తెలుసుకుని పని ప్రారంభించారు. ఇద్దరు యువకులు, వేణూ కలిసి, ఆ కోతలు అన్నీ పూర్తిచేసి ఆడపిల్లల కిచ్చారు. ఇక అతనిచ్చిన హోమ్ వర్క్ చేయుటము తరముగాదని అందరూ టాయ్ ఎంపోరియంపై దాడి చేసి, తలొకరకమైన బొమ్మలు కొని తాము చేశామని, తమ రోల్ నంబరు వేసి యివ్వడము. అయితే, అది వారు చేసిందో కాదో మాష్టారుగారికి తెలియదా? తెలుసు. అందరికీ తెలుసు. కాని అన్నవాడు చెడ్డవాడు. ఈ గ్రూప్ వాళ్ళు వదిలితే పీడా పోతుందని చెప్పేవారికి, ఈ తొమ్మిది నెలలు గడిచి, ఏదో ఓ క్లాసులో ఈ పరీక్ష ప్యాసయితే చాలని చదివేవారికి ఉంటుంది. విజ్ఞానము అన్న పదము అజ్ఞానము క్రింద నలిగిపోతుంది.

మొదటి టర్మ్ సెలవులు, వాటి తదుపరి టీచింగ్ ప్రాక్టీస్ మొదలయింది. అక్కడ నేర్చుకునేదానికి, రోజూ చెప్పేదానికి సంబంధమే ఉండదు. ఈ సూత్రప్రాయమైన విషయాలు యెందుకు నేర్చుకోవాలో అర్థం కాదు. ప్రతివారికి సూపర్ వైజరుంటారు. యెందుకు? బోధనాపద్ధతిలో లోటుపాట్లు తెలిపే, తరువాత పాఠం చక్కగా బోధించేలా చేయాలని, కాని ఒకేసారి ఒకే సూపర్‌వైజర్ పదిమందిని పర్యవేక్షిస్తుందంటే అతిశయోక్తి కాదేమో. రికార్డుమీద మాత్రం అరపేజీనిండా రిమార్కులు చూసి అధికారులు సంతోషిస్తారు. ఏదో పని గడుపుకుందామనే వారికి తప్ప, ఉపాధ్యాయ వృత్తి స్వీకరించి ఆదర్శప్రాయంగా జీవించుదామన్నవాడికి, ఈ ట్రెనింగు యెందుకూ పనికి రాదు. నలుగురు నడిచేదారి తను అనుసరిస్తున్నా, యెందుకో అసంతృప్తి ఉంది వేణుకు. ఆగని కాలము పరుగులు పెడుతూనే వుంది.

## 15

బస్సు దిగుతూ, బ్యాగుకై చేయిచాపే తండ్రిని చూసి ఆశ్చర్య పోయాడు వేణు. తనకోసము తండ్రి బస్టాప్‌కు రావటము మొదటిసారి. మధు ప్రవర్తనవల్ల ఆయన మనసు మారిందనుకున్నాడు.

"అందరూ క్షేమమా నాన్నా?"

"ఆఁ. ఈసారి విజయదశమికి అందరూ వచ్చారు. నువ్వే వస్తావో రావో అని మీ అమ్మ ఒకటే దిగులు పడుతోందిరా."

"మా స్టాఫ్ అంతా ఎక్స్‌కర్షన్‌కు వెళ్తున్నారు. నన్ను బలవంతం చేశారు. పోవాలని అనుకుంటుండగానే మీ ఉత్తరము వచ్చింది" తండ్రికో బ్యాగు యిచ్చి తను సూటుకేసు తీసుకున్నాడు. ఇరువురూ ఇల్లు చేరారు.

"వచ్చావా వేణూ!" ఆప్యాయంగా యెదురువచ్చిన తల్లికి వంగి నమస్కరించాడు. వారి ఆశీర్వాదమువల్ల తనింతవాడయ్యాడు. ఆ భావమెప్పుడూ అతనిలో ఉంటుంది.

"ఏంరా! అక్కడ ఆహారపదార్థాలు సరిగ్గా దొరకవా? చిక్కి పోయావేం?" ఆప్యాయంగా సూరి మాట్లాడించాడు.

"ఈ మధ్య ఏం రాయటములేదా అన్నయ్యా? వారపత్రికలు, మాస పత్రికలు రాగానే నీ ఆర్టికల్ ఉంటుందేమోనని చూస్తాను" మధు నవ్వుతూ అడిగాడు.

"తీరికేదిరా! చదువుకునే రోజులే మంచివి. ఇవి బాధ్యతతో కూడినవి" సావిత్రి కాఫీగ్లాసు బావగారి ముందు పెట్టింది.

"నేను బిస్కట్లు తెచ్చేలోపలే కాఫీ యిచ్చావా?" సుజాత వచ్చింది.

"మీ దగ్గర బిస్కట్లున్నాయని నాకేం తెలుసు? అలిసి వచ్చారని యిచ్చాను" సావిత్రి ముఖం తిప్పుకుంది.

"యెప్పుడొచ్చావురా? వాడు వచ్చాడని కబురు చేయకూడదే అమ్మా?" బయటినుండే అరుస్తూ వచ్చింది లలిత. ప్రేమ వచ్చి అన్నగారి దగ్గరే కూర్చుంది. ఒక్కసారి పక్కున నవ్వాడు వేణు. ఎందుకో ఎవరికీ అర్థం కాలేదు.

"ఏమిట్రా! యెందుకు?" సూరి అడిగాడు. తన పొరపాటు తెలిసి వచ్చింది. వెంటనే ఓ అబద్ధం ఆడాడు.

మా బడిలో జరిగిన సంగతులు గుర్తుకొచ్చాయి అన్నయ్యా! ఏం వదినా! నీ ప్రాక్టీస్ యెంతవరకు వచ్చింది? బాగానే ఉందయ్యా అని తెలిపావు. విశేషాలు చెప్పు."



"ఏదైనా కథకు థీమ్ కావాలా?" నవ్వుతూ అడిగింది సుజాత.

"కాదులే విందామని, చూడమ్మా ప్రేమా! ఆ సూటుకేసిలా పట్రా. నా సంపాదనతో నాకు తోచింది, అందరికీ తెచ్చాను" అన్నాడు.

ప్రేమ వెళ్ళి సూటుకేసు తెచ్చింది.

అది తీశాడు. నాలుగు వెంకటగిరి చీరలు తీసి వదినలకు, అక్క చెల్లెండ్రకు యిచ్చాడు. ఒక గుంటూరు జరీచీర తీసి తల్లికి ఇచ్చాడు. ధోవతులు, సిగరెట్లు తండ్రికిచ్చాడు. పిల్లలకు డ్రస్సులు, ఆటవస్తువులు యిచ్చాడు. అన్నకు, తమ్ముడికి చేతిరుమాళ్ళు ఇచ్చాడు. తనకున్న దాంట్లో తెచ్చినందుకు అంతా సంతోషిస్తారనుకున్నాడు. కాని అలాంటిదేం జరగలేదు.

"మరిదిగారూ! మరిచిపోయినట్టున్నారు. పాపకు గాజులు చేయిస్తా న్నారు" సుజాత గుర్తు చేసింది.

"ఈ మూడు నెలల్లో మిగిల్చిన డబ్బిదే వదినా! ఇంతకంటే తేలేకపోయాను."

"ఉన్న బంగారమంతా మీ ఆయన చదువుకే పెట్టారు. ఇద్దరూ సంపాదిస్తున్నారు. ఇంకా తృప్తి లేదటే అమ్మాయి!" లలిత అడిగింది.

ఎన్ని సేర్ల బంగారము అమ్మి చదివించారండీ? తిరిగి యివ్వరాదూ?"

"శేర్లనే ఏముంది! నాలుగు కాసులయినా నలుగురికీ రావాలి కదా?" సావిత్రి అడ్డుపుల్ల వేసింది.

"ఇంట్లో చిన్నా, పెద్దా అనేదే లేదు. రావడము నా తప్పు" లేచి బయటికి వెళ్ళాడు సూరి. తల్లి కోడలివంక కోపంగా చూసింది.

"తనకు మహావున్నట్టు. అటు ప్రేమ పెళ్ళి అవుతుంటే, పనంతా వదిలి పడుకోలా" లలిత మూతి తిప్పింది! కోటయ్య కూతురివంక ప్రసన్నంగా చూశాడు.

"ఊరుకో అక్కా! అన్నయ్యనంటే అమ్మకు కోపము వస్తుంది" మధు వెటకారము చేశాడు. ఆ వాతావరణము విసుగనిపించింది. అందరి పిల్లలను తీసుకుని పెరట్లోకి వచ్చాడు. పిల్లలతో ఆడుతుండగా ప్రేమ, లలిత వచ్చారు.

"మా పెద్దాడిని నీ దగ్గరుంచుకోవడానికి వీలవుతుందిరా! ఇంటి వాతావరణమే మారిపోయింది" లలిత అడిగింది.

"అదేమిటక్కా?"

"అంతేరా నాయనా! మీ బావగారికి ఈ మధ్య బాగా త్రాగుడు అలవాటయింది. చెడు స్నేహాలు, ఏం చేయాలో?" అన్నది దిగులుగా.

"నేను పోయిన సంవత్సరమే చెబితే సంపాదిస్తాడు. త్రాగుతారన్నావ్ కదక్కా?"

"బుద్ధిలేకరా నాయనా! అన్నగారు బాగున్న రోజులలో దేవుడు, దయ్యం అన్న పెద్దలు, ఆయన తమ్ముళ్ళు, యిప్పుడిటుకేసి చూడరు. నగలన్నీ తాకట్టులోనే. పిల్లడయినా బుద్ధిమంతుడయితే, ఏదో నాలుగు కాలాలపాటు నిశ్చింత."

"ఈ యేడాది గడిచిందిగా, వచ్చే యేడాది చూద్దాం" అన్నాడు.

"అన్నయ్యా! వదినలకూ, నాకూ ఒకేలాంటి చీరలా! మాకేం ప్రత్యేకత లేదా?" ప్రేమ గునిసింది. ఆమెకేదో విధంగా నచ్చచెప్పాడు. నాలుగు రోజులు ఆప్యాయంగానే చూశారందరూనూ. వెళ్తానని ప్రయాణమయ్యాడు. పండుగ మరురోజే సూరి భార్యాబిడ్డలతో వెళ్ళిపోయాడు.

"ఈసారి నీ వివాహమయితే నిశ్చింతగా ఉంటుందిరా వేణూ!"

"చూద్దాంలే అమ్మా, ఏం తొందర"

"అలా అనకు ఎంతోమంది వస్తున్నారు. నీకయినా తోడుకావద్దా!" నిజమేననిపించింది.

"సరేనమ్మా! మీకు నచ్చితే అలాగే చూడండి" అన్నాడు.

"ఒరేయ్ వేణూ! ఇకనుండి బట్టలూ, బాతలూ వద్దురా. నెలకింతని నగదు పంపు" అన్నాడు తండ్రి.

అలాగేనని చెప్పి, తను పనిచేసే జిల్లాకు వెళ్ళిపోయాడు. కాలము గడుస్తుంటే జీవితములో ఉత్సాహము నశించసాగింది. తన ప్రియబంధువుల ఉత్తరాలు చూస్తే అందరికీ దూరంగా పారిపోవాలనిపించేది.

"ఎంతొస్తే అంత ఖర్చుచేయుటమేనా? ఏనుగు తెచ్చుకుని ఏనుగు తిన్న చందము చేయకు. నీ ఖర్చుపోగా మిగిలింది పంపు" తండ్రి ఆజ్ఞ.



నిజమే పెద్దలు జాగ్రత్త చేస్తారని పంపితే అది వాళ్ళు వాడుకోరు, వేణుకై దాచిపెట్టరు. ఇరువురు భార్యాభర్తలు పోటీలుపడి తమ కిష్టమున్న సంతానానికై ఖర్చుపెడతారు.

"అన్నయ్యా! ఎంతడబ్బూ ఈ వ్యాపారానికే చాలదు. వచ్చిన లాభాలు దాంట్లోకే పోతున్నాయి. నెలనెలా పెద్దవారికి పంపే బదులు ఆ డబ్బు నాకే పంపితే ఉపయోగపడుతుంది. నీకు దాచి యిస్తా" మధు అన్నాడు.

"ఒరేయ్ వేణూ! మీ బావగారు పూర్తిగా మారిపోతున్నారు. వెయ్యి రూపాయలు చేతిలో ఉంచుకుని వచ్చి మిల్లు, యిల్లు నా పేర రాయించరా! సూరి అందరినీ మరిచిపోయాడు. చిన్నప్పటి నుండి కష్టసుఖాలు ఎరిగిన వాడవు నువ్వే" అక్కగారి అర్థింపు.

"అన్నయ్యా! మీ అన్నయ్య వొంటరివాడు, ప్లాటు కొనడానికి సాయం చెయ్యడా అని అత్తగారి వైపువారు అడుగుతున్నారు. ఊరికేకాదు. తిరిగి యిస్తాము" చిన్న చెల్లెలి వివరణ.

"మరిదిగారూ! ఆడబిడ్డకిస్తానని యివ్వకపోతే పాపమంటారు, పాప ఎప్పుడూ మా చిన్నాన్న గాజులు తెస్తాడని యెదురు చూస్తోంది. సుజాత ప్రేమగా వ్రాసే జాబు. ఒక్కరయినా, "నీ ఆరోగ్యం జాగ్రత్త. ఇన్నాళ్ళు కష్టపడ్డావు. ఏదో సంపాదిస్తున్నావు, సంతోషంగా వుండ"మని వ్రాయరేమిటి? ఎక్కడలేని విసుగు వచ్చింది. అతని సంపాదన ఎంతని? అతను పొదుపరి. ఇతరత్రా చిల్లర తిరుగుళ్ళు, ఖర్చులు లేవు కాబట్టి వందరూపాయలు నెలకు మిగల్చవచ్చును. అంతమాత్రం తన కవసరము లేదా! అతని ప్రమేయము లేకుండానే, బలవంతంగా భీమా చేయించి పదివేల రూపాయల పట్టా చేతిలో పెట్టాడో స్నేహితుడు. అదొకందుకు మంచిదేలే అని ఊరుకున్నాడు.

"ఫలానాచోట అమ్మాయి వుంది చూసుకో, కట్నం యిస్తారు. అయితే ఒక లోపము. ఎన్నదగినది కాదు. 'పూత వుందనో', 'కాస్త ఎడమ కాలు ఈడుస్తుందనో', 'కుడి కన్నులో మెల్ల వుందనో' తల్లి దండ్రులు చూసే సంబంధాలు ఒక్కటీ కుదరవు. అటు సూరిమీద డబ్బు చేసుకోవాలంటే కుదరలేదు, మధు కుదరనివ్వలేదు. మిగిలింది వేణు. అతని వివాహములోనైనా

తమ కోర్కెలన్నీ తీర్చుకోవాలని వారి తాపత్రయము. వాటిని చూసి అమ్మాయిల తల్లిదండ్రులు పారిపోయేవారు. తను వివాహం చేసుకుని ఓ ఇంటి వాడయితేగాని ఈ పంజరము నుండి బయటపడడు.

"కరీమ్‌నగర్‌లో మా బంధువుల అమ్మాయి వుంది. చూడు వేణూ! అన్ని విధాల నీకు తగినది. ఈ యేడే సెకండరీ స్కూల్ ట్రైనింగు పాసు అయింది. నీ కిష్టమైతే ఉద్యోగం చేయించు" సహ ఉపాధ్యాయుడు అడిగాడు.

"అలాగే, ఈ వేసవి సెలవులలో వెళ్దాము" అన్నాడు. తనే ఓ నిర్ణయానికి రావాలని అనుకున్నాడు.

"ముందుగానే చెబుతున్నాను. కట్నము యిచ్చుకోలేరు. ఆయన భార్యదగ్గర పెద్దలు ఇచ్చిపోయిన బంగారముంది. అదే కొంత కొంత ఒక్కొక్క అమ్మాయికి ఇస్తున్నారు.

"ఆ విషయములో నాకు పెద్ద పట్టింపు లేదు మాష్టారూ!" అతనికి చెప్పాడు. వేసవి సెలవులివ్వగానే ఎప్పటిలా ఇంటికి వెళ్ళలేదు. మైసూర్ వెళ్ళి ఊటీలో కొన్ని రోజులుండి వచ్చాడు. స్నేహితుడు అమ్మాయిని చూడమని పిలిచాడు. తల్లి తండ్రులను పిలవాలా, వద్దా అని రెండురోజులు ఆలోచించాడు. అన్నీ.... అనుకూలిస్తే వారిని మరోసారి పిల్చుకోవచ్చని తలిచాడు. వారు కట్నం దగ్గర యేదో పేచీ పెడతారు. ఒక జత బట్టలు బ్యాగులో సర్దుకున్నాడు.

# 16

అమ్మాయి పెద్ద అందకత్తె కాదు, కురూపి కాదు. మామూలుగా వుంటుంది. సాంప్రదాయమైన కుటుంబము. అంగీకరించాడు. వారంతా సంతోషించారు. ముహూర్తాలు చూశారు. ఇద్దరి జాతకరీత్యా మరో సంవత్సరము వరకు మంచి ముహూర్తమే లేదు. అయితే వేణుకు ముహూర్తాలంటే పెద్ద నమ్మకము లేదు. అవతలివారిని ఎలా శాసిస్తాడు?

"మీరు సహృదయముతో మా అమ్మాయి కన్నెచెర విడిపించాలన్నా, మాకా అదృష్టం లేనట్టుంది బాబూ!" వధువు తండ్రి కన్నీటిలో నిరాశ కొట్టవచ్చినట్టు కనిపించింది.



"అంత నిరాశ దేనికండి! మీరు ఆగమంటే ఆగుతాను. సంవత్సరం ఎంతలో వస్తుంది కనుక" అన్నాడు నవ్వుతూ. గుమ్మములో తల్లి చాటుగా నిలబడిన ఆ అమ్మాయి కళ్ళు మెరవటము కనిపించింది.

"నిజమా.... నిజంగా మేము చాలా అదృష్టవంతులము బాబూ! అన్నట్టు ఈ యేడు అమ్మాయిని ఉద్యోగంలో చేర్పించనా?"

"భలేవారండి. అప్పుడే నా అనుమతి దేనికి? పెద్దవారు మీ ఇష్టం" వారంతా ఎంతో సంతోషించారు. వూరంతా చూపించినాడు స్నేహితుడు. మామూలుగా ఇళ్ళకు దూరంగా ఓ మేడ వుంది. దాన్ని చూస్తూ, రెండు అడుగులు ముందుకు వెయ్యగానే ఓ కుర్రవాడు పరుగెత్తుకుంటూ వచ్చాడు.

"మిమ్మల్ని మా దొరసానిగారు పిలుచుకురమ్మన్నారు" వేణు చేయి పట్టుకున్నాడు. ఎవరా దొరసాని అనుకుని పైకి చూశాడు. వొక స్త్రీ నిల్చుని ఇటే చూస్తోంది. వెంటనే పోల్చాడు వేణు. ఆమె రాధ.

"ఆమె నీకు తెలుసా?" స్నేహితుడు అడిగాడు.

"తెలుసు. ఒకప్పుడు ట్యూషన్ చెప్పాను. రండి. ఒకసారి మాట్లాడించి వెళ్దాము."

వెళ్ళాలనుకుంటే నువ్వు వెళ్ళు వేణూ! మా బంధువులకూ, ఆమెకూ పడదు. ఊరివాళ్ళము కదా. మా గొడవలు మాకుంటాయిలే" అతను చెప్పి తనింటివైపు వెళ్ళాడు.

వేణు రాధ సౌధంలోకి అడుగుపెట్టాడు. ఆనాడు నలుగురిముందు దోషిగా నిలబెట్టిన పడతి ఈనాడెందుకు పిలిచినట్టో? అతనికి అర్థం కాలేదు. అతను కేవలము తను వారి పన్నాగాలకు బలైపోలేదని తెలుపదలచే వెడుతున్నాడు. అతను హాల్లో అడుగుపట్టేసరికి రాధ మేడ దిగింది. పసుపు కుంకుమతో ముఖము కళకళలాడుతున్నా, కళ్ళు మాత్రం మిలమిల లాడటము లేదు.

"బావున్నావా వేణూ! కూర్చో"

అన్నీ మరిచిపోయిందా, అంత ప్రేమగా పిలుస్తోంది.

"ఒంటరిగా ఉన్నట్టున్నారు. నాపై మరేదయినా నేరం కావచ్చు దయచేసి ఎందుకు పిలిచారో చెప్పండి?"

"వేణూ!" ఆమె అశ్రుపూరిత నేత్రాలతో అతనివంక చూసింది. వచ్చి అతనిచేయి పట్టి బలవంతంగా కూర్చోబెట్టింది.

"జరిగింది మరిచిపోయి నా మాట వినవా?"

"మళ్ళీ కొత్త పన్నాగమా?"

"అయ్యో! నా హృదయములో ఆత్మీయుడుగా నీకు తప్ప మరొకరికి చోటు లేదని ఎలా నమ్మించేది వేణూ!". ఆమె వెక్కివెక్కి ఏడ్చింది.

"ఊరుకో రాధా! గతం పోనివ్వు. ప్రస్తుత విషయాలు చెప్పు. సత్యం కన్పించడేం?"

"ఆయన అత్తగారింట్లో వున్నాడు."

" నా కర్థం కావటము లేదు రాధా."

"సత్యం మరో పెళ్ళి నెలరోజుల క్రితం చేసుకున్నాడు వేణూ! ఆ అమ్మాయికి ఒక కన్ను లేదు, బాగా ఆస్థి వుంది. ఆదర్శ వివాహము"

"మరి నువ్వెలా ఒప్పుకున్నావ్?"

"అదంతా పెద్ద కథలే. ఒప్పుకోకపోతే నా నడత మంచిది కాదని కోర్టులో నిరూపిస్తానన్నాడు. ఒకప్పుడు నీవు వ్రాసిన ఉత్తరాలు సాక్ష్యంగా చూపుతానన్నాడు"

"అతనెందుకలా ప్రవర్తిస్తున్నాడు?"

"యెందుకంటే ఏమని చెప్పను? అతన్ని అర్థం చేసుకోవటంలో పొరపాటు చేశాను."

"కూర్చుని వివరంగా చెప్పు"

ఆమె కళ్ళు తుడుచుకుంటూండగానే ముద్దబంతి పువ్వుల్లా ముద్దొస్తూ నలుగురు పాపలు వచ్చారు. ఆఖరుపాప తప్పటడుగులు వేస్తోంది.

"ఈ నలుగురు మా బిడ్డలు" పిల్లలను చూపింది. "అంకుల్‌కు నమస్తే చెప్పమ్మా!" పెద్దపాపతో అంది. ఆ పిల్ల ముద్దుగా చేతులు జోడించింది. దగ్గరగా పిలిచి ముద్దు పెట్టుకున్నాడు.



"వెళ్ళి ఆడుకోండి" అని నౌకరు కుర్రాడిని పిలిచి, వారిని తీసుకు వెళ్ళమని చెప్పింది. వారంతా వెళ్ళిపోయారు.

"నిజంగా నన్ను మోసంవల్ల నాశనం చేశాడు. అయితే తప్పంతా ఆయనదే అని అనను. నాలోని వాంఛలు అతనికి దాసురాలిని చేశాయి. నీవు జడ పదార్థంగా కనిపించేవాడివి. అతను ప్రతి చేష్టతోనూ నన్ను కవ్వించాడు. ఒకరోజు నువ్వు లేనప్పుడు గదికి వచ్చాను. అతని వాంఛలకు లొంగిపోయాను. నీ గురించి అతను చెప్పినవన్నీ నమ్మాను."

"ఏం చెప్పాడు?"

"ఒకటా, రెండా యెన్నో చెప్పాడు. ఇప్పుడవన్నీ తల్చుకుంటే యేం లాభం?" అతను ప్లాను ప్రకారం ఆలోచించి, తన దగ్గరున్న మారు తాళము చెవులతో, నేను నీకు రాసిన ఉత్తరాలన్నీ తీశాడు. మా వివాహము అయి, జీవితంలో స్థిరపడేవరకు మీరు దూరంగా ఉండాలని, నాచేత హెడ్ మిస్ట్రెస్‌కు రిపోర్టు చేయించాడు. అతని ప్రేమ మైకంలో నాకేం తెలియలేదు. నీవు గది వదలిపోయాక ఇరువురమూ స్వతంత్రంగా తిరిగాము. మా మామకు తెలిస్తే గొడవ అవుతుందని రిజిష్టరు మేరేజి చేసుకున్నాము. సత్యం ఆదర్శాన్ని, నా అదృష్టాన్ని అందరూ పొగిడేవారే, నెమ్మదిగా నా కొచ్చిన ఆస్థిపాస్తుల వివరాలు తెలుసుకున్నాడు. అతని అసలు స్వరూపం బయటపెట్టాడు. స్త్రీ లోలుడు, ధనంకోసం యేం చెయ్యమన్నా చేస్తాడు. అప్పటికే సమయం మించిపోయింది. పెద్దపాప పుట్టింది.

"బజారు స్త్రీలను తెచ్చేవాడా?"

"అదొక్కటేనా? ఈ యింట్లో ఒక్క పనిమనిషి వుండదు. వాళ్ళ అమ్మా, నాన్న వచ్చి మేనమామకూతురిని చేసుకోమంటే ఒప్పుకున్నాడు. నాతో ఏపని చేసినా అది మోక్షము కాదట! అందుకని మరొక వివాహం చేసుకోక తప్పదన్నాడు. ఏడ్చాను, తిట్టాను. భద్రంగా దాచిన ఉత్తరాలు తెచ్చి విడాకులు యిస్తానని బెదిరించాడు. అప్పటికే రెండోపాప పుట్టింది. పొమ్మని బ్రతకగలనా వేణూ! నా దురదృష్టం చూడు. అంతా ఆడపిల్లలే. రేపు వారి భవిష్యత్తు ఏమిటి? అందుకే మీ యిష్టమొచ్చినట్టు చేసుకోమన్నాను, ఉరకలు వేస్తూ

వెళ్లాడు. మామ కూతురే నిరాకరించిందట. ఓ రెండు సంవత్సరాలు నిశ్చింతగా ఉన్నాము. మళ్ళీ ఏం పైత్యము తలకెక్కిందో, యెవరు వార్త మోసుకొచ్చారో, ఈ అమ్మాయి యింటికి పోవటము రావటము మొదలుపెట్టారు. ఒకరోజు వచ్చి నా ఆరోగ్యము బాగుండని కారణాన ఆయన వివాహము చేసుకుంటు న్నారని చెప్పమని బెదిరించాడు. ఆ అమ్మాయి తండ్రి వస్తే చెప్పక తప్పలేదు. నెలరోజుల క్రితము తిరుపతిలో వివాహము జరిగింది. మీ ఊర్లో అందరిని పిలిచారు. మీకు తెలియదా?"

"నేను ఈసారి ఊరికే వెళ్ళలేదు. ఊటీవెళ్ళి సరాసరి స్నేహితుని బలవంతంపై ఈ ఊరు వచ్చాను."

"అలాగా! నేను మేడమీద నుండి చూసి నువ్వా, కాదా అని ఆలోచిస్తుండగానే, మా యింటిముందుకు వచ్చావు. ఇన్నాళ్ళకు నా బాధ చెప్పుకునే స్నేహితుడు దొరికాడు. నన్ను క్షమించలేవా వేణు!"

"తప్పేం లేదు. పరిస్థితులు అలా వచ్చాయి. అదంతా మరిచిపోదాము."

"నీలో వున్న శాంతము నిర్వచనకందనిది వేణూ! నా సోది చెప్పాను. నీ విషయాలు చెప్పనే లేదు" అన్నది.

"ఏమున్నాయి. యేదో కష్టపడి డిగ్రీ తెచ్చుకున్నాను. ట్రెనింగ్ ప్యాసయి ఉద్యోగములో చేరాను. హాయిగా గడుస్తుంది కాలము."

"వివాహము చేసుకోవా?"

"సన్యాసినా!" నవ్వి తనీ వూరు వచ్చినపని చెప్పాడు. ఆమె తృప్తిగా నిట్టూర్చింది.

"అదృష్టవంతుడివి వేణు! వాళ్ళ రాజేశ్వరి నీలాంటిదే. సుఖపడతావు."

"అదే చూడాలి. ఇంతవరకు ఆపడానికి కారణం కనిపించలేదు.

"లేదు వేణు! నిండుమనసుతో చెబుతున్నాను. అటు మామయ్యకు దూరమయ్యాను. ఇటు అత్తవారింటివారు నా నీడనే అసహ్యించుకుంటారు. దాయాదులకు, వారికి వారి వంశీకుడి సొమ్ముతింటూ, మరొకరిలో ఉంటున్నానని కోపం. నా కెవరున్నారు చెప్పు? భగవంతుడు దయామయుడు.



అప్పుడప్పుడు నా కష్టాలు చెప్పుకునేందుకుగాను నిన్నీ వూరికి అల్లుడుగా చేశాడు" అన్నది.

"నేను అలా వస్తే యేం బావుంటుంది? సత్యం అనుమానించడు కదా!"

"ఆయనలో యెన్ని చెడుగుణాలున్నా ఒకటి రెండు మంచి గుణాలున్నాయి వేణూ! నా నిజాయితీని అనుమానించవచ్చు గాని, నీపై నమ్మకముంది. అతి ఉల్లాసముగా ఉన్నప్పుడు నీ మంచితనాన్ని, శాంతాన్ని పొగడుతాడు. అతనెన్ని వేషాలు వేసి, కడకు తిండి మిగల్చకపోయినా తల్లిలా శాంతంగా వున్నావని చెబుతాడు."

"అంత నమ్మకముంటే సంతోషమే. వస్తాను" లేచాడు.

"అదేమిటి వేణూ! భోజనము చేసిపోరాదూ?"

"వాళ్ళు కనిపెట్టి ఉంటారు. రేపు వస్తాను."

"తప్పక రా. ఉండు షర్బత్ త్రాగి వెళుదువుగాని" వెళ్ళి షర్బత్ తెచ్చి యిచ్చింది. ఆరోజు వచ్చి రాధ విషయాలు స్నేహితునికి చెప్పి కొంత విముఖత తొలగించాడు. మరురోజు బిస్కట్లు, పండ్లు తీసుకుని వెళ్ళి రాధ పిల్లలకిచ్చాడు. ఆమె ఇంట భోజనము చేసి రాజేశ్వరి తల్లిదండ్రుల వద్ద సెలవు తీసుకుని, వారికి ఉత్తరాలు వ్రాస్తానని మాటయిచ్చి వచ్చాడు.

ఊరికి వచ్చి తండ్రితో తన నిర్ణయము చెప్పాడు.

"అంత తొందరేం వచ్చిందిరా? ఇవాళ, రేపు గతిలేని వాడికి వేలకు వేలు గుమ్మరిస్తున్నారు."

"నా దగ్గర మాత్రం ఏముంది నాన్నా! కనీసం ప్రేమాదరణలకు కూడా నోచుకోలేదు. అమ్మాయి సంసారపక్షంగా వుంది చాలు."

"వాడే విషయము మనము చెబితే విన్నాడు గనుక. కంఠశోష దేనికి? ఊరుకోండి." చిట్టెమ్మ నిష్ఠూరంగా భర్తను మందలించింది.

"మీ మాట వినొద్దని కాదమ్మా! ఏదో చూసుకోవాలి. కట్నాలు, కానుకలు అంటూ కూర్చుంటే యెప్పటికీ నా వివాహము సాధ్యపడదు." గొణుక్కుని ఊరుకున్నాడు. తన నివాసానికి వెళ్తూ, అన్న పిల్లలను చూద్దామని

వెళ్ళాడు. ఆయనకు ఆప్యాయత లేకపోయినా, చిన్నవాడుగా, వివాహవిషయము చెప్పి తన బాధ్యత తీర్చుకున్నాడు వేణు

"వెతికి వెతికి పంతులమ్మను పట్టావేం మరిదీ?" సుజాత వ్యంగ్యంగా అన్నది.

"పంతులమ్మ అంటే అంత చులకనదేనికి వదినా! డబ్బు రెండు చేతులా సంపాదించరనా?"

"నీ కిష్టమయితే మాకేమిటి, ఏదో ఉండబట్టలేక అన్నాను" నీవు మీ సోదరుడు మధులా ఉన్నా చదువుదేముందిలే అని నా స్నేహితురాలిని ఒప్పించేదాన్ని, డాక్టర్. హాండ్‌సమ్ చాప్ కోసము వెతుకుతోంది."

"పరవాలేదు వదినా! భగవంతుడు అందచందాలు యివ్వలేదని నేనెప్పుడూ బాధపడను. తోటి మానవులను మనుషులుగా చూసే సహృదయత యిచ్చాడు. అదే చాలు. స్వార్థం, అందమైనవారమే అనుకుని ఇతరులను అవహేళన చేసేవారంటే నాకు అయిష్టం. నీ స్నేహితురాలు అందచందాలు చూడక, యిలాగే చేసుకున్నా నాకక్కరలేదు. నాలాగే కష్టపడి, ఉన్న దాంట్లో తృప్తిగా వుండే స్త్రీ కావాలి."

"ఇలాంటి మాటలు కథారచనలకు బావుంటాయిగాని వాస్తవంలో మాత్రం శోభించవయ్యా! రేపు మా కారు, వస్తువులు చూసి నాకు లేవే అని నీ భార్య బాధపడదా?" అన్నది అతన్ని రెచ్చగొట్టాలని.

"నా కయితే లేదు. నా కాబోయే భార్య గురించి నాకు తెలియదు. స్త్రీ సహజమైన బుద్ధితో కోరితే కోరుతుందేమో?"

"అలా కోరినప్పుడు నీ మనస్సు బాధపడదా?"

"బాధ యెందుకు? అదృష్టాన్నిబట్టి అమరుతాయని చెప్తాను. ఒకప్పుడు అన్నానికి యిబ్బంది పడుతూ చదివిననాడు అందరూ రిక్షా కడతాడు, కోళ్ళబేరం చేస్తాడు. అని అన్నారు. అదృష్టాన్ని పరీక్షించు కుందామని జీవితపోరాటం సాగించాను, గెలిచాను. నేను నలుగురిలో తలెత్తుకు తిరగ గలుగుతున్నాను. అలాగే రేపు మీలాగే అన్నీ కొనే యోగముందేమో! ఎవరికి తెలుసు?"



"పగటి కలల్లో జీవిస్తారే" పకపక నవ్వింది సుజాత.

"ప్రభుత్వము టీచర్లకు కూడా కార్లు యిచ్చే ప్రణాళిక వేస్తుందో ఏమో సుజా?" సూరి నవ్వాడు. వేణు హృదయములో బాకు దిగబడినా పైకి మాత్రం చిన్నగా నవ్వాడు. మరో రెండు రోజులుండి వెళ్ళాడు.

వేణుకీమధ్య తీయని ఊహలతో గడపడము అలవాటయింది. ఏపని చేసుకొంటున్నా వొకటే ఆలోచన. ఇకముందు తను హాయిగా కూర్చుంటాడు. తన భార్య చేస్తుంది. ఆ ఊహలతో కాలము గడిచేదే తెలియలేదు. కాబోయే మామగారికి ఉత్తరము వ్రాసినప్పుడల్లా రాజేశ్వరిని గూర్చి వ్రాయాలని వుండేది. కాని ఉత్తరము పూర్తిచేసేసరికి కలము సాగేది కాదు. 'మీ చిరంజీవులందరిని అడిగానని చెప్పండి' ఆఖరి వాక్యము వ్రాసి పూర్తి చేసేవాడు.

ఆరోజు సాయంత్రం మార్క్‌ట్వేన్ వ్రాసిన పుస్తకము పట్టుకొని కూర్చున్నాడు. సహ ఉపాధ్యాయుడు శంకర్ వచ్చాడు.

"వేణూ! ఈ అడ్వర్‌టైజ్‌మెంటు చూశావా? ప్రయత్నం చేస్తావా? అతని చేతిలోని పేపరు అందుకున్నాడు వేణు. అతన్ని కూర్చోమని చెప్పి, తను ప్రకటన చూశాడు. ఆఫ్రికా ఖండములోని ఒక దేశమైన ఇథియోపియా దేశంలో విద్యావంతులు అంతగాలేని కారణమున ఉపాధ్యాయులను భారతదేశము నుండి అప్పాయింట్‌చేసి తీసుకెళ్తారు. వారి రూల్స్, రెగ్యులేషన్స్ చదివాడు, పేపరు క్రిందపెట్టాడు.

"వారడిగినట్టు నాకు సర్వీస్ లేదు."

"అప్లయిచేస్తే వచ్చిన నష్టం ఏముంది? సెలెక్ట్ అయితే హాయిగా తొమ్మిదింతలు జీతం వస్తుంది."

"మీరు చెయ్యమంటే అప్లయి చేస్తాను" ఆరోజే అన్ని సర్టిఫికెట్లు కాపీలు తీసి సర్టిఫై చేయించుకుని వచ్చాడు.

"శంకర్‌గారూ! పోస్టేజి ఖర్చులు మీరే ఇవ్వాలి. అవసరమని రాస్తే మొన్ననే అంతా మాయింటికి పంపాను. జీతం వచ్చాక ఇస్తాను"

"మంచిది" ఉత్సాహంగా వెళ్ళి, పోస్టుచేసి వచ్చాడు. తరువాత వేణు ఆ విషయమే మరచిపోయాడు. పాఠాలు ముగిశాయి పరీక్షలు అయ్యాయి. తన శుభలేఖ పంపుతాను, తన వివాహానికి రమ్మనీ అందరిని ఆహ్వానించి ఇంటికి వచ్చాడు. పెద్దలు కలుసుకుని జూన్ అయిదో తారీఖున వివాహము నిశ్చయించారు. శుభలేఖలు అచ్చు వేయించాలని తండ్రీ, కొడుకులు బయలుదేరుతుండగా, పోస్టుమెన్ పెద్ద బ్రౌన్ కవరు తెచ్చి యిచ్చాడు. ఆత్రంగా విప్పి చూశాడు. తను ఆశించనిది ఇథియోఫియా నుండి ఇంటర్వ్యూకు పిలుపు వచ్చింది. బాంబే, ఢిల్లీ, బెంగుళూరులలో ఇంటర్వ్యూ సెంటర్లు ఉన్నట్లు వ్రాశారు. ఢిల్లీలో అయితే ఎంబసీకి రమ్మని, మిగతా రెండు సిటీలలో అయితే వెస్టెండ్ హోటల్కి రమ్మని వ్రాశారు. ఇథియోఫియా వాతావరణము, అక్కడ లభించే వస్తువుల పట్టిక పంపారు. ఇంటర్వ్యూ డేట్ చూశాడు. జూన్ అయిదు.

"ఏమిట్రా అది?" తండ్రి అడిగాడు.

"ఇంటర్వ్యూ నాన్నా!" తను అప్లయి చేసిన విధానము చెప్పాడు.

"ఎలా? వివాహపు రోజునే వుందే? ఉంటే ఉందిలే! ఆ ఉద్యోగము మనకు వచ్చేదా, పెట్టేదా? అంత పెద్ద జీతం ఇచ్చేప్పుడు పెద్దవారినే తీసుకుంటారు" తేలికగా తీసిపారేశాడు.

"ప్రయత్నిస్తే నష్టమేమిటి?"

"ఈ పెళ్ళి ఖర్చులకు తోడు మరో రెండువందల రూపాయలు ఖర్చు?"

"అయితే అయింది. సెలెక్ట్ కాకపోయినా ఢిల్లీ చూశానన్న తృప్తి వుంటుంది" జూన్ ఇరవైన మరో ముహూర్తముంది, ఆ రోజుకు పెళ్ళి పోస్టుపోన్ చేయమని కాబోయే అత్తవారికి టెలిగ్రామిచ్చి, తను ఢిల్లీ ప్రయాణమయ్యాడు.

## 17

జూన్లో ఢిల్లీలో చెప్పతరము కాని ఎండలు, తన సర్టిఫికెట్లున్న బ్యాగ్ పట్టుకుని, పృథ్వీరాజ్ రోడ్లో ఇథియోపియన్ ఎంబసీ ముందు నిల్చున్నాడు వేణు. అతనికి రాను రాను నిరాశ యెక్కువయింది. అక్కడెవరూ అతనిలా కాటన్ ఫ్యాంటు షర్టుమీద లేరు. ప్రతివారు ఫుల్సూట్లో వున్నారు. అవి కూడా ఖరీదయినవి వేసుకుని ఇంటర్వ్యూకి వచ్చారు. తన దుస్తులే అంతంత మాత్రముంటే, దానికితోడు ఉక్క, అసహనంగా ఎదురు చూడసాగేడు. ఆఖరుకు తన పేరు వచ్చింది. వెళ్ళాడు. యాంత్రికంగా నమస్కారాలూ, పరిచయాలూ, కరచాలనమూ చేశాడు. అక్కడ కూర్చున్న ముగ్గురూ ఇథియోఫియన్స్. నల్లగా, యెత్తుగా, లావుగా, ఆరోగ్యంగా వున్నారు. తలపై చిన్న జుట్టు ఉంగరాలు తిరిగి వుంది. వారి కళ్ళలోని నిర్మలత్వము, ముఖములోని చిరునవ్వు చూడగానే వేణుకెంతో ధైర్యము వచ్చింది. అతనికి ఆ ఇంటర్వ్యూలో నెగ్గుతాననే ధైర్యము కల్గింది. దానికి కారణము ఆ కమిటీలో భారతీయులెవరూ లేకపోవడమే. ఒకప్పుడు కర్మభూమి అన్నారు భారతదేశాన్ని, ఇప్పుడు లంచాలకు, రికమెండేషన్లకు ఆలవాలమైంది.

"మీరు బాగా ఆలోచిస్తారనుకుంటాను" ఒకతను నవ్వుతూ ఇంగ్లీషులో అడిగాడు. అచ్చు అమెరికన్ ఉచ్చారణతో.

"లేదు" నవ్వాడు, ఒకతను విషయానికి సంబంధించిన ప్రశ్నలు అడిగాడు. మరొకతను ప్రపంచ జ్ఞానముందా, లేదా అని పరీక్షించాడు. మూడో అతను మాత్రం తనకు వచ్చే జీతము అడిగి, తామిచ్చే జీతాల వివరాలు చెప్పాడు.

"మిష్టర్! నీ సర్వీసు ఒకటిన్నర సంవత్సరాలేనంటూ తెచ్చావు సర్టిఫికెటు. నీకూ, మీ అథారిటీస్కు పడదా!"

"అలాంటిదేం లేదు. నేను పని చేసినంత కాలము వేశారు."

"అలాగా! ఇందాక ఓ అబ్బాయి వచ్చాడు. వయసు ఇరవై మూడు అంటాడు. యెనిమిదేళ్ళ సర్వీస్ వున్నట్టు స్కూల్ నుండి వ్రాయించుకొచ్చాడు."

"మీ దేశం చూడాలని ఉత్సాహం కాబోలు! మీరేమో సర్వీస్ బాగా వున్నవారికే అవకాశము యిస్తామన్నారు. పాపం, చిన్న అబద్ధం ఆడి వుంటాడు."

"అబద్ధం ఆడితే తప్పులేదంటావ్?"

"అది మనుషుల్ని బట్టి వుంటుంది."

"మరి నువ్వెందుకు అబద్ధపు సర్టిఫికెట్ తేలేదు?"

"చెప్పాను కదండీ! అది మనుషుల్నిబట్టి వుంటుంది అని. అలాంటి సర్టిఫికెట్లు నా దగ్గర లేవు గనకే ఈ రోజు ధైర్యంగా మీతో మట్లాడుతున్నాను."

"ష్యూర్" అతను తలాడించి బాండ్ తీశాడు. "మీకు మా దేశానికి రావటము అంగీకారమైతే, ఈ రూల్సు, రెగ్యులేషన్స్ చదివి సంతకం పెట్టి సాయంత్రంలోగా తెచ్చి యివ్వండి. నేను హోటల్ జనపథ్‌లో ఉంటాను. ఒ.కె" వారికి ధన్యవాదాలు చెప్పి లేచాడు. అతనికంతా మాయగా వుంది. తను ఈ విషయము కలలోకూడా తలంచలేదు. బయటికి వచ్చాడు. తాను తీసుకున్న హోటల్ గదికి చేరాడు. కంట్రాక్ట్ చదివాడు. భార్యభర్తలే అయితే ఫస్ట్‌క్లాసు విమానపు ఛార్జీలు యిస్తారు. పిల్లలుంటే దానిని ఎకానమి క్లాసుకు మారుస్తారు. ఇద్దరు బిడ్డలవరకు ఫరవాలేదు. మూడు సంవత్సరాల కాంట్రాక్టు అంతకు ముందు టీచర్లు వెళ్ళిపోవాలనుకున్నా, ప్రభుత్వం వారిని పంపాలనుకున్నా రెండు మాసాల నోటీస్ ఇవ్వాలి. ఉపాధ్యాయులు సంవత్సరములోపు తిరిగి వెళ్ళాలని అనుకుంటే టికెట్టు డబ్బు తిరిగి యివ్వాల్సి ఉంటుంది. వారికి ఉపాధ్యాయుల పని నచ్చక పంపితె టిక్కెట్టు యిచ్చి పంపివేస్తారు. పని నచ్చితే ఉపాధ్యాయుడు ఇష్టము వచ్చినంతకాలము ఉండవచ్చు. ప్రతి మూడు సంవత్సరాలకో తడవ స్వదేశం పోవడానికి అనుమతి, ఖర్చులు యిస్తారు. ఉపాధ్యాయుడు మతాలకు సంబంధించిన, రాజకీయాలకు సంబంధించిన సమావేశాలలో పాల్గొనరాదు.

అన్నీ నచ్చాయి వేణుకు. వెళ్లాలని పట్టుదల పెరిగింది. మొన్నటికి మొన్న పగటికలలు కంటావని వెక్కిరించిన వదిన మాట కల్ల చేయాలని నిశ్చయించుకున్నాడు. తాను సెలక్ట్ అయినట్టు సూరికి టెలిగ్రామ్ యిచ్చి బాండ్‌పై సంతకము పెట్టాడు. నవవధువు రాజేశ్వరితో విమానములో ప్రయాణం చేస్తాడు. మబ్బులలో తేలిపోతాడు. కాగితాలు జనపథ్ హోటల్‌లో యిచ్చి వచ్చి, తీయని ఊహలతో కాలము గడిపాడు. ఎయిర్ టిక్కెట్లు తరువాత పంపుతాము, వెళ్ళిపొమ్మన్నారు.

ఢిల్లీ, ఆగ్రా అంతా చూడాలని వుంది, కాని జేబులో డబ్బులు తక్కువ మోతాదులో వున్నాయి. అందుకే తిరుగు ప్రయాణము అయ్యాడు.



శంకర్ లాంటి స్నేహితులు అభినందించటానికి స్టేషన్‌కి వచ్చారు. అందరూ సూరి ఇంటివరకు వచ్చి సాగనంపి వెళ్ళారు.

"సెలెక్ట్ అయ్యానని టెలిగ్రామిచ్చావు. ఎప్పుడు వస్తున్నావో తెలుపరా. స్టేషన్‌కు కారు తీసుకు వచ్చేవాడిని" నిష్ఠూరం చేశాడు సూరి.

"నేను వచ్చేసంగతి శంకర్‌కు కూడా తెలుపలేదు. పనిలేదని ఆయనే రోజూ వచ్చి వెళ్తున్నాడట స్టేషన్‌కి. ఎన్నిసార్లు రిక్షాలో రాలేదు."

"మన కారుంది దేనికయ్యా తగలబెట్టనా?" వదిన నిష్టూరము వేసింది. ఢిల్లీలో జరిగిన సంగతులు అన్నగారితో చెబుతూ వదినగారందించిన ఫలహారము చేశాడు.

"ఆ రోజు వరదరాజు మామయ్యా, సత్యం వాళ్ళంతా యిక్కడే వున్నారురా. మామయ్య కూతురికి బొటా బొటీ సెకండ్ క్లాసు మార్కులు వచ్చాయి. ఎం.బి.బి.ఎస్. చదివిస్తానంటాడు."

"ప్రతివారికదో జబ్బు అయింది. డిస్ట్రిక్టులో చూడాలి. మా అమ్మాయి డాక్టరు, మా అబ్బాయి ఇంజనీరు. ఇదేగోల" నవ్వుకున్నారు. తను కాబోయే భార్యకీ సంతోషవార్త చెప్పాలి. ఆ సాయంత్రం ఇంటికి ప్రయాణమవుతుండగా సుజాత వచ్చింది.

"వేణూ! వదినగా, శ్రేయోభిలాషిగా ఓ మాట చెప్తాను వింటావా?"

"సందేహము దేనికి వదినా చెప్పు!"

"కరీమ్‌నగర్ వాళ్ళకు మరో సంబంధం చూసుకోమని వ్రాయి. నిన్న మా పిన్ని కూతురు వచ్చింది. చక్కనిచుక్క. పదిహేనువేల దాకా యిస్తారు."

"ఈ విషయములో నన్ను క్షమించు వదినా! నాకు డబ్బుపై పెద్ద ఆశలేదు. అంతదూరము డబ్బుకోసం వెళ్తున్నానని అనుకోకు. ఒక దేశం చూడాలనే కుతూహలముతో వెడుతున్నాను. ఒకవేళ స్వంతడబ్బుతో వెళ్లాలనుకుంటే, నువ్వన్నట్టు పగటికలే అవుతుంది" అన్నాడు నింపాదిగా. ఆమె చిన్నబుచ్చుకుని వెళ్ళిపోయింది. వారివద్ద శెలవు తీసుకుని రాత్రికి యిల్లు చేరాడు.

"వచ్చావా! ఇప్పటివరకు చూసి రావేమో అనుకుని ఇప్పుడే భోజనము చేశాను" కోటయ్య ప్రసన్నవదనముతో మాట్లాడాడు.

"అన్నయ్య యింటిలో ఆలస్యం అయింది" అన్నాడు. యెన్నడూ లేనిది లేచి వడ్డించింది మరదలు. తమ్ముడు విశేషాలు అడుగుతూ దగ్గరే కూర్చున్నాడు. చిట్టెమ్మ సంబరమింతా అంతా కాదు. భోజనము ముగించి నిద్రపోయాడు.

"పిచ్చివాడురా వరదుడు నిన్ను చూడాలని ఇప్పటివరకూ యెదురు చూసి వెళ్ళాడు" కొడుకు ప్రక్కలో కూర్చుని చెప్పింది చిట్టెమ్మ.

"ఉన్నట్టుండి మామయ్యకు నాపై అంత ప్రేమ కల్గిందేమిటే?"

"వాడికి ప్రేమలేందెప్పుడురా! నువ్వు చేసుకుంటానన్న సంబంధం నాకేం నచ్చలేదురా! బంగారంలాంటిపిల్ల మామ కూతురు. చదువుకుంది కూడాను."

"నా లాంటి నల్లవాడికి, తలనెరిసిన వాడికి మామయ్య పిల్లనిస్తాడా?"

"యెందుకు ఇవ్వడు? చిన్నప్పుడేదో తమాషాకంటే, దాన్నే పట్టుకుని ప్రాకులాడితే యెలాగురా? హాస్యాలు లేకపోతే జీవితమే భారంగా వుంటుంది. పాపం వాడంతట వాడే యెత్తాడురా ఈ ప్రస్తావన."

"అతను యెత్తినా నా కిష్టము లేదమ్మా. అది వయసులో చిన్నది."

"ఆడపిల్లకవన్నీ చూస్తాముట్రా. మామయ్యకు చాలా యిష్టంగా ఉంది. రక్తసంబంధము. కాదనకు."

"అవన్నీ నిజమేనమ్మా. సంవత్సరము వారిని ఆపి, ఇప్పుడు కాదంటే ఏం బావుంటుంది?"

"పుట్టిన దగ్గరనుండి మొగుడూ, పెళ్ళాలు అనుకున్నవారికే వివాహాలు కావు. కాదని చెప్పడానికేం భయం. నాకు జీతం పెద్దది, బోలెడుమంది కట్నం యిచ్చేవారున్నారని చెప్పు. తీరిపోతుంది."

"అదే స్థలంలో మనముంటే ఎంత బాధపడతామో ఆలోచించేం! రేపు నేను వాళ్ళూరు వెడుతున్నాను."



"చిన్నప్పటి నుండి నీమాటేగాని మా మాట విన్నదెప్పుడటా." ఆమె విసుగ్గా లేచింది.

"మీరెప్పుడైనా నన్ను అర్ధం చేసుకుని నా మాట విన్నారు గనుకనా!" అతనూ నిష్టూరంగా అన్నాడు. యెవరూ మాట్లాడలేదు. ఎవరిదారిన వారు నిద్రపోయారు.

అందరికీ అయిష్టంగా ఉన్నా కరీంనగర్ బయలుదేరాడు. అక్కడ తన పెళ్ళి కుదిర్చిన స్నేహితునికి సంతోషవార్త చెప్పి, రాధతో మాట్లాడి, కాబోయే మామగారికి కూడా తెలియజేద్దాము అనుకున్నాడు.

బస్సుదిగి స్నేహితుడి ఇల్లు చేరాడు. అక్కడ తాళం దర్శనమిచ్చింది. నిరాశగా వెనుదిరిగాడు. అత్తగారింటికి వెళ్ళటము సమంజసంగా కనిపించలేదు. రాధ దగ్గర సామాన్లు పెట్టి భోజనం చేసి కూర్చున్నాడు.

తను సంతోషవార్త యెలా చెప్పాలా అనుకుంటుండగానే, రాధే సంకోచంగా మరోవార్త చెప్పింది.

"వేణూ! ఏం జరిగిందో తెలియదుగాని, రాజేశ్వరికి మరో సంబంధం చూశారు. సత్యం కూడా చెప్పాడు. అసలైన కారణం యెవరూ చెప్పరు."

"పొరపాటు పడివుంటారు రాధా! నాకు ఇథియోఫియాలో టీచర్ పోస్టు దొరికింది." వివరాలన్నీ చెప్పాడు. "అందుకే నేను కట్నం అడుగుతానని అనుకుని వుంటారు" అన్నాడు.

రాధ యెందుకో గంభీరంగా వుండిపోయింది.

వేణు నెమ్మదిగా కాబోయే మామగారింటికి వెళ్ళాడు. అతను సంతోషంగా యెదురు రాలేదు. ఉత్తరాలలో అంత ఆప్యాయతను కురిపించే వ్యక్తి యితడేనా అనిపించింది. బలవంతంగా తన భావాలను బిగబట్టి ఆహ్వానించారు. నమస్కారము చేసి కూర్చున్నాడు.

"ముహూర్తము పొడిగించినందుకు అన్యధా భావించకండి. చాలా ఏమి....."

"ఫరవాలేదండి. భగవంతుడేది చేసినా మన మేలుకే అన్నట్టు. మొదటే తెలిపి రక్షింపబడ్డాము. మేము వ్రాసిన ఉత్తరం అందలేదా?"

"ఎప్పుడు వ్రాశారు? ఏమని వ్రాశారు?"

"మేము రాజేశ్వరికి మరో సంబంధము చూశామని, మీరుకూడా మరో సంబంధము చూచుకోవచ్చునని...."

"యెందుకు వ్రాశారో తెలుసుకోవచ్చునా?"

"యెందుకంటే ఏం చెప్పాలి? మా అమ్మాయి ఇష్టపడలేదు."

"ఆ ఆలోచన సంవత్సరం క్రితం ఉంటే బావుండేది."

"అప్పుడు మిమ్మల్ని ఆదర్శపురుషుడుగానే భావించింది. కాని మీరు మరో ఉద్దేశ్యముతో మా ఊరి అల్లుడు కాదలచారని మాకేం తెలుసు?"

"చూడండి పేచీలు, మడతమాటలు నాకు తెలియవు. స్పష్టంగా చెప్పండి"

"మీరంతగా వినాలని కుతూహలపడుతుంటే చెప్పడానికేం? యీ ఊళ్ళోవున్న రాధ అనే స్త్రీ పూర్వాశ్రమంలో మీ ప్రేయురాలు, ఆమెను కలుసుకోవాలని, మా అమ్మాయిని వివాహము చేసుకుందామని వచ్చారు" అన్నాడు వెటకారంగా.

"మీ మాటలు ఆధారములేనివి" కోపంగా లేచాడు.

"అమ్మా! ఆ ఉత్తరమిలా తే తల్లీ" అతను నిశ్చలంగా పిలిచాడు. కొన్ని నిమిషాలలో గాజులచేయి ముందుకు వచ్చింది. ఆ చేతిలోని కాగితం అందుకుని వేణువైపు గిరాటు వేశాడు.

"చూసుకోండి. కాదని బుకాయించకండి. మీరు నాకు రాసిన ఉత్తరం రాతతో పోల్చి చూసుకున్నాను" అన్నాడు.

"అంత అవసరము యేం లేదులెండి" అని ఉత్తరము అందుకుని చదివాడు, తనెప్పుడో రాధకు రాసిన ఉత్తరము. ఆ ఉత్తరము వారికెలా అందినదో అర్థం కాలేదు.

"మీరు వ్రాసిందేనా?"

"అంతలా నిలదీయవల్సిన అవసరం లేదు. మీరు నన్ను నమ్మితే వీటన్నిటికి జవాబు చెప్తాను. నమ్మకం లేకుంటే వెళ్ళిపోతాను. నాకు వేరే సంబంధము దొరకదని కాదు."



"అంటే, ఆడపిల్లలు కన్న తండ్రిని, నాకు దొరకదనేకదా బెదిరింపు."

"పొరపాటు పడుతున్నారు. ఆ అహంకారమే ఉంటే ఇంతదూరం వచ్చేవాడినే కాదు" అన్నాడు లేస్తూ.

"మంచిది. వెళ్ళిరండి. మాకేం వినాలని లేదు" అతని మాటలు ...వి. లేచి బయటకు వచ్చాడు. ఆ ఉత్తరం వాళ్ళకిచ్చి, తన పెళ్ళి ఆపితే ...ర్యానికేం కలిసి వస్తుంది? అదో తృప్తా! తనకెంత అపకారము చేసినా, ఒక్కమాటయినా అనలేదే తను. అడుగులు కొలుస్తూ నడిచినట్టే రాధ ...శధము చేరుకున్నాడు.

మలినమైన ముఖముతో తిరిగివచ్చిన వేణును మాట్లాడించలేక పోయింది రాధ. అతని హృదయమంతా ముఖంలోనే చదువ గలిగింది. అతడు ...చ్చి నిస్పృహగా కుర్చీలో కూర్చున్నాడు. వేణు జుట్టు సవరించింది.

"అసలేం జరిగింది వేణూ?" చివరికెలాగో అడిగింది.

"రాధా! నేను నీకు వ్రాసిన ఉత్తరాలు సత్యం దగ్గరనుండి సేకరించి దాచిపెట్టకూడదూ, పోనీ కాల్చివేయకూడదూ?"

"ప్రయత్నించాను వేణూ! లాభం లేకపోయింది. అవి లేనినాడు నా ఆస్తిపై ఆయనకు అధికారము సాగదని తెలుసు. ఆ ప్రసక్తి దేనికి?"

"ఆ ఉత్తరం రాజేశ్వరి తండ్రికి అందింది"

"ఆ!"

"అవును. నీ దగ్గరికి రావటానికే నేను వారి అమ్మాయిని చేసుకుంటున్నానని అపోహపడ్డారు."

"యెంత పని జరిగింది వేణూ! నావల్ల నీకెన్ని ఇబ్బందులు వస్తున్నాయి? ఇప్పుడే వెళ్తాను, నీవు ఈ దేశం వదిలివెళ్తున్నావని చెప్పి వారి అనుమానము తొలగిస్తాను" రాధ ఆవేశంగా లేచింది.

"వద్దు రాధా! వారు నిన్ను మాటలంటారు. అది నాకిష్టం లేదు. ...నిప్పు. నాకున్న విచారమల్లా, ఆ ఉత్తరాలతో నిన్ను యెన్ని ఆటలాడిస్తారో ...ని."

"స్వయంకృతాపరాధం. నన్నెవరు రక్షించరు. నీ విషయాలు చూడాలి."

"నా విషయాలు ఆలోచించకు రాధా! మొగవాడిని. ప్రకృతి యీ విషయములో నన్ను కనికరించింది. నీ మార్గమే కంటకప్రాయంగా వుంది. అతను నీ ఆస్తిని హస్తగతం చేసుకోవాలని చూస్తున్నాడా?"

"అదొక్కటేనా, అతని పనులకు అర్ధం, పర్థం లేదు. ఈ బిడ్డల కోసము అనుభవిస్తున్నాను వేణూ! బిడ్డలు చాలు, ఆపరేషన్ చేయించమంటే వెటకారంగా నవ్వుతారు. 'నీ రంకు నిరంకుశత్వంగా సాగించుకుందామనా' అంటారు. రెండుసార్లు నాటుమందులు త్రాగి ప్రాణంమీదికి తెచ్చుకున్నాను. ఈ పిల్లలు ఏమైపోతారోననే దిగులు" అన్నది కన్నీరు కారుస్తూ.

"ఊరుకో రాధా! ఏదో ఆలోచిస్తా" ఆమెని ఓదార్చి ఆలోచనలో పడ్డాడు.

రాధ వెళ్ళి వంటపనిలో లీనమైంది.

"హల్లో బ్రదర్! యెప్పుడు రాక! కంగ్రాచ్యులేషన్స్" అన్నాడు సత్యం బయటి నుండి వస్తూ. అతని వెనకాల నలుగురు బిడ్డలూ వచ్చారు. 'నాన్నా' అంటూ.

"థ్యాంక్స్" అన్నాడు కోపాన్ని దిగమ్రింగుతూ.

"అంత పొడిగా అంటావేంరా. నాకు ధన్యవాదాలు పదివేలిచ్చి చెప్పినా తక్కువే. ఈనాడు ఓ కుచేలుని కూతురికి తాళికట్టకుండా ఆపాను. యెందుకంటావ్? నీ మేలుకోరి. నీ స్వంత మామే జామపండులాంటి కూతుర్ని పదివేలరూపాయల కట్నం ఇవ్వడానికి సిద్ధంగా వున్నాడు. ఆఁ. ఆనాటిమాట. రాధను కట్టుకుంటే ఇవిగో, నల్గురి మారెమ్మలకు తండ్రివై తరించే వైనము గానక బాధపడేవాడివి. ఈ ఇథియోఫియా ఛాన్స్, యీ చదువు సాగేవా?"

"సత్యం ఏమిటి నీ ఉద్దేశం? నేనేం అపకారము చేశానని నా వెంటబడ్డావు?"

"నువ్వు అర్థం చేసుకోకపోతే నీ ఖర్మ. ఏం చూసి వరించావురా, ఈ రాజేశ్వరిని? అఫ్‌కోర్స్! నేనో యేకాక్షిని కట్టుకున్నాను. కావల్సినంత ధనము వుంది" సత్యము మాటలు వింటుంటే వేణుకు మండిపోతోంది. తన్ను తాను చాలా నిగ్రహించుకొన్నాడు.



"అర్థం చేసుకున్నాను బ్రదర్! చాలా సంతోషంగా వుంది. పద హైదరాబాద్‌కు. పార్టీ యిస్తాను" ఉత్సాహంగా అన్నాడు.

"గుడ్! అలా వుండాలి స్నేహమంటే. నీకు అయిష్టమే కావచ్చు కదా!" పెద్దగా నవ్వాడు సత్యం. రాధ బయటికి వచ్చింది.

"వేణూ! నీకు మతిగాని పోలేదుకదా? ఆయన చేసిన నిర్వాహకానికి పార్టీ యిస్తావా?"

"ఇవ్వాలి, తర్వాత నీకే అర్థమవుతుంది" యిరువురూ లేచారు. రాధ బలవంతంపై వేణు, సత్యం భోజనాలు చేసి బయలుదేరారు. సత్యం చాలా ఉత్సాహంగా వున్నాడు. బస్సుదిగి హోటల్లో గదులు తీసుకున్నారు. అంతా వేణు ఖర్చే. మరురోజు మంచి ఇరానీ హోటల్‌కి వెళ్ళి బిర్యాని, కట్‌లెట్, సమోసా తిన్నారు. కాస్తప్రొద్దు తిరగగానే బార్‌కి వెళ్ళారు. సత్యం అడిగినవన్నీ తెప్పించాడు.

"నేను ఒక్కడినే తాగాలిట్రా? ఇక్కడ అలవాటు లేకపోయినా ఫారిన్ కంట్రీలో త్రాగాల్సి వస్తుంది. కానియ్యి" మరో గ్లాసులోకి ఒంపాడు. దాన్ని నోటిదగ్గర పెట్టుకుని, వేయించిన రొయ్యి కొరుకుతూ కూర్చున్నాడు. ఎనిమిది దాటాక గదికి వచ్చారు. వేణుకు బాగా తెలుసు సత్యం గుణం. అతను యే విధంగా దారికి వస్తాడో? నిషాలో కొందరు అసమానమైన ధైర్యసాహసాలు ప్రదర్శిస్తారు. మరి కొందరు పసిపిల్లల్లా నీడను చూస్తే జడుసుకునే పిరికివారవుతారు. సత్యం పిరికివాడు కాడు. త్రాగితే యెక్కడలేని పిరికితనము ఆవహిస్తుంది. గది తలుపులు మూశాడు వేణు.

"ఏరా.... నా గదిలో పడుకుంటావ్! ఆహో.... కావాలంటే సెప్పు. అప్సరసలను పిలిపిస్తాను. స్వర్గం చూపిస్తారు"

వేణు వెళ్ళి అతని కాలర్ గట్టిగా పట్టుకున్నాడు.

"వాళ్ళు స్వర్గము చూపనక్కరలేదు, నేనే చూపుతాను..."

"నా గొంతు..... గొంతు పట్టుకున్నావ్..... చంపుతావా?"

"నిశ్చయంగా. సత్యం! ఆ వుత్తరాలు నీ వివాహానికి ముందు నా గదినుండి దొంగిలించావ్.... ఏవి? అవి కావాలి. లేకుంటే చంపుతాను"

"లేవురా....ఊర్లో...."

"అబద్దం ఆడితే చంపుతాను, ఊర్లో అంగుళం, అంగుళం రాధ వెతికింది."

"కొత్త అత్తగారింట్లో...." సత్యం మాట పూర్తిగాక ముందే వేణు ఈడ్చి ఒక దెబ్బ వేశాడు.

"మళ్ళీ అబద్ధం. అవి నీ దగ్గర యెక్కడో ఉండి వుంటాయి. యెప్పుడు పడితే అప్పుడు వాటిని తీసి రాధను బెదిరిస్తావ్! తే. మర్యాదగా యివ్వకపోయావో, నిన్ను చితకబాది, నీ వస్తువులన్నీ తగలబెడతాను."

"వద్దురా, వదులు. యిస్తాను."

"చెప్పు. ఎక్కడున్నాయో నేను తీస్తాను"

"నా కోటులో కుట్టి వున్నాయి. రాధ వాటికై ప్రయత్నిస్తోందని తెలిసి ఇంట్లో పెట్టటము లేదు. నల్లదారముతో హెమ్ చేసిన కుట్టును తీశాడు. ఉత్తరాలు బయటపడ్డాయి. వేణు అతని జేబులో నుండి అగ్గిపెట్టె తీసి అన్నింటిని అంటించాడు.

"వేణూ! వద్దురా" వారించబోయాడు. అతన్నో నెట్టునెట్టి అన్నింటిని కాల్చాడు.

"సత్యం! మనిషికి నేనే గొప్ప అన్న అహం తగదురా. సూచావుగా నీ పరాజయము. అమాయకురాలైన రాధను మోసం చేసి వివాహం చేసుకున్నావు. ఫరవాలేదు. మానవుడన్నాక ఒకసారి కాకపోతే ఒకసారి పొరపాటు చేస్తాడు. స్వార్ధం వెల్లడించుకుంటాడు. కాని జీవితాంతము నటించబోతే ప్రమాదమురా. మరో స్త్రీని డబాయించి రెండో పెళ్ళిచేసుకున్నావు. ఇంకా నీకు తృప్తి లేదా! కళ్ళు తెరచి ప్రవర్తించు. వస్తాను. స్త్రీ అంటే నీకు సుఖమిచ్చే యంత్రమే కాదురా, సున్నితంగా దాచుకోవాల్సిన సుకుమారమైన పుష్పము. వస్తాను" త్వరగా గది విడిచి తన గదిలోకి వచ్చాడు. తలుపులు వేసుకుని జేబులోనుండి ఇన్‌లాండ్ కవరుతీసి, నిశ్చింతగా వుండమని రాధకు ఉత్తరం



వ్రాసి నిశ్చింతగా మంచముపై వ్రాలాడు. అతనికి మేనమామ ప్లాను అర్థం అయింది. 'మనుషుల్ని గౌరవించని మనుషులతో తనకు సంబంధం వద్దు. చచ్చినా సరే, జన్మలో వివాహం కాకపోయినా ఫరవాలేదు. ఓ నిశ్చయానికి వచ్చి హాయిగా నిద్రబోయాడు.

## 18

ఒక సూటుకేసు నిండా బట్టలు సర్దుకుని తయారయ్యాడు. చిన్న కిట్ బ్యాగులో కొన్ని వస్తువులు సర్దుకున్నాడు. వెళ్ళేటప్పుడు కూడా యెవరూ తృప్తిగా సాగనంపటం లేదు. తన జన్మ యింతే? మామ కూతుర్ని చేసుకోలేదని తల్లికి కోపము; మధుకు డబ్బు పంపుతానని ప్రమాణం చేయలేదని తండ్రికి కోపము, తన మాట వినలేదని అన్నా, వదినలకు కోపము; తన కాపురము సర్దుబాటు చేయలేదని అక్కకు కోపము; తన భర్త అడిగినవి యివ్వలేదని చెల్లెలికి కోపం. అన్నింటికి అతీతుడుగా తన పనులలో మునిగిపోయాడు.

"వేణు బాబూ! క్షమించి నా మాట వింటావూ....." రాజేశ్వరి తండ్రి వచ్చాడు.

"నాకు తెలుసు. మీరు చెప్పేది. అపార్థం చేసుకున్నాను అంటారు. చూడండి, నా కెవరు చెప్పినా మీ విషయం మరో విధంగా ఆలోచించలేక పోయాను. నిండు మనసుతో మీ దగ్గరకు వచ్చాను. నిర్దాక్షిణ్యంగా పొమ్మన్నారు. ఇప్పుడు మీ పట్ల జాలితప్ప మరేం లేదు. కొన్ని గంటలలో దేశం విడువ బోతున్నాను. నన్ను విసిగించి మీరు బాధపడవద్దు. రాజేశ్వరికి వివాహము చెయ్యండి. నేను అప్పుడే వివాహ విషయం తలపెట్టను" ఖచ్చితంగా చెప్పాడు. అతను నిరాశగా వెనుదిరిగాడు. అన్నగారి కారులో ఏరోడ్రోమ్ చేరారు. అందరిని వదలి విమానంలో కూర్చోగానే అతని కళ్ళు చెమర్చాయి. ఏదో ఒంటరితనము ఆవహించింది. నిజంగా ఒంటరిగా కాక, జంటగావస్తే యెంత బావుండేది? తనకా అదృష్టం లేనట్టుంది. అతని ఆలోచనలకన్నా వేగంగా విమానం పరుగెత్తుతోంది.

సాయంత్రము ఆరున్నరకు పాలం ఏర్‌పోర్టులో దిగాడు. ఒంటరితనము అతని ధైర్యాన్ని పరీక్షించసాగింది. హోటల్‌చేరి కావల్సినవన్నీ పూర్తిచేసి మర్నాటి ప్లేన్‌లో సీటు రిజర్వేషన్ చేయించి వచ్చాడు.

రెండు గంటల రాత్రి నిశీధియైన రాత్రి. పాలం ఏర్‌పోర్టు వదులుతుంటే, అతనికి అమితమైన బాధవేసింది. ప్లేన్ నిండా టీచర్లే. ఒక్క ఆంధ్రుడు కనిపించడు. అంతా కేరళ వారే.

"టీ కావాలా, కాఫీయా?" కరాచీ సమీపిస్తుండగా ఏర్ హోస్టెస్ అడిగింది.

"టీ" ముక్తసరిగా జవాబు చెప్పాడు. ఆమె ఇచ్చిన టీ తాగాడు. కరాచీలో అరగంట ఆగింది. దిగి చూసి వచ్చాడు. ఇంటర్నేషనల్ ఏర్‌పోర్ట్లో అది కూడా పెద్దదే. ఎటు చూసినా కాస్మెటిక్స్ కొట్లే ఉన్నాయి. ముస్లిముల రసికతను చాటుతున్నాయి. బయటికి వెళ్ళి చూడటానికి సమయము లేదు. వచ్చి కూర్చున్నాడు. ప్లేన్ బయలుదేరింది. ప్రొఫెల్లర్లు తిరిగినట్లు వేగు ఆలోచనలు తిరుగుతున్నాయి. ఉషోదయముతో పాటు, అతని మానసము తన నిర్ణయాలపట్ల ఆమోదము తెలుపుతూ, అశాంతి నుండి దూరము నెట్టాయి. రెండున్నర గంటలు ఆలస్యంగా తెల్లవారింది. క్రిందికి అర్ధం గుండా చూశాడు. అరేబియా సముద్రం, ఉదయపు టెండలో నిశ్చలంగా కనిపించింది. తనను నిర్లక్ష్యంగా చూసిన బంధువులపట్ల పేరుకుపోయిన విముఖత తొలగిపోసాగింది. వారి నిర్లక్ష్యం వల్లనే పట్టుదల పెరిగి, తనో లక్ష్యం సాధించాడు. ఇంతవరకు తన అవసరాలకు మించిన డబ్బు తన దగ్గర లేదు. ఇప్పుడు బహుశః తను మిగల్చవచ్చును. పదో వంతయిన బీద విద్యార్థులకై వెచ్చించాలి. ఇలాంటి నిర్ణయాలు సాగిపోతున్నాయి. బ్రేక్‌ఫాస్ట్, మరో కప్పు కాఫీ వచ్చాయి. అవి తీసుకుని తన ముందుసీటుకు తగిలించిన సంచి నుండి మాగజైన్లు, పేపర్లు తీశాడు. ప్లేన్ ఇథియోపియా బోర్డరు చేరింది. ముఖ్యమైన మూడు తెగలు గల ఇథియోపియాకి, అస్మారా ఒక తెగకు సంబంధించిన రాష్ట్రానికి కాపిటల్. 'టిగ్రీ' తెగ అక్కడ నివసించేది. అక్కడ మరో గంట ఆగింది ప్లేన్. అక్కడి నుంచి చిన్న పట్టణం అందంగా కనిపించింది. చిన్న చిన్న కొబ్బరిచెట్ల



వంటి మొక్కలు పచ్చగా, నయనానందంగా కనిపించాయి. ప్రకృతి సౌందర్యమంతా ఇథియోపియా సొమ్మన్నట్లు అక్కడక్కడ మొలచిన యూకలిప్టస్ మొక్కలు అందంగా కనిపించాయి. ప్లేన్ ఎగురుతున్నా గడ్డి రంగు ఒక విధమైన ఆకుపచ్చన, యూకలిప్టస్ మొక్కలు మరో రంగు ఆకుపచ్చన, ఇతరత్రా మొక్కలు మరో రంగు. భలే గమ్మత్తుగా చిత్రకారుడు తన రంగులను కలబోసి, కుంచెతో నేర్పినట్లు కనిపించసాగింది ధరిత్రి. తన ఊహలనుండి తేరుకుని చూశాడు తన సీటు దగ్గరే నిల్చుంది ఓ అమ్మాయి. నలుపు రంగు, గరుకు జుట్టు, పెద్ద బార్డరుగల తెల్ల ఫ్రాకు వేసుకుంది. అలాంటి ఓణీయే కప్పుకుంది. అతన్ని చూసి చిరునవ్వు నవ్వింది.

"మీది ఇథియోపియానా?" అడిగాడు ఇంగ్లీషులో.

"యా........" ఆ యా అన్నమాట కర్ణకఠోరంగా వినిపించింది. కాని ప్రపంచంలోకెల్ల అభివృద్ధి గాంచిన దేశము, ధనధాన్యాలలో తులతూగుతున్న దేశం అయిన అమెరికా యొక్క ఉచ్చారణ. యస్‌కు బదులు 'యా' అంటారు.

"హౌ డూ యు లైక్ అవర్ కంట్రీ?" (మా దేశం నచ్చిందా?)

"చూడందే" తనూ నవ్వుతూ అన్నాడు. "అడవిలో కూడా ఈ మొక్కలు అందంగా మొలిచాయి. యూకలిప్టస్ మీకు కలప నిస్తుందా?" ఇంగ్లీషులో అడిగాడు.

"మొలవలేదు. ప్రిన్స్ సెకండ్ మెనిలిక్, ఆస్ట్రేలియాకు వెళ్ళి విత్తనాలు తెచ్చారు. హెలికాప్టరులో తిరుగుతూ అంతటా జల్లారు" ఆమె వెళ్ళిపోయింది. అడిస్ అబాబా చేరుకున్నది ప్లేన్. పాస్‌పోర్టులు, వీసా, హెల్త్ సర్టిఫికెటు అన్నీ చూపించి బయటకు వచ్చేసరికి, వారి గైడ్ వచ్చి అందరినీ, ఓ హోటల్‌కు తీసుకుపోయాడు. అక్కడ కాస్త స్థిమితపడ్డాక అందరితో పరిచయము జరిగింది. డెబ్భై శాతం కేరళ వారు, పది శాతము సర్దార్జులు, మరో పది శాతము మద్రాసు వారు. మిగిలిన పదిశాతములో ఇతర రాష్ట్రాలవారున్నారు. అడ్వాన్స్ చేతిలో పడ్డాక, అడిస్ అబాబా పట్టణం చూడడానికి వెళ్ళాడు. అతనితో మరొక బెంగాలీ అతను కూడా వచ్చాడు. ఓభిజిత్‌రాయ్. ఇరువురూ ఎత్తయిన ప్రదేశంలో నిలబడి హిల్ స్టేషన్‌లో వున్న అందమైన పట్టణాన్ని తిలకించసాగేరు.

"పట్టణం చిన్నదయినా, బహు సుందరంగా ఉందండి రాయ్‌గారూ!"

"వీరి ముఖం వీరికేం తెలుసు? గొజ్జాం రాష్ట్రంలో మా స్నేహితుడున్నాడు. అతను వ్రాసేవాడు ఈ మాత్రము రోడ్లు ఇటాలియన్స్ వేసినవేనట"

"అవును. పంధొమ్మిది వందల నలభై రెండులో కాదు ప్రపంచ యుద్ధము ముగిసినాక, భారతీయ సైనికులే వీరికి ముక్తి ప్రసాదించింది"

"అందుకే ఈ దేశపురాజు హిజ్ మేజెస్టీ, హెల్ సెలాసీ బ్రతికినంత కాలము భారతీయులను గౌరవించాడు. ఆయన తన హయాంలో భారతీయులకు ఎట్టిలోటు రానివ్వలేదు."

"నిజం చెప్పొద్దూ! ఈ దేశస్తులను నేను చాలా భయంకరముగా ఊహించుకున్నాను సుమా! నాకు ఆఫ్రికన్స్ అంటే నల్లని రంగు, లావాటి పెదవులు! చప్పిడి ముక్కు, భయంకరమైన కళ్ళుంటాయని ఊహించుకునే వాడిని."

"నిజానికి ఆఫ్రికన్ కంట్రీస్‌లో ఇథియోఫియా ఒక్కదానిలో అందమైన వారుంటారు. దానికి కారణము ఇటాలియన్ క్రాస్ బ్రీడ్, ఇండియన్ క్రాస్‌బ్రీడ్ కెన్యా, వుగాండా, జాంబియాలలో చూడాలి. వారి మినిస్ట్రీనుండి వెలువడే బులెటిన్స్‌లో ఫోటోలు వస్తాయి."

"నిజమే. వీరు భారతీయులవలెనే ఉంటారు గాని ఒక జుట్టు మాత్రం తేడా వుంటుంది."

"గెథోచ్! కాల్సి పీల్లిగాల్?" ఒక పదహారేళ్ళ అబ్బాయి రక రకాల సాక్స్ పట్టుకుని నిల్చున్నాడు. ఇరువురికి భాష అర్థం కాలేదు. ప్రక్కనే నిల్చున్న ఇథియోపియన్ వీరి అవస్థ గమనించాడులా ఉంది. ఇంగ్లీషులో జవాబు చెప్పాడు.

"మీకు సాక్స్ కావాలా, అంటున్నాడండి."

"గెథోచ్ అంటే ఏమిటి?"

"మీరు తప్పని అనుకుంటున్నారా? గెథోచ్ అంటే సర్! అని అర్థం" అతనికి ధన్యవాలు చెప్పి, వద్దన్నట్టు చేతితో సైగ చేశాడు. ఎత్తు పల్లాలుగల రోడ్లు, ఇరువైపులా యూకలిప్టస్, పైన్స్ మొక్కలు, పదంతస్తులు అందమైన



బిల్డింగులు ముచ్చటగా వుంది. సైకిళ్ళూ, రిక్షాలూ, గుర్రపుబళ్ళూ అసలు కనిపించవు. యెటు చూసినా మోటారు కార్లే. అందులో సగము వోక్స్ వాగన్స్. అవి లేనివారికి టాక్సీలు. సిటీలో ఎంతదూరమైనా సరే, మనిషికి 25 సెంట్లు తీసుకుంటారు. ఒక డాలరుకు వంద సెంట్లు. సిటీ బస్సులున్నాయి. అవి కొన్ని మెయిన్ రోడ్స్‌లోనే తిరుగుతాయి. వాటికంటే ఒక చోట యెక్కి బస్సు ఆఖరి స్టాప్ దగ్గర దిగినా, పదిహేను సెంట్లు ఇవ్వాల్సి వుంది. బస్సులో యెక్కేదారి ఒకటి, దిగేదారి ఒకటి ఉంది. మనుషులంతా యెక్కగానే ఆటోమాటిక్‌గా తలుపులు మూసుకుంటాయి. అటునుండి ముందుకు పోదలచినవారు డబ్బాలో కూర్చున్న స్త్రీకి పదిహేను పైసలిచ్చి టిక్కెట్టు తీసుకుని ముందుకు పోవాలి. చకచకా జరిగిపోతాయి ఈ పనులు.

"బస్సు ప్రయాణం హాయిగా, చౌకగా గడిచింది గాని, ఏమిటండీ ఈ వాసన?"

"మిష్టర్ వేణుగోపాల్! సిటీలోనే యింత కంగారుపడితే ఇంటీరియర్ ప్లేసెస్‌లో యెలా? ఈ దేశంలో వున్నది రెండే తరగతుల వారు. ధనవంతులు, బీదవారు. ధనవంతులంతా కాస్త నాగరికత నేర్చుకున్నారులా ఉంది. మిగిలిన వారంతా తలకు, శరీరానికి ఆవునెయ్యి, లేదా క్రొవ్వు పూసుకుంటారు. అదే వాసన" అటునుండి ఇరువురూ తిరిగి ఇథియోఫియా కమర్షియల్ బ్యాంక్‌కు వెళ్ళారు. అక్కడ తమ పేర కొంత డబ్బు డిపాజిట్ చేసి వస్తుండగా అక్కడే ఒక భారతీయుడు కనిపించాడు. అతనే వీరిని విష్ చేసి గుర్తించినట్టు నవ్వాడు.

"క్రొత్తగా వచ్చారా?" ఇంగ్లీషులో అడిగాడు. అవునని యిరువురూ చెప్పారు.

"అయితే రండి. అలా బార్‌కి వెడదాము" ముగ్గురూ బార్‌కి నడిచారు. ఇథియోపియాలో ఇంకో విచిత్రమేమిటంటే ప్రతి మూడో యిల్లు బార్. అంటే కాస్ట్లీ డ్రింక్స్ అమ్ముతారని కాదు. పరిసరాలనుబట్టి, మంచి వీధి అయితే బీర్, ఆరెంజ్ క్రష్ (ఫాంతా), తోకో-కోలా ఉంటాయి. మరీ చిన్న బార్స్‌ని బున్నాబేత్ (కాఫీహౌస్) అంటారు. అక్కడ బ్లాక్ కాఫీ, లోకల్ డ్రింక్స్ 'తల్లా' 'టెజ్' దొరుకుతా[illegible] ప్రతి బార్[illegible]ను, బున్నా[illegible]త్‌లోను స[illegible] దగ్గర నుండి

క్యాషియర్ వరకు అంతా స్త్రీలే. అలాగే ప్రతి కుర్రవాడు బూట్ పాలిష్ చేసేవారె. ఎక్కడ చూడు బల్ల పరుపుగవున్న ఓ చెక్క, పాలిష్ సరంజామా మెడలో తగిలించుకు తిరుగుతారు. అందరూ వెళ్ళి బార్‌లో కూర్చున్నారు. బార్ ఆధునికమైన ఫర్నిచర్‌తో అందంగా వుంది.

"ఏం తీసుకుంటారు? బీరా, బ్లాక్ అండ్ వైట్ విస్కీనా, నోంయాల్ చాంపేన్... ఏది కావాలి?" అతని వంక చిత్రంగా చూశాడు వేణు. వాటి పేర్లు విని వున్నాడో లేదో తను.

"కాఫీ తీసుకుందామండి"

రాయ్ ముఖం చిట్లిస్తూ అన్నాడు. "కాఫీ!!...ఏం యువకులయ్యా మీరంతా? అక్కడ తీసుకున్న కాఫీతో విసుగెత్తదూ! చూడండి మిస్టర్! ఇక్కడ అనుభవించవల్సినవి, ఆనందించవల్సినవి చాలా ఉన్నాయి. మీకే విషయంలోను కట్టడిలేదు. మదవతి, మదిరా ఈ దేశంలో అతి చవక. అనుభవించు, ఆనందించు. ఇదేం అనేవారు లేరు. అప్సరసల చెంత అమృతము పొంత....బహు.....ఆంచీ...." అతను మైమరచి చెబుతున్నాడు. ఇంతలో మినీస్కర్ట్స్ వేసుకున్న రంగు, రంగుల గుడ్డలతో కుట్టి సంచి ఏప్రెన్‌లా కట్టుకున్న ఓ అమ్మాయి వచ్చింది. అతను చేయి కలిపాడు. తరువాత ఆమె వీరివంక చేయి చాచింది.

"ఇక్కడ ఆచారమయ్యా. మన దగ్గరా వుంది ఆచారము యెందుకూ, ఓ పులకింత. గిలిగింత లేకుండా. మన చేతుల్ని మనమే జోడించుకోవాలి" అన్నాడు వెటకారంగా. ఇరువురు యువకులు ఆ అమ్మాయితో కరచాలనము చేశారు. ఆ మహాశయుడు చెప్పిన పులకింత గిలిగింత ఏదీ కలగలేదు. తన స్వభావములోనే లోపముందనుకున్నాడు.

"అలా చూస్తారేం బ్రదర్! కాస్త టిప్‌టాప్‌గా ఉన్నవారయితే, అమ్మాయికి ఒక రాత్రికి పాతికనుండి పదిహేను వరకు రేటు. కాస్త మామూలుదయితేనేమో పదినుండి అయిదు వరకు. సరుకంతా ఒకటేలే" అతని మాటలు మౌనంగా విన్నాడు. అతను తెప్పించినవి ఏవీకాక చెరొక కోకాకోలా త్రాగారు.



"ఏం పిరికివాళ్ళయ్యా! లైఫ్ ఎంజాయ్ చేయటము తెలియదు." అతను హేళనగా నవ్వాడు. మరేం మాట్లాడక నమస్కరించి వచ్చాడు. హోటల్ బిలో కూర్చుంటే విసుగు వేసింది. వారు తనను పిలవకపోయినా, గేటు దగ్గర నిలబడి ఉపన్యసిస్తున్న ఒక కేరళ బృందం దగ్గరకు చేరాడు.

"ఓహో! ఐ థింక్ యు కమ్ ఫ్రమ్ ఆంధ్రా? ధిస్ క్లైయిమేట్ ఈజ్ నాట్ సూటబుల్ ఫర్ యు" అన్నాడు అతను.

"దాందేముండి లెండి" అన్నాడు నిరాశపరుస్తూ. ఎన్నో విషయాలు చెప్పారు.

"ఇక్కడ పట్టపగలే దోపిడీలు జరుగుతాయి. బీఫ్ (ఆవు మాంసం) తప్ప తినడానికేం దొరకదు. ఇక్కడి నీళ్ళలో సూక్ష్మజీవులుండి, రకరకాల రోగాలు కలగజేస్తాయి. ఒంటరిగా వచ్చిన పురుషుడిని స్త్రీలు పట్టి పీడిస్తారు" అవన్నీ విన్న వేణు దిగులుపడిపోయాడు. వెంటనే అతనిలో తర్కము బయలుదేరింది. 'ఇన్ని ఇబ్బందులుంటే వీళ్ళంతా యెలా వచ్చినట్టో? ఎందుకు వచ్చినట్టో?' ఆమాటే అడిగాడు.

"మాకు మొదటి నుండి అలవాటు. అసలు కేరళ పాప్యులేషన్‌లో ఫ్టీపర్సెంట్ క్రిష్టియన్స్, అందునా ఆర్థడాక్స్ క్రిష్టియన్స్ చాలా మంది వున్నారు. వారంటే ఇథియోపియన్‌లకు గౌరవము. అందుకే వస్తాము. మన ప్రభుత్వం అలా కమ్యూనల్ ఫీలింగ్‌లో చేయరాదని ఓ నియమము పెట్టింది. గాడిద గుడ్డు" వేణు చెప్పేలోగానే, బార్ ముస్లిమ్ అతను పిలిచాడు.

"రా భాయి! కేరళ సోదరులు ఇథియోపియాకి ఇల్లరికపుటళ్ళుంద్రు మరెవరు వచ్చినా దుర్బోధలు చేస్తారు. భోజనం చేద్దాము పద."

"అలా అంటే వారేమీ అనుకోరా?" అతని వెనకాలే నడిచాడు.

"అనుకోనీ. ఇలాంటి కుటిలనీతులు చెప్పేవారంటే నాకు చాలా మంట" ఇరువురూ తామున్న హోటల్ బిజాబి వదిలి లూయిస్ హోటలుకు వెళ్ళారు. అక్కడ అన్ని రకాల ఆహారము దొరుకుతుంది. ఇథియోపియన్ల ముఖ్యాహారము ఇంజెరా. భారతదేశములో పండే రాగులవంటి ధాన్యము అక్కడ తెలుపు, నలుపులో దొరుకుతుంది. దాన్నే 'థెఫ్' అంటారు, దాన్ని

పిండి విసిరి, నీళ్ళలో నానబెట్టి, రెండు మూడు రోజులు పులియబెట్టి, తరువాత దోసెలలా నూనె లేకుండా కాలుస్తారు. దోసెలకంటే చాలా పెద్దవి. వాటి పెద్ద పెద్ద తట్టలలో దాచి నాల్గు రోజులు తింటారు. దానికి జతగా, ధనవంతులయితే బీఫ్, కోడి, పప్పు, కూర చేసి తింటారు. బీదవారయితే 'షురో' అని బఠానా పిండితో చారులా కాచి తింటారు. ఇతరత్రా కూరగాయలు పండినా, ఎక్కువ పచ్చివి తింటారు. బంగాళా దుంపలయితే ఉడికించి టీఫ్ క్రింద తింటారట. ఒక ఇథియోపియన్ చెప్పిన ఆహార పదార్థాలను, వాటి తినే పద్ధతిని గుర్తుకు తెచ్చుకున్నాడు వేణు.

"ఏం వేణూ! ఇంజెరా డోరోవట్ (కోడికూర) తిందామా?"

"ఏమిటో యింకా ఆ వాసనకు అలవాటు పడలేదు" అని రైస్ ఆలుగడ్డ కూర తెప్పించుకున్నాడు.

"హోటల్ నీటుగానే వుంది. మనిషి ప్రక్కనుండి వెడితే వెగటు వాసన."

"అదంతే, విదేశీయుల ప్రభావము వలన నీటయిన సూట్లు వేయటము నేర్చుకున్నా, ఇంకా శుభ్రత రాందే. స్నానాలు చేయుట అంటే యెరగనట్టున్నారు" భోజనము ముగించి లేచారు. ఏం తోచడం లేదు. 'హెల్ సిలాసిబన్' థియేటరులో ఏదో పాత హిందీ సినిమా ఆడుతుంటే చూశారు. అక్కడి ప్రజలను హిందీ సినిమాలు విపరీతంగా ఆకర్షిస్తాయి. యిక స్టంట్ పిక్చరయితే చెప్పేదే లేదు.

"మర్నాడు అలి, రాయ్‌తో కలిసి రాయ్‌కు తెలిసిన వారింటికి వెళ్ళారు. వారి కార్లో కూర్చుని అడిస్ అబాబాకి ముప్పై కిలోమీటర్లు దూరమున నున్న 'సభాతా' వాటర్ ఫాల్స్ చూడడానికి వెళ్ళారు.

దారిపొడవునా కూరకాయలు అమ్మేవారే.

"శ్రమజీవుల వలె నున్నారే?"

"మిష్టర్ వేణుగోపాల్! ప్రపంచంలో వీళ్ళంత సోమరులు మరొకరు లేరేమో! భూదేవి కృపవలన, ఏ కష్టమూ లేకుండా పంటలు పండుతాయి. వారములో అయిదురోజులు ఏదో పండుగ. ఆమత్‌బ్యాత్ అంటారు. ఆ రోజు



ఇల్లు కూడా ఊడ్చకుండా కూర్చుని, క్రితంరోజు చేసుపెట్టుకున్న ఇంజెరాలు, గోధుమపిండితో చేసిన ఉడికీ ఉడకని బ్రెడ్‌లాంటి రొట్టెలు తింటూ దినమంతా తల్లా త్రాగుతూ గడుపుతారు" రాయ్ స్నేహితుడు చెప్పాడు.

"మరి ఇంకొకరివద్ద జీతాలున్న వారికి ఏది దారి?"

"అందరిది ఒకటే దారి. మన దగ్గర పండుగ అంటే ఎంత గోల. స్నానాలు, జపాలు, ఇల్లు శుభ్రం చేయటము. వీరి కా బాధలేదు. ఒక విషయములో మెచ్చుకోవచ్చు. భోజనాల వేళ వచ్చిన అతిథి యెవరయినా సరే తాము తింటున్నదాంట్లో కొంత పెడతారు" మాటలలో సభాతా వాటర్‌ఫాల్స్ చేరారు. పచ్చని మొక్కలు, దారికిరువైపుల నారింజ, నిమ్మ తోటలు కమ్మని వాసనలు వెదజల్లుతున్నాయి. తిన్నగా కారు లోయలోకి దిగసాగింది. నాల్గువందల అడుగులు దిగాక, చిన్న బార్ కనిపించింది. అక్కడ కారు పార్క్ చేసి, ముందుకు నడిచారు. చల్లనిగాలి వారి శరీరాలకు తాకి గిలిగింతలు పెట్టసాగింది. యించుమించు మూడువందల కార్లు పార్కు చేయబడి వున్నాయి. గలగలమని శబ్దముతో ఎడమవైపు నుండి నీళ్ళు పడుతున్నాయి. నీళ్ళు జారుతుండగా యెత్తు పల్లాలు గల ప్రదేశాలను దాటుతూ, తెల్లని నురగతో అందంగా కనిపిస్తున్నాయి. ఆ రెండువైపుల నుండి వచ్చే నీటికి మధ్యగా త్రికోణాకారములో స్థలము, అక్కడ కోకా కోలా, చిరుతిండ్లు అమ్ముతున్నారు. పచ్చికపై కూర్చుని ప్రకృతిని చూడసాగేడు. పైనుపై నుండి దుమికేచోట కూడా మనుషులు నిలబడి క్రిందికి చూస్తున్నారు. ప్రతి ఒక్కరి భుజాన కెమేరాలు వ్రేళ్ళాడుతున్నాయి.

"మిష్టర్ వేణుగోపాల్! ఏమిటంత పరవశముతో చూస్తున్నారు" రాయ్ ప్రశ్నించాడు. యేం లేదన్నట్టు తలాడించాడు. రాయ్ స్నేహితుడు కొన్ని ఫోటోలు తీశాడు. అక్కడ తిరిగి చూసి, సాయంత్రం యింటి ముఖం పట్టారు. అతనింట్లోనే భోజనము గావించి వచ్చేశారు. హోటల్ గదిలో పడుకుంటే ఎక్కడలేని నీరసం, వంటరితనము ఆవరించింది. అంతలో ఓ ఇరవై ఏళ్ళ యువతి వొకతన్ని వెంట తీసుకుని వచ్చింది.

"నీళ్ళు పెట్టించుదామంటే మీరు ప్రొద్దుట నుండి లేరు" ఇంగ్లీషులో అన్నది. వేణు నవ్వాడు. పురుషుడు నీళ్ళు పెట్టి పక్క దులిపాడు. తరువాత ఆ యువతితో ఏమో చెప్పాడు. ఆమె 'ఇష్షీ!" అని తలాడించింది.

"ఇష్షీ అని యెన్నోసార్లు విన్నాను, అర్థం ఏమిటి మేడమ్?"

"అంటే 'మంచిది' అని అంగీకారము తెలుపుట. మీరు ఒంటరిగా ఉన్నట్టున్నారు. అంబి(అమ్మాయి)ని పంపనా?"

"అమ్మాయా! ఎందుకు?" అడిగి వెంటనే నాలుక కొరుక్కున్నాడు. ఆ యువతి నవ్వింది. అతని భుజాలు మృదువుగా తట్టి వెళ్ళిపోయింది. వెంటనే తలుపులు బిగించుకున్నాడు. అర్థరాత్రి దాటాక నిద్రబోయాడు.

రెండవరోజు కూడా అప్పాయింట్ మెంటు ప్లేస్ తెలుపలేదు. ఆలికి తెలిసిన మరో స్నేహితుని టానస్ కార్లా ఆడిస్ అబాబాకు అయిదువందల మైళ్ళ దూరములో ఉన్న బవారుదార్ బ్లూ నైల్ వాటర్ ఫాల్స్ చూడటానికి బయలుదేరారు.

"వీళ్ళెవరు? దారి ప్రక్కగా వెడుతున్న స్త్రీల గుంపును చూపించి అడిగాడు వేణు. ముక్కు, మొహము చక్కగా ఉన్నా, మసిగుడ్డలా ఉన్న ఫ్రాకులు, తలవెంట్రుకలని వందకుపైగానే అల్లిన జెడలు, మాడుపై నిగనిగలాడుతున్న ద్రవపదార్థము, బిడ్డలను వీపుకు కట్టుకున్నారు. మెడలో రంగు రంగుల పూసలు వ్రేళాడుతున్నాయి.

"ఇథియోపియన్స్‌లో ముఖ్యంగా మూడు తెగలున్నాయి. మిష్టరు వేణుగోపాల్! వొకటి 'అమహరా', రెండు 'గాల్లా', మూడోది 'టిగ్రీ', అందరిలో కాస్త నాగరికత నేర్చిన వారంటే 'అమహరా' తెగ. ఇక యీ గాల్లావారిని గూర్చి రకరకాల కథలు చెప్తారు" అని ఆపేశాడు అలి స్నేహితుడు.

"చెప్పండి."

"వీరి దేశములో ఒకప్పుడు జనసంఖ్య చాలా తక్కువ ఉండట. ఇప్పటికీ అంతే అనుకోండి. అప్పుడు భారతదేశము నుండి సాయము కోరి, ఇప్పుడు ఉపాధ్యాయులను కోరి తెచ్చినట్లే, కొన్ని సంవత్సరాలకు పూర్వం దక్షిణ భారత దేశమునుండి కొంతమంది సైనికులను తెచ్చారట. వారంతా



ఇక్కడే స్థిరపడిపోయారు. వారి తెగనే గాల్లా అంటారు. ఉత్సాహముంటే వారి కొన్ని ఆచార వ్యవహారాలను పరికిస్తే దక్షిణ భారతీయులవలెనే వుంటాయి. చూడండి. మరో గుంపు కనిపించినప్పుడు వాళ్ళ కాలివ్రేళ్ళకు మెట్టెలుంటాయి."

"ఫ్రాకు వెయ్యడంలోను భేదం కన్పించింది. దూరమునుండి చూస్తే ఏ ఫ్రాకు చీరలాగ కనిపిస్తుంది."

"అసలు వీరి దేశపు ఆచారము దుస్తులువేస్తే, ఈ ఫ్రాకులు, సూట్లు గానే కావు. స్త్రీలకయితే చీలమండల వరకు ఫ్రాకులు, దానిపైన ముసుగులు, తలకు చక్కని రంగుబట్ట వెంట్రుకలు కనిపించకుండా చుట్టుకుంటారు. అది సాధారణ డ్రస్సు పర్వదినాలూ, పెళ్ళిళ్ళూ అయితే ప్రత్యేకంగా ఉంటాయి. అందంగా కూడా వుంటాయి. చక్కని వివిధ రంగుల కలయికతోనో, ఏకరంగుతోనో బార్డర్లు నేసిన తెల్ల బట్టను పొడుగాటి గౌన్లు కుట్టి ధరించి, అదే బార్డరుగల ఓణీ వేసుకుంటారు. దాన్ని వీరు 'సతలా' అంటారు. విదేశీయులను చూసి మిని స్కర్ట్స్, 'ఎలెన్' ఫ్రాకులు, టెట్స్ నేర్చుకున్నారు."

"మీరు చెప్పిన తెల్లదస్తులలోనే ఏర్ హోస్టెస్ మాకు దర్శనమిచ్చింది. ఏకంగా చాలా అందమైన డ్రస్సు. అదో మోజుతో తొడుగుతారుగాని, మరో ఏర్‌హోస్టెస్ మినిస్కర్ట్‌లో అందంగా కనిపించలేదు" ఆలి చెప్పాడు.

"అందంగా ఉంటామా, ఉండమా అన్నది వారికి అవసరము లేదు. శ్వేతవర్ణముపై పిచ్చి ఆరాధన. వారేం చేస్తే వీరు అదే చేయాలని పట్టుదలట. మొగవారి డ్రస్ మన చుడీదార్ పైజామాలా పైన వదులుగా, మోకాళ్ళ వద్దనుండి బిగుతుగా వుంటాయి. ఫ్యాంట్లు, లాల్చీవంటి వదులైన అంగరఖాలా ఉంటుంది. పైన తెల్లని రుమాలు వేసుకుంటారు. ఇంటీరియరుకుపోతే యిప్పుడూ అంతే. పట్టణాలలో సూట్లు వేస్తున్నారు.

"ఇక్కడి వారికి దుస్తులపై అమితమైన ఆసక్తి కనిపిస్తుంది. ప్రతివారు శుభ్రంగా వుంటారు" అన్నాడు వేణుగోపాల్.

"పైకి మాత్రమే అలా కనిపిస్తారు. నాగరికులు, విదేశాలలో ఉండి వచ్చినవారు, ఆదివారము స్నానము చేస్తారు. మిగిలిన జనము క్రిస్టమస్,

క్రిష్టమస్‌కే అనుకుంటాను. ఆ క్రిష్టమస్‌నాడు వర్షం పడితే మళ్ళీ క్రిష్టమస్‌కో నవ్వాడు ఆలీ స్నేహితుడు.

"ఇక్కడ క్రిష్టియన్సు తప్ప వేరే మతస్థులు లేరా?"

"ఎందుకు లేరు, రెండు వంతులు క్రిష్టియన్సు అయితే, ఒక వంతు ముస్లిమ్స్ - వారినే అరబ్స్ అంటారు. ఇక్కడివారు వారిని 'ఇస్లామ్స్' అంటారు."

"భేదం ఎలా కనుక్కోవటం. కట్టుబొట్టు అందరిది ఒకే లాగుంటుంది?"

"ఇప్పుడే భేదం ఎలా తెలుస్తుంది? పరీక్షగా చూడండి. అరబ్ స్త్రీలు ఫ్రాకులేకాక, పొడుగాటి పైజామాలు ధరిస్తారు. పురుషులు తలపైన క్రోషెలో అల్లిన తెల్లని టోపీలు ధరిస్తారు. వారు అరబిక్ మాట్లాడతారు."

"చిన్న దేశమైనా కొన్ని మెచ్చుకోవల్సిన గుణాలున్నాయండి. అప్పాయింట్‌మెంట్ ఆర్డరు కోసమని వెళ్ళాము. ఆఫీసులో ఇంగ్లీష్ మాట్లాడరు. ఫైల్స్ ఇంగ్లీష్‌లో లేవు. అన్నీ వారి భాషలోనే" వేణు మెచ్చుకున్నాడు.

"వారిది ప్రజాస్వామ్యము కాదుగా, నిరంకుశత్వము. కొన్నిసార్లు అదే మంచిదనిపిస్తుంది. ప్రణాళికలు కుక్కలు చింపిన విస్తరిలా కావు"

దారమ్మట కబుర్లు సాగుతూనే వున్నాయి. పచ్చని ప్రకృతి, ఆరోగ్యముగా ఉన్న పశువుల గుంపులూ, లోయలు, యెత్తుపల్లాలుగల దారి అతనికెంతో నచ్చింది. జనసంచారం చాలా తక్కువ. నిశబ్దంగా, గంభీరంగా కనిపించింది. అక్కడే ఉండిపోదామనిపించింది. మధ్యలో ఒకచోట కారాపి తెచ్చిన బ్రెడ్ బట్టరు, పళ్ళు తిన్నారు. సాయంత్రం బహర్‌దారు చేరుకున్నారు. చుట్టూ యెటు చూసినా అడవిపూలు విరగబూచినాయి. చిన్న బంతిపూలు కూడా యెక్కడ బడితే అక్కడ పూస్తాయి. పచ్చని మొక్కలపై నుండి ఛంగు ఛంగున దూకే లేడిపిల్లలు, రొదపెడుతూ యెగిరే పావురాల జంటలూ, రంగు రంగుల ఈకలతో కళ్ళకు యింపు కొలిపే ఊరపిచ్చుకలు. సహజ సౌందర్యమంటే యిదే కాబోలు అనుకున్నారు. రెండడుగులు ముందుకు వేయగానే ఒకతను తలపైనున్న టోపీ తీసి తలవంచి 'తనాస్తలీన్' అన్నాడు. వేణు తలాడించినా అతనలా యెందుకు చేశాడో తెలియలేదు.



అదిక్కడి ఆచారము లెండి. కాస్త విద్యావంతులని అర్థమయితే చాలు నమస్కరిస్తారు. 'తనాస్తిలీన్' అంటే 'నమస్కారము' ముందుకు వెళ్ళి నీలిరంగుతో అందాలను వెదజల్లుతూ దుమికె నీళ్ళనుచూస్తూ నిలబడి పోయాడు.

"ఈ నది వెళ్ళి నైలును చేరుతుంది...." అతను చెప్పేది వినటం లేదు. నీలిరంగు నీరు శ్వేతవర్ణపు నురగలు క్రక్కుతూ సాయంత్రపు నీరెండలో వింతగా మెరుస్తోంది. ప్రకృతి యెవరికీ అర్థం గానిది. యెలాంటి పోషణలేక ఈ పూలు విరగబూశాయంటే ప్రకృతి ప్రభావమే. అక్కడక్కడ విదేశీయులూ, ఇథియోపియన్సు కూర్చుని నైలునది అందాలను తిలకిస్తున్నారు. వీరంతా వెళ్ళి ఒక చోట కూర్చున్నారు. నీలి నీలి ఆ నీళ్ళలోకి చూస్తుంటే, వాలిపోయే ప్రేయురాలి కళ్ళలోకి చూసినట్టు అనిపించింది. రాత్రికి హోటల్లో బస చేశారు. మరురోజు బహార్దారు టెక్నికల్ కాలేజి. రష్యన్స్ స్థాపించిన ఉన్నత పాఠశాల చూసి తిరిగివచ్చారు.

వేణుకు పోస్టింగ్ ఆర్డరు వచ్చింది. ముఖ్య పట్టణమైన ఆడిస్ అబాబాకి, రెండువందల యాభై కిలోమీటర్లున్న చిన్న పట్టణము 'అసల్లా' అనే ప్రదేశానికి అతన్ని పోస్ట్ చేశారు. కొందరు పట్టణములోనే కావాలని, విచాలు, త్రాగుడులు అమాయకులైన ఇథియోపియన్లకు రుచి చూపుతూ కూర్చున్నారు. అడవిలోనైనా తనుంటాడు. ఎందుకుగోల అని, కొన్ని సామాన్లు కొని, అందరివద్ద శెలవు తీసుకుని 'అసల్లా'కు బయలుదేరాడు.

## 19

అసల్లా చిన్న పట్టణము. అందముగా ఉండే ప్రకృతి అక్కడా మనసులను రంజింపచేస్తుంది. వారానికోసారి సూర్యదేవుని దర్శనం అవుతుంది. ఎప్పుడూ నీరూరినట్టే వుంటుంది. వాతావరణము దినానికి ఒకటి రెండుసార్లు జల్లులు పడుతూనే వుంటాయి. బట్టలు ఆరటము మహాకష్టం. అక్కడ నీటి వసతి లేదు. యెర్రని నీరు, ఉదయమో గంటా, సాయంత్రమో

గంటా వస్తాయి. ప్రతి యింటి ముందు, నీటి డ్రమ్ము వుంటుంది. ట్యాపులు కూడా ప్రతి యింటికీ వుండవు. అందుకే కొందరు నీటి వ్యాపారము చేస్తారు. తమ యింటికి పంపు పెట్టించుకుని, డ్రమ్ముకు పది సెంట్లు తీసుకుని నీరు నింపిస్తారు. డ్రమ్ము అడ్డంగా వేసి, ఇనుప చక్రాలు బిగించి వుంటాయి. చిన్న మూత తియ్యడానికి, పెట్టడానికి ఉంటాయి. వాటిని ఇనుపచక్రాల సాయంతో నింపి తెచ్చుకుంటారు. అతి పొదుపుగా వాడుకుంటారు. మూటెడు బట్టలు రెండు బాల్చీల నీళ్ళలో ఉతుకుతారు. అదొక కళే! మన బండలూ, కొట్టడాలు లేవు, చిన్నవి, పెద్దవి టిన్నుతో చేసిన పళ్ళాలుంటాయి. వాటితో ఉతుకుతారు. చలికి ఎప్పుడూ నిమ్మగా వుండే వాతావరణానికి యెవరూ స్నానము చేయరు.

వేణు చిన్న యిల్లు అద్దెకు తీసుకుని, అక్కడ సామానులన్నీ పెట్టి బడికి వెళ్ళాడు. జాయినింగ్ రిపోర్టు యిచ్చి, ఒంటరిగా మిగిలిపోయాడు. అక్కడున్న ప్రతివారికి తెలిసిపోయిందిలా వుంది, అతడు తమ రాష్ట్రం నుండి రాలేదని, యెవరి దారిన వారు వెళ్ళిపోయారు. ఈ వాతావరణము అతన్ని మహా చికాకు పరిచింది. మరో భారతీయుడు వచ్చాడు. మన బలగము వృద్ధి అవుతుందన్న సంతోషము లేకపోగా, వాటాదారున్ని చూసినట్టు, కొర, కొర చూడటము యెంతో బాధకు గురి చేసింది. తను వారిని తప్పించుకు తిరగలేడు. భాష రాదు, తన అవసరాలు తీరాలంటే ఎవరితోనో మాట్లాడాలి. భారంగా డైరెక్టరు గదిలోకి వెళ్ళాడు.

"రండి. మీకేం సాయము చెయ్యగలను?" చిరునవ్వుతో అడిగాడు డైరెక్టరు (హెడ్ మాష్టరు) అతను యూరోపియన్. అతను మాట్లాడేతీరు చాలా మర్యాదగా వుంది. ఇంగ్లీషు మాత్రం అమెరికన్సు యాసలో వుంది.

"నాకు భాష తెలవదు. హోటళ్ళుంటాయో, లేదో తెలియదు. పని మనిషి కావాలండి."

"మంచిది" ఎవరో స్టూడెంట్‌ను పిలిచి మిష్టర్ సింగ్‌ని పిలువమని చెప్పాడు. మరో అయిదు నిమిషాలలో సింగ్ వచ్చాడు.

"మిష్టర్ సింగ్ ఇతను మన బడికి వచ్చిన క్రొత్త ఉపాధ్యాయుడు. వీరు మన యూనిట్ లీడర్ ఫస్ట్ అసిస్టెంట్స్" పరిచయము చేశాడు.



"ఐయాం మిష్టర్ వేణుగోపాల్" లేచి అతనితో కరచాలనము చేశాడు.

"ఇతనికి ఏదైనా కావల్సి ఉంటే సాయము చెయ్యండి" సింగ్‌తో చెప్పాడు డైరెక్టరు.

"రండి." అతనితో వేణు లేచి బయటికి వచ్చాడు.

"ఇల్లు కావాలా?"

"బస్సులో ఒకతనితో పరిచయమైంది. వారిళ్ళు చూపించాడు. నలభై డాలర్లకు ఓ యిల్లు కుదుర్చుకున్నాను" అన్నాడు.

"ఈ పూట మా యింట్లో భోజనము చెయ్యండి. రేపు మీరు పని ప్రారంభింతురు. ఇక్కడ పనివారు పుష్కలంగా లభిస్తారు. మన దగ్గరలా వాళ్ళిళ్ళు చేయరు. ఒకే ఇంటిలో బాధ్యతతో చేస్తారు. కాస్త సరసుడైన యజమాని లభిస్తే అసలు వదలరు" అన్నాడు. బడి అంతా తిరిగారు. ఇంతలో లంచ్ బ్రేకును సూచిస్తూ లాంగ్‌బెల్ మ్రోగింది.

"ఇక్కడ పన్నెండింటికే వదులుతారా?"

"లేదు పన్నెండున్నర, మీ గడియారము ఆగిపోయి వుంటుంది. ప్రొద్దుట యెనిమిదిన్నరకు ప్రారంభమైతే పన్నెండున్నర వరకు నడుస్తుంది. మధ్యాహ్నము రెండున్నర నుండి నాల్గున్నర వరకు. ఇథియోపియా మొత్తములో ఇదే సమయం పాటిస్తారు. శని ఆదివారాలు సెలవుదినాలు. శనివారము మార్కెటింగ్ చేసుకోవాలి. ఆదివారము పిక్‌నిక్‌లకో, స్నేహితుల దగ్గరకో వెళ్తుంటాము" ఇరువురూ సింగ్ యింటికి వెళ్ళారు. ఇళ్ళలో నేలపై కర్రతో చేసిన ఫ్రేమ్‌లు, దానిపై బల్లపరుపు కర్రలున్నాయి. సిమెంట్ దొరకదా? అదేమాట సింగ్ నడిగాడు.

"ఇలాంటి చలి ప్రదేశాలలో అంతా కర్రతో చేసినవేనండి" అన్నాడు. అక్కడ భోజనము చేసి విశ్రాంతి తీసుకున్నాడు.

మరురోజు పనిమనిషి వచ్చింది. సాయంత్రం ఆమెను తీసుకుని మార్కెట్టుకు వెళ్ళాడు. సాధారణంగా అన్నీ ఒకే కొట్టులో లభిస్తాయి. ఫ్యాన్సీ షాపులని, బట్టలషాపులని, కిరాణాకొట్లని లేవు. సంచులతో కొనే ధాన్యము గోడౌన్స్ తప్ప, అందరూ అన్ని వస్తువులు అమ్ముతారు. ఇంచుమించు అన్ని

వస్తువులు దొరుకుతాయి. కాని ధరలలో తేడా ఉంటుంది. బియ్యం, నక్కలు, కొబ్బరి, నూలు బట్టలు చాలా ప్రియము. ఆరబ్‌వారు మంచి వ్యాపార వేత్తలుగా పేరుగాంచారు. తనకు కావల్సినవి కొని యింటికి తిరిగి వచ్చారు. సింగ్‌తో కొన్ని వ్యవహారికములలో ఉన్న పదాలను వ్రాయించుకున్నాడు. ఏమేమి చేయాలో పనిమనిషికి చూపించి వెళ్ళిపోయాడు. బడిలో అతనికి లెక్కలు, ఫిజిక్స్ యిచ్చారు. అమెరికన్స్‌ను అనుకరిస్తారు. స్వంతంగా వ్రాసే అలవాటే ఉండదు. విద్యార్థులు టకటక మాట్లాడతారు గాని, ఒక్క వాక్యము సరిగ్గా వ్రాయలేరు. పరీక్షలలో అంతా ఆబ్జెక్టివ్ టైప్. పదో తరగతిలో పాతికేళ్ళ వయసు వారి నుండి పద్దెనిమిదేళ్ళ వయస్సు వారుంటారు. లేచి నిలబడి జవాబులిచ్చే అలవాటు లేదు విద్యార్థులకు, అక్కడి ఫైల్స్ ఆఫీసు పని వారి భాషలో వుంటుంది కాబట్టి గొడవలేదు. ఫేలయినవారికి బాధ లేదు. ఇంక్రిమెంట్లు ఆపి మామూలు గ్రేడు యిస్తారు. రాత్రిపూట నడిపే క్లాసులలో చేరి, సంవత్సరానికొక సబ్జెక్టు ప్రకారము పూర్తిచేయవచ్చు. ఇంక్రిమెంట్లపై ఆశ గల వారు ఆ యేడే అన్నీ పూర్తిచేసుకోవచ్చు. ప్రొఫెషనల్ కోర్సుకు పోదలచినవారికి పదకొండవ క్లాసులోనే ఎంట్రన్సు ఎగ్జామ్స్ జరుగుతాయి. అర్హత గల వారు వెళ్ళిపోతారు. పద్ధతులు, విధానము విచిత్రంగా కనిపించింది. వెనుకబడిన దేశం. కాకపోతే, బారతదేశము నుండి ఉపాధ్యాయులను పిలిచే ఖర్మ ఏమిటి అనుకున్నాడు.

ప్రతి యూనివర్శిటీ గ్రాడ్యుయేటు ఒక సంవత్సరము ప్రభుత్వము యెక్కడికి పంపినా వెళ్ళి, తొమ్మిది నెలలు ఉపాధ్యాయుడుగా పని చేయాలి. దానిని వారు నేషనల్ సర్వీస్ అంటారు. తొమ్మిది నెలలు వారికి బత్తా యిస్తారు. మరో రకానికి చెందిన ఉపాధ్యాయులు అమెరికన్ పీస్‌కోర్ వాళ్ళు. ప్రతి రెండేళ్లకోసారి, ప్రతి బడికి ఎనిమిది, పదిమందిని డిప్యూట్ చేస్తారు. భారతీయులే కాక, ఫ్రెంచివారు కూడా కాంట్రాక్టు బేసిస్ పైన వస్తారు.

ఆ రోజు బడి ముగించి వచ్చేసరికి, బల్లపై శుభ్రంగా భోజనము అమర్చింది అంబి. అన్నమూ, గోధుమ రొట్టెలు, పప్పు, గ్రుడ్లు, పెరుగూ, నెయ్యీ. అతనికి అన్నం తింటుంటే కళ్ళమ్మట నీరూరింది. గడిచిన ఒక్కొక్క



ఘట్టం గుర్తుకు రాసాగింది. సాయంత్రము సింగ్‌తో వెళ్ళి చల్లని పానీయాలు గ్లాసులలో తెస్తుంటే బంధుజనము ప్రవర్తన గుర్తుకు వచ్చింది. అలాంటి పానీయాలు తెచ్చి పెద్దవారికిచ్చి, వేణులాంటి వారికి ఒక చంచాడు వింటో గ్లాసులో పోసి, నీళ్ళ రంగు మారాక యిచ్చేవారు. అంతెందుకు, వదిన అలాగే చేసేది.

ఇద్దరి భారతీయులతో బయటికి వెళ్ళాడు. నడిరోడ్డులో ఒకచోట, యువతీయువకులు, పెద్దవారు ఒకరినొకరు ముద్దుపెట్టుకుంటున్నారు.

"బజార్లో ఇదేమిటండీ?" ఆశ్చర్యంగా చూశాడు.

"దురుద్దేశముతో కాదు. వారు చాలా రోజులకు కల్సుకున్న బంధువులు, స్నేహితులు వావి వరుస ఏం లేదు. ఒకరినొకరు ముద్దుపెట్టుకుంటారు" విచిత్రంగా చూస్తుండిపోయాడు.

మరురోజు పనిచేసే అమ్మాయి సుస్తీగా వుందని ఒక ఇంగ్లీషు తెలిసిన కుర్రాడిచేత చెప్పింది. సుస్తీ ఏమిటని అడిగితే సిగ్గుపడుతూ "ఇర్గూస్ నాచో" అంది.

"గర్భవతిట సార్!" కుర్రాడు చెప్పాడు.

"మరి నీ భర్త ఏం పని చేస్తాడు?"

ఆమాట ఆ పిల్లవాడు ఆమెకు చెప్పాడు.

"యేందే...." అని సిగ్గుతో పారిపోయింది.

"ఇనేనాల్ నెల్లచ్చి....."

"ఆమెకు భర్త లేడట సర్!

భర్త లేకుండా పిల్లలు కలగటము అద్భుతముగా కనిపించింది.

ఆమాటే కుర్రాడిని అడిగాడు.

మా దగ్గర అలాంటివేం లేవు సర్. యువతీ, యువకులు స్వేచ్ఛగా తిరగవచ్చు. వయసు మళ్ళిన స్త్రీ పురుషులు కూడా యిష్టమొచ్చినట్టు తిరుగుతారు."

"ఈ అమ్మాయిని వెలివేయటం గాని ఆ పిల్లవాడెవరని అడగటము గాని లేదా?"

"ఏం లేదండి. ఆ అమ్మాయి మరెవరినైనా పెళ్ళి చేసుకుంటే, ఆమె తల్లి ఆ పిల్లవాడిని పెంచుతుంది. లేదా పెళ్ళి చేసుకునే అతను అంగీకరిస్తే తనతో తీసుకు వెడుతుంది."

"మరి మున్సిపాలిటీ వారి వద్ద రిజిష్టర్‌లో యే తండ్రి పేరు వ్రాయిస్తుంది?"

"ఈ దేశములో తండ్రిపేరు వ్రాయించరండి, తల్లిపేరే వ్రాయిస్తారు. తండ్రి పేరు అవసరము వస్తే, తండ్రి పేరు తెలియనివారంతా తన పేరు పెట్టుకోవచ్చునని ఈ దేశపు రాజుగారు ప్రకటించారండి."

"దాని వలన ఏదైనా ఉపయోగముందా?"

"మా దేశంలో జనాభా తక్కువ. యెవరూ గర్భవిచ్ఛిత్తి చేసుకో కూడదని, సాంఘిక నియమాలు కఠినంగా ఉంటే, వారు బిడ్డలను కని పెంచడానికి సంకోచిస్తారని ఆయన అలాంటి నిర్ణయము చేశారు."

"పెళ్ళిళ్ళు చర్చిలో జరగవా?"

"యెందుకు జరగవు? జరుగుతాయి. యెక్కువమంది చర్చిలో జరిగే పెళ్ళి యిష్టపడరు. విడాకులివ్వడానికి అవకాశముండదు. మూడు రకాలుగా జరుగుతాయి. ఒకటి చర్చిలో 'అది శాస్త్రోక్తంగా జరుగుతుంది'. అవి సాధారణంగా పెద్ద కుటుంబాలవారు, గౌరవనీయులు చేసుకుంటారు. రెండవ రకము పెళ్ళి కాంట్రాక్టుపైన జరుగుతుంది. రెండు సంవత్సరాలో, మూడు సంవత్సరాలో మేము కలిసి వుంటామని కోర్టుకెళ్ళి సంతకాలు పెడతారు. వారికి ఒకరి అభిప్రాయాలు ఒకరికి నచ్చి కలిసి ఉండాలనుకుంటే కాంట్రాక్ట్ కంటిన్యూ చేసుకుంటారు. లేదా విడిపోతారు. విద్యాహీనులు, క్రింది జాతులవారు బంగరపు రింగు తొడిగి చేసుకుంటారు. నల్గురి పెద్దల సమక్షములో అబ్బాయి అమ్మాయి చేతికి రింగు పెడతాడు. ఇరువురి స్నేహితులు కలిసి పాటలు పాడతారు. అందరికి ఇంజరా పెడతారు. పెళ్ళి అయిపోతుంది."

"ఇలా విడిపోవటము ఏం బావుంటుంది?"



"కొట్లాడుతూ కల్సి వుండటము ఏం బావుంటుంది? మీ దేశంలో విడిపోరా?"

"యెక్కడో వెయ్యిమందికి ఒకరు విడిపోతారు."

"ఛ! ఒకే స్త్రీతోగాని, పురుషుడితో గాని ఉండటము ఏం బావుంటుంది?" ముఖము చిట్లించాడు. వేణు నవ్వి వూరుకున్నాడు. అతని కళ్ళ ముందు సత్యం ప్రత్యక్షమయ్యాడు. పాపం! రాధ నల్గురి ఆడపిల్లలతో ఏం చేస్తుందో? అనుకున్నాడు. వెంటనే లేచి రాధకు, నగరేశానికి ఉత్తరాలు వ్రాసి కూర్చున్నాడు. అతని మనసులో ఏదో వెల్తి. కాలక్షేపానికి రేడియో కొన్నాడు. కెమేరా కాస్త ఎండ వచ్చిననాడు, ప్రకృతి దృశ్యాలు ఫిల్ములో బంధించుకొచ్చేవాడు. రాత్రి పడక చేరగానే బాల్యం, రాధాకృష్ణ మాస్టారు, తల్లి, తండ్రి, తన చదువూ, పురుషోత్తంగారు, వారి ప్రక్కింటి ముత్తయిదువ, శ్రీరామ్, హాస్టల్, ఆడపిల్లల బడి, రాధ, సత్యం.... అంతా అతని కనులముందు మెదలేవారు. భోరుమని భయపెట్టేది పెద్దయిల్లు. శరీరాన్ని ముడుచుకోవడానికి పరుల అరుగుల ఆశ్రయించిన ఘట్టాలు గుర్తుకొచ్చాయి.

"మిస్టర్ వేణుగోపాల్ ఓం జి చక్కెర ఫ్యాక్టరీ చూసి వద్దాం వస్తావా? వీకెండ్స్ భలే బోరు కొడతాయి."

"ఫ్యామిలీ వున్న మీరే అలా అంటే, నాలాటివాడి సంగతి అడగాలా?"

"మీ ఫ్యామిలీ యెప్పుడు వస్తుంది?"

"ఇంకా నాకు వివాహము కాలేదు."

"ఏమిటీ?" ఎంతో అదిరిపడినట్టు చూశాడు. నేను మీకు పెద్దపెద్ద పిల్లలున్నారనుకున్నాను" అన్నాడు సింగ్. చెంపల దగ్గర నెరిసిన వేణుగోపాల్ జుట్టు వంక చూస్తూ.

"లేదండి. సర్వీస్‌లో చేరి చేసుకుందామనుకునే లోపలే ఇక్కడ ఉద్యోగము వచ్చింది."

"అరే, ఆంధ్రలో తొందరగా పెళ్ళిళ్ళు అవుతాయంటే, మీకు ముప్ఫై అయిదు, నలభై లేవూ?"

"యాభై..." అందామనుకుని ఊరుకున్నాడు. పోన్లే, ఈయన నా వయసు సర్టిఫై చేసి యిచ్చే ఉద్యోగము ఏమిటని.

"యెంతుంటే ఏమిటి లెండి....ఆఁ! మీఫ్యామిలీ కూడా వస్తుందా?"

"ఫ్యామిలీ రాదనే మిమ్మల్ని పిలుస్తున్నాను. పిల్లలకు ఒంట్లో బావుండలేదు"

"అసలేం జబ్బు?"

"ఇది చల్లని ప్రదేశము. వాళ్ళమ్మ చాలా చిన్నది. పద్దెనిమిదో ఏటికి యిద్దరు పిల్లలు. యేమిటి చెప్పేది? సముదాయించలేక సతమతమవుతుంది. ప్రతినెల డాక్టర్లకి ముడుపుకట్టి పెట్టాల్సిందే. ఒకోసారి ఈ కారు ఎందుకు కొన్నానా అని అనిపిస్తుంది. దాన్ని మేంటేన్ చేయలేక ఛస్తున్నాను. మిగిలిన వారంతా భార్యాభర్తలు పనిచేస్తున్నారు. పెద్దగోల లేదు."

"మీ మిసెస్ క్వాలిఫైడ్ కాదా?"

"క్వాలిఫైడ్ వారిని చూస్తున్నారా. బుర్రలేని మనుషులు. నా మిసెస్ బి.ఎ., బి.ఇ.డి. ఆరు సంవత్సరాలు చండీగడ్‌లో పనిచేసింది. ఇక్కడికి వచ్చి మూడు సంవత్సరాలు. ఇంట్లో కూర్చుంది" విచారంగా చెప్పాడు సింగ్. నవ్వు వచ్చింది వేణుకు.

"ఏమిటి నవ్వుతున్నారు?"

"ఏదో జ్ఞాపకము వచ్చి" మాట తప్పించాడు. మనిషి సత్యవంతుడూ, హరిశ్చంద్రుడై పేరుగాంచాలని కాదు. కాని చిన్న చిన్న విషయాలకు విపరీతంగా అబద్ధం ఆడేవారంటే పరమ చిరాకు. అబద్ధం వెంటనే మనకు తెలియకుండా వెల్లడి అవుతుంది. మనిషింత సంకుచితుడుగా ఎందుకు మారుతున్నాడు? మిసెస్ సింగ్ వయసు దాయటం వల్ల ఒరిగే లాభం? తను యివన్నీ ఆలోచిస్తే తనకేం ఒరుగుతుంది?

"తొందరగా బయలుదేరుదాం. మా యింటికే రండి" అతను పిలిచి వెళ్ళిపోయాడు. లేచి దుస్తులేసుకుని, మరురోజుకని బ్రెడ్, జామ్ తెచ్చుకున్నాడు. అసలక్కడ బ్రెడ్ దొరకదు. బస్సువాళ్ళు తెచ్చి వాక్కోసారి అమ్ముతారు.

మరురోజు ఓం జి కి వెళ్ళారు. ఇథియోపియాలో వున్న పెద్ద పంచదార కర్మాగారమది. దాని ప్రక్కనే టాఫి కర్మాగారముంది. కార్మికులు తప్ప, మిగిలిన పనులకు డచ్‌వారు, భారతీయులు వున్నారు. అదికూడా చూడచక్కని ప్రదేశము. ఒక కిలోమీటరు దూరము వరకు మధ్యన అయిదారు మీటర్ల స్థలము వదులుతూ. రెండువైపులా పొడుగాటి మొక్కలు. అవి కొంతదూరము వెళ్ళి తలల దగ్గర వంగి, రెండూకలిసి చిన్న గుడిసెలా అందముగా కనిపిస్తాయి. నేలంతా పీతాంబరము ధరించినట్టు, పచ్చగా కనుల పండువుగా వుంది. దాని ముందుగా పారే నీరు, ఒకవైపు డచ్‌వారికై నిర్మించిన అద్దాలతో అలంకృతమైన నీరెండలో తళతళలాడే గృహాలు. మరొకవంక కార్మికుల యిళ్ళు ప్రతి ఇంటిముందు పది ఇరవై రకాల పూల మొక్కలు విరగబూసి, ప్రకృతికన్య అందాన్ని ద్విగుణీకృతం చేస్తున్నాయి.

"ఏమండీ వేణుగోపాల్ గారూ! రెండో మనిషి ఉన్నట్టే మర్చిపోతే ఎలా?"

"సారీ, మిస్టర్ సింగ్! ఈ యిళ్ళు యింత అందంగా కట్టి, పైన రేకులే వేశారు. ప్రతిచోట జింకుషీట్సే ఎందుకు ఉపయోగిస్తారు?"

"వారిదిప్పుడే అభివృద్ధి చెందుతున్న దేశం. అన్ని వస్తువులూ బయటినుండి తెప్పించాలి. అల్లాటప్పాగా కడితే వుండవు. వర్షాలు, వడగళ్ళు యెక్కువ. అందుకే రేకులు ఉపయోగిస్తారు. చవకలో అయిపోతుంది. రెండు, మూడంతస్థులు కట్టి, స్థలము మిగల్చాలన్న తాపత్రయము లేదు వారికి."

"అవును. ఆడిస్ నుండి వస్తూ చూశాను కదా!" దారిలో ఎక్కడా జనాభా వున్నట్టు కనిపించలేదు. రెండు మూడు చిన్న చిన్న టౌన్స్ తప్ప అంతా నిర్జన ప్రదేశమే" అటు నుండి యెదురుగా కనిపించే చెరకు తోటల వైపు నడిచారు. దూరాన పెద్ద ఏడంతస్తుల భవనం కనిపించింది. ఏమిటన్నట్టు చూశాడు.

"ఆ భవనము ఆస్పత్రి. ఇప్పుడే ప్రారంభించారు. ముఖ్యంగా కన్ను, ముక్కు, చెవి స్పెషలిస్టులను తేవాలని చూస్తున్నారు" చుట్టూ తిరిగి చెట్ల మధ్య కూర్చుని, తెచ్చిన ఫలహారం చేశారు. ఫ్లాస్కువిప్పి టీత్రాగారు.

"ఇక్కడ అడుగడుగునా బార్‌లు, బున్నాబేత్‌లున్నాయన్న మాటే గాని, ఎక్కడా మంచి కాఫీ, టీ దొరకదు. బ్లాక్ టీ ఎవరు త్రాగుతారుట" విసుక్కున్నాడు సింగ్. కొన్ని ఫోటోలు తీసుకున్నారు. అటు నుండి అప్పుడే

మొదలు పెడుతున్న పేపర్ మిల్లుకేసి నడిచారు. అక్కడ కూడా ఫ్యాక్టరీ ఒక ప్రక్క పాతిక వరకు కార్మికుల యిళ్ళు, మరోప్రక్క అయిదారు క్వార్టర్సు అందముగా కట్టి ఇంజనీర్లకు యిచ్చారు. అది మాత్రం వారి స్వంతము కాదు. విదేశీయులే నడుపుతున్నారు. గ్రీస్, ఫ్రెంచి, భారతదేశము నుండి వెళ్ళిన ఇంజనీర్లు రోమ్, బల్గేరియా నుండి వచ్చిన మేనేజర్లు ఉన్నారు. అటు నుండి మూడు కిలోమీటర్లు ఇంటీరియర్‌కు వెళ్ళితే హిప్పోపూల్ వుంది. దారంతా రాళ్ళూ, రప్పలూ. పెద్ద నది ప్రక్కగా వెళ్ళారు. నీటిలో మునిగిన ఎద్దు పరిమాణము గల హిప్పొపొటమస్‌లున్నాయి. వాటి నాసికా రంధ్రాలు పెద్దగా, భయంకరంగా వున్నాయి. ప్రతి మూడు నిమిషాలకోసారి బయటికి వచ్చి ఊపిరి పీల్చుకుంటుంది. తిరిగి మునుగుతుంది. అప్పుడు పెద్దగా శబ్దం వినిపిస్తుంది. లోతయిన ప్రదేశములో స్థావరము చేసుకుని వున్నాయి. అయిదారు కనిపించాయి. అన్నీ ఒకేసారి తలలు లేపితే, ఫోటో తీయాలని ప్రయత్నించి విఫలుడయ్యాడు వేణు. మూడింటిని మాత్రం తియ్య గలిగాడు.అప్పటికే బాగా ఎండ యెక్కింది. ఆసల్లా వంటి చలి ప్రదేశములో వుండి వచ్చాక, ఇది చాలా వేడి అనిపించింది. వెనుతిరిగి, దగ్గరేవున్న ఫారముకు వెళ్ళారు. విరగబూచి రెండువైపుల నుండి వచ్చి అల్లుకున్న బోగన్‌విల్లా పందిరి క్రింద కూర్చున్నారు. భోజనముచేసి, వచ్చికపై విశ్రమించారు. ప్రొద్దువాలుతుండగా లేచి అక్కడున్న చేనులోకి వెళ్ళి కూరగాయలు తీసుకున్నారు. సంతరాపళ్ళు జామ కొని కారెక్కి బయలు దేరారు. ఆ ప్రదేశము వదలి రాబుద్ధి కాలేదు. మనుషులు శుభ్రంగా వుండరు కాని, పరిసరాలు, తోటలు ఎంత అందముగా వుంటాయి అనుకున్నాడు.

అసల్లా చేరేసరికి చీకటి పడింది. పోస్టాఫీసు దగ్గర కారాపి, పోస్టు చూసుకున్నారు. ఇథియోపియాలో పట్టణాలలో, పల్లెలలో ఎక్కడా పోస్టుమ్యాను తెచ్చియిచ్చే పద్ధతి లేదు. సంవత్సరానికి కొంతడబ్బు కడితే వారే ఆఫీసులో మనకై ఓ బాక్స్ ప్రత్యేకించి, దాని తాళంచెవులు యిస్తారు. రోజూ వెళ్ళి చూసి తెచ్చుకోవాల్సిందే. ప్రస్తుతం సింగ్ బాక్స్‌కే వస్తున్నాయి ఉత్తరాలు. తండ్రి దగ్గరి నుండి, విద్యార్థుల దగ్గర నుండి ఉత్తరాలు వచ్చాయి. తండ్రి ఆరోగ్యము



కాపాడుకొమ్మని, డబ్బు జాగ్రత్త చేయమని, వ్యసనాలకు లోనుకాకూడదని వ్రాశాడు. అందరూ క్షేమంగా ఉన్నట్టు వ్రాశాడు. విద్యార్థులు వాళ్ళ బడి రాజకీయాలు వ్రాశారు. వాటిని యింట్లో పెట్టి అలసటగా కళ్ళు మూసుకున్నాడు మంచములో వ్రాలుతూ. అరగంట తర్వాత లేచి, తన దగ్గరున్న విద్యార్థితో కాఫీ చేయించుకుని త్రాగి కాగితం, కలం తీశాడు. అలా రాస్తుంటే కాలమే తెలియటము లేదు. రాత్రి భోజనం సంగతి కూడా మరిచిపోయాడు. ఎక్కడో కోడికూత వినిపిస్తే ఉలికిపడినాడు.

"ఆస్ఫా......ఆస్ఫా...." జవాబు రాలేదు. పెన్నుమూసి బయటికి వచ్చాడు. తలుపులు బార్లాతీసి వున్నాయి. ఆస్ఫా హాయిగా నిదురబోతున్నాడు. తను లేపినప్పుడు బియ్యమో, ఓట్సో చేద్దామని వేచి వుంటాడు. అలాగే నిద్రపోయాడులా వుంది అనుకున్నాడు. తలుపులు చేరవేసి, ఇల్లంతా ఒకసారి కలయచూచి, తలుపులు వేసివచ్చి పడుకున్నాడు.

## 20

సాయంత్రం తన కారు తీసుకుని మరో నల్గురి స్నేహితుల నెక్కించుకొని పోస్టాఫీసువైపు బయలుదేరాడు. ఈ రెండు సంవత్సరాల్లో బాగా సంపాదించాడు. కారు కొన్నాడు. అక్క కూతురు పెళ్ళికి డబ్బు పంపాడు. తమ్మునికి వ్యాపారంలో సహాయం చేశాడు. చెల్లెలి కోరిక తీర్చాడు. తనకు పెద్ద ఖర్చేమీ లేదు. ఆ పట్టణములో సినిమాలు లేవు. త్రాగితే ఖర్చవుతుంది. తనకా అలవాటు లేదు. టేప్‌రికార్డర్ కొన్నాడు, రికార్డు ప్లేయర్, ట్రాన్సిస్టర్ ప్రొజెక్టర్ కొన్నాడు. బంధువుల నుండి ఉత్తరాలు అమ్మాయిలను చూచిపొమ్మని, పురుషోత్తం భార్య సుగుణ కూడా ఉత్తరాలు రాసింది. తనకు తెలిసిన వారమ్మాయి ఉందని, రాధ రాసింది. రాజేశ్వరి తన దురదృష్టాన్ని నిందించుకుంటుందని, మరొకరితో వివాహమయిందని, సత్యం ఇప్పుడు డబాయించటము లేదని.

అతనికెందుకో అక్కడ ఉండాలనిపించటం లేదు. బీదరికము, డబ్బును అనుభవించాడు. బయటివారి ప్రవర్తన తనపట్ల వేరుగా ఉందిగాని

తన మనసు ఎప్పటి మాదిరిగానే ఉంది. కారు వెళ్ళి పోస్టాఫీసు వద్ద ఆగింది. దిగి చూశాడు. వదిన, తండ్రి, స్నేహితులు వ్రాసిన ఉత్తరాలతో పాటు ఒక క్రొత్త వ్రాత కంటపడినది.

"బుజా, బుజా పోస్తా ఆల్లే" ఒక ఇథియోపియను నవ్వాడు(చాలా పోస్టుందే)

"ఊఁ" తనూ నవ్వి వారి కోరికపై ఎత్తుగా వున్న కొండలాంటి ప్రదేశము చేరినాడు. అందరూ కూర్చున్నారు. ఎవరి ఉత్తరాలు వారు విప్పారు. వేణు అందరివి చదివి ఆఖరున అపరిచిత వ్రాత ఉన్న ఉత్తరం విప్పాడు. నాలుగయిదు పేజీలున్నాయి. ఆత్రంగా సంతకము వంక చూచి కళ్ళు తాటించాడు. ఆ పేరు చూస్తూనే అతనిలో సంచలనము బయలుదేరింది. ఆత్రంగా చదవటం మొదలుపెట్టాడు.

"డియర్ వేణూ!

ఈపాటికి నేను ఎవరో మరిచిపోయి వుంటావు. నేను నిన్ను ప్రతి క్షణం తలుచుకునేలాగా చేశావు. నా జీవితములో వసంత ఋతువును చూడగల్గుతానో, లేక ఎడారినే చూస్తానో, నీ నిర్ణయముపై ఆధారపడి వుంటుంది. యూనివర్శిటీ నుండి మీ పర్మనెంటు అడ్రసుకై ప్రయత్నిస్తుండగా, ఏదో తెలుగు పత్రికలో మీరు వ్రాసిన 'ప్రకృతి-పురుషుడు' కథ పడిందని స్నేహితురాలు చెప్పింది. వెంటనే పత్రికాఫీసుకు పరుగెత్తి మీ అడ్రసు తెచ్చాను. ఇథియోపియాకు రావాలని ఎంతో ప్రయత్నము చేశాను. మీకు వివాహమై యుండవచ్చు. ఎన్నో సంకోచాలు. అప్పుడే ఆంటీ ఆరోగ్యము బాగా దెబ్బతిన్నది. కన్నతల్లిని మరిపిస్తూ నన్ను పెంచినందుకు కూతురిలా ఆమెకు సేవ చేయటము నా విధి. ఆంటీని చూడడానికి వచ్చిన డాక్టరులో మీ పోలికలు స్పష్టంగా కనిపించాయి. రంగు మాత్రం భేదం. వేణు అనే అన్నగాని, తమ్ముడుగాని ఉన్నారా అని అడగాలనిపించింది. సంకోచిస్తూ వుండిపోయాను. మాటల సందర్భంలో అతనే చెప్పాడు. 'మా తమ్ముడు ఇథియోపియాలో ఉన్నాడు. వాడు రాస్తాడండి, అక్కడ డాక్టర్లకు చాలా డిమాండ్ ఉందట. ప్రొఫెషనలిస్టును రిక్రూట్ చేస్తే రెండింతలు జీతము యివ్వాలని రిక్రూట్



చేయురట...." ఏమేమో చెప్పాడు. మధ్యలో మాట కలుపుతూ మీ విషయాలన్నీ లాగేను. మీరు....మీరు.....అవివాహితులని తెలియగానే నా మానసం విహంగమై యెగిరింది.

సోది అంతా రాస్తున్నాను నేను యెవరో గుర్తుకు రాలేదు కదూ! మీరు బి.యస్‌సి. చదువుతుండగా, ఓం ప్రకాశ్ చౌదరిగారింట్లో వుండేవారు గుర్తుందా? వారి పెంపుడు కూతురు మంజును. మరిచిపోలేదని తలుస్తాను. మీరు నా వివాహ సందర్భములో వ్రాసియిచ్చిన పద్యము నా దగ్గర భద్రంగా వుంది. అసలు విషయము రాస్తాను. ఆరోజు... అదే నా వివాహము రోజు, మీకు లీలగా జ్ఞాపకముండి వుంటుంది. ఆంటీ అంకుల్ నన్ను చెరొకరికి యివ్వాలను కున్నారు. పురుషుడు కాబట్టి అంకుల్ తన యిష్టమొచ్చిన వారికే ఖాయపరిచారు. నా జాతకములో వివాహము విచ్ఛిన్నమై పోతుందని ఉందట. పెరిగి పెద్దదాన్నయితే స్వతంత్ర భావాలు మొలకెత్తుతాయని ఆయన ఆత్రం. నేను తన మాట వినేటప్పుడే వివాహముచేసి, నాన్నగారి ఆత్మకు శాంతి కలిగించాలని ఆయన కోర్కె. ఆంటీకి యింత ఆస్తి బయటివారికి పోవటము ఇష్టంలేదు. తను యెవరికైతే ఇవ్వాలనుకుందో అతన్ని పిలిపించింది. ఎలాగైనా ఆ రాత్రికి వరుని బరాత్ రాకుండా ఆపితే పరువుకోసం అంకుల్ తను నిర్ణయించిన వరునికిచ్చి చేస్తారని తలచింది. అంకుల్ ఒంటరివాడు. ఆంటీవైపు బంధువులు వరుని ఆహ్వానించటానికి విమానాశ్రయము దగ్గరకు వెళ్ళారు. అతని బంధువులంతా ఉదయమే ట్రయినులో వచ్చారు. అతన్ని మా యింటికి తీసుకు రావడానికి బదులు, హోటల్లో వుంచి, కారును అలంకరించి తీసుకువెళ్తామని చెప్పాడు. అతను, స్నేహితుడు, ఆంటీ తమ్ముడు హోటల్లో వుండిపోయారు. భోజనాల కేర్పాట్లు అయ్యాయి. బరాత్ రాలేదేమని అంకుల్ చాలా ఆందోళన పడుతున్నాడు. విమానాశ్రయము నుండి తిరిగి వచ్చినవారు, వరుడు విమానంలో దిగలేదని చెప్పారు. ఇంతమందిలో పరువు నిలవాలంటే తాము చెప్పిన అబ్బాయికిచ్చి వివాహం చేయమన్నారు. దాంతో ఆయన మండిపోయారు. వెంటనే పిస్టలు తీసుకుని బయలుదేరాడు. ఈ విషయము బయటికి పోరాదని కట్టడిచేశాడు. అరగంటలో బరాత్ వచ్చింది.

అతని మెడలో నేను జయమాల వేశాను. తిరిగి అతను వేశాడు. అత ఆరోగ్యం బాగుండలేదని విందులో పాల్గొనలేడని భోజనాలు ప్రారంభించార వరుని వంక బంధువుల అతన్ని చూడాలనిపిస్తే అతన్ని ఆస్పత్రికి పంపాను. అంకుల్ చెప్పాడు. అబద్ధాలాడే వారంటే విసుక్కునే అంకుల్ యింతింత పెద్ద అబద్ధాలు ఎందుకు చెబుతున్నాడో అర్థం కాలేదు. స్నేహితురాండ్రు పరిహాసాలు ఆడుతున్నా, వారేం మాట్లాడుతున్నా వినిపించటము లేదు. నా మనసు ఆందోళనగా వుంది. అంతా షామియానాలో ఉండగా అంకుల్ హాల్లోకి వచ్చి తలుపు వేసుకుని విమానాశ్రయానికి ఫోను చేశాడు. వరుని వర్ణన చెప్పి దిగాడా లేదా అని అడిగాడు. "ఆఁ.....దిగాడా..... చాలా మంది వచ్చి రిసీవు చేసుకున్నారా! చిత్రంగా వుందే" అతని మాటలు నాకింకా చిత్రంగా వినిపించాయి. అయితే ఇందాక నేను జయమాల వేసిన వరుడెవరై వుంటారు? నా వివాహము మిష్టరీ లాగుందే! ఆ మాట అంటే అంకుల్ షూట్ చేస్తాడు. అసహనంగా చూస్తున్నాను. ఒకవైపు ఎవరితోనో ఆంటీ గుసగుస లాడుతోంది.

రాత్రి ఒంటిగంటకు విందు ముగిసింది. వరునితల్లి, అక్కలు చాలా ఆందోళన పడుతున్నారు. మరి రెండు గంటలలో ముహూర్తము. బంధు జనమంతా నిద్రపోయారు. అప్పుడే వాకిట్లో ఆగిన టాక్సీలో నుండి వరుడు దిగాడు. అతను చాలా కోపంగా అరుస్తున్నాడు. మీకు మంచీ, మర్యాద తెలియదు. అలంకరించిన కారు తెస్తామని నన్ను హోటల్లో కూలేసి, అర్ధరాత్రి దాటినా యెవరూ రాందే. ఈ మహానుభావుడిని యిల్లు చూపమంటే సికింద్రాబాద్ వీధులన్నీ తిప్పాడు" పిన్ని తమ్ముడిని చూపాడు.

"ఏం రా..... యెందుకలా చేశావు?" అంకుల్ కోపంగా అతన్ని పట్టి యెడాపెడా బాదాడు. అతను ప్లానంతా చెప్పాడు. అంకుల్ వరుణ్ణి యెన్నో విధాలుగా బ్రతిమాలి, తన పొరపాటు లేదని చెప్పాడు. అతను శాంత పడ్డాడు. అతని తల్లికి యెన్నో అనుమానాలు మొలకెత్తాయి. 'తన కుమారుడు హోటలు గదిలో వుంటే మాల వేసిందెవరని', ఆ మాటే అడిగింది.

"మీరు క్షమించాలండీ! అందరిలో పరువు కాపాడాలని చిన్న నాటకము ఆడాను."



"ఈ నాటకాలు, నటనలు అవసరము లేదు. అయిన అవమానం చాలు, వెళ్ళిపోతాం" ఆవిడ పట్టుపట్టింది. గొడవకు బంధువులు ఒక్కొక్కరే మేల్కొన్నారు. కొందరు మా పక్షము, కొందరు వారి పక్షము వహించి, శాంతంగా పరిష్కరించే బదులు జగడంలోకి దింపారు.

"జయమాల వేసినవాడే మీ అమ్మాయి మొగుడు" విసురుగా చెప్పారు. సామాన్లతో వెళ్ళిపోయారు. అప్పటికే ముహూర్తం ఘడియలు మించిపోయాయి. తెల్లవారింది. నేను మాలవేసింది యెవరికో తెలియలేదు. దీనికంతా మూలకారణమైన ఆంటీని, ఆమె బంధువులను తిట్టారు. దాంతో వారు అలక సాగించి వెళ్ళిపోయారు. పెళ్ళివారితో కళకళలాడవలసిన యిల్లు శూన్యంగా తయారయింది. నా స్నేహితురాండ్రు ఒక్కొక్కరే వెళ్ళిపోయారు. బయటికి రాలేకపోయాను. ఇంట్లో యెవరికీ శాంతి లేదు. అంకుల్ సాయంత్రం ఓపిక చేసుకుని, వస్తువులు తిరిగి యిచ్చారు. రాత్రికి నన్ను అక్కున చేర్చుకుని కన్నీరు కార్చారు.

"కొందరిపట్ల జాతకాలు నిజము కావు. మనము దురదృష్ట వంతులము మంజూ!"

"నాకు మాల వేసింది ఎవరు?" నెమ్మదిగా అడిగాను.

"యెవరయితేనేం? మరిచిపో తల్లీ! కొన్నాళ్ళు తిరిగి వద్దాము" అన్నారు.

ఆంటీని పిల్లలను వదిలి మేమిద్దరమూ కాశ్మీరు, సిమ్లా అన్నీ తిరిగి చండీగర్‌లో వున్న బంధువుల యింటికి వచ్చాము. అక్కడకు ఆంటీ, పిల్లలు వచ్చారు. అందరము ఢిల్లీచేరాము. అంకుల్ వుద్దేశము మాకు అర్థం కాలేదు. మమ్మల్ని ఢిల్లీలో వుంచి తను వ్యాపారము చూసుకుంటూ నాలుగు ఊరులు తిరిగేవారు. నేను అక్కడే కాలేజీలో చేరాను. పప్పూ వాళ్ళు బడిలో చేరారు. కొన్నాళ్ళకు అంకుల్, ఆంటీ ముభావము వదిలి మునుపటిలా తిరగసాగేరు. నాకు చాలా సంతోషమయింది. నా చదువు అయిపోయేవరకు నా పెళ్ళి మాట ఎత్తలేదు. అప్పుడప్పుడు ఒంటరిగా కూర్చుంటే రెండే విషయాలు నన్ను బాధించేవి. ఒకటి, నాకు జయమాల వేసిందెవరో తెలియదే? రెండవది, నా

పై ఇంత మంచి పద్యము వ్రాసిన మీతో చెప్పిరాలేదే అని. మీరు నా పెళ్ళిరోజ కనిపించి, మళ్ళీ కనిపించలేదని పిల్లలు చెప్పారు. 'వాల్గంటి నీ చూపులు వాడ గావు. శీతల కిరణ పుంజములు' మునుపటి హుషారు లేదు. ఒకసారి ఒక ఆంధ్రుల యింటికి భోజనానికి వెళ్ళాము. అక్కడ కనిపించిన మాగజైనులో 'విద్య' పేరుతో ఆర్టికల్ కనిపించింది. వెంటనే కాంక్షతో నా కన్నులలోకి చూడబోయి త్వరగా వ్రాలిపోయే మీ ముఖము గుర్తుకు వచ్చింది.

చదువు పూర్తి అయింది. నాకు వివాహము చేసి విదేశాలకు పంపాలని అంకుల్ అభిప్రాయం. తిరిగి వరాన్వేషణ ప్రారంభమైంది. నాకు నచ్చినవారు ఆయనకు నచ్చరు, అంకుల్‌కు నచ్చినవారు నాకు నచ్చరు. ఇరువురికీ నచ్చిన వారికి మేము నచ్చము. అలా ఓ సంవత్సరము గడిచింది. సికింద్రాబాద్‌లో వ్యాపారము పూర్తిగా దెబ్బతింటుందని కాపురము యిక్కడికి మార్చాము. మళ్ళీ పాత ఇల్లు, పాత జ్ఞాపకాలు, పాత మనుషులు. ఒకరోజు మాటల సందర్భంలో డ్రైవర్ నోరు జారి ఆ రోజు నా వివాహపు రాత్రి జరిగిన విషయాలు చెప్పాడు. స్థాణువులా నిల్చుండిపోయాను. అయితే నాకు మాల వేసింది మీరన్నమాట. నేను జయమాల మీకే వేశాను. అది తలుచుకుంటే గమ్మత్తుగా అనిపించింది. "మాల వేయించుకున్నవాడే నీ భర్త.... అని ఏదో అజ్ఞాతశక్తి అరిచింది..." వేణు గుండెలు జల్లుమన్నాయి. మంజు మాట వరసకు భర్తగా అంగీకరించినా, అతని హృదయము పొంగిపోతుంది. ఆ పరిమళ ప్రసూనము యెక్కడ? గడ్డిపువ్వులాంటి తనెక్కడ? అందాల బొమ్మ ముట్టుకుంటే మాసిపోతుందనుకునే మంజు యెక్కడ? నల్లగా మొరటుగా ఉండే తనెక్కడ? లక్ష్మి, సరస్వతులు ప్రసన్నము కాగా అన్ని హంగులు గల ఆమెకు జీవితములో ప్రతిక్షణము పోరాడుతూ, ఇప్పుడిప్పుడే దరిద్రదేవత కబంధ హస్తాల నుండి తప్పించుకునే తనకు ఏ విధంగాను సాపత్యము లేదు.

"వెళ్దాము, పదండి" ఒక మళయాళీ లేచాడు.

"మీరు వెళ్ళండి" వారికి జవాబు యిచ్చి కళ్ళు మూసుకున్నాడు. ముఖానికి వ్రేలాడదీసిన పూలదండల చాటు నుండి కనిపించిన ఆమె ముఖం



ఆకారము అతని కళ్ళముందు ప్రత్యక్షమయ్యాయి. ఎరుపురంగుపై జరీ పువ్వులున్న బెనారసు చీర, బంగారురంగు పట్టు జాకెట్టు, చేతులనిండుగా బంగారు గాజులు, మెడలో బిగుతుగా కంఠాహారము, ముత్యాల పాపిటబిళ్ళ, పెడుగాటి జూకాలు, గుండ్రని బంగారు ముక్కుపోగు, దాని నుండి చెంప మీదుగా వెడుతున్న బంగారు గొలుసు. నుదుట దోసపలుకులా పెట్టిన ఎర్రటి తిలకము, దానిచుట్టూ, తళ తళ లాడుతున్న మెరుపు చుక్కలు... మానవకాంత కాదు. కళ్ళువిప్పి హృదయముపై నున్న ఉత్తరము అందుకున్నాడు. అప్పటికే సంధ్య చీకట్లు క్రమ్ముకున్నాయి. అక్షరాలు మసకగా కనిపించాయి. లేచి మెల్లిగా కారు దగ్గరకు వచ్చాడు. కూర్చుని స్టార్ట్ చేశాడు. ఇంటికి వస్తూనే లైటు వేసుకుని మంచంపై వ్రాలిపోయాడు.

"గెదోచ్ శాయి విల్లిగాల్!" అంచీ వచ్చి అడిగింది.(టీ కావాలా?)

"ఆల్ విల్లిగాల్!" అని ఉత్తరం విప్పాడు.

రోజూ సాయంత్రం వస్తూనే టీ అడిగే మనిషి ఎందుకు వద్దన్నాడా అని ఆశ్చర్యంగా చూసి వెళ్ళిపోయింది అంచి.

"....నిజమేనా, అని అరిచి, తరచి నా మనసుని ప్రశ్నించుకున్నాను. తరువాత అంకుల్‌ని మీ విషయం అడిగితే మాల మీకే వేశానని చెప్పారు. ఆ రోజు నుండి మీ పద్యం చదువుకుంటే తెలియని మైకం వచ్చేది. నేను చదివింది కో ఎడ్యుకేషన్ కాలేజీలో, ఎంతో అందమైన వారిని, ఐశ్వర్యవంతులైన పురుషులను చూశాను. వారంతా నా చుట్టుప్రక్కల ఎంతో సన్నిహితంగా తిరిగారు. వారి సమక్షంలో లభించని తియ్యదనమేదో మీ గురించి ఊహించుకుంటేనే కలిగేది. నెల రోజులు సతమతమవుతూ ఆలోచించాను. ప్రశాంతత లేని నా జీవితము మీ సమక్షంలో శాంతత పొందుతుందని ఓ నిర్ణయానికి వచ్చేసరికి, మరో సందేహము తలెత్తింది. మీరు అవివాహితులుగా ఉంటారా అని. సరే, నా అదృష్టాన్ని పరీక్షించుకుందామని మీ చిరునామా సంపాదించాను. మీరు అవివాహితులని తెలుసుకున్నాను. ఆనాడే అంకుల్ నా కోసము ఓ వరుడిని చూశానని చెప్పాడు.

"నా వివాహము వేణుగోపాల్ గారితో అయిపోయింది. అతడు నిరాకరించిన నాడు వేరే సంబంధాలు చూడండి. అతని అర్హతలు, యోగ్యతలు, రూపు రేఖలూ అన్న సమస్య లేనే లేదు. అతని మనసు, ప్రవర్తన నాకు తెలుసు" అన్నాను. అతను నచ్చచెప్పబోయాడు.

నేను నిరాకరించాను. మీ పైన వున్న అపారమైన నమ్మకము వృథా చేయకండి. మీరు ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి వస్తే ఇక్కడ కొన్నాళ్ళుండి. స్టేట్స్‌కి వెళ్ళిపోదాము. లేదంటారా, వచ్చి నన్ను తీసుకు వెళ్ళండి. అది సాధ్యపడదు, శెలవు లభించదు అనుకుంటే నన్ను రమ్మంటారా? మీ అభిప్రాయము తెలుపుతూ ఉత్తరము వ్రాస్తే నేను వచ్చే ప్రయత్నము చేస్తాను. ఎప్పుడు వచ్చి మీ ఒడిలో వాల్దామా అనిపిస్తోంది. మీ ఉత్తరానికై అనుక్షణము రెండు కళ్ళే వేయి కళ్ళు చేసుకుని ఎదురు చూస్తుంటాను.

చౌదరి దంపతులు అడిగినట్లు చెప్పమన్నారు. "

మీ మంజు

"నా మంజూనా? భగవాన్! నీ లీలలు ఎంత విచిత్రము. నా కింత పెద్ద వరమివ్వాలనేనా రాధను, రాజేశ్వరిని దూరం చేశావు" అతని మనసు భక్తితో పరవశము చెంది, పంజాబి దుస్తుల్లో నవ్వుతూ చూసే మంజు మూర్తి ప్రత్యక్షమయింది. "నీ అంతట నీవు కోరి వస్తూంటే వద్దనటానికి నేను మూర్ఖుడినా మంజూ?... నన్ను అవమానించిన వారికంతా నిన్ను గర్వంగా చూపించుతాను... నిన్ను పొందే అర్హత నాకులేదు మంజూ..." అతని కనులముందు మంజు వివాహఘట్టము మెదిలింది. పదినిమిషాలు తీవిగా పెళ్ళిపందిరిలో అడుగుపెట్టాడు. ఆ క్షణము నటనే అనిపించినా, తన జీవితములో మరపురాని క్షణాలవి. అతని మనసు ఉల్లాసంగా, ఉత్సాహంగా ఉరకలు వేసింది. ఆ క్షణమే వెళ్ళి మంజు సమక్షములో వాలాలనిపించింది. అంతవరకు కనిపించిన లోటు తీరిపోయింది.

"ఆంచీ! శాయి" కేకవేశాడు. ఈసారి ఆంచి మరీ చిత్రపోయింది. గంభీరంగా ఉండే యజమాని ఉత్సాహము చూసి, త్వరగా టీ తెచ్చి ఎదుట పెట్టింది.



"మిన్నో గెథోచ్ హుల్లుండైనో ఇండియాగర్" (ఏమిటి సర్! భారతదేశములో అంతా క్షేమమేకదా?)

"హుల్లుండైనా అల్లె ఆంచి. అవున్ ఇన్ హిడాల్ (అంతా బావున్నారు. నేను వెళ్ళిపోవాలి) అన్నాడు.

"లామెన్?" (ఎందుకు) ఆశ్చర్యంగా చూసింది ఆంచి.

"మిస్తలామలా ఫిల్లిగాల్" (నా భార్యను తెచ్చుకోవాలి)

"యెండే....మిస్త్ నబ్బర్. ఫోటోగ్రాఫ్ సిచి...." (యేమిటి? భార్య వుందా? ఫోటో చూపండి)

"ఫోటో ఎల్లమ్ (ఫోటో లేదని) చెప్పాడు. ఆయన మాటలు నమ్మలేనట్టు చూచి వెళ్ళిపోయింది. వేణు లేచి బల్లముందు కూర్చున్నాడు. వీలయినంత తొందరలో వస్తున్నానని, ఫ్లయిట్‌బుక్ అయ్యాక మరో వుత్తరము వ్రాస్తానని వ్రాశాడు మంజుకు. ఆ రాత్రి తను డబ్బాలో వేసినా, రెండవ రోజే తీస్తారని తెలిసినా, అది పోస్టు చేసేవరకు నిద్ర రాలేదు.

రెండవరోజు సెలవుపెట్టి 'లేక్ లంగానో'కు బయలుదేరాడు. అది చూసివచ్చి కారమ్మేయాలని ప్రణాళిక వేశాడు. ఎర్రగా, మడ్డిగా వుండే నీరయినా, చుట్టూ అందమైన ప్రకృతి. ఒకవైపు పిక్‌నిక్ స్పాట్, దాని ప్రక్కన హోటల్ గదులు, ఒక్కొక్కప్పుడు అవి కూడా దొరకవు. చాలామంది డేరాలు అద్దెకు తెచ్చుకుని లేక్ ప్రక్కగా వేసుకుని వుంటారు. బోటింగ్ చేసే వారికి బోట్లు దొరుకుతుంటాయి. కొందరు ఫిషింగ్ రాడ్స్ తెచ్చుకుని చేపలు పడుతుంటారు. అక్కడ ఇథియోపియా వారికంటే విదేశీయులే చాలా మంది వుంటారు. ఆ రోజంతా అక్కడ గడిపి, తిరిగివస్తూ దారిలో ఇండో-జపానీస్ బట్టలమిల్లు, ఇథియోపియా - జపానీస్ బట్టలమిల్లు చూసి వచ్చాడు. 'కోకా డామ్‌కు దారి' అనే బోర్డుచూసి అటు తిప్పాడు కారుని. అదేమంత పెద్ద డామ్ కాదు. కాని, దాని ప్రక్కన కాస్త యెత్తుపై నిర్మించిన హోటలు, దానిచుట్టూ వేసిన తోట చూడముచ్చటగా వుంది. తోటలో ప్రతి బోగన్‌విల్లా మొక్కని ఒక గుడిసెగా అమర్చి, దాని క్రింద పడక కుర్చీలు వేశారు. అక్కడి నుండి లేక్ వ్యూ చక్కగా కనిపిస్తుంది. హోటలంతా ఆధునికంగా అలంకరించారు.

పాశ్చాత్యదేశాల ప్రభావము. అద్దె కూడా చాలా ఉంటుంది. అక్కడ విపరీతమైన చేపలు, పది సెంట్లకు, పదిహేను సెంట్లకు నాల్గయిదు వ్రేళ్ళాడదీసిన గుచ్ఛం ఇస్తారు. హోటల్లో పానీయం తీసుకొని వచ్చేశాడు. అతను రెండు నెలల జీతం యిచ్చి, రిజిగ్నేషన్ యిచ్చాడు. అక్కడ అందరికి ఒక అభిప్రాయం వుంది. ప్రతి వ్యక్తి డబ్బుకోసమే వస్తాడు, ఇథియోపియన్స్ పొమ్మనేవరకు పోరనీ, వేణు రిజిగ్నేషను చూసి అందరూ ఆశ్చర్యపోయారు. వెంటనే కారు, తదితర సామానులు అమ్ముతూ, ప్రయాణానికి ఏర్పాట్లు చేసుకున్నాడు.

ఫ్లయిట్ బుక్ కాగానే మంజుకు ఉత్తరము వ్రాశాడు. అటు తండ్రికి ఉత్తరము వ్రాశాడు. వివరాలు వ్రాయలేదు. కొన్ని చీరలు, రెండు గడియారాలు, టైలాంటి చిన్న చిన్న వస్తువులు కొన్నాడు. అసల్లాకు తిరిగి వచ్చాడు. డైరెక్టరు ఎంతో ప్రేమతో తనింటికి భోజనానికి పిలిచాడు.

"మీ వంటివారు అరుదుగా వుంటారండి. ఇన్ని పాలిటిక్స్‌లో ఇతర ప్రాంతాలవారితో ఒక్కసారీ పోట్లాడలేదు. అన్నట్టు మీరు మంచి రచయితట కదా! సింగ్ చెప్పారు" అభినందించాడు.

"ఏదో తోచక రాస్తాను" వారింట్లో ఇంజెరా, కోడికూర పెట్టారు. అక్కడ భోజనము ముగించి వస్తువులన్నీ ప్యాక్ చేశాడు. ఒక్కో వస్తువు టేప్ రికార్డర్ లాంటివి తీసికెళ్ళినా బరువు అదనపుదవుతుంది. అమ్మడానికి మనసు ఒప్పలేదు. ఆన్‌కంపెనీడ్ లగేజిగా కట్టి పంపాడు. అందరి దగ్గర సెలవు తీసుకుని బయలుదేరాడు. ఇద్దరు విద్యార్థినులు అడిస్ అబాబా వరకు వచ్చారు. వారికి చాలా సార్లు సాయము చేశాడు. వారిద్దరూ కలిసి చిన్న వెండితో చేసిన బ్యాంక్ ప్రజెంట్ చేశారు. అదచ్చు అడీస్‌లో వున్న కమర్షియల్ బ్యాంకును పోలి వుంది. అతని చెయ్యందుకుని ముద్దు పెట్టుకున్నారు.

"డైనాదర్..." అన్నారు కన్నీటితో.

"డైనాదర్...(గుడ్‌బై)" అతని కళ్ళమ్మట నీళ్ళు తిరిగాయి. తనను ఆప్యాయంగా ఆదరించి, నువ్వు మనిషివే అని, తన వారిలో తల యెత్తుకునేలా చేసిన ఇథియోపియా అంటే ఎప్పుడూ గౌరవముంటుందతని హృదయములో. మృదువుగా ఆ అమ్మాయిల చేతులు నొక్కి వదిలాడు.



ప్లేన్ యెక్కేనాడు ఎంతోమంది స్నేహితులూ, విద్యార్థులు వచ్చి సాగనంపారు. ప్లేనులో ఎక్కి ఆఖరిసారిగా అందరికి చెయ్యి ఊపి లోపలికి వెళ్ళాడు. వచ్చేనాడు బరువైన హృదయముతో వచ్చాడు. ఇప్పుడు తేలిక హృదయముతో వెడుతున్నాడు. ఉత్సాహంగా, ఉల్లాసంగా వుంది. ప్లేనుతో పాటు అతని మానసము యెంతో యెత్తుకు లేచింది. దూరమైపోయే అడిస్ అబాబాను అరమోడ్పు కన్నులతో చూశాడు. అడిస్ అంటే క్రొత్త, అబాబా అంటే పువ్వు అని అర్థం. నిజంగా సార్థకనామధేయముగల పట్టణం అనుకున్నాడు.

## 21

ఢిల్లీ పాలమ్ విమానాశ్రయంలో దిగగానే దూరంగా చెయ్యూపుతూ మంజు, ఆ ప్రక్కనే చౌదరిగారు నిల్చున్నారు. మంజులో చాలా మార్పు వచ్చినట్టు కనిపించింది. ఆమె తనదే ననుకుంటే యెక్కడలేని గర్వము వచ్చింది. త్వరగా వారి దగ్గరకొచ్చాడు. మంజునేమని పలుకరించాలో తెలియక చౌదరిగార్కి చేతులు జోడించాడు.

ఆయన ఆప్యాయంగా వేణు భుజాలు తట్టాడు.

"చాలా మారిపోయావు వేణూ!" అన్నాడు వేణు వంకే పరీక్షగా చూస్తూ. బాగా ఛాయతేలి లావుగా బలంగా అయ్యాడు. బూడిద రంగు సూటు, స్ట్రైప్స్ ఉన్న టై కట్టుకున్నాడు. నిరాశగా, గంభీరంగా ఉండే ముఖాన హాస చంద్రికలు కనిపిస్తున్నాయి."

"అదిలా ఇవ్వండి" మంజు ఓవర్ కోటుకై చేయి చాపింది.

"కస్టమ్స్ వారికి చూపాలి, తెస్తాను" నవ్వుతూ ఆమె వంక చూశాడు. ఆ క్షణమే యిరువురి కళ్ళు కలుసుకున్నాయి. మంజు మొదట కళ్ళు వాల్చింది.

"మంజూ....."

"వేణూ! అదో అటాచీస్ అన్నీ వస్తున్నాయి" చౌదరీసాబ్ పిలిచాడు. ఓ గంట కస్టమ్స్‌లో పట్టింది. సామాన్లన్నీ కారులో పెట్టారు. బయట నిలబడిన

చౌదరిగారి ఆఫీస్ బృందం పూలమాలలు వేశారు. మరి కొందరు చనువుగా మంజు మెడలో కూడ వేసి, ఫోటోలు తీశారు.

అందరూ చౌదరిగారు తన కోసము కేటాయించిన యింటికి వెళ్ళారు. వంటవాడు కాఫీ తెచ్చాడు. మంజు సామానులన్నీ గదిలో పెట్టింది. అందరిని రేపు రండి, అబ్బాయి అలసి వచ్చాడని పంపివేశాడు.

"అమ్మా! మంజూ మీ ఆంటీకి టెలిగ్రాము యిచ్చి వస్తాను" చౌదరిగారు బయటకు వెళ్ళిపోయారు. అయిదు నిమిషాలు హాల్లో కూర్చుని డ్రస్సు మార్చుకుందామని గదిలోకి వెళ్ళాడు. వేణు, మంజూ అత్యంత శ్రద్ధతో అలంకరించింది గదిని. అతను తెచ్చిన సామానులు గదిలో సర్దుతోంది. గుమ్మములో నిలబడి ఆమెను చూస్తూ, కళ్ళతోనే అందాలు త్రాగాడు. ఇటు తిరిగింది.

"మీరు.....మీరు...వచ్చారా" అన్నది నెమ్మదిగా అతని దగ్గరగా వచ్చింది.

"ఎన్నో కోర్కెలతో మీ కోసం ఎదురు చూస్తుంటే మీరలా ఏదో పోగొట్టుకున్నట్టు చూస్తారేం?"

"కాదు అపార్థం చేసుకుంటున్నావు మంజూ! ఇంకా నా అదృష్టముపై నమ్మకం కలుగలేదు. ఇది నిజమేనా?" రెండడుగులు ముందుకువేసి ఆమె భుజాలు ఊపాడు.

"ఎదురుగా నన్ను చూసి కూడా నిజమని నమ్మకము కలగటం లేదా?"

"లేదు మంజూ, అంతా కలలా అనిపిస్తుంది."

"మీ కన్నీ అనుమానాలే! నేను ఎదురుచూసిన క్షణం ఇంత పాడిగా వుంటుందని అనుకోలేదు" నిష్టూరంగా దూరం వెళ్ళిపోయింది.

వేణుకు నవ్వు వచ్చింది. ఎన్నో కథలలో భార్యాభర్తలను, ప్రేయసీ ప్రియులను అతి మనోహరంగా వారి కలయికను అతి చాకచక్యంతో వర్ణించిన తను, ఈనాడింత బిడియపడుతున్నాడేం? కొన్నిసార్లు 'ఆలస్యం అమృతం విష'మన్నట్టు మంజు అపార్థం చేసుకోగలదు. వెంటనే ఆమె



కోసం ఆడిస్‌లో కొన్న బహుమతి గుర్తుకు వచ్చింది. కోటు లోపలి జేబులో నుండి తీశాడు.

"మంజూ!"

"ఊఁ."

"అలక తరువాత సాగిద్దువుగాని' ఇలా రా" ఆమె వచ్చి అతని దగ్గరగా నిల్చుంది.

"చూడు, ఈ గొలుసు, లాకెట్టు. నచ్చిందా నీకు?"

"ఇలా ఇవ్వండి" చెయ్యి చాపింది.

"ఊహుఁ..." చనువుగా దాన్ని ఆమె మెడలో వేశాడు.

అరుణిమ దాల్చిన ముఖం చూపలేక ఆమె కళ్ళు వాల్చింది.

ఆమె ముఖాన్ని రెండు చేతులలోకి తీసుకుని .....

"మంజూ! ఇటు నా కళ్ళల్లోకి చూడు. నిజంగా నేనంటే ప్రేముందా..." ఆమె చటుక్కున వదిలించుకుని దూరం వెళ్ళిపోయింది.

"ప్రేమ లేదు. నాటకమాడాలని పిలిపించాను. నాకు ఇష్టం లేని పని చేయనని యెన్నోసార్లు చెప్పాను. నన్నెందుకు అర్థం చేసుకోరూ...."

"వాల్గంటి చూపులకు వాడి గలదు.
పడతీ నీ పలుకులలో వేడిగలదు..." నవ్వుతూ రాగం తీశాడు.

"ఆ మాటంటే ఎవరొప్పుకుంటారేం? మొదట మీరు రాసింది నా దగ్గర లేదేమిటి?" తను నవ్వింది.

అతను ఆమె దగ్గరగా వెళ్ళి ఆమె నడుం చుట్టూ చేయి చుట్టాడు.

"మంజూ! నా జీవితంలో యింత మధురమైన క్షణం వస్తుందను కోలేదు" వంగి సున్నితంగా ఆమె పెదవులందుకున్నాడు. భగవంతుడిచ్చిన ఆ అపురూపమైన వరాన్ని అతి జాగ్రత్తగా దాచుకోవాలన్నంత కాంక్షతో ఆమెను తన హృదయానికి హత్తుకున్నాడు. మాటలు కరువై, మమతలు నిండిన గుండెలు ఒక చోట చేర్చి, ఇరువురూ ఎంతసేపున్నారో తెలియదు.

"అమ్మాయ్....." బయట చౌదరిగారి గొంతు విని, మొదట వేణు తేరుకున్నాడు.

"మంజూ! పద. చౌదరిగారు వచ్చారు"

"రానీ వేణూ.... నిన్ను విడిచి ఎక్కడికీ వెళ్ళాలని లేదు."

"నిన్ను విడిచి మాత్రం నేను ఎక్కడికి వెళ్తాను. దుస్తులు మార్చుకోవద్దా?" ఆమె అతని టై వదులు చేసింది. కిట్ తీసి అతనికి వేరే దుస్తులు తీసింది. అతను అలా ఆమె చేతులవంక చూస్తున్నాడు.

"మంజూ...."

"ఆగిపోయారేం?" యింకేం సందేహాలో చెప్పండి? నవ్వుతూ అతని దగ్గరకు వచ్చింది.

"చూడండి. ఇక మన జీవితము గూర్చి ఎలాంటి శంకలు వద్దు. ఎవరమూ చిన్న పిల్లలము కాము. మన నిర్ణయము బాల్యచాపల్యముతో చేసింది కాదు."

"ఇరువురమూ పెద్దవారమే. మన భావాలు పరిపక్వము చెందనివి కావు. మిగిలిన విషయాలు నేను ఉత్తరములో వ్రాశాను. సందేహాలతో మన సంసారము నాల్గు దారులు పట్టరాదు. వేణు మాటే మంజు మాట, వేణు బాటే మంజు బాటగా బ్రతకాలి. బ్రతుకంతా నందనవనము కావాలి"

"ధన్యుడిని మంజూ!"

"అది యే కథలోనైనా పెట్టండి. పాఠకులు ఆనందిస్తారు" కిలకిల నవ్వింది.

కోటు తీసి ఆమె చేతిమీద వేసి యివతలకు వచ్చాడు.

"వేణూ! మంజు అన్ని విషయాలు రాసిందనే అనుకుంటాను. మీ ఆంధ్రులు కట్నాలు చాలా తీసుకుంటారట. మంజు ఆస్తి వివరాలు చెప్పనా?"

"అక్కరలేదండి. ఆమెకంటే పెద్ద ఆస్తిని నేను ఆశించలేదు. నిజంగా నేను అడిగినదానికంటే పదిరెట్లు ఎక్కువే ఇచ్చిన కరుణామయుడైన సృష్టికర్తకు యెప్పుడూ ఋణపడి వుంటాను" అన్నాడు.



"అలా అనకు వేణూ! మంజు ఒక ఉత్తముని జీవితములో భాగస్వామిని అంటే నాకు చాలా తృప్తిగా వుంది. వాళ్ళ నాన్నగారి అభిలాష తన ప్రాంతము వారికివ్వాలని. అనుకోకుండా అది నెరవేరింది" అతను తృప్తిగా నిట్టూర్చాడు. వేణు స్నానముచేసి వచ్చాడు. మంజు బల్లపై అన్నీ పెట్టించింది. భోజనాలు అయిపోయాయి. ఆమె కతనితో ఒంటరిగా యెటన్నా వెళ్ళిపోవాలని వుంది.

"సినిమా కెళ్దామా అంకుల్?"

"నేనెందుకమ్మా! ఈ రోజంతా తిరిగేనా, ఆయాసము వస్తుంది. మీరిద్దరూ వెళ్ళిరండి. రేపటి ప్లేన్‌లోనే మన టిక్కెట్లు బుక్ అయ్యాయి" చౌదరిగారు పడక కుర్చీలో వాలి హుక్కా పీల్చసాగాడు. సిగరెట్ ట్రే అతని ముందుకు నెట్టాడు.

"నో! థాంక్స్"

"అదేమిటండి, విదేశాలు తిరిగినాక పొగత్రాగడము, బ్రాందీ త్రాగడము అలవాటు కాకపోతే ఎలా?"

"బావుంది. విదేశాలలో అవ్వే నేర్చుకోవాలేమిటి?" నవ్వుతూ తన ముస్తాబు ముగించి వచ్చింది మంజు.

వేణు త్వరగా లేచి తయారయ్యాడు.

"నీకు డ్రైవింగ్ వస్తుందిగా, డ్రైవరెందుకు? మా మంజుకు వస్తుంది, కాని పట్టలేని సంతోషంతో సరిగ్గా నడపదని"

"ఊరుకోండి. ఎన్నిసార్లు యాక్సిడెంట్లు జరిగాయేమిటి?" నవ్వుతూ బయటికి వచ్చింది.

వేణు కూడా వచ్చాడు.

"నువ్వే నడుపు మంజు. నాకు లెఫ్ట్‌హాండ్ డ్రైవింగ్ అలవాటు లేదు" అన్నాడు. మంజు కూర్చుంది. చౌదరిగారన్నమాట అబద్ధం కాదు. ఆమె డ్రైవింగును చూసి రెండు మూడుసార్లు హెచ్చరించాడు వేణు.

"అక్కడ ఇంగ్లీషు సినిమాలు చూసి చూసి విసుగెత్తిపోయాను మంజూ ఏదైనా హిందీ సినిమా కెళ్దాము."

"అసలు సినిమా చూడ్డానికెవరు వచ్చారట? నవ్వింది. అతను నిలబడిపోయాడు. అతని దగ్గరంతా ఫారిన్ కరెన్సీ వుంది. తను సంకోచిస్తే మంజుకు కోపము వస్తుంది.

"మంజూ నీ పర్సిలా తే" ఆమె అందించిన పర్సులో నుండి డబ్బు తీసి రెండు టిక్కెట్లు తెచ్చాడు.

బాక్సులో వెళ్ళి కూర్చున్నారు. ఆమె అతని ఒడిలో వాలిపోయింది. అతని మెడకు చేతులు వేసింది.

"ఇలా మీ దగ్గరుండాలని...." చెప్పలేకపోయింది.

"ఊఁ!" చిరునవ్వుతో ఆమె చుట్టూ తన చేతులు వేశాడు. సినిమా దారి సినిమాది. వారి కబుర్లకు అంతు లేదు. క్లయిమాక్సు సీనులో ప్రేక్షకుల క్లాప్సుకు ఈ లోకంలోకి వచ్చారు. ఇంటికి వచ్చారు. మంజు ఒడిలో తల పెట్టుకొని పడుకొని, తన జీవితములో అతి కష్టతరమైన ఘట్టాలు కొన్ని చెప్పాడు. మంజు అతని నోటికి చెయ్యి అడ్డు పెట్టింది.

"చెప్పకండి, దయచేసి చెప్పవద్దు, నేను వినలేను" ఆమె కంఠం వణికింది. అతను ఆమె వంక చూశాడు. ఆమె చెంపల మీదుగా నీరు జారుతోంది.

"భలేదానివి మంజూ! ఏదీ..... నవ్వాలి" ఆమెకు కితకితలు పెట్టాడు.

"ఇలాంటివి తలుచుకుంటే నవ్వెలా వస్తుంది?" నవ్వుతూనే కళ్ళు ఒత్తుకుంది.

"ఇక జీవితమంతా నీ సమక్షంలో నవ్వుతూ గడపాలి మంజూ..." తృప్తిగా కళ్ళు మూసుకున్నాడు. ఆమె అతని వెంట్రుకలు సవరిస్తూ కూర్చుంది.

## 22

బేగంపేట విమానాశ్రయముకు తమ్ముని కోసము కారు తీసుకు వచ్చి ఎదురు చూసే సూరి, తమ్ముడి వెంట అందమైన యువతి దిగడము చూసి, ఎవరో యితర ప్యాసింజర్స్ అయి వుంటారనుకున్నాడు. కాని వారిద్దరూ జంటగా రావటం అతనికెంతో ఆశ్చర్యమయింది. ఆ యువతి



తను చూసిన పంజాబీ యువతి. ఆమె చిరునవ్వుతో తలపైకి పమిట లాక్కుని, నమస్కరించింది. వెనకాలే చౌదరిగారు వచ్చారు.

"నమస్కారము సూర్యనారాయణగారూ! మనము బంధువులము కూడాను. తెలిసిందా! మా మంజు మీ వేణూ ఇల్లాలు"

సూరి తెల్లముఖం వేశాడు.

వేణు అన్నగారి చేయి పట్టుకున్నాడు.

"వదినా, అమ్మా అంతా బావున్నారా అన్నయ్యా!"

"అంతా బావున్నారు. అందరూ వచ్చి నీ కొరకు చూస్తున్నారు. యిక్కడికే వస్తానన్నారు. టాక్సీ ఖర్చులు దండుగని వద్దన్నాను."

"మేము కాస్త ఆలస్యం చేశాము. అప్పుడే దిగారా?" నవ్వుతూ మిసెస్ చౌదరి వచ్చింది.

"గుడ్‌మార్నింగ్ సర్!" పప్పు, తమ్ముడూ మిలటరీ శాల్యూట్ చేశారు.

"గుడ్ మార్నింగ్! హౌ ఆర్ యు?" వారి భుజాలు తట్టాడు.

"ఆల్‌రైట్, మిస్టర్ వేణూ! మీ వారందరిని చూసిరా."

"అదేమిటండి! ఇంటి దగ్గర అన్ని ఏర్పాట్లు చేశాము" మిసెస్ చౌదరి అన్నది.

"మనము అమ్మాయి వంక వారము. తగ్గి ఉండాలి" చౌదరి మాటల కంతా నవ్వారు. మీరు రండి అనబోయి ఆగిపోయారు. వెంటనే తను వెళ్ళేది అన్నగారింటికి అని గుర్తుకు వచ్చింది. అలాంటి సందేహాలుండరాదు నిజానికి. తనూ, అన్నా ఒక రక్తం పంచుకుపుట్టిన బిడ్డలమే కాని, తనను అలా చూడలేదు. అలా అని వారి తప్పు కాదు. చిన్నప్పుడే తల్లి దండ్రులు తమ ప్రవర్తనలో భేదభావము చూపుతే, వారిని సూరి రమ్మంటాడేమోనని చూశాడు. అతను అలాంటిది ఏం అనకపోగా, పోయిరమ్మన్నట్టు నమస్కరించాడు.

సూరి మలకపేటలో ప్లాటుకొని సగము యిల్లు కట్టుకున్నాడు. అతని గేటులో కారు ఆగగానే అందరూ యెదురువచ్చారు. మంజు అందరి ముందు ప్రశ్నవాచకమై నిల్చుంది. వేణు మంజు చెయ్యి పట్టుకుని అందరికి నమస్కరించాడు.

"మరిదిగారు మాకు చెప్పకుండానే వివాహము చేసుకున్నట్టున్నారే!" సుజాత అడిగింది మంజును యెగాదిగా చూస్తూ.

"మరేం చెయ్యను వదినా! నల్లని మరిది, వివాహము అవుతుందో కాదోనని వదినగారి ఆందోళన. అయినా మా వంటి అమ్మాయి వస్తుందో, రాదోనని మీ బాధ. అందుకే మీకు అన్నిటా సాటిరాగల అమ్మాయిని తెచ్చాము."

"వస్తూనే నిష్ఠూరము వేస్తున్నావు."

"నిష్ఠూరమేముందే అమ్మాయి! పరిహాసము. రారా" చిట్టెమ్మ కొడుకు చెయ్యి పట్టుకుంది. వేణు నమ్మలేనట్లు తల్లివంక చూశాడు. జీవితంలో మొదటిసారి ఆమె కొడుకు మాటను సమర్థించింది. నవ్వుకుని యింట్లోకి వెళ్ళాడు. కూరకాయల బస్తా క్రిందపెట్టి వచ్చాడు కోటయ్య. వేణు తండ్రిని వాటేసుకున్నాడు. తండ్రిని ఆ స్థితిలో చూస్తే కళ్ళు చమర్చాయి. యెంత బాధాపూర్వకంగా ఉన్నాయా చూపులు? కొడుకులకని, కూతుర్లకని ఉన్నదంతా ఖర్చు చేసినాక బంట్రోతుపని అప్పగించారు. తను వారిలా కాకూడదు. వారు యెలాంటివారయినా, తన తల్లిదండ్రులు పూజ్యులు. తను వారికే కష్టము రాకుండా చూసుకోవాలి అనుకున్నాడు.

"నువ్వన్నీ ఇలాంటి పనులే చేస్తావురా. పెళ్ళి చేసుకుంటున్నానని ఒక్కమాట వ్రాయకూడదూ?"

"మా పెళ్ళి యెన్ని సంవత్సరాల క్రితము జరిగిందో మీ కోడలిని అడగండి చెబుతుంది."

"వాళ్ళను కూర్చోనివ్వండి, తీరికగా మాట్లాడుదురుగాని" చిట్టెమ్మ కసురుకుంది. అందరూ కూర్చున్నాక సుజాత అందరికీ కాఫీలు యిచ్చింది.

"ఏం మరిదీ! మామీద పోటీకి అందకత్తెనే కట్టుకున్నావు. లక్ష రూపాయలు ఇవ్వటానికి కూడా సిద్ధంగా ఉన్నారు కొందరు. కట్నము పోగొట్టుకున్నావు."

"వదినా, మంజు పేరన అంతకు మూడంతలుంది ఆస్తి" అందరూ తెల్లమొహాలు వేశారు.

తీరికగా ఒక్కొక్కరికి తను తెచ్చిన బహుమతులు యిచ్చాడు.



లలిత చనువుగా బంగారు గాజులు తీసింది తమ్ముని పెట్టెలో నుండి. "ఇవి యెవరికిరా?"

"అన్నయ్య కూతురికి అక్కా! అది పుట్టగానే కొని యిస్తానన్నాను, యిప్పుడు కొనగలిగాను" అన్నాడు.

"సింగినాదం. ఇంట్లో ఉన్న బంగారమంతా వాడికే చదివించారు. యింకా యెందుకు? ఈ గొలుసెవరికి?"

"అమ్మ మెడ బోసిగా ఉందని తెచ్చానక్కా! బంగారమక్కడ చవుకే కాని కష్టమ్సుకు భయపడి తేలేదు. అమ్మకు, పాపకు, మంజుకు మాత్రమే తెచ్చాను."

"అమ్మకెందుకురా? పెద్దకొడుకు లేడూ చేయించడానికి? ఒక్క వాడయినా నీకు ఏం కావాలో అడిగారా?"

"ఆ విషయాలు యెవరడిగారక్కా! అంతా నిరసనగా చూసిన వారే" లలితమ్మ ఊరుకుంది. గట్టిగా అంటే తననే ఏదైనా అంటే బావుండదని, చెల్లెలికి ట్రాన్సిస్టరు ఇచ్చాడు.

"మీ బావగారు టేప్ రికార్డర్, వాచీలు, సూటుగుడ్డలు తెమ్మన్నారట కదా! ఇవన్నీ మావేననుకున్నాను."

"వెర్రిదానవు ప్రేమా! ఒక్కొక్కరికి అన్నీ యెలా తేగల్గుతాను? టేప్ రికార్డర్ ఖరీదు, తెచ్చిన ధరే రెండువేలమ్మా" ప్రేమకు అన్నగారి మాటలు నచ్చలేదు. అసంతృప్తిగా ట్రాన్సిస్టర్ ఓ మూల నెట్టింది. అన్నగారికి సూటుగుడ్డ, వదినకు చీర, పాపకు గాజులు యిచ్చాడు.

సాయంత్రానికి మధు వచ్చాడు. అతను చనువుగా అన్నగారి కెమేరా లాక్కున్నాడు.

"పల్లెటూర్లో నీకెందుకురా?" సూరి అడ్డువచ్చాడు.

"పోనివ్వండి అన్నయ్యా! అదృష్టముంటే కెమేరా కొంటాముగాని, వాడి చనువు ఎక్కడ లభిస్తుంది?" ఆప్యాయంగా తమ్ముడి భుజాలచుట్టూ చేయి వేశాడు. మధు కళ్ళు చెమర్చాయి. దాని భావమెవరికీ అర్థం కాలేదు. మరదలు తన చీర చూసుకుని మురిసిపోయింది. ఆనందంగా గడిచింది.

"మంజూ నువ్వూ, వదిన, ప్రేమ బజారుకు వెళ్ళి ఒక కంచి పట్టుచీర, ఈ జాబితాలో వున్న వస్తువులు కొనుక్కు వస్తారా?"

"మంచిది" మంజు బయలుదేరుతుంటే సుజాత కేకవేసింది.

"అమ్మాయ్! ఆస్పత్రి దగ్గరేగా! నేను, మీ బావగారూ వెళ్ళిపోతాం. కారు తీసుకువెళ్ళు."

"యెందుకండి....." మొహమాటపడింది.

"పట్టుకెళ్ళు. అక్కగారాప్యాయంగా యిస్తుంటే వద్దనరాదు" వేణు అన్నాడు. ఆమె వస్తువులన్నీ తీసుకు వచ్చింది. యే గదులూ బావుండలేదని, తనగదే మరిదికి యిచ్చింది సుజాత. మంజు కలుపుగోలుగా పనులు చేస్తూ అందరిలో తిరిగింది. మర్నాడు చౌదరిగారింట్లో అందరికీ విందు.

"మీకు హిమాయత్ నగర్‌లో యిల్లు కొన్నాను. నచ్చిందో లేదో చూడు వేణూ."

"మీ అమ్మాయికి నచ్చితే చాలండి."

"అలాగే గృహప్రవేశము, మీ పెళ్ళి ప్రకటించి విందు ఏర్పాటు చేస్తున్నాను" వేణు వారికి తను తెచ్చిన బహుమతులు యిచ్చాడు.

"థాంక్స్. మా యింట్లో అల్లుడివద్ద బహుమతులు పుచ్చుకునే ఆచారం లేదు బదులు తీసుకోవాలి."

"ఆచారాలు పాతబడ్డాయి లెండి. నాల్గయిదు రోజులు నేను మంజ కాస్త శ్రేయోభిలాషులను చూసి రావాలండి."

"మంచిది, అంతవరకు నా కారు పట్టుకెళ్ళండి. మీ కోసము ఆర్డర్ చేసింది రెండు మూడు రోజులలో రావచ్చు."

"ఫరవాలేదండి" కొన్ని వస్తువులు సర్దమని మంజుకు చెప్పాడు. ఆమె అన్నీ కార్లో పెట్టించింది. అతను కూర్చోగానే ఆమె ప్రక్కన వచ్చి కూర్చుంది. కారు పట్టణం చివరనున్న జహానుమా వద్ద ఆగింది. చేరవేసిన తలుపులు త్రోశాడు. రాధాకృష్ణగారు బాగా దిగజారిపోయారు. చెంపలు మడుచుకుపోయాయి. తల పండిపోయింది. బడిపంతులు జీవితానికి ప్రత్యక్ష వ్యాఖ్యాత. ఈజీచైర్లో కూర్చుని ఏదో చదువుతున్నాడు.



"యెవరూ!...వేణూ!... నువ్వేనా?" వచ్చి కౌగిలించుకున్నాడు.

"మంజూ! వీరే నాలో విద్యాబీజము బలంగా నాటింది. నా భార్య సర్!"

"అదృష్టవంతుడివి వేణూ! పట్టుదలతో సాధించలేని పని లేదని నిదర్శన పూర్వకంగా చూపావు. కూర్చో" పాత కుర్చీలు చూపాడు.

"సరోజినిగారేరి సర్?"

"ఆమె మంచినీళ్ళకు వెళ్ళింది. వస్తుంది, కూర్చోండి. పంపు షైరాలున్న యింటికి అద్దెలు పొయ్యటము చాత కాదు. యింట్లో బావి వుంది. ఒక బిందె పబ్లిక్ పంపువద్ద త్రాగడానికి తెస్తుంది" రాధాకృష్ణ విశేషాలు అడుగుతుంటే, చెబుతుండగానే సరోజిని వచ్చింది. సంబరంగా, సంతోషంగా, విప్పారిన నేత్రాలతో వేణును చూసింది. ఆ దంపతులను కూర్చోబెట్టి, తను తెచ్చినవి యిచ్చాడు.

"మీ మాష్టారిని అప్పుడప్పుడూ కంచి పట్టుచీర కోసం వేధించడం జ్ఞాపకముందా వేణూ?" నవ్వుతూ అడిగింది. చీరవంక చూసుకుంటూ.

"అబ్బే..... అదేం కాదు మీ ప్రేమకు సాటిగా నేను ఏమివ్వగలను. నా విజయవార్తకు సంతోషించారు, నన్ను సంతోషపెట్టారు."

"అమ్మాయ్! మా వేణు యిన్ని నేర్చాడు. సావాసదోషము కాదు కదా?"

మంజు నవ్వింది.

"అలనాడు ద్రౌపదిని మూరెడు పేలిక చింపి యిచ్చినందుకు, ఆ వేణుగోపాలుడు అంతులేని గుడ్డను ప్రతిగా యిచ్చాడట. ఆ విధంగా ఈ వేణు...."

"మాష్టారు! మీరు కూడా అలా అంటే యెలా? పాప, బాబులు యేరి?"

"పాపకు మొన్నటి వేసవిలో పెళ్ళిచేశాం వేణూ! మెట్రిక్ చదివించి ట్రైనింగు చెప్పించాము. అది మా శక్తిలో సాధ్యమైన పని. మీ మాష్టారి మేనల్లుడు చేసుకుంటానంటే యిచ్చాము. పెద్దబాబు ఎల్.యం.ఇ. ఆఖరి సంవత్సరము

చదువుతున్నాడు. చిన్నాడు మెట్రిక్ చదువుతున్నాడు" కాలం తెలియటము లేదు. చీకటి పడ్డాక లేచారు. భోజనము చెయ్యందే వదలలేదు. దంపతులను కూర్చోబెట్టి, పళ్ళూ, రవికలగుడ్డా చేతిలో పెట్టింది. మంజు వంగి ఆమెకు నమస్కరించింది.

"వచ్చే యేటికి నీవంటి అందగాడు, మా వేణు వంటి బుద్ధిమంతుడైన కుమారుడు కలగాలి" అన్నది లేవనెత్తుతూ. రాత్రికి తిరిగి వచ్చారు.

మరురోజు శ్రీరామ్ దగ్గరకు తీసుకువెళ్ళాడు. అతను అపనమ్మకంగా వేణు వంక చూశాడు.

"వీరు శ్రీరామ్‌గారు మంజూ! నాలోని విద్యాబీజానికి నీరు పోసి, మొలకెత్తేలా చేశారు" మంజు నమస్కరించింది.

"నిజంగా ఈ రోజు నిన్ను చూశాక, నా హృదయము తేలికగా ఉందోయ్! ఎప్పుడూ నీ పట్ల కఠినంగా ప్రవర్తించానని చాలా బాధపడేవాడిని. యోగ్యుడవయ్యావు" వారింటి నుండి పురుషోత్తం గారింటికి వెళ్ళి వారి మర్యాదలందుకుని, రాధను, మిగిలిన స్నేహితులందరిని చూసి వచ్చారు. బంధువుల ఆహ్వానాలు చాలా వున్నాయి.

"ఇంకెక్కడికండి? వారము నుండి వొకటే తిరుగుడు."

"మరిన్ని వరాలిచ్చిన భగవంతుడిని ఒక్కసారి దర్శించి రావద్దూ?"

"మీరు రాతిలో, కర్రలో దేవుడున్నాడంటే నమ్ముతారా?"

"యెందుకు నమ్మను! దేవుని పేరును ఉపయోగించి, మోసము చేసేవారంటే అసహ్యం, ఇందుగల డందులేడని సందేహం వలదు..."

"అమ్మబాబోయ్! చాలండి" నవ్వింది. "అంతటా ఉంటే ఆలయాని కెందుకు వెళ్ళాలి?"

"అది నమ్మకం. ప్రశాంతత కోసము" ఇరువురూ, ఆలయములో భక్తిగా ప్రదక్షిణ గావించి, పూజారుల ఆశీర్వాదము పొంది, బయటకు వచ్చారు.

"ఏం కోరుకున్నారండి?"

"లేడీస్ ఫస్ట్. మొదట నువ్వు చెప్పు" రాతి తిన్నెపై కూర్చుంటూ అడిగాడు.



ఆమె అతని సరసనే కూర్చుని కొబ్బరి ముక్కలు చేయసాగింది.

"ఊఁ.... చెప్పవేం?"

"ఏం చెప్పాలి? నాకు పెద్ద కోరికలేం లేవు. మీతో పాలుపంచుకునే ఈ జీవితం సుఖవంతమూ, అర్థవంతమూ చేయమని ప్రార్థించాను. మీరు చెప్పండి."

"ఓ భగవాన్! నేను కోరకుండానే అటు సాహితీ కన్యను, ఇటు అపురూపమైన మంజు అనే మరో కన్యను నాకిచ్చావు. వారిద్దరిని ప్రేమించి వారికి నా జీవితములోని కష్టసుఖాలు సమంగా పంచేటట్లు చేయి...."

"నిజం..." నిజమేనన్నట్టు ఆలయమున జేగంటలు మ్రోగాయి పూజారి చదివిన దండకము ఆఖరి భాగము కర్ణపేయంగా వినబడింది.

".....నాకు నభ్యర్థితంబుల్ ప్రసాదింపు
కారుణ్యామూర్తీ! త్రైలోకనాధా!
నమస్తే.....నమస్తే......నమస్తే.....నమః"

